# వ్యాసకౌముది

2012

## వ్యాసాలు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

కౌముది ప్రచురణలు - 129

# విషయ సూచిక


| ఏడాది | నెల | వ్యాసం పేరు | వ్యాస రచయిత(త్రి) | పేజి |
|---|---|---|---|---|
| 2012 | 3 | మద్యపానం మహాపాతకం | కుంతి | 3 |
| 2012 | 4 | మాటల శిల్పి నాగరాజు గంధం | పోపూరి సురేష్ బాబు | 6 |
| 2012 | 4 | సామ్రాట్టు సమీక్ష పేరడీ గారడీ | శ్రీనివాస ఫణికుమార్ డొక్కా | 10 |
| 2012 | 5 | తూర్పు – పడమర | చింతల చెరువు సువర్చల | 14 |
| 2012 | 7 | వ్యాస చరిత్ర | వనం వేంకట వరప్రసాదరావు | 19 |
| 2012 | 9 | ఎల్లలెరుగని మహాప్రస్థానం | డా. రాపోలు సుదర్శన్ | 21 |
| 2012 | 10 | సజ్జన దుర్జన విచారం | కుంతి | 26 |
| 2012 | 11 | గ్లింప్సెస్ ఆఫ్ తెలుగు లిటరేచర్ | నరిశెట్టి ఇన్నయ్య | 29 |
| 2012 | 11 | సుఖదుఃఖములు | కుంతి | 33 |
| 2012 | 11 | మరాఠీ సాహిత్యపు రెండు మణిపూసలు | గబ్బిట కృష్ణమోహన్ | 38 |
| 2012 | 12 | కవికి విమర్శకుడూ కావాలి | కర్ల పాలెం హనుమంత రావు | 44 |
| 2012 | 1 | నలోపాఖ్యానం | కౌటిల్య చౌదరి(తొమ్మిది భాగాలూ) | 48 |
| 2012 | 3 | బౌద్ధం – దుష్ప్రభావాలు | డా పాతూరి తేజేంద్ర (రెండు భాగాలూ) | 86 |
| 2012 | 5 | మను చరిత్రము | బాలాంత్రపు వేంకట రమణ (ఐదు భాగాలూ) | 95 |
| 2012 | 6 | శతకకారులు దోషైక దృష్టి | కుంతి(నాలుగు భాగాలూ) | 125 |
| 2012 | 9 | బౌద్ధం – దుష్ప్రభావాలు ఒక ఖండన | ఇ ఎన్ వి రవి(మూడు భాగాలూ) | 141 |




## మద్యపానము - మహాపాతకము

### - కుంతి

మద్యపాన సేవనము వలన వ్యక్తి ఆర్థికంగా, సాంఘికంగా, శారీరకంగా, కుటుంబ పరంగా పతనమవుతాడు. కీర్తిప్రతిష్ఠలు మసకబారుతాయి. అంతేకాక మద్యపాన సేవనము వలన వివేకము, విచక్షణ కోల్పోతామని ,ఒక్కొక్కసారి తమ చేతులారా తాము స్వజనులకే హాని చేసిన వారము అవుతామని తెలుస్తుంది. మద్యపాన సేవనము వలన శరీరము డొల్ల, సంసారము గుల్ల అవుతుంది. మద్యపానము మహాపాతకములలో ఒకటని శ్రీమద్భాగవతము చెపుతుంది. మగువ, జూదము, వేట, వాక్పారుష్యము, తీవ్రదండన,ధనము వ్యర్థంగా వ్యయించుటతో పాటు మద్యపానము సప్త వ్యసనాలుగా తెలుపబడినాయి.

అదేవిధంగా ఉద్యోగపర్వములో సప్తవ్యసనాలను గూర్చి తెలిపే పద్యము ఉంది.

"వెలదిజూదంబుపానంబు వేటపలుకు
ప్రల్లదంబును దండంబుపరుసుదనము
సొమ్ము నిష్ప్రయోజనముగ వమ్ముసేత
యనెడుసప్తవ్యసనములఁజనదితగుల"

మద్యపానము వలన అనర్థాలను ఇతిహాసాలు,పురాణాలు,ప్రబంధాలు వేనోళ్ళా తెలిపాయి. మన ఇతిహాసాలు, పురాణాలు పుక్కిటి పురాణాలని, సామాజిక స్పృహ, అభ్యుదయ దృక్పథము, ప్రగతిశీల భావాలు లోపించినవని కొందరు భావిస్తుంటారు. అయితే క్షీరసాగరమథనానంతరము అమృతము లభించినట్లు, సాహిత్యసాగరమథనము చేస్తే అమృతోపమానమైన పద్య సుధా సూక్తులు లభిస్తాయి.

శ్రీకాళహస్తీశ్వర శతకములో తృతీయాశ్వసములో కాట్రేని జాతర సందర్భముగా బోయపల్లెవారు తప్పతాగిన వారు ఎలాప్రవర్తిస్తారో ధూర్జటి గారు అద్భుతంగా వర్ణించాడు. ఈ పద్యము హాస్యంగా కనబడినా తప్పతాగిన వారు ఒళ్ళు తెలియక ఎలా ప్రవర్తిస్తారు అన్నది ఈ పద్యములో తెలుస్తుంది.

"మాటలాడఁదలంచి మఱచిపోయెడువారు
నడవబోవుచుఁదొట్రుడువారు
నూరకుండెదమని యుండనోపనివారు
లేచెదమని లేవలేనివారు

బనిలేనిపని బట్టబయలుదిట్టెడువారు
బాడనేరకుయునుబాడువారు
నెదురైనవారికి నెల్లమ్రొక్కెడువారు
వ్రీడా విహీనులైయాడువారు
జాలద్రావియుమగుడజేసాచువారు
దొడరియుపదంశ భాండముల్‌దొడుకువారు
నైరిమృగయాధి దైవతయాత్రయందు
బానములుచేసి శబర దంపతుల రతుల"

శబర దంపతులు కొందరు కాటెని జాతరయందు అతిగా మద్యపానము చేసారు. వారు సంభోగ సమయంలో ప్రసంగింప దలచియు ప్రసంగింప మరుచుచుండిరి. కొందరు నడవబోవుచు దడబడుచుండిరి. కొందరు మాటాడకుండ నుండెదమని మాటాడకుండ నుండలేకపోవుచుండిరి. కొందరు నిష్ప్రయోజనముగా మిక్కిలి శూన్యములందు దుర్భాషలాడుచుండిరి. కొందరు గానము చేయజాలకయు గానము చేయుచుండిరి. ొకొందరు యెదురైనవారికెల్లా నమస్కరించుచుండిరి. కొందరు సిగ్గులేకుండా సంచరించుచుండిరి. కొందరెక్కువ మద్యపానము చేసి మరి ఇంకా కావాలని చేయి సాచుచుండిరి. కొందరుప్రయత్న పూర్వకముగా మద్యముతో నంజుకొనుటకు దెచ్చిన వ్యంజనద్రవ్యములు గల కుండలను గ్రహించుచుండిరి.

మహాభారతములో మద్యపానము, సురాపానము వల్ల కష్టనష్టాలు ఎలాంటివో తెలిపే పద్యప్రసూనాలు ఆదిపర్వము తృతీయాశ్వాసములో కలవు. దేవతల ప్రార్ధనమేరకు బృహస్పతి కుమారుడైన కచుడు సంజీవని విద్యనభ్యసించడానికి శుక్రాచార్యుడి దగ్గర శిష్యుడిగా చేరుతాడు. శుక్రాచార్యుణ్ణి మెప్పిస్తాడు. కాని శుక్రుని శిష్యులైన రాక్షసులు ఓర్వలేక కచుడిని చంపుతారు. శుక్రుడు కచుడిని బ్రతికిస్తాడు.రాక్షసులు మళ్ళీ అతడిని చంపి, అతడి శరీరమును కాల్చి బూడిదగా చేసి తమ గురువైన శుక్రుడిచే త్రాగిస్తారు. మద్యపానాసక్తిలో శుక్రుడు ఆ విషయము గ్రహించడు. అటుపిమ్మట కూతురైన దేవయాని శోకాన్ని చూసి కరిగిపోయి, యోగదృష్టి ద్వారా మద్య రూపములో తన పొట్టలో చెరిన కచుడిని చూస్తాడు. మద్యము వల్ల వచ్చిన కీడును తెలుసుకుంటాడు. ఆ సందర్భములో తెలుగు సాహిత్యానికి అన్నయ్య, ఆదికవి నన్నయ్య వ్రాసిన ఈ పద్యాన్ని పరికిద్దాము.

"మొదలిపెక్కు జన్మముల బుణ్యకర్మముల్
పరగఁబెక్కుసేసి పడయఁబడిన
యట్టి యెఱుకజనులకాక్షణమాత్రన
చెఱుచుమద్యపాన సేవ సేయనగునె"

పూర్వకాలమందలి అనేక జన్మాలలోని పుణ్యకార్యాలను ఒప్పుగా అనేకము చేసి పొందబడిన జ్ఞానము, ప్రజలకు క్షణమాత్రకాలములోనే పోగొట్టే మద్యపానము చేయదగదు ..అన్నది ఈ పద్యభావం. అందుకే శుక్రాచార్యులవారు

"భూసురులాదిగ గలజను
లీసుర సేవించిరేని యిది మొదలుగ బా
పాసక్తిఁబతితులగుదురు
చేసితి మర్యాద జేకొనుడు జనుల్"

మద్యపానము వల్లనే యింతటి అపకారము జరిగింది. అనేక జన్మల పుణ్యము, కష్టపడి సంపాదించిన జ్ఞానము మద్యము సేవించిన మరుక్షణము నాశనము అయిపోతాయి. కావున మద్యము సేవించినవారు పాపాత్ములై, పతితులై పోతారని శుక్రాచార్యుడు శపించాడు. అదేవిధంగా ప్రజలు సురను సేవించినచో పాపకార్యములందు ఆసక్తి కలవారై చెడిపోవుదురు. ఆ కట్టుబాటును ప్రజలందరూ పాటింపుడు అంటూ శపిస్తాడు.

శ్రీమద్భాగవతములో ఏకాదశ స్కంధములో ప్రభాస తీర్థములో యాదవులంతా కూడి బాగా మద్యము సేవించి, ఒకరినొకరు వావీ వరుసలు, బంధుత్వాలు మరిచి తీవ్రంగా చంపుకుంటారు. మద్యము యొక్క కైపు ఎంతటి దారుణాలు చేయిస్తుందో అందులో వర్ణించబడినది.

భర్తృహరి త్రిశతి కారుడు తన త్రిశతిలో "యతి సంగంబున" అను పద్యములో "మద్యప్రాప్తిచే సిగ్గు" చెడును అనితెలిపాడు.

పురాణేతిహాసాలు మద్యపానము యొక్క దుష్పరిణామాలను ఈ విధంగా చక్కగా వర్ణించాయి.

ఇలా ఉత్తమమైన మన పద్య సాహిత్యమును పరిశీలించినప్పుడు తప్పొప్పులను, గుణదోషాలను తెలియజేస్తూ మనుష్య వ్యక్తిత్వ నిర్మాణములో, శీలవికాసములో అది ఎంతగా తోడ్పడుతుందో దేశాభివృద్ధికి, సంఘాభివృద్ధికి ఎంతగా తోడ్పడుతుందో తెలియవస్తుంది.

అంతేకాక పై పద్యాలు మందుభాగ్యులైన మందభాగ్యులకు, మందుచూపును తొలగించి ముందుచూపు ప్రసాదిస్తుందనడములో సందేహములేదు.




## మాటల శిల్పి నాగరాజు గంధం

### - పోపూరి సురేష్‌బాబు



**కథ, నవల, నాటిక, సినిమా ఇలా అన్ని రంగాల్లోనూ** బహుముఖ ప్రజ్ఞ కనపరిచిన, కనపరిచే రచయితలు మన ఆంధ్రదేశంలో బహుకొద్ది ముందే అయితే వారి రాణింపు ఆయా రంగాల్లో చాలా సంవత్సరాలే కనపడుతుంది. కానీ తక్కువకాలంలో ఎంతో పేరు తెచ్చుకుని ప్రతీరంగంలోనూ తనదైన ముద్ర వేసిన మేటి రచయిత కీర్తిశేషులు శ్రీ నాగరాజు గంధం.

నాగరాజు గంధం 30.8.1968న నర్సరావుపేటలో జన్మించారు. వీరి తండ్రి సుప్రసిద్ధ కథా రచయిత గంధం యాజ్ఞవల్క్య శర్మ. సాహితీవాతావరణంలో పెరగడంతో నాగరాజుకి చిన్న వయసు నుండే అన్ని రకాల కథలూ, నవలలూ చదివే అవకాశం కలిగింది. వీరికి అక్షరాభ్యాసం చేసిన వీరి పెదనాన్న గంధం లోకనాధ శర్మని వీరు గురువుగారుగా వ్యవహరించారు. ఆనాడు ఆయన పెట్టిన అక్షర భిక్ష తర్వాత అక్షయ పాత్ర అయిందని నాగరాజు ఓ వెబ్ పత్రికకు ఇచ్చిన వీడియో ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఆయన వల్ల తనలో సాహితీ పిపాసకు చాలా చిన్న వయసులోనే బీజం పడిందనీ, పుస్తకం పఠనాశక్తి (క్లాసు పుస్తకాలు కాదు) గణనీయంగా పెరిగిందనీ తెలిపారు.

అక్కయ్యలు ఇంటికి తెప్పించుకునే ఆంధ్రభూమి, భారతి వంటి మేగజైన్స్ ద్వారా, వీరింటికి వస్తూండే కోలవెన్ను రాధాకృష్ణమూర్తి, వాకాటి పాండురంగారావు వంటి ప్రముఖుల ద్వారా పుస్తకాలతో మమేకమవడానికి తగిన వాతావరణం ఏర్పడింది. అలాగే లోకల్ వైశ్య లైబ్రరికి రోజూ వెళ్ళి విధిగా సాహిత్య రచనలు చదవడం అలవాటు చేసుకున్నారు. చిన్నప్పుడు విపరీతంగా చదివిన తిలక్, చలం, బుచ్చిబాబు, యండమూరి, రంగనాయకమ్మ గార్ల రచనలు నాగరాజు సాహితీ జీవితానికి ఒక రకంగా బీజం వేసాయని చెప్పవచ్చు. వీరు పదిహేడేళ్ళ వయసులోనే 'అమ్మ' (ఆంధ్రజ్యోతి వారపత్రిక) అనే కథ వ్రాసారు.



నాగరాజు చదువు బి.ఎస్సీ వరకూ నర్సరావుపేటలోనె సాగింది. తరువాత పై చదువుకోసం కొల్హాపూర్ శివాజి విశ్వవిద్యాలయంలో మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ మేనేజ్ మెంట్‌లో చేరారు. ఓ ప్రక్క చదువుతూనే కథా రచన కూడా కొనసాగించారు. వీరి 'అపరాజిత' కథ ఆంధ్రప్రభ వారపత్రికలో (24-4-91) ఉగాది కథల పోటీల్లో ప్రోత్సాహక కథగా ఎంపికయ్యింది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ తర్వాత ఉద్యోగం కోసం



వెదుకుతూనే రాసిన 'చెరువు' కథ ప్రభవారి 1993 ఉగాది కథల పోటీల్లో తృతీయ బహుమతికి ఎంపికై మంచిపేరు తెచ్చిపెట్టింది.

ఇలా నాలుగైదు కథలు వ్రాసిన నాగరాజు 1995 తర్వాత కెరీర్ పై దృష్టి పెట్టి ఎనిమిది సంవత్సరాలు వ్రాయడమే మానేసారు. సాహిత్యపు పలురంగాల్లో ప్రావీణ్యం గడించిన నాగరాజు రకరకాల ఉద్యోగాల్లో కూడా ప్రావీణ్యం పొందడం ఇక్కడ గమనించదగ్గ విషయం.

వివాహానికి (18-3-95) పూర్వం 'రచన' మాసపత్రికలో సబ్ ఎడిటర్‌గా పనిచేసారు. వివాహం తర్వాత సంవత్సరం పాటు ఖమ్మంలోని బి.బి.ఎమ్ కాలేజ్‌లో లెక్చరర్‌గా చేసారు. తర్వాత విజయవాడలో బిజినెస్ చేసి మళ్ళీ 1999లో బి.బి.ఎమ్ కాలేజ్‌కి ప్రిన్సిపల్‌గా వెళ్ళారు. అక్కడ కొన్నాళ్ళు చేసి బయటికొచ్చిన నాగరాజు భార్య ఉదయ శైలజ మళ్ళీ రచనలు చేయమని ప్రోత్సహించడంతో 2002లో 'స్వాతి' నిర్వహించిన సీరియల్స్‌లో పాల్గొని తొలి సీరియల్ 'స్థితప్రజ్ఞ'కు బహుమతితో పాటుగా మంచిపేరు తెచ్చుకున్నారు.

మొదటి ఇన్నింగ్స్‌లో కథలు మాత్రమే వ్రాసిన నాగరాజు రెండో ఇన్నింగ్స్‌లో కథలుతోపాటుగా నవలలు, నాటికలు వ్రాయటంపై ఎక్కువ దృష్టిపెట్టారు. స్వాతి వారపత్రికలో 'వెల్లవేసి చూడు' (14-3-03), పాకలహరి (3-6-05) వంటి కామెడీ కథలూ, జీవితానికో పుష్కరం (29-8-03), దుప్పటి (24-6-05) వంటి సరసమైన కథలూ, సృష్టి(2-4-04), అబార్షన్ (19-3-04) జన్మభూమి (2-05)లాంటి కథలు వ్రాసారు. రజ్జు సర్పభ్రాంతి (పత్రిక మాస పత్రిక), తెల్లమచ్చల నల్ల క్రోటన్ మొక్క (నవ్య, 15-12-04), పునరావాసం, కర్మయోగి కథలు వివిధ పత్రికలకి వ్రాసారు. కథలతో పాటు 'పసిడిలంక' (1-10-04 నుండి 14-1-05) సీరియల్‌ని స్వాతికి వ్రాసారు. వ్రాసిన సీరియల్స్ రెండే అయినా ఆ రెండూ నాగరాజుకి మంచిపేరు తెచ్చిపెట్టాయి. 'స్థితప్రజ్ఞ' సీరియల్ నాగరాజుకి విశేషఖ్యాతి ఆర్జించి పెట్టింది. ఇది నాగరాజు మనసుకి నచ్చిన రచనకూడా.

ఇక నాగరాజు సాహిత్య పఠనాసక్తికి వస్తే, తిలక్, శ్రీశ్రీ, అఫ్సర్‌ల కవిత్వాన్నే కాకుండా ఆరుద్ర, కొమ్మూరిల డిటెక్టివ్ సాహిత్యాన్ని చదివారు. బుచ్చిబాబు, చాగంటి, సోమయాజులు, కాళీపట్నం రామారావు, రావిశాస్త్రిల కథల్నే కాకుండా చలం, విశ్వనాధ, యండమూరి, మల్లాదిల నవలల్ని చదివారు. గొల్లపూడి, ఆదివిష్ణుల నాటికలు ఎంత ఇష్టమో, సినిమారంగంలో త్రివిక్రమ్ శ్రీనివాస్, పరుచూరి బ్రదర్స్ డైలాగ్స్ కూడా అంతే ఇష్టపడ్డారు. ఎక్కడ, ఎప్పుడు ఏ మంచి కథ కనపడినా వదలకుండా చదివేవారు.

చిన్నప్పుడు నాటకం వేయడానికి సరైన స్క్రిప్టు దొరకక 'ప్రెసిడెంట్ పేరయ్య' నాటకం రాసి నటించిన నాగరాజు గంధం ఈ అనుభవాన్నే తర్వాత నాటక, నాటిక రచనలకు పునాదిగా వాడుకున్నారు. విద్యార్థిగా ఉన్నప్పుడు నర్సరావుపేట రంగస్థలిలో చూసిన వందల నాటకాల ప్రభావంతోఈ నాటక రచనకు శ్రీకారం చుట్టారు. నాగరాజు నాటకాల్లో మాటలకు మంత్రాల్ని నేర్పి సందేశాన్ని కూడా సూటిగా, సరళంగా అందించారు. 'సత్యాగ్రహి' నాటకం వారికి 2007లో రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు సంపాదించి పెట్టింది. ఈ నాటికతో పాటుగా శేషార్థం, ఆలోచించండి వంటి నాటికలు పలు పరిషత్తులలో ప్రదర్శనకు చోటు చేసుకున్నాయి, చేసుకుంటున్నాయి కూడా.



ప్రెసిడెంటు పేరయ్య, పాదుకాస్వామ్యం, రంగుల రాట్నం, వలస, చదువు, శేషార్థం, అనంతం, సత్యాగ్రహి, ఆలోచించండి, నోట్‌దిస్ పాయింట్. మిధ్యాబింబం, నువ్వు + నేను - ప్రేమ = పెళ్ళి, డాక్టర్ జోసెఫ్ మరగదమణి, దివ్యధాత్రి. వంటి నాటికలు, నాటకాలు ఎందరో ప్రేక్షకుల్ని రంజింపచేసాయి, కనుమరుగైపోతున్న నాటక ప్రక్రియకు పునరుజ్జీవనం ప్రసాదించాయి.

స్టేజి మీద హింస ప్రధాన వస్తువుగా తీసుకుని తొలిసారిగా ప్రదర్శించిన 'ఆలోచించండి', భార్యాభర్తల బంధాన్ని తల్లితండ్రుల అనుబంధాల్ని మెడికల్ బాక్‌గ్రౌండ్‌లో చెప్పిన 'శేషార్థం' నాటిక, అనాధలపై వ్రాసిన 'నోట్‌దిస్ పాయింట్ ' వంటి నాటికలు ఎంతోమంది మేధావుల ప్రశంసలు పొందడంతో పాటు బహుమతులు కూడా దక్కించుకున్నాయి.

గుంటూరులో ఒకసారి నాగరాజు నాటకం ప్రదర్శిస్తుండగా ఆ నాటకాన్ని చూసిన జాగర్లమూడి సాయిబాబు తన కుమారుడు 'రాధాకృష్ణ (క్రిష్)కు చెప్పడం, అప్పటికే నాగరాజుకి నాటకాల్లో పేరు రావడం - అతన్ని సినిమారంగంలోకి అడుగుపెట్టేలా చేసాయి. 'యువసైన్యం' అనే సినిమాకని స్క్రిప్ట్ వర్క్ మొదలుపెట్టి దాన్ని చేస్తుండగానే 'గమ్యం' సినిమా అనుకోవడం దీనికి కథా సహకారం, మాటలు అందించడం జరిగింది. 'గమ్యం' విడుదలకు ముందే 'మార్నింగ్ రాగా' అనే సినిమాకి నాగరాజు పనిచేసిన సంగతి కొద్దిమందికే తెలుసు.

'గమ్యం' తర్వాత నాగరాజు వెనుదిరిగి చూడలేదు. బాణం, ఇంకోసారి, ఓం శాంతి ఓం, సొంతఊరు, బెట్టింగ్ బంగార్రాజు, గాయం2, ఇలా పలు మంచి చిత్రాలకు, విజయవంతమైన చిత్రాలకు పనిచేసారు. జయాపజయాలతో సంబంధం లేకుండా ప్రతి చిత్రమూ ఆయనకు ఎంతో మంచి పేరు తెచ్చిపెట్టింది. మరణించేనాటికి నాగరాజు నాలుగైదు సినిమాలకు రచనా సహకారాన్ని అందిస్తున్నారు.

కథా రచయితగా మొదలుపెట్టి, నవల వైపు తిరిగి మళ్ళీ నాటకాలు వ్రాసి సినిమారంగంలో అడుగుపెట్టి ఎంతో మంచిపేరు తెచ్చుకున్నా నాటక రచనని మాత్రం మానలేదు. పనిచేసేది ఏ రంగంలోనైనా ఎక్కడా ఎవర్ని నొప్పించకుండా మృదుస్వభావంతో మసిలాడు. సినిమా విజయాన్ని తలెత్తుకోకుండా తనకి నచ్చిన రంగస్థల రచనల్లోనే తన మానసిక సంతృప్తికి అర్థం చెప్పుకున్నారు.

నాగరాజుకి ఎప్పుడు ఎలాంటి  ఆలోచన వచ్చినా దాన్ని వెంటనే ఒక పేపర్ మీదకు ఎక్కించేయడం అలవాటు. ఇలా ఆయనకొచ్చే వందలాది ఆలోచనలకు అక్షరరూపం (మాటలు) ఇచ్చేవారు. పదహారువారాల సీరియల్ 'స్థితప్రజ్ఞ' పదహారు రోజుల్లోనే పూర్తిచేయడం ఒక విశేషం.

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో విశేషాలు, విశేషాంశాలు నాగరాజు జీవితంలో ముడిపడి ఉన్నాయి. అనేక విషయాల్లో స్థితప్రజ్ఞత కనపరచిన నాగరాజు ప్రస్తుతం మన మధ్య లేకుండటం ఓ తీరని లోటు. ఈయన స్మృత్యర్థం గత సంవత్సరం విజయవాడలో మూడురోజుల పాటు నిర్వహించిన నాటక పోటీల్లో ఒకరోజు ప్రదర్శనకి 'నాగరాజు గంధం' పేరు పెట్టారు. ఈ సంవత్సరం ప్రథమ వర్ధంతి సందర్భంగా నాగరాజు స్వగ్రామం నర్సరావుపేటలో ఏప్రిల్ 22న నాగరాజు గంధం చివరి నాటిక 'దివ్యధాత్రి'ని ప్రదర్శించున్నారు.

నాగరాజు గంధం రచనా కృషికి జ్ఞాపకార్థంగా 'కౌముది' వెబ్ మాగజైన్ గత సంవత్సరం (2011) మే నెల నుండి ప్రతినెలా ఒక కథని 'కథా సుగంధాలు' పేరిట పాఠకులకు అందిస్తున్నారు. వీరు త్వరలోనే నాగరాజు నవలల్ని కూడా పాఠకులకు అందించనున్నారు. అయితే నాగరాజు కథలు గానీ, నవలలు గానీ పుస్తక రూపంగా లేకపోవడం ఓ వెలితే. నాగరాజు గంధం వ్రాసిన దాదాపు పదెనిమిది



కథలూ, రెండు సీరియల్స్‌నీ కథా సంపుటాలుగా, నవలలుగా ఎవరైనా తీసుకువస్తే బాగుంటుంది. నాగరాజులాంటి నిగర్వికి, మేధావికి చరిత్రపుటల్లో ఒక స్థానం ఏర్పరచడానికి ఆ పుస్తకాలు ఎంతైనా దోహదకారి అవుతాయి. అదే మనం ఆయనకి అర్పించే నివాళి కూడా. ***




# స్వామాట్టు సమీక్ష

## (పేరడీ గారడీ)

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా

**(వంగూరి ఫౌండేషన్ వారు మార్చి 10-11 తేదీలలో హ్యూస్టన్ లో నిర్వహించిన మూడో ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు గురించి కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు సమీక్ష వ్రాస్తే ఎలా ఉంటుందీ - అనే చిలిపి ఊహకి సరదా రూపకల్పన)**

**శ్రీమద్రామాయణ కల్పవృక్ష కర్త సమీక్షల నేల వ్రాయవలెను?** అందునా అమెరికా దేశమున జరిగిన ఒకానొక తెలుగుల సభగూర్చి వ్రాయవలెనా? వ్రాసినాడు. అనుగుల సహితముగా ధర్మజుడు విరటుని గొల్వబోలేదో? విష్ణు పాదోద్భవయైనను తుదకు అర్ణవమున గలియుట లేదో? గాన ఇది వైపరీత్యముగాదు. నేను సమీక్ష జేయుట వారి యదృష్టమనవలెను. వారు చేసుకున్న పున్నెములు ఊరకెబోవునా ? తొల్దొల్త, అసలు రానని దలచియే ఆహ్వానమంపినారు వారు. ప్రపంచమున ప్రచారము జరిగినది గదా, ఛాందసుడననియు, ముక్కోపిననియు. అందువలన రాననుకొనినారు. సంద్రములు దాటుటకు వెరచి, ఆ హ్వానమును తిరస్కరింతురని వారు భావించి యుండవచ్చును. ప్రపంచమున కూటములు గట్టుచున్న గొందరు కుహనా హేతువాదులు ఛాందసులు కారో? నిర్ధారించిన పిదుపనే నమ్మెదమన్న, అది నమ్మకమెట్లగును? అది ఛాందసముకాదో? తమ తమ తల్లి దండ్రుల జన్యు పరీక్షలు జరిపించిన పిమ్మటనే "అమ్మా", "అయ్యా" అని పిలిచినారో? ఏమో, యా ఛాందసులే జెప్పవలెను. అది ఒక చిత్రము.

ఏమైననూ, ఈ సంఘము వారు అట్టివారు కారు. వీరిలో మంచివారు లేకపోలేదు. అయిననూ వీరి నిబద్ధతను బరీక్షింపదలచి విమానమున మొదటి తరగతి టిక్కెట్టు అడిగినాను. పైకమంపినారు. నేను సాధారణ తరగతి టికెట్టునవే బ్రయాణించి హ్యూష్టను బట్టణము జేరినాను. అచట విమానాశ్రయమునందు ఒకబీద అంతేవాసి తారసపడినాడు. వైద్య విద్యాభ్యాసము జేయుచున్నాడు. చేత రూకలు లేవు. లక్ష్మీ సరస్వతుల దోబూచులు మనమెరిగియే యుంటిమి. గాన, మిగిలిన రెండువేల డాలర్లు, కుఱ్ఱవాని చేతిలో పెట్టినాను. వేయి పడగల సహితముగా నిచ్చినాను. పిల్లవానిది బందరు. అట్లుండనిండు.

సంస్థ ప్రతినిధులు, సంఘ ప్రతినిధులు వచ్చినారు, సాష్టాంగపడినారు, సంబరమున నన్ను పడవకారున గూర్చుండబెట్టి వేడుకగా వేదికకు తోడ్కొనిబోయినారు. వారి సంస్కారమట్టిది. పుణ్య వంశంబుల బుట్టిన ఫలమనవలెను. స్వాగత వచనములతో, పిల్లల ప్రార్థనతో కార్యక్రమము మొదలయినది. వేదికపైనను, ఎదురుగనూ, లెక్కకు మిక్కిలిగా ఖర్వాటులే గాన్పడినారు. తత్కారణముననే నన్ను

బిలిచినారో? అయిననూ సాపత్యమెక్కడున్నది. అల నన్నయకు, తిక్కనకూ, ఇల విశ్వనాథునకు గల ఖర్వాటత ఒక యలంకారము. పాండితీ ప్రతిభకు చిహ్నము. మిగిలినవన్నియూ గాకున్న, కొన్ని సారహీన సాలెగ్రామములే గాబోలును. చూడవచ్చినదెవరు?

పిమ్మట ఎవరినో వేదికనెక్కించినారు. వారియందొకనికి బుట్ట మీసములున్నవి. ఆదిభట్ల నారాయణదాసు జ్ఞప్తికి వచ్చినాడు. కృష్ణశాస్త్రి మేనగోడలు వచ్చినది. జంట యవధానులు వచ్చినారు. తిరుపతి వేంకట కవులు మా గురువులు. తత్కారణమున ధన్యులు. మరి వీరి గురువులెవ్వరో. ఒకనికి మరియొకరు గురువని జెప్పగా వింటిని. తరచి జూడగా, ఏ జన్మంబున ఎవరు ఎవరికి గురువో గదా. అజ్ఞాన జీమూతంబులు ఛిద్రుపలైన వేళ, అతనే గురువు, అతనే అంతేవాసి, నిరంతర చైతన్య ప్రభా రాశి. అది తత్వము. ఆ శువుగ పద్యములల్లు నేర్పు గలవారని వినియుంటిని. ఆనందించితిని. మరికొంతమంది ఉపన్యాసకులు, అధ్యాపకులు వచ్చినారు. పిమ్మట తెలుగు నేర్పెడి గొంతమందికి సన్మానము జరిగినది. విధి ఎంత చిత్రమోగదా. మా చెళ్ళపిళ్ళ వారు సన్మానంబుల బ్రోత్సహింపలేదు. తాను జేసికొనలేదు, భవదీయునకు జేయుటకిష్టబడలేదు. అది విషయాంతరము. దేనికైనను బట్టు విడుపులుండవలెను. ఇంకను గొంతమంది రచయిత్రులు వచ్చినారు. సభ పరిచయోపన్యాసము స్వపరిచయోపన్యాసముగా సాగినదన్న యపవాదు వినియున్నాను. నేను నిద్ర లేమివలన గొంత గునుకు చుండుట చేత యా వాక్యములు వినియుండలేదు. గాన నిర్ధారింపబూనను.

దనకు, తన సాహితీ సేవకు తగిన గుర్తింపు దొరకలేదని ఒక వక్త వాపోయినాడు. తెలుగునాట గుర్తింపు లభియింపకపోయిన ఆశ్చర్యమేమున్నది? లభించినచో అబ్బుర పడవలె. ఇది గ్రహించిగాదో మంగళంపల్లి చెన్నపట్నము చేరినాడు. ఈ నాడు ఆంధ్ర దేశమున కవిసామ్రాట్టే కాలినడకన బోయి కాలేజీ పాఠములు జెప్పుకొనుచున్నాడు. చివరకీ దుస్థితియైనది. కానిండు. అయితే భాగ్యనగరమందు నా విగ్రహము ప్రతిష్ఠింపక, నా శిష్యుడు నాకుగొంత మేల్జేసినాడు. కానిచో, యీనాడు నన్నయ, తిక్కనలకూ, రాయలకూ పట్టిన గతే పట్టియుండెడిదిగాదో. కష్టము వెంట సుఖము యుండియే తీరును. హంస రీతి, నీర క్షీర న్యాయము బాటించి, ముందుకు పోవలె.

పిమ్మట ఉత్తమ కథలకూ, కవితలకూ పురస్కారములీయబడినవి. ఒకతను రెండు సార్లు పుచ్చుకొనినాడు. ఈతను నిర్వాహకుల బంధువై యుండవచ్చునని సందేహపడ్డమాట వాస్తవము. ఏమైననూ, అతను రాసినది చదివి నిర్ధారింపవలసి యున్నది. తదనంతరము పుస్తకావిష్కరణలు జరిగినవి. పిమ్మట బుట్ట మీసాల వ్యక్తి మాట్లాడినాడు. సినిమా పాటల రచయితనని చెప్పుకొనినాడు. "ఏకవీర" నాటికి ఏ ఐదేండ్ల పిల్లవాడో అయి ఉండవలె. "గువ్వ గోరింకతో ఆ డినది బొమ్మలాట" అనే గేయాన్ని రచించెనట. బొమ్మలాటలు ఆడునది శిశువులు గాని పశువులు గాదు, పక్షులు ఎంతమాత్రమూ గాదు. పక్షులు ఆ డునది "కొమ్మలాట" గావలె. మరి ఈ గేయము ఎందులకు ప్రాచుర్యము పొందినదో తెలియదు. అది ఒక చిత్రము.

ఈతడు భార్యా బాధితుల ప్రస్తావన గూడ చేసినాడు. అంత నొక తుంటరి ఈతని భార్యకు ఫోనులో ఉప్పందించినాడు. కడుపుజించుకొనెను. గాళ్ళమీద బడదో. అయినను భార్య యనగా నేమి ? భరింపబడునది. యా భారము మోసియే దీరవలెను. ఆమె నవమాసంబులు మోసి యా భర్తకు బిడ్డలను గనుటలేదో? దన వంశ కుదురును గుదుట బరచుటలేదో. యామె ఋణము యెన్ని జేసిన దీరును? స్త్రీ సగము, బురుషుడు సగమనిజెప్పు సిద్ధాంతములసంపూర్ణములు, అపరిపక్వములు. బురుషుడు యొక పూర్ణ సంఖ్య. స్త్రీ యొక బూర్ణ సంఖ్య. వారి హెచ్చవేతచే చేయబడు సంసారమద్దియూ బూర్ణసంఖ్యయే. ఇది వివాహ రహస్యము. అసలు వివాహమననేమి? విశేషముగా వహించునది గాదో.

నా హాహాహూహూ యందు ఉటంకించిన లండను మహానగర పరిసరములనుండి ఒక భిషక్కు వచ్చినాడు. తినుబండారములపై కవితలల్లి అందరనూ నవ్వించినాడు. రెండువందలేండ్లకు పైన మనలనేలిన దొరల సంతతికి గూడ జికిత్సలు జేసి, ప్రాణదానము జేయు సంస్కారమునందే భారతీయత యిమిడియున్నది. అదియొక ప్రత్యేకత.

మరియొక వక్త హాస్య కవితలపై ప్రసంగము చేయుట గమనించినాను. కవితయందననేల, తెనుగుల జీవితమునందే హాస్యము ఇమిడి యుండలేదో? ఏమైనను, జక్కటి బ్రయత్నము. సభలు జరుగు గాలమంతయు బయట జల్లు గురియుచునే యున్నది. ఇది సమయానుకూలముగ జేసిన యేర్పాటో. ఇతమిత్థముగ జెప్పుట గష్టము. ఏమైనను, సభ నిండుదనమునకు ఇదియొక గారణమైనది.

మధ్యాహ్న భోజనానంతరము మరికొన్ని ప్రసంగములు జరిగినవి. స్వీయరచనలలో నవలల వంటి కవితలు, కవితల వంటి కథలు, మాటల వంటి వ్రాతలు విని యున్నాను. తమ వంశ ప్రముఖులపై ఒక కవి కవితలల్లినాడు. వాడుకలోనున్న ఛందస్సులు వాడినాడు. మధ్యాక్కరలో వ్రాసియున్న మరింత అందముగా వుండునని భావించితిని.

శాకపాకములు బాగుగనే యున్నవి. తొల్లి మా బందరు లడ్డును మరచినారని తలచినాను గాని, మరునాడు తేనీటితో నిచ్చినారు. ఉపాహారమున ఉప్మా నిచ్చినారు. జీడిపప్పును మినహాయించిననూ బాగుగనేయున్నది. అల్లము వేసియుండవలసినది. అల్లము అందము గొరకో, అట్టహాసము గొరకో కాదు. అజీర్ణమును హరించునది అల్లము. దీనికి ఆ యుర్వేద ప్రమాణము గలదు. అట్టుండనిండు.

సభ రెండవనాటికి సహనము సగమైనది. సమయపాలన కరువైనది. గొందరు వక్తలు తీరు తెన్నులు లేని ప్రసంగములు చేయుచుంటిరని విరామ సమయమున వినియుంటిని. నా నిద్రలేమి, గునికిపాట్లే నాకు శ్రీరామ రక్ష అయినవి. నాలుగు పాడవైన వాక్యముల మధ్య విరామ చిహ్నములు దొలగించిన, యది కవిత గాదు. స్వానుభవమ్మును స్వానుభవమ్ముగానే చెప్పిన అది డైరీ అగును, పరానుభవమును జూచి, ఉన్నది యున్నట్లు రాసిన అది, పత్రికా వార్తా వ్యాసంగ మగును. కథ గాదు. కథ రాయుట ఒక విలక్షణమైన ప్రక్రియ. దాని సుళువు బళువులు దానికున్నవి.

పుస్తక విక్రయశాల నిరాశబరచినది. గొన్ని జీవితకాలములకు, శతాబ్దములకు సరిపడు నా సాహితీ సేద్య ఫలంబులొక్కటియైననూ కాననైతిని. అందుజేతనే అమ్మకములు అంతంతమాత్రమైనవి. గల్పవృక్షములనొదలి విషక్మారుహంబులకెగబడు పోకడలు ఆంధ్రదేశమున ప్రబలినవి. ఆ ఛాయలు గొన్ని ఇచ్చటనూ గనపడుచున్నవి. ఎవరినేమంతము. ఏమన్ననూ, బధిర శంఖారావమ్ము గాదో. గొన్ని మంచి పుస్తకములు లేకపోలేదు. గాననే అమ్ముడుబోయినవి. హాస్యమునకనుచుంటినే గాని, ఒక రచన యొక్క నాణ్యతను నిర్ణయించునదేది? వెలయో? అమ్మకములో? జనరంజకత్వమో? లేక గాలమో? ఇవేవియునూ గాదు. రచనవలన గలుగు సమాజ హితమే నాణ్యతకు గొలమానము గావలెను.

మధ్యాహ్నము గొంత చర్చ జరిగినది. వాగ్ధోరణులు, ఉచ్చారణలు, ఆ శావహ దృక్పథములు, ప్రబోధ వ్యాసములు, ఒకటిగాదు, సకలాంశ సంహితయైనది. ఈ సభను సభయందే ఒక ఆచార్యుడు సమీక్ష జేసినాడు. పదునెనిమిది గంటలు శ్రమించి, అక్షరాక్షరమూ గ్రహించి, సారము జెప్పుట సామాన్యమగు విషయముగాదు. ఆయన ఓపికకు అయిదు పదిజేయవలెను. తెనుగు భాషా గాయత్రి యను నొక వినూత్న మంత్రమును గూడ ప్రకటించినాడు. అది యొక చమత్కారము.

మధ్య ప్రాచ్య దేశమునుండి వచ్చిన వనిత మా గురువుగారి రాయబార పద్యములు పాడినది. గౌరవ సూచకముగా లేచి నిలబడి వింటిని. ఆమె భర్త మనుచరిత్ర పై పరిచయవాక్యముల జెప్ప నుత్సాహించెనుగాని, సమయము లేదని ఆగినాడట. మంచి విషయములు వినుటకు ఎవ్వరకునూ సమయములేదు.

జీవిత సాఫల్య బురస్కారములు మాగాలమందు అరుదు. కొత్త యొరవడి గాబోలును. మంచి సంస్కృతిగాన అభినందనలు తెలియజేయవలెను. కొందరు భాషా సంఘ నేతలు, ప్రభుత్వ ప్రతినిధులు గూడ వచ్చినారు. మంచికార్యక్రమములను అమలు జేయుటలో తమకు గల సాధక బాధకములను వివరించినారు. ఎవరి కష్టములు వారివి. వారు సదస్సున పాల్గొనుటయే యొక శుభ పరిణామమనవలెను.

ఎట్టకేలకు సభలు ముగిసినవి. కార్యకర్తలందరూ నూతనోత్సాహముతో గానిపించినారు. గొన్ని సంస్థల అధిపతులు రానున్న గాలములో ఇటువంటి కార్యక్రమములను అందలమెక్కించెదమని ప్రతిజ్ఞ చేయుట ముదావహము.

*(సమాప్తం)*




## తూర్పు - పడమర

**- చింతలచెరువు సువర్చల**

**"సన్నజాజి తీవలోయ్.. సంపెంగ్ పూవులోయ్**

చిలిపి సింగారులోయ్ బాలలు.. సిరులొలికే చిన్నారులోయ్" అన్నాడో సినీకవి.

నిజంగా పసిపిల్లల మనస్సు ఎంత తేటగా ఉంటుందో వారి గేయాలు కూడా అంత తేట పదాలతో అన్నాక. మన తెలుగు బాలలే అనుకోనవసరంలేదుగా. ఏ భాషలోనైనా పిల్లల్ని అలరించే గేయాలుంటాయికదా అయితే తెలుగు పిల్లలకి తెలుగు గేయాలతో పాటు ఇంగ్లీషు రైమ్స్ కూడా వచ్చుంటాయి. వారు వేటికవే పాడుకుంటూ ఉంటారు కానీ వాటి సారూప్యతను గమనించలేరు.

నిజానికి గేయాలన్నీ వారి వారి సామాజిక నేపథ్యాల నుంచే పుట్టాయి. వారి భాష సంస్కృతిని అనుసరించుకునే ఉంటాయి. అయినా పెద్దలకీ పిల్లలకీ మధ్య అనుబంధాలు, ఆత్మీయతలు పిల్లల మానసిక స్థాయి, పరిసరాల పరిశీలన ఇవన్నీ ఒకేలా ఉంటాయి కదా. అల వారి జీవన స్రవంతిలోనుంచి జాలువారిన ఈ లేత తుంపరలు మనల్ని ఎలా తడుపుతాయో చూద్దామా?

పాపాయి కన్నుల్లు కలువరేకుల్లు
పాపాయి జులపాలు పట్టుకుచ్చుల్లు
పాపాయి దంతాలు మంచి ముత్యాలు
పాపాయి వన్నెలు పసినిమ్మ పండుల్లు
పాపయి చెక్కిళ్ళు పసి వెన్నముద్దల్లు

అని తెలుగు అమ్మ తన పాపకు ఈ గేయాన్ని నేర్పుతూ పాప అందానికి మురిసిపోతే.

Chubby cheeks
Dimple chin
Rosy lips
Eyes are blue
Curly hair
Very fair
Teachers pet
Is that you
Yes yes yes

అంటూ ఇంగ్లీషు తల్లి తన బేబీకి నేర్పి. బేబీ అందానికి ఆనందిస్తుంది.

బుజ్జి మేక బుజ్జిమేక ఏడకెళ్తివి?
రాజుగారి తోటలోన మేతకెళ్తిని
రాజుగారి తోటలోన ఏమి చేస్తివి?
రాణిగారి పూల చెట్ల సొగసు చూస్తిని
పూలచెట్లు చూసి నువ్వు ఊరకుంటివా?
ఊరకొనక పులచెట్లు మేసివస్తిని
మేసివస్తె తోటమాలి ఊరకుండినా?
తోటమాలి కొట్టవస్తె తుర్రుమంటిని.

అంటూ మనం పిల్లల్లో ఊహాశక్తిని పెంచటానికి అర్థమయ్యే పదజాలంతో తేలిక పదాలతో కళ్ళకు కట్టేలా చెప్తాం. మరి వాళ్ళేమో.

Pussy – cat pussy – cat
Where have you been?
I've been to London
To look at the Queen

Pussy – cat pussy – cat
What did you there?
I frightened a little mouse
Under the chair

అంటూ నేర్పిస్తారు.

వాన పడ్డప్పుడు మన చిన్నారులకు ఆనందమే ఆనందం. ఎప్పుడోకాని రానివాన. దాని రాకతో ఉల్లాసాన్ని అందిస్తుంది. చినుకులు పడుతుంటే తడవటం మహా ఇష్టం. తడుస్తూ ఆడుకోటం మాబాగా ఇష్టం. అలాంటప్పుడే మరి చేతులు చాచి గుండ్రంగా తిరుగుతూ ఇదిగో ఇలా పాడేస్తారు.

వానా వానా వల్లప్పా
వాకిలి తిరుగు చెల్లప్పా
తిరుగు తిరుగు తిమ్మప్పా
తిరుగలేను నరసప్ప

అయితే ఎప్పుడూ వర్షాలు పడుతుంటే కొన్ని పాశ్చాత్య ప్రాంతాలలో ఆటాడుకుందామన్న కుదరదు. ఎప్పుడెప్పుడు వాన ఆగిపోతుందా అని ఎదురు చూస్తుంటారు. మనకేమో వానలు కావాలి. వారికి అంతగా అవసరం లేదు. అలాంటప్పుడు అక్కడి పిల్లలు వాన నుద్దేశించి..

Rain Rain go away

Come again another day

Little Johnny wants to play

Rain Rain go to spain

Never show your face again

అని బతిమలాడుతారు. కోప్పడతారు కూడా.

పిల్లలకి అంకెలు ఉత్సాహంగా నేర్చుకోటానికి, ఇలా కొన్ని కొండగుర్తులతో నేర్పుతుంటాం మనం. వాళ్ళు చకచకా ఒకటీ రెండూ అంటూ చెప్పేస్తారు. అప్పచెప్పేస్తారు.

ఒకటి ఒకటి ఒప్పులకుప్పు

రెండు రెండు రెక్కలపక్షి

మూడు మూడు ముక్కాలిపీట

నాలుగు నాలుగు మా ఆవు కాళ్ళు

అయిదు అయిదు నా చేతి వేళ్ళు

మరి అదే విధానం ఇంగ్లీషు వారికీ ఉంటుందిగా

One, Two

Buckle my shoe

Three, Four

Shut the door

Five, Six

Pick up sticks

Seven, Eight

Lay them straight

Nine, Ten

A big fat hen

ఇక వారాలు నేర్పటం కూడా ముఖ్యమేగా. మరి గేయం రూపంలో నేర్పితే పిల్లలు ఆడుతూ పాడుతూ చెప్పేస్తారుగా.

ఆదివారం నాడు అరటి మొలిచింది

సోమవారం నాడు సుడివేసి పెరిగింది

మంగళవారం నాడు మారాకు తొడిగింది

బుధవారం నాడు పొట్టిగెల వేసింది

గురువారం నాడు గుబురులో దాగింది

శుక్రవారం నాడు చకచక గెలకోసి

అందరికీ పంచితిమి అరటి అతములు

అబ్బాయి అమ్మాయి అరటిపండిదిగో

Monday's child is fair of face

Tuesday's child is full of grace

Wednesday's child is full of woe

Thursday's child has far to go

Friday's child is lovind and givind

Saturday's child works hard for his livinf

And the child that is born

On the Sabbath day (Sunday)

Is bonny and blithe,

Andi good and gay

అంటూ వారాలు అలవోకగా తమ పిల్లలు నేర్చుకునేలా చేస్తారు.

ళ్ళో..ళ్ళా. హాయిా

లాలి ఉయ్యాలమ్మ జోల ఉయ్యాల

ఊగేటి మా పాప తూగుటుయ్యాల

పాల ఉయ్యాలమ్మ గాలి ఉయ్యాల

ఆకాశవీధిలో కెగురు ఉయ్యాల

అంటూ తల్లులు తమ పనిపాటల్లో ఉంటూ చెట్టు ఉయ్యాలలో పిల్లల్ని నిద్రబుచ్చుతారు. అదే జీవనాన్ని అదే గేయాన్ని తలిపిస్తుంది ఈ రైమ్.

"Hush a bye baby" on the tree top

When the wind blows the cradle will rock

When the bow breaks, the cradle will fall

And down come baby cradle and all

ఏడవకు అబ్బాయి ఏడవకు తండ్రీ

పాలిచ్చు మీ అమ్మ పట్నమెళ్ళింది

ఊరుకో అబ్బాయి ఊరుకోవయ్యా

నీరోసి మీ అమ్మ నీళ్ళకెళ్ళింది.

అంటూ అమ్మ కనబడలేదని ఏడుస్తుంటే వచ్చేస్తుందంటూ ఓదార్చే పాట.

అలాంటి రైమ్ ఇంగ్లీషులో కూడా ఉంది అయితే బిడ్డ నాన్న కావాలని మారాము చేస్తుంటాడు.

Cry Babby Bunting

Daddy's gone a hunting

Gone to fetch a rabbit skin

To Wrap the baby Bunting

Cry Babby Bunting

చందమామ రావె. జాబిల్లి రావె

కొండెక్కి రావె కోటిపూలు తేవె

బండెక్కి రావె. బంతిపూలు తేవె.

పల్లకిలో రావె పాలు పెరుగు తెవె

తేరు మీద రావె తేనెపట్టు తేవె

అన్నీ తెచ్చి మా అమ్మాయి / అబ్బాయి కియ్యవె

అంటూ తెలుగునాట బాగా ప్రచారంలో ఉన్నట్లుగానె పాశ్చాత్య ప్రాంతంలో కూడా మనందరికీ తెలిసిన రైమ్ బాగా వ్యాప్తిలో ఉంది. రెండింటికీ భావ సారూప్యత లేకపోయినా రెండూ ఆకాశానికి సంబంధించినవే అవటం విశేషం

Twinkle Twinkle little star

How I wonder what you are

Up above the world so high

Like a diamond in the sky.

ఈ గేయాలన్నింటిలో తూర్పు - పడమర ప్రాంతాల జీవన సారూప్యం, వైరుధ్యం కనిపిస్తుంది. అప్పటి జీవన శైలితో పాటు వాటి వెనుక దాగిన చరిత్ర, సంస్కృతి తెలుస్తాయి. అయితే వీటి వెనుక ఏ మహనీయుల మధురమైన దీవెనలున్నాయో! మరుపురాని ప్రియభావనలున్నాయో!

అన్నింటినీ మించి వారు చిట్టి పొట్టి గేయాలతో చిన్నారుల బాల్యం నిండా సౌరభాల్ని నింపారు. మానసిక వికాసాన్ని అందించారు. బాలలపై అపారమైన మమకారాన్ని కురిపించారు.

ఎంతమంది భాషావేత్తల, సంప్రదాయవేత్తల ముందుచూపో మరి. వారి పేర్లు తెలియకపోయినా ఎదురెదురు ధ్రువాలకు చెందినవారైనా దిక్కుల్లాగే వారెన్నటికీ కలవకపోయినా ధ్రుక్పథంలో మాత్రం ఒకరే. సంకల్పంలో కూడా ఒకతీరే.




## *వ్యాస చరిత్ర!!*

### *వనం వేంకట వరప్రసాదరావు*

**"వ్యాసాయ విష్ణు రూపాయ వ్యాస రూపాయ విష్ణవే,**

**నమోవై బ్రహ్మ నిధయే వాశిష్ఠాయ నమో నమః "..**

(వ్యాసుడే విష్ణువు..విష్ణువే వ్యాసుడు. బ్రహ్మ జ్ఞాన నిధియైన, వశిష్ఠసంతతికి చెందిన, మహానుభావుడైన వ్యాసునకు నమస్కారం)

**"అచతుర్వదనో బ్రహ్మ, ద్విబాహు రపరో హరి,**

**అఫాల లోచనో శంభు భగవాన్ బాదరాయణః !"**

(నాలుగు ముఖములు లేకున్నా బ్రహ్మ దేమునంతటి వాడు, రెండే చేతులు కలిగినప్పటికీ శ్రీ హరి అంతటి వాడు, నుదుట మూడో కన్ను లేకున్నా శివునంతటి వాడు ఐన బాదరాయణుడైన వ్యాసునకు నమస్సులు!)

బ్రహ్మ దేవుని మానస పుత్రుడు వశిష్ఠుడు. భాగవతం ప్రకారం బ్రహ్మదేవుని ప్రాణ వాయువులనుండి వశిష్ఠుడు, అరుంధతీ వశిష్ఠులకు శక్తి, శక్తికి పరాశరుడు, పరాశరునికీ సత్యవతికీ వ్యాసుడు, వ్యాసునికి శుక మహర్షీ జన్మించారు.

నల్లగా, దృఢమైన, ఆకర్షణీయమైన శరీరంతో పుట్టాడు కనుక కృష్ణుడు అని, ద్వీపంలో జన్మించాడు కనుక ద్వైపాయనుడనీ, ఒక్కటే రాశిగా ఉన్న వేద విజ్ఞానాన్ని వ్యాసం చేశాడు కనుక, అంటే విభజించాడు కనుక వ్యాసుడనీ బదరికాశ్రమంలో తపస్సుచేశాడు కనుక బాదరాయణుడనీ, పరాశరుని కుమారుడు కనుక పారాశారుడనీ ..వ్యాసుల వారికి పేర్లు! వ్యాసుల వారు సులభంగా అర్థం కావడం కోసం వేదాన్ని నాలుగు భాగాలుగా విభజించి, ఋగ్వేదాన్ని పైలునికీ, యజుర్వేదాన్ని వైశంపాయనునికి, సామ వేదాన్ని జైమినికీ, అధర్వణ వేదాన్ని సుమంతునికీ, బోధించి వారి ద్వారా వేద విజ్ఞానాన్ని ప్రచారం చేశాడు ప్రపంచంలో.

ఇంకా సులభంగా వేద విజ్ఞానం అందించడం కోసం ఉపనిషత్తులకు బ్రహ్మ సూత్రాలు వ్రాశాడు. అంతటితో తృప్తి చెందక వేద విజ్ఞాన సర్వస్వంగా సులభమైన కథల రూపంలో అష్టాదశ మహా పురాణ సారస్వతాన్నితన మరొక శిష్యుడైన రోమహర్షణుడి ద్వారా ప్రపంచానికి అందించాడు. ఐనా సంతృప్తి లభించక వేద రహస్య సార సర్వస్వంగా మహా భారతాన్ని రచించాడు అందుకే మహా భారతం పంచమ వేదమైంది.అష్టాదశ ఉప పురాణములనుకూడా రచించాడు. ఇంకా ఆయన ఆత్మకు ఆనందం కలుగక నారద మహర్షి సూచన మేరకు శ్రీ కృష్ణ స్తుతి లక్ష్యంగా మహాభాగవతాన్నిరచించాడు. బ్రహ్మసూత్రములకు అర్థ వివరణాత్మకంగా, భారత అర్థ వ్యాఖ్యానంగా, గాయత్రీ మంత్ర సారంగా, వేద విజ్ఞాన సారంగా, సమస్త పురాణ సారాంశంగా, పద్దెనిమిది వేల శ్లోకములతో, వంద అధ్యాయములతో, పన్నెండు స్కంధములతో తను రచించిన మహా భాగవతాన్ని తన కుమారుడైన శుక మహర్షికి వినిపించి, బోధించాడు. ఆయన పరీక్షిత్తు మహా రాజుకు వినిపించాడు!

తన పురాణ, భారత, భాగవత, వేద సారస్వతంలో పరమాణు విజ్ఞానంతో మొదలుకొని, కాల జ్ఞానము, భూగోళ శాస్త్రము, కాల విజ్ఞానము, భావి రాజుల చరిత్ర, సామాజిక, ఆధ్యాత్మిక, నీతి, వేదాంత శాస్త్రసమన్వితాలుగా సమస్త జ్ఞాన రహస్యాలను మానవాళిని ఉద్ధరించడం కోసం వేద వ్యాసుల వారు అందించారు. వ్యాసుల వారు చెప్పనిది యింతవరకూ ఆధునిక విజ్ఞాన శాస్త్రంతో సహా ఎక్కడా చెప్ప బడలేదు. భౌతిక, రసాయన, వైద్య, యుద్ధ, గణిత శాస్త్రములన్నింటిలోను ఆధునిక మానవుడు కనుగొన్న అద్భుత రహస్యాలన్నీ ఆయన ఏనాడో చర్చించాడు! సమస్త జ్ఞాన సర్వస్వానికీ మూల పురుషుడు కనుక ఆయన తొలి గురువు. ఆయన జన్మ తిథి ఐన ఆషాఢ పౌర్ణమి నిజమైన గురుపౌర్ణమి!

సమస్త శాస్త్రాల సారం పరోపకారమును మించిన పుణ్యము లేదు, పర పీడన కన్న పాపంలేదు అనే సత్యమే అని ఘోషించాడు. సమస్త ప్రాణి కోటిలోను వెలుగొందుతున్న దైవం ఒకడే అని, సమస్త ప్రాణికోటి భగవంతుని సంతానమే అని బోధించాడు. దేహమే దేవాలయం, జీవుడే దేముడు, మానవ సేవయే మాధవ సేవ, త్యాగము చేతనే అమృతత్వము సిద్ధిస్తుంది, ప్రతి ఆత్మా పరమాత్మయే, సత్యమే జయిస్తుంది, సత్యమే దైవము, ప్రపంచమంతా ఒకటే కుటుంబము, రెండు పాదముల మానవులకూ, పక్షులకూ, నాలుగు పాదముల పశువులకూ..అంటే సమస్త ప్రాణి కోటికీ శాంతి కలగాలి, సర్వ జనులూ సుఖించాలి అని చాటిన, బోధించిన భగవత్ స్వరూపుడు.. సాక్షాత్తూ మహావిష్ణువు అవతారమైన వ్యాసుడు భారతీయులకే కాదు....సమస్త మానవాళికీ తొలి గురువు, జ్ఞాన నిధి!

మానవాళిని ఉద్ధరించడం కోసము మహావిష్ణువు ప్రతి ద్వాపర యుగంలోనూ అవతారం దాలుస్తూ ఉంటాడు, వ్యాసునిగా! మొదటి ద్వాపర యుగంలో స్వాయంభువ మనువు, రెండవ ద్వాపర యుగంలో ప్రజాపతి, మూడవ ద్వాపర యుగంలో ఉశనసుడు, నాలగవ ద్వాపరంలో బృహస్పతి, ఐదవ ద్వాపరంలో సూర్యుడు (సవిత) ఆరవ ద్వాపరంలో మృత్యువు, ఏడవ ద్వాపరంలో మఘవుడు, ఎనిమిదవ ద్వాపరంలో వశిష్ఠుడు, తొమ్మిదవ ద్వాపరంలో సారస్వతుడు, పదవ ద్వాపరంలో త్రిధాముడు, పదకొండవ ద్వాపరంలో త్రివృషుడు, పన్నెండవ ద్వాపరంలో భరద్వాజుడు, పదమూడవ ద్వాపరంలో అంతరిక్షుడు, పద్నాలగవ ద్వాపరంలో ధర్ముడు, పదిహేనవ ద్వాపరంలో త్రయ్యారుణి, పదహారవ ద్వాపరంలో ధనంజయుడు, పదిహేడవ ద్వాపరంలో మేధాతిథి ,పద్దెనిమిదవ ద్వాపరంలో వ్రతి, పందొమ్మిదవ ద్వాపరంలో అత్రి, ఇరవైయ్యవ ద్వాపరంలో గౌతముడు, ఇరవై ఒకటవ ద్వాపరంలో ఉత్తముడు, ఇరవై రెండవ ద్వాపరంలో వేనుడు, ఇరవైమూడవ ద్వాపరంలో సోముడు, ఇరవై నాల్గవ ద్వాపరంలో తరుణ బిందువు, ఇరవై ఐదవ ద్వాపరంలో భార్గవుడు, ఇరవై ఆరవ ద్వాపరంలో శక్తి, ఇరవై ఏడవ ద్వాపరంలో జాతుకర్ణ్యుడు వ్యాసులుగా అవతరించారు.

బ్రహ్మ దేముడు కూడా ఆయన గారి కాలమానంలో వంద సంవత్సరాల తర్వాత తనువు చాలిస్తాడు, మరొక బ్రహ్మ వస్తాడు. ప్రస్తుత బ్రహ్మ గారి కాలంలో ఇది ఇరవై ఎనిమిదవ ద్వాపర యుగం. ఈ ద్వాపర యుగంలో కృష్ణ ద్వైపాయనుడు వ్యాసుడు. రాబోయే ఇరవై తొమ్మిదవ ద్వాపర యుగంలో ద్రౌణి వ్యాసుడౌతాడు.

ఇదీ సంక్షిప్తంగా వ్యాస చరిత్ర. ఆది గురువైన వ్యాసులవారి ఆశీస్సులు సమస్త మానవాళినీ శాంతియుత సహజీవన సౌభాగ్యానికి పాత్రులుగా చేయుగాక!

●●●




# ఎల్లలెరుగని మహాప్రస్థానం

## డాక్టర్ రాపోలు సుదర్శన్

'**1930 వరకు తెలుగు సాహిత్యం నన్ను** నడిపితే 1930 తర్వాత దాన్నినేను నడిపాను' అన్న ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించి, అది నిజమని తన కవిత్వం, కవిత్వేతర రచనలతో నిరూపించారు మహాకవి శ్రీశ్రీ వీరి మొత్తం రచనల్లో మకుటాయమానమైనది 'మహాప్రస్థానం'. 1933-1947 మధ్య రాసిన కవితలలో 40 కవితల్ని ఏర్చి కూర్చి 'మహాప్రస్థానం' కావ్యంగా 1950లో వెలువరించారు. అప్పటినుంచి 2011 వరకు 32 ముద్రణలను పొందిందంటే ఈ కవితా సంకలనం ఎంత జనబాహుళ్యాన్ని పొందిందో తెలుస్తుంది. 100 పేజీలైనా లేని ఈ మహా కావ్యం తర్వాతి కవు కవులెందరికో ఒజ్జబంతి అయ్యి ఆదర్శంగా నిలిచింది.

'ఆంధ్ర మహాభారతా'న్ని తెలుగులోకి నన్నయ్య అనువదిస్తూ ఈ కావ్యాన్ని కవులు చదివితే కవిత్వ గ్రంథంగా, న్యాయకోవిదులు చదివితే న్యాయశాస్త్రంగా, ఖగోళ శాస్త్రజ్ఞులు చదివితే ఖగోళశాస్త్రంగా ఇలా ఏ రంగం దృష్టితో చదివితే ఆరంగం శాస్త్రంగా అగుపిస్తుందని చెప్పిన మాట 'మహాప్రస్థానం' కావ్యానికి అనుసరింపజేస్తే సామాన్యులకోసం - అని కొందరంటే, కాదుకాదు శ్రామికులకోసం రాసిందని, కమ్యూనిజ ప్రచారానికై అని- ఇలా ఏ దృష్టితో చూసి చదివితే ఆ అంశాలు మెండుగా వున్నట్లు అగుపడే ఈ కావ్యాన్ని అంతర్జాతీయ దృక్పథంతో ఈ వ్యాసంలో పరిశీలిద్దాం.

మహాకవిశ్రీశ్రీ తన దృష్టిలో తెలుగు కవిత్రయంగా- ప్రాచీనకాలంలో తిక్కన, మధ్యయుగాల్లో వేమన, ఆధునిక కాలంలో గురజాడలను పేర్కొని, గురజాడను తన గురువుగా చెప్పుకున్నాడు. ఆ గురజాడ 'దేశభక్తి' గీతాన్ని ఏదేశమైనా పాడుకునే రీతిలో అంతర్జాతీయ గేయంగా రాసినట్లు 'మహాప్రస్థానం' కావ్యంలో దాదాపు కవితలన్నిటిని ఎల్లలు ఎరగని విధంగా రాశాడు శ్రీ శ్రీ "...నెత్తురూ, కన్నీళ్ళూ తడిపి కొత్త ***Tonic*** తయారు చేశాడు శ్రీ శ్రీ ఈ వృద్ధ ప్రపంచానికి" అని చెప్పాడు చెలం 'యోగ్యతా పత్రం'లో. ఇందులోని ఒక్కో కవితను విశ్వదృష్టితో చూద్దాం.

'మహాప్రస్థానం'లో కాలానుసరణ(**Chronological**)గా చూస్తే 1933 లో రాసిన 'జయభేరి' మొట్టమొదటిది. ఈ కవితను ఆరంభించడమే "నేను సైతం/ప్రపంచాగ్నికి/సమిధ నొక్కటి ఆహుతిచ్చాను" అంటూ ప్రారంభించాడు. ప్రపంచాగ్నికి, విశ్వ వృష్టికి, భువన ఘోషకు - అని ఒక్కో స్టాన్జాలో చెప్పి కవితను ముగిస్తూ "నేను సైతం/ప్రపంచాబ్జపు తెల్లరేకై పల్లవిస్తాను/" అంటూ 'విశ్వవీణకు' ,

'భువన భవనపు' అని అంతర్జాతీయ దృక్పథంతోనే ఈ కవితను శ్రీశ్రీ ముగించాడు. ఇంకా ఈ కవిత మధ్యలో 'జగం నిండా', 'లోక మంతా' అనీ తెలిపాడు. ఇందులో 'నేను సైతం' అనే దానిలో 'నేను' అనేది 'విశ్వ మానవుడి'కి ప్రతీకేగాని ఏ ఒక్క దేశ మనిషికి చిహ్నం కాదు.

మహాప్రస్థానం కావ్యం మొత్తానికి చుక్కల్లో చంద్రుడిలా భాసించే 'మహాప్రస్థానం' టైటిల్ కవితలో "... మరో ప్రపంచం/మహాప్రపంచం/ధరిత్రినిండా నిండింది" అని కేవలం తన ప్రాంతానికో, దేశానికో అనకుండా యావత్ 'ధరిత్రి నిండా నిండింద'ని చెపాడు శ్రీశ్రీ ఇంకా ఈ కవితలో "...నయాగారా వలె/ఉరకండీ ముందుకు/" అనే అంతర్జాతీయ పోలికను పొందుపరచి 'మరో ప్రపంచం' సాధించడానికి ఆలపించాల్సిన సమరశీల గేయంగా దీన్ని రూపొందించాడు శ్రీశ్రీ

'ఒక రాత్రి' అనే కవితలో గగనం, ఆకాశం, గాలిలో, ఆకాశపుటేడారిలో తనకు కనిపించిన తీరుచెప్పి "విశ్వమంతా నిండి, వేలిబూది వోలె/బహుళ పంచమి జ్యోత్స్న భయపెట్టునన్ను" అని బహుళ పంచమి నాటి రాత్రి తీరును "విశ్వమంతా" అనే పదంతో విశ్వ దృష్టిని ప్రదర్శించాడు శ్రీశ్రీ

**E.A. Poe** వ్రాసిన **The Bells** కి అనువాదం కాదు - అని, ఐతే ఆ కవితను చదివి తనలో కలిగిన భావనకు ప్రతిరూపంగా 'గంటలు' కవితను రాశానన్నాడు శ్రీశ్రీ "పట్టణాలలో, పల్లెటూళ్ళలో/బట్టబయలునా, పర్వత గుహల్లాదారులందూ, సముద్రమందూ,/ అడవుల వెంటా,అగడ్తలంటా/ప్రపంచమంతా ప్రతిధ్వనిస్తూ..." అని ఆరంభమవుతుంది ఈ కవిత. ఇది ఏదేశస్తులు పాడుకున్నా స్థల దోషముండని రీతిలో రాశాడు శ్రీ శ్రీ ఫ్రెంచ్‌లో ప్రముఖ కవి, నాటక కర్త అయిన ఎమైల్ వేర్ హెరెన్ { **Emile Verhaeren** (1885-1916)} రాసిన లెస్ పావ్‌రెస్ **(Les Pauvres )** కవితను 'పేదలు' శీర్షికతో "అంతేలే, పేదల గుండెలు!/అశ్రువులే నిండిన కుండలు/శ్మశానమున శశికాంతులలో/చలిబారన వెలి రాబండలు!/" అంటూ తెనిగించిన కవిత ఏ దేశంలోని 'పేదలు' అయినా వారి జీవితం ఎలా దుర్భరంగా వుంటుందో కవితాత్మకంగా అచ్చ తెలుగు కవితలాగే శ్రీ శ్రీ రాశాడు. ఇదీ ఏ దేశ ప్రజలకైనా వర్తించే విశ్వ వ్యాపిత ప్రజలు **(Universal People)** చదువుకోడానికి అనుకూలంగా వుంది.

"కూటికోసం, కూలికోసం/పట్టణంలో బ్రతుకుదామని-/..." అంటూ ఆరంభమయే 'బాటసారి' కవితలో ఏ ఒక్క ప్రాంతం పేర్కొనకపోవడంతో ఈ కవితయావత్తు పొట్ట కూటికోసం వలస వెళ్ళే ఏ దేశస్తులకైనా చెల్లుబాటు అయ్యేంత అంర్జాతీయత గమనిస్తాం. ఇలాగే అవతలిగట్టు, కళారవి, ఒక క్షణంలో, పరాజితులు, ఆః, ఉన్మాది, అభ్యుదయం, జ్వాలాతోరణం, కేక, నీడలు మొదలైన కవితలన్నీ పేర్కొనవచ్చు. ఇలాగే 'ఆశాదూతలు' కవితలో 'యజ్ఞాశ్వముల్' వంటి ఒకటో రెండో పదాలు లేకుంటే ఇదీ ఏ ప్రాంతీయులకైనా వర్తిస్తుంది. ఇదేవిధంగా 'వాడు' అనే కవితను కర్మ సిద్ధాంతాన్ని ఏదేశ ప్రజలు నమ్ముతారో వారు పాడుకో దగ్గట్టుగా రాశాడు శ్రీ శ్రీ మరో కవిత 'మిథ్యావాది' కుడా ఇలాంటిదే

మహాప్రస్థానం కావ్యం మొత్తంలో తన గురించి రాసుకున్న కవితలుగా ఐ, స్విన్‌బర్న్ కవికి, కవితా! ఓ కవిత, దేని కొరకు కవితల్ని పేర్కొన వచ్చు. తన గురించి 'ఐ' అని ఆంగ్ల పదం 'I' ని తెలుగులో వాడ్డంలోనే 'ఆంగ్లీకరణ' అదే అంతర్జాతీయత వ్యక్తమౌతుంది. ఈ కవితలో యజ్ఞోపవీతం (జంధ్యం పవిత్రతకు చిహ్నంగా వాడడం), అనల వేదిక (యజ్ఞ వేదిక) పదాలను మినహాయిస్తే అనితర సాధ్యంగా రచనల్ని వెలువరించే ఏ సృజనకారులైనా తమ గురించి చెప్పుకోవడానికి అనుకూలంగా వుందీ కవిత. ప్రముఖ బ్రిటిష్ కవి, నాటకకారుడు, సాహిత్య విమర్శకుడైన ఎ.సి. స్విన్ బర్న్ (1837 - 1909 ) రచనల్ని చదివి ఎంతో స్ఫూర్తిని పొంది, ఆయన గొప్పదనాన్ని తెలుగు వారికి చెప్పడానికి "స్విన్ బర్న్ కవికి" శీర్షికతో కవిత రాశాడు శ్రీశ్రీ ఇందులో ఈ కవి పాటలు ఎలా వున్నాయో చెప్పి చివరికి "కవీ!నీ గళ గళన్మంగళ/కళాకాహళ/హళాహళి/కలిసిపోతిని!కరగిపోతిని!/ కానరాకే కదలిపోతిని!" అనే పంక్తులతో ముగించాడు శ్రీశ్రీ, ఇలా ఒక అంతర్జాతీయ కవిని తెలుగువారికి పరిచయం చేసూ తెలుగు పాఠకుల్ని అంతర్జాతీయ స్థాయికి

తీసుకెళ్ళాడు. అంతేగాదు, ఈయనదే 'ఎ మ్యాచ్' (A Match) అనే గీతాన్ని 'అద్వైతం' శీర్షికతో అనుసరణ గేయంగా తెలుగులోకి మలిచాడు శ్రీశ్రీ ఈ కవితను కన్యాశుల్కం చలనచిత్రంలో ఒక పాటగా వాడుకున్నారు. తన గురుంచి శ్రీశ్రీ రాసుకున్న కవితల్లో మరో కవిత 'కవితా! ఓ కవితా!' ఒకటి. ఏ భాషీయ కవి అయినా కవిత్వం రాసే తొలి దశలో "చిరదీక్షా శిక్షా తపస్సమీక్షణలో..." ఉండక తప్పదు. ఈ కవితలో శ్రీశ్రీ కవిత్వం రాయడానికి తనకు కనిపించినవీ, వినిపించినవీ కవిత్వీకరిస్తూ "... నడిరేనిద్దురలో/అపుడే ప్రసవించిన శిశువు నెడదనిడుకొని/..." ఇలా ఎన్నెన్నో గమనించిన శ్రీశ్రీ "...కడుపు దహించుకు పోయే/పడుపుకత్తె రాక్షస రతిలో/..." ఆమె "...బాధల పాటల పల్లవి!"తోపాటు, "...సమ్మెకట్టిన కూలీల,/ సమ్మెకట్టిన కూలీల భార్యల, బిడ్డల/ఆకటి చీకటి చిచ్చుల హాహాకారం! ఆర్తారావం/..." మొదలైనవి ఏ ఒక్క దేశానికో, ప్రాంతానికో చెందినవికాక విశ్వవ్యాప్త(Universal)గా వున్నవి వినిపించాడు శ్రీశ్రీ ఇంకా "...నేనీ భూలోకంలోపడి/" అనే పంక్తిని చదివితే కవి తను వున్న ఆంధ్ర ప్రాంతంలోనో, భారత దేశంలోనో పుట్టినట్టుగా చెప్పుకోక ప్రపంచ మానవుడిగా 'భూలోకంలో' పుట్టినట్లుగా చెప్పుకోవడం వల్ల శ్రీశ్రీలో అంర్జాతీయ దృష్టి కనిపిస్తుంది. తన గురించి చెప్పుకున్న మరో కవిత 'దేనికొరకు'. ఇందులో ఉన్న రెండు 'స్టాన్జాలు' కవి తన పేరు 'శ్రీనివాస రావ్'తో ముగించాడు. ఈ పేరుకు బదులు మరే దేశ కవి అయినా తన పేరు పెట్టుకుంటే ఆ దేశ కవి కవితగా అన్వయం పొందుతుంది. ఇలా తన గురించి చెప్పుకున్న కవితలనూ ఏ ప్రాంతానికైనా, ఏ కవికైనా వర్తించేట్టుగా విశ్వ దృక్పథంతో రాశాడు శ్రీశ్రీ

పిల్లల గురించి రాసిన కవిత 'శైశవ గీతి'. ఇది "పాపం పుణ్యం, ప్రపంచ మార్గం..." అనే పంక్తితో ఆరంభమవుతుంది. మొదటి పంక్తిలోనే 'ప్రపంచ' పదం ప్రయోగించి ఈ కవిత ప్రపంచ బాలల కోసం రాసినట్లుగా ఋజువు చేశాడు శ్రీశ్రీ ప్రజల మధ్య వ్యత్యాసాలున్న ఏ దేశ ప్రజలైనా 'వ్యత్యాసం' కవితను చదువుకోవచ్చు. మరో కవిత 'ప్రతిజ్ఞ' పరిశీలిస్తే అందులో ఎక్కడా ప్రాంతమో, ప్రదేశమో పేర్లు చెప్పక యావత్ "...జగానికంతా సౌఖ్యం నిండగ/విరామమెరుగక పరిశ్రమించే/బలం ధరిత్రికి బలికావించే..."; "...ప్రపంచ భాగ్యం వర్ధిల్లాలని..." ; "...లోకపుటన్యాయాలూ" ; "...త్రిలోకాలలో, త్రికాలాలలో..." ; "...జగతుకంతా చవులిస్తానోయ్" అంటూ 'ప్రతిజ్ఞ' కవితలో ప్రతిజ్ఞ చేశాడు శ్రీశ్రీ ఇలాగే ఏ దేశ, ప్రాంత పతితులకైనా, భ్రష్టులకైనా, బాధా సర్పదష్టుల కైనా అభయాన్ని అందించే కవిత 'జగన్నాథుని రథ చక్రాలు'. ఇందులో "...నిటాలాక్షి పటాలుమన్పిరపంచాన్ని భయ పెట్టింది..." అంటూ మరోచోట "...పునాదులై ఇళ్ళు లేచ్చి,అనావళికి శుభం పూచి - / శాంతి,శాంతి, కాంతి,శాంతి,జగమంతా జయిస్తుంది.../" అని జగద్రష్టగా ఈ కవితను రాశాడు శ్రీశ్రీ. 'పుత్తడి బొమ్మా పూర్ణమ్మ"ను గురజాడ కథాత్మక కవితగా అల్లినట్లుగా 'భిక్షు వర్షీయసి' ని శ్రీశ్రీ తీర్చి దిద్దాడు. హృదయ విదారకమైన ఈ కవిత ఏ దేశంలోని బిచ్చగత్తె దృశ్యమైనా కావచ్చనే రీతిగా ప్రాంత దోషం లేని కవితగా మలిచాడు మహాకవి శ్రీశ్రీ 'ఒక దురదృష్ట జీవి' ఆరిపోవడాన్ని హృదయవిదారకంగా 'ఆకాశదీపం' కవితలో కవిత్వీకరించాడు. దీన్ని ఏ భాషలోకి అనువదించినా ఆ ప్రాంతీయతను సంతరించుకుంటుంది. 'ఋక్కులు' కవితలో కవితావేశం ఉండాలేగానీ కవితకు వస్తువు కానిదేదీ ఉండదని చెబుతూ "ప్రపంచమొక పద్మవ్యూహం!/కవిత్వమొక తీరని దాహం"గా చెప్పాడు. 'అవతారం'లో తిరుగుబాటును కవి సూచించి "పుడమి తల్లికి/పురుటి నొప్పులు/కొత్త సృష్టిని స్ఫురింపించాయి" అని మొత్తం భూమిపై మరో ప్రపంచం సృష్టిని ఊహించాడు కవి.

సాటి మనుషుల్ని హీనంగా చూసే, బానిసలుగా చేసే ఏ దేశ ప్రజలనైనే జాగృతపరిచే కవిత్వం "...పులిచంపిన లేడి నెత్తురూ,/ఎగరేసిన ఎర్రని జెండా,/..." ; "ఘాటెక్కిన గంధక ధూమం,/పోటెత్తిన సప్త సముద్రాల్," ; "రాబందుల రెక్కల చప్పుడు, / పొగ గొట్టపు భూంకార ధ్వని,/..." లా వుండాలని చెప్పి అంతిమంగా "కదిలేదీ, కదిలించేదీ,/మారేదీ, మార్పించేదీ,/పాడేదీ, పాడించేదీ,/మునుముందుకు సాగించేదీ,/పెనునిద్దుర వదిలించేదీ,/పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ..."గా మేల్కొల్పేలిది అయి వుండాలని అద్భుతంగా 'నవకవిత'లో చెప్పాడు శ్రీశ్రీ, ఇలాగే 'మానవుడా' కవిత కుడా. ఇందులో ప్రపంచంలోని ఇతర ప్రాంతాలు "...ఆసియా,

అమెరికా, యూరప్,/ఆఫ్రికా, ఆస్ట్రేలియాలలో/సముద్ర ద్వీపాలలో/ధ్రువ ప్రాంతాలలో…"ని మానవుడి స్థితి గతుల్ని తెలిపే ఈ కవితా ఏ దేశానికైనా వర్తిస్తుంది. ఇదే విధంగా "నిజంగానే నిఖిల లోకం/నిండు హర్షం వహిస్తుందా?/మానవాళికి నిజంగానే/మంచి కాలం/రహిస్తుందా?" అంటూ విశ్వ మానవాళి కోసం రాసిన గేయమిది.

'సంధ్యా సమస్యలు' కవితలో మద్రాసునగరంలో వుండే విద్యార్థి, ఉద్యోగి, సంసారులకు సంధ్యా సమయంలో కలిగే కష్టాలు చూపబడ్డాయి. సంధ్యా సమయమంటే రాత్రికి ఉదయానికి గాని, సాయంకాలం నుంచి రాత్రికి కాలం జారుకునే కాలాన్ని గాని సంధ్యా సమయమంటాం. ఇది రెండు కాలాలకు సంధి కాలం. ఇంగ్లీషు సినిమాలు ఎక్కువగా ఆడే రాదిరో థియేటర్ లో ప్రముఖ హాలివుడ్ చలన చిత్రాలైన ఈడియట్స్ డిలైట్స్ (1939), రోమియో అండ్ జూలియెట్(1936)మొదలైన వాటిలో నటించిన నటీమణి నార్మా షేరర్(1902-1983)చిత్రాన్ని చూడాలా లేక బ్రాడ్వే థియేటర్ లో కాంచనమాల {(1923 -1981) తెలుగు చలన చిత్ర పరిశ్రమ తొలి రోజుల్లో తొలి అందాల తారగా ప్రసిద్ధి చెందింది, ఈమె తొలి చిత్రం 1935 లో విడుదలైన శ్రీ కృష్ణ తులాభారం} సినిమాని చూడాలా - అనే సమస్య. ఇలాగే ఒక ఉద్యోగికి శ్రీ కృష్ణ విలాస్ హోటల్‌లో బాదం హల్వా తినాలా లేక సేమ్య ఇడ్లీ తినాలా అనే సమస్య. అలాగే సంసారికి అప్పుల వాళ్ళు, తన పిల్లల ఆకలి గుర్తుకొచ్చి వురేసుకోనా లేక సముద్రాన పడి ఆత్మాహత్య చేసుకోవాలా అనే సమస్య. ఇలా విద్యార్థి, ఉద్యోగి, సంసారులకు ఏర్పడిన సమస్యలు ప్రపంచంలో ఎక్కడైనా ఒక్కటే. ఈ కవితలో మద్రాసు నగరంలోని స్థలాల పేర్లు కనిపిస్తాయి. కానీ మారే ఇతర ప్రాంతీయ కవి అయినా తన ప్రాంత పేర్లను వాడితే ఈ కవిత ఆ ప్రాంతీయ మవుతుంది. అంటే ఈ కవితా విశ్వజనీనమే.

'మహాప్రస్థానం'లోని కవితల్లో మార్క్సిజాన్ని అక్షరం అక్షరంలో, ప్రతి పాదంలో కవిత కవితంతా నింపి డైరక్టుగా మన గుండెల్లోకి ఒంపే కవిత 'దేశ చరిత్రలు'. దీన్ని ఏప్రిల్ 10, 1938 నాడు 24 పాదాల్లో రాశాడు శ్రీశ్రీ ఈ కవితను వివరించాలంటే వెయ్యి పేజీల వ్యాసం రాసినా సరిపోదు. ఇది ఏదేశానికైనా, ఏప్రాంత ప్రజలకైనా వర్తించే అంతర్జాతీయ కవితకు నిలువుటద్దం. "ఏదేశ చరిత్ర చూచినా/ఏమున్నది గర్వ కారణం? నరజాతిచరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం" అనే పంక్తులతో ఈ కవిత ఆరంభమవుతుంది. తను పుట్టిన భారతదేశంగానీ, తన దేశాన్ని పరిపాలిస్తున్న పరాయి దేశమైన రవి అస్తమించని బ్రిటనైనా లేక ఇంకా ఏ దేశ చరిత్రైనా చూస్తే గర్వించ దగ్గ అంశమేమీ లేదని చెప్పి, యావత్ నరజాతి, పరులచేత పీడింపబడుతున్నదనే చారిత్రక యదార్థ సత్యాన్ని చెప్పాడు శ్రీశ్రీ చరిత్రలో రాచరికవైనాన్ని "బలవంతులు దుర్బల జాతిని/బానిసలను కావించారు; /నరహంతలు ధరాధిపతులైన /చరిత్రమున ప్రసిద్ధి కెక్కిరి" అని అతి సులభంగా బోధపడే రీతిగా చెప్పాడు శ్రీశ్రీ ఈ భూస్థలమంతా "… రణ రక్త ప్రవాహ సిక్తం" గానో "… కాకుంటే కన్నీళ్ళతో"నో తడిసిందన్న చారిత్రక సత్యాన్ని కవిత్వాత్మకంగా ఆవిష్కరించాడు శ్రీశ్రీ అనేక యుద్ధాలతో తన సామ్రాజ్యాన్ని విస్తరింపజేసుకున్న మంగోలియన్ మహా వీరుడు జెంఘీజ్ ఖాన్ (1162 -1237); తూర్పు యూరప్, ఆసియా ఖండాల్లోని ఎక్కువ భూ భాగాన్ని జయించిన, భారతీయ రాజుల్లో బాబర్ వంశీయుడైన తామర్లేనూ (1335 -1405); బ్రిటిష్ భారతావనిలోని డెహరాడూన్‌లో జన్మించి, పిన్న వయసులోనే రక్షణ మంత్రి **(Minister of War)** అయ్యి అనంతరం రాజుగా ఆఫ్ఘనిస్తాన్‌ను ఏలిన నాదిర్షా (1883 -1933); ఆఫ్ఘన్‌లో జన్మించి దాని రాజై, రాజ్య విస్తరణ కాంక్షతో భారత దేశం పై 17 సార్లు దండయాత్రలు చేసి 1024లో సోమనాథ్ దేవాలయాన్ని ధ్వంసం చేసిన ఘజనీ(997-1030); ఆఫ్ఘనిస్తాన్‌లో జన్మించి, తన సామ్రాజ్యం మన దేశం వరకు విస్తరింపజేయ పలుమార్లు దండయాత్రలు చేసిన ఘోరీ(1150-1206); గ్రీసులో జన్మించి, అరిస్టాటిల్‌కు శిష్యుడై, తన సామ్రాజ్య విస్తరణకై దండయాత్రలు జరిపి ఈ భూమిపై చాలా భూభాగాన్ని జయించి విశ్వవిజేతగా బిరుదు పొందిన సికందర్ {ఇతని అసలు పేరు అలగ్జాండర్(క్రీ.పూ.356 - క్రీ.పూ.323)} వీళ్ళలో ఎవరైనా "… ఒక్కొక్కడూ మహా హంతకుడు" గా అభివర్ణించాడు శ్రీశ్రీ

ఇంకా ఈ 'దేశ చరిత్రలు' కవితలో జాతుల గురించి చెబుతూ వైకింగులు {**vkings**క్రీ. శ. 8 -11 శతాబ్దాల మధ్య జీవించిన వీరు ప్రధానంగా దోపిడీదారులులు} {5వ శతాబ్దం లో యుద్ధోన్మాదులైన ఆసియాకు చెందిన ఈ జాతీయులు అత్తిల **(Attila The Hun)** అనే రాజు నాయకత్వంలో యూరప్ భూ భాగాన్ని జయించారు}; సిథియన్లు{(**Scythians)** క్రీ.పూ. 200 నుంచి కనిపించే ఈ జాతీయులు అశ్వారూఢులై యుద్ధాల్నిచేస్తారు}; పారశీకులూ {(ఫర్సి) వీరు క్రీ. శ. 10వ శతాబ్దం నుంచి కనిపిస్తారు. వీరి పూర్వీకులు ఇరానీయులు}; పిండారులు {**(Pindaris)** ఈ జాతీయులు దారి దోపిడీదారులు. వీరు ముస్లిం రాజులను దోచుకున్నారు}; థగ్గులు - ఇలాంటి వారు సాటి మానవుల పట్ల ప్రవర్తించిన అమానవ ప్రవర్తనను "కాలానికి కత్తుల వంతెన" కట్టినట్లు చెప్పాడు శ్రీశ్రీ ఇంకా 'దేశ చరిత్రలు' కవితలో అంతర్జాతీయత "చీనాలో రిక్షావాలా/చెక్ దేశపు పని మనిషీ/ఐర్లాండున ఓడ కళాసీ..." లను; మరింకా "హాటెన్ టాట్,జూలూ,నీగ్రో/ ఖండాంతర నానా జాతులు" తెలపడంతో తేటతెల్లమవుతున్నది. ఏదేశంలో నైనా "ఒక వ్యక్తిని మరొక్క వ్యక్తీ/ఒక జాతిని వేరొక జాతి/ పీడించే సాంఘిక ధర్మం/ఇంకానా? ఇకపై సాగదు" అని చాటింపుగా 'దేశ చరిత్రలు' తెలిపాడు. ఈ కవితలోనే నైలునదీ నాగరికతలో తాజమహల్ నిర్మాణానికైనా సామాన్యుల పాత్రే ముఖ్యమన్నాడు శ్రీశ్రీ అంతిమంగా "ఏదేశం ఏకాలంలో/సాధించినదే పరమార్థం?" అని 'దేశ చరిత్రలు' కవితను ఏ జాతి ప్రజలైనా పాడుకునే విధంగా అంతర్జాతీయ కవితగా వెలువరించారు మహాకవి శ్రీశ్రీ

1941 జూన్ నెలలో రష్యా వైమానిక దళం యుద్ధరంగ ప్రవేశం చేసిన వార్త చదివి 'గర్జించు రష్యా' కవితను రాశాడు శ్రీశ్రీ ఇందులో రష్యాను "వ్యక్తి స్వతస్సిద్ధ స్వాతంత్ర్యదాతా!/అతిత నిర్గతిక ప్రపంచ త్రాతా/" గా అభివర్ణించాడు శ్రీశ్రీ రష్యా విజయానికై "... ప్రపంచం పడగెత్తి బుసకొట్టి లేచింది/ ... ప్రపంచం నీ కోసం పరిపక్వంగా వుంది..." అని ప్రపంచ దృష్టి రష్యాపై, రష్యా దృష్టి ప్రపంచ కార్మికుల సౌభాగ్యం కోసంగా వుందని శ్రీశ్రీ భావించాడు. ఈ కవితతో అంతర్జాతీయంగా జరుగుతున్న సంఘటనపై తెలుగులో కవిత రాసినట్టైంది.

ఇలా 'మహాప్రస్థానం' లోని ఏకవితను చూసినా ప్రాంతాల ప్రసక్తి దాదాపు లేదనవచ్చు. వున్నా ఒకటో అరో కవితలో ఎక్కడో ఒకటో రెండో పదాలు తప్ప మిగతా దంతా విశ్వ జనీనత వున్న కవితలే. మన విశ్వంలో ఎక్కడ అన్యాయం జరిగినా, ఎప్పుడు అధర్మం తలెత్తినా అక్కడ శ్రీ శ్రీ 'మహాప్రస్థానం' వాటిపై సునామీని ప్రకటిస్తుంది. అందుకే చెలం ఈ కావ్యానికి పీఠిక రాస్తూ "... ప్రపంచపు బాధ అంతా శ్రీ శ్రీ బాధ"గా చెప్పాడు. అందుకే ఈ 'మహాప్రస్థానం' కవితలు విశ్వ మానవుడి **(Universal Men)** కోసం విశ్వ వ్యాప్తంగా వున్న సమస్యల **(Universal Problems)** పై దండయాత్రగా విశ్వాత్మ **(Universal Soul)** తో "... నవ ప్రపంచ నిర్మాణ కర్తల ఉత్సాహంతో కంఠం కలిపి పాడుతున్నాడు శ్రీశ్రీ" అని 'యోగ్యతా పత్రం' లో చెలం చెప్పింది అక్షరాలా నిజం. అందుకే ఎల్లలు ఎరగనిది మహాప్రస్థానం.

●●●




## సజ్జన దుర్జన విచారము

**-కుంతి**

**సజ్జనులనగా మంచివారు.** దుర్జనులనగా చెడ్డవారు. వారివారి స్వభావాలు,నడవడులు,ధోరణులు ఎట్టివో పరిశీలించి చూడడము ఎంతైనా అవసరము. దీనికై పురాణేతిహాసాలు, కావ్యాలు సజ్జనదుర్జన విచారమును ఏవిధంగా చేసినాయో, ఎవరెవరిని ఎట్లా నిర్ణయించినాయో తెలుసుకొనవలెను, అవగతము చేసుకొనవలెను. సత్యాసత్యాలు, మంచిచెడులు తెలిసినపుడే ఎదుటివారు ఎట్టివారో అవగతమైనప్పుడే మన జీవన మార్గము సులభమవుతుంది. మహాభారతములోని ఉద్యోగపర్వములో దృతరాష్ట్రునకు విదురుడు నీతులనుపదేశిస్తూ ఇలా అంటాడు.

**"ధనమును విద్యయు వంశం బును దుర్మతులకు మదంబొనరించును స**
**జ్జనులైన వారి కడకువయును వినయము నివియు తెచ్చునుర్వీనాథా!"**

దుర్జనులకు ధనము ,విద్య, వంశము గర్వమును అవే సజ్జనులకు వినయ విధేయతలను ఇచ్చును.

" తనులోకము గొనియాడగ-వినియుబ్బడు సజ్జనుండు ; వెండియు గడు మే
లొనరించు,గీడొకించుక -యును దనదెస దోపనీయక యుడుపుచు వచ్చున్!"

సజ్జనుడు తన పొగడ్తను విని పొంగిపోడు. అంత కంటే పరులకుపకారమొనర్చును. తనవలననితరులకెట్టి కీడును కలిగింపడు, దురాలోచనకలిగినను తనలో యడిచి పెట్టును.

**" పురుషుండు రెండు దెఱుగుల -ధరనుత్తముడన బరుగు; దానెయ్యడలం**
**బరుసములు పలుకకునికిన్-దురితంబులుదొరయు పనులుదొఱగుటకతనన్"**

ఎక్కడా పరుష వాక్కులు పలుకకుండా ఉండడము, పాపపు పనులు చేయకపోవడము ఈరెండింటి వల్ల లోకములో మానవుడు ఉత్తముడు అనిపించుకుంటాడు .

వేమన "అల్పుడెపుడు పలుకు నాడంబరముగాను సజ్జనుండు పలుకు చల్లగాను" అని సజ్జనుడి గూర్చి అంటాడు. ఇక దుర్జనుడి గూర్చి చూస్తే...

**"ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ" అంటాడు బద్దెన.**
**"కోపము నుబ్బును గర్వము నాపోవక యునికియును దురభిమానము ని**

ర్వ్యాపారత్వమునను నివి కాపురుషగుణంబులండ్రు కౌరవనాథా!"

సజ్జనుల స్వభావమెట్టిదో భర్తృహరి తన త్రిశతిలో ఇట్లు చెప్పాడు.

"విపదిధైర్యమదాభ్యుదయేక్షమా సదసి వాక్పటుతాయుధి విక్రమః

చాభిరతర్వ్యసనసంశ్రుతౌ ప్రకృతి సిద్ధమిదంహి మహాత్మానాం!"

"కష్టములందు ధైర్యమును తగిన ఐశ్వర్యములందు ఓర్పును, రాజసభయందు సంపూర్ణమగు వాక్ నైపుణ్యమును, యుద్ధమునందు దృఢమగు భుజబలమును, కీర్తియందాసక్తియును, చదువునందు అధికమగు కోరికయును సజ్జనులకు స్వభావ సిద్ధగుణములు". మనమునందు భేదము పాటింపబడకుండుట, ఓర్పుగల చిత్తము కలవాడగుట గుణములనే గ్రహించి, దోషములను విడుచుట ఉత్తమ పురుషుల లక్షణము. తనకు దుఃఖము కలిగినప్పుడు పొంగిపోనివాడు, ఇతరుల దు:ఖానికి సంతోషించని వాడు, దానము చేసిన తరువాత బాధపడని వాడు సత్పురుషుడు.

ఇక దుర్జన స్వభావమెట్టిదనిన, భర్తృహరి తన త్రిశతిలో ఇట్లు చెప్పాడు.

" అకరుణత్వ మకారణ విగ్రహ: పరధనే పరయోషితి చస్పృహా

సుజనబన్ధుజనేష్వ సహిష్ణుతా ప్రకృతిసిద్ధమిదంహి దురాత్మానం"

కారణము లేకయే తగవులాడుట, దయలేకుండుట, పరస్త్రీ,ధనముల యందు కోరిక ,బంధువులయందును, సజ్జనులయందును ఓర్వలేకుండుట అనునవి లోకములో దుష్టులకు సహజ స్వభావములు.

దక్ష యజ్ఞ సందర్భములోపార్వతికి శివుడు సజ్జన,దుర్జనుల గూర్చి ఇలాచెబుతాడు

"విద్య, తపస్సు, ధనము, వయసు, వంశము, రూపము ఇవి సత్పురుషుల లక్షణము. ఇవే దుష్టులకు దుర్గుణములుగా పరిణమించి వారి వివేకమును నాశనమును చేయును".

మహాభారతములో యయాతి పూరునకు దుర్జనుడి గూర్చి ఇలా చెబుతాడు. "దుర్జనులగు యోధులు తమముఖ మనెడు విల్లునుండి వాడిబాణముల వంటి మాటలను వదిలి యితరుల మర్మములనెడి లక్ష్యములను వదలక భేదించుచుందురు." మహాభరతములో దుర్యోధనుడికి శకుని మంత్రియగు గణకుడు దుర్జనుడి స్వభావమును గూర్చి చెప్పునది ఇలా ఉంటుంది. "మాటిమాటికి ప్రమాణములు చేయుట, చేతులు జోడించుట, నమస్కరించుట, సౌమ్యముగా, తియ్యగా మాటలాడుట, వినయము ప్రదర్శించుట అనునవి దుర్జనుల స్వభావములు. దుర్జనుడు అవకాశము కొరకు వేచియుండి నమ్మించి అవకాశము దొరికిన వెంటనే విషపుకోరలతో పాముకాటు వేయునట్లు చంపును".

సజ్జనుల సహవాసము ఎట్టిదనిన భర్తృహరి మాటలలో

సత్యసూక్తి ఘటించుధీజడిమమాన్పు గౌరవమొసంగు జనులకు కలుషమడచు

గీర్తిబకటించు జిత్తవిస్ఫూర్తి జేయుసాధు సంగంబు సకలార్థసాధనంబు"

ఫక్కి అప్పలనరుసు తన కుమార శతకములో

"సద్గోష్ఠి సిరియునొసగును,సద్గోష్ఠి యెకీర్తిబెంచు సంతుష్టునినా

సద్గోష్ఠియెయొనగూర్చును, సద్గోష్ఠియెపాపములను చరచుకుమారా!

మహాభారతములో పాండవులు కానలకేగుచున్నప్పుడు పౌరులు దుఃఖితులై వారితో ఇలాఅంటారు.

"సజ్జనులు పాపుల సహవాసములోపాపులగుటలో సందేహము లేదు. నువ్వులు, నీరు, వస్త్రములుకూడా పువ్వులతో నున్న యెడల అవి సువాసనభరితమగును. అటె సజనుల సహవాసమున ఎట్టి వారికైనను సద్గుణాలు సంక్రమించును. జనులు చెడపనులు

చేయక పోయినను, దుర్జనులను చూచుటచే, వానిని స్పృష్టించుట చేత, వారితో పాటు మాట్లాడుట చేత, కలిసి యుండుటచేత ధర్మహీనులగుదురు''.

ఆధ్యాత్మరామాయణము అయోధ్యాకాండ ద్వితీయ సర్గలో కైకేయి మంథర మాటలు విన్న సందర్భమున గల శ్లోకము పరిశీలించదగినది.

''ధీతోత్యన్త దయాన్వితోపి సుగుణాచారాన్వితో వాథవా
నీతిజ్ఞోవిధివాది దేశికపరో విద్యావివేకో థవా
దుష్టానామతి పాపభావితధియాం సఙ్గం సదా చేద్భజేత్
తద్బుధ్యా పరిభావితో వ్రజలు తత్సామ్యం క్రమేణ స్ఫుటం''

సద్బుద్ధియు, దయయు, సద్గుణములును సదాచారములు గలవాడైనను, నీతి తెలిసిన వాడైనను,యధాశాస్త్రముగానుపదేశించు గురువున కధీనుడైనను, విద్యచే యుక్తాయుక్తములు వివేచించి శక్తిగల వాడైనను ఎల్లప్పుడు పాపపు దలంపు గలవారై, పాపమునే చేయుచుండు దుష్టుల సహవాసము చేసిన పక్షమున నతడు క్రమముగా వారల వలెనే దుష్టుడును, పాపములను చేయువాడు అగును.

నీతి తారావళి అను గ్రంధములో కందన అను కవి చక్కని దృష్టాంతములతో సజ్జన దుర్జన సహవాస ఫలితాలను వర్ణించాడు.

''ఖలు సంగతి గూడిన నిర్మలచిత్తుండైన జేయుఃబతికూలుండై
యలనూనియ కర్పూరము గలిసిన విషమైనయట్లు కందామాత్యా!''

కుమార సంభవములో నన్నెచోడుడు,

''దుష్ట సాంగత్యం సంగతినగుదురు దోషాత్మకులకిదియె సంగదోషము'' అని దుష్ట సాంగత్యమును గూర్చి తెలుపుతాడు. దుష్టుడిని మాత్రము ఎలాగైనా దూరము చేసుకోవాలి.

''విద్యచే భూషితుండయి వెలయుచున్న దొడరి వర్ణింపనగు జుమీ దుర్జనుండు
చారుమాణిక్య భూషిత శస్తమస్తకంబు గలపన్నగము భయంకరము గాదె''
''శకటం పంచహస్తేషు, దశహస్తేషువాజినం,
గజం సహస్ర హస్తేషు, దుష్టం దూరేణ వర్జయేత్''

కావున ప్రతివ్యక్తి, ఉత్తమ సాహిత్యపు వెలుగులో సజ్జన దుర్జన విచారము చేసుకొని, తాము వెళ్ళే దారిని కాంతివంతము చేసుకోవాలి.




# గ్లింప్సెస్ ఆఫ్ తెలుగు లిటరేచర్
# డి.ఆంజనేయులు
# సమీక్ష పరిశీలన

- నరిశెట్టి ఇన్నయ్య

***తెలుగేతరులకు, స్వదేశంలోనూ విదేశాలలోనూ ఉన్న వారికి స్థూలంగా తెలుగు సాహిత్య ధోరణులు పరిచయం చేయగలమా? తెలుగు వారి పిల్లలు ఇంగ్లీషు, తదితర మీడియంలో చదువుకుంటున్నప్పుడు, వారికి తెలుగు సారస్వత సాహిత్య రుచులు చూపడం ఎలా? ఇందుకు సమాధానమే ఆంజనేయులుగారి పుస్తకం. ఇది సమగ్రం కాదు. పెద్ద విస్తృత రచన కాదు. కానీ అన్ని రంగాల సాహిత్య ధోరణులు, కొందరు రచయితల్ని చూపి, ధోరణులు అలా ఉంటాయని గమనించమన్నారు. ఆ రచనకు ఇది చిన్న సమీక్ష.***

***డి.ఆంజనేయులు***

(1924-1998) తెలుగు వారైనా, రచనలన్నీ ఇంగ్లీషులో చేశారు. పాశ్చాత్య లోకాలు తిరిగి పరిశీలించాడు. జీవిత చరిత్ర తీరుపై గ్రంథం రాశారు. వీరేశలింగం, సి.ఆర్.రెడ్డిపై ప్రత్యేక రచనలు వెలువరించారు.




***తెలుగు సాహిత్య సౌరభాలు***

ఒక శతాబ్దంలో పరిణమించి, వికసించిన తెలుగు సాహిత్యాన్ని ధూళిపూడి ఆంజనేయులు ఔపోశనం పట్టారు. అవి ఎలా గుబాళించాయో చూపారు. అందులో విశేషం ఏమంటే, తెలుగేతరులు ఈ సాహిత్య లోతు పాతుల్ని అవగాహన చేసుకునేందుకు ఇంగ్లీషులో రాశారు.

గింప్సెస్ ఆఫ్ తెలుగు లిటరేచర్ శీర్షికన ఈ పుస్తకాన్ని కలకత్తా రైటర్స్ వర్క్ షాప్ వారు వెలికి తెచ్చారు. సుప్రసిద్ధ రచయిత పి.లాల్ ప్రారంభించిన ఈ ప్రచురణలు మంచి పేరు గడించగా ఆ పట్టికలో ఆంజనేయులుగారి రచనను రెండు పర్యాయాలు ముద్రించారు. అమెరికాతో సహా

విదేశీయులకు, దేశంలో తెలుగేతరులకు ఇది గొప్ప పరిచయ రచన.

ఆంజనేయులు చిరకాలం పత్రికా రచయితగా, వ్యాసకర్తగా, హిందూ దినపత్రికలో 'బిట్వీన్ యు అండ్ మీ' శీర్షిక నిర్వహించిన నిష్ణాతులు.

ఆంజనేయులు (1924 - 1998) వివిధ ప్రసార శాఖ బాధ్యతలు నిర్వహించి, రచయితగా, 'నిష్పక్షపాతి' అని పేరొందారు.

సుప్రసిద్ధ రచయిత, సంపాదకుడు, విమర్శకుడూ నార్ల వెంకటేశ్వర రావుకు అంకితం ఇచ్చిన గ్లింప్సెస్ ఆఫ్ తెలుగు లిటరేచర్‌లో లీడర్స్ అండ్ లాండ్ మార్క్స్ అని పేరుపెట్టారు. తెలుగు వాడైన ఆంజనేయులు రచనలన్నీ ఇంగ్లీషులోనే చేయడం ప్రత్యేకత. వీరేశలింగం, కట్టమంచి రామలింగారెడ్డి, రాసిన ఆంజనేయులు పాశ్చాత్య దేశాలు పర్యటించి, అద్దం పటినట్లు చిత్రరచన చూపారు. చేయి తిరిగిన రచయిత ఆయన.

ఈ గ్రంథంలో తెలుగు సాహిత్య వీక్షణం చేసి, ఆధునిక పోకడలు చూపారు. అతివాదుల రచనా ధోరణి ప్రస్తావించారు.

ఆంజనేయులుగారు ఎంచుకున్న రచయితలు సి.పి.బ్రౌన్, బమ్మెర పోతన, వేమన, క్షేత్రయ్య, కందుకూరి వీరేశలింగం, దేవుల పల్లి కృష్ణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ దాశరథి, సి.నారాయణరెడ్డి, బైరాగి, పి.ఎ.రాజమన్నార్, భమిడిపాటి కామేశ్వరరావు, పాలగుమ్మి పద్మరాజు, బుచ్చిబాబు నండూరి సుబ్బారావు, ఇల్లందు ల సరస్వతి దేవి, ద్వివేదుల విశాలాక్షి, కట్టమంచి రామలింగారెడ్డి, గిడుగు సీతాపతి, తాపీధర్మారావు, శ్రీవాత్సవ, ముట్నూరి కృష్ణారావు, వి.ఆర్.నార్ల.

తెలుగు నిఘంటు కర్తల్ని తడిమి చూచారు. ఇది సాహిత్యానికి ప్రాతినిధ్యం వహించే తీరు.

ఆంజనేయులకు రాగద్వేషాలు అట్టేలేవు. అందువలన అభిమానులు ఇబ్బంది పడే అవకాశం ఉంది ఉదాహరణకు సి.నారే అభిమానులకు ఆంజనేయుల సౌమ్య నిష్పక్ష ధోరణి నచ్చక పోవచ్చు. అటువంటిదే విశ్వనాథ సత్యనారాయణ విషయంలోనూ వర్తిస్తుంది.

చాలామంది రచయితలతో ఆంజనేయులుకు వ్యక్తిగత పరిచయం ఉన్నప్పటికీ, అంచనాలో పాక్షికత రానివ్వకపోవడం గమనార్హం.

అందరి రచయితల ప్రస్తావన తీసుకురావడం సాధ్యం కాదుగానీ, ప్రధాన ధోరణలు ఏవీ ఆయన వదలకుండా చూపారు. స్త్రీ పేరుతో పురుషులు రాసిన రచనలు, యండమూరి వీరేంద్రనాథ్ వంటివారి ప్రాధాన్యత, స్త్రీ రచయితల ధోరణలు పాఠకులకు చవిచూపారు.

***<u>సి.పి.బ్రౌన్</u>***

తొలుత ఆంజనేయులు కలం నుండి చార్లస్ ఫిలిప్ బ్రౌన్ గురించి అక్షర సత్యాలు వెలువడ్డాయి. బ్రిటిష్ ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూనే తెలుగు ప్రాంతంలో చిరకాలం ఉన్నందున, భాషాభిమానం పెంచుకుని, ఎనలేని కృషి చేశారు. నన్నయ, తిక్కన, పెద్దన, భట్టుమూర్తి కవితలు పరిష్కరించి వారి ప్రతిభను వెలికి తెచ్చారు. లోగడ వారిపై రాసిన వారు తమ పాండిత్య ప్రకర్షతో మూలకర్తలను మరుగున పరచడం బ్రౌన్‌కు నచ్చలేదు. తెలుగు - ఇంగ్లీష్ నిఘంటువు, ఇంగ్లీషు - తెలుగు నిఘంటువు అందించారు అనేక గ్రంథాలు పరిష్కరించి ప్రచురించడం బ్రౌన్ విశిష్ఠత. బ్రౌన్ (1798-1884) తెలుగు సాహిత్య చరిత్రలో సిద్ధమైన స్థానాన్ని పొందారు.

***<u>పోతన - వేమన</u>***

తెలుగు వారి ప్రజాకవులుగా పోతన, వేమనలను ఆంజనేయులు సరిగా పేర్కొన్నారు. భక్తి పూర్వకంగా పోతన రాసిన వాటిని ముఖ్యంగా గజేంద్రమోక్షం ప్రహ్లాద చరిత్రం, రుక్మిణీ కళ్యాణం గమనించాం. ఆయన భోగినీ దండకం శృంగారమయం. కామిగానివాడు మోక్షగామికాడన్నట్లు పోతన శృంగారంతో మొదలెట్టి, భక్తిలో తేలాడు.

సర్వజ్ఞ సింగభూపాలుడి శృంగారం ప్రియురాలితో జరిపిన కార్యకలాపాలు అందులో చూడొచ్చు.

వేమన సిసలైన సామాజిక ప్రజాకవి. సంఘ రుగ్మతల్ని ఆటవెలదిలో చక్కగా చెప్పాడు. అవే జనం నోట్లోనానాయి. ఉప్పు కప్పురంబు నొక్క పోలికవుండు, చూడ చూడ రుచులు వేరయా వంటివి ఎన్నో గుప్పించాడు. సంఘదోషాన్ని ఎత్తి పొడిచాడు. అంటరానితనాన్ని ఈసడించాడు.

క్షేత్రయ్య కందుకూరి వీరేశలింగం, దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రాధాన్యతలను విడమరచి చూపాడు.

విశ్వనాధ సత్యనారాయణ ప్రాధాన్యతను బేరీజు వేసి, పొగిడినా తెగిడినా నిలదొక్కుకున్న కవిగా ఆయన్ను చూపారు. విస్తృత పరిధిలో ప్రతి రంగాన్ని విశ్వనాధ చవిచూచిన తీరు పేర్కొన్నారు.

వేయిపడగల ప్రస్తావన తెచ్చి, దైవసృష్టిలో బ్రాహ్మణత్వం, వారి ఆధిపత్యం సమర్ధించిన సందర్భం ఎత్తి చూపారు.

శ్రీశ్రీ పై రాస్తూ ప్రజాజీవితానికి కవిత్వకళకూ గల సంబంధం చూపిన కవిగా చెప్పారు. సాహిత్య అకాడమీ అవార్డు పబ్లిక్‌గా నిరాకరించి, ప్రైవేట్‌గా స్వీకరించిన శ్రీశ్రీ మరో ప్రపంచం కవిత ద్వారా ఆధునిక, ప్రాచీన ధోరణుల వారధి అయ్యాడన్నారు.

ఒకప్పుడు తెలంగాణ జంటకవులుగా చలామణి అయిన దాశరధి, సి.నారాయణ రెడ్డిపై చక్కగా అద్దం పట్టి చూపారు. నారాయణ రెడ్డి అదృష్టవంతుడని కొందరంటారని, చెవికింపుగా ఉండేట్లు పదజాలాన్ని వాడడం, ప్రజాకర్షణ విషయాలు ప్రస్తావించడం ఆయన కవితలో కనిపిస్తుందన్నారు. మధ్య తరగతి మందహాసం అలాంటిదేనన్నారు.

బైరాగి, పి.వి.రాజమన్నార్‌లపై అంచనాలు చాలా నిష్పక్షపాతంగా లోతుపాతులలో ఉన్నాయని జనం విస్మరించిన రచయితల్ని వెలికితీసినట్లయింది.

తెలుగులో సీరియస్ హాస్యరచయితగా పేరొందిన భమిడిపాటి కామేశ్వరరావు నుడికారం బాగా వెలికి తెచ్చి చూపారు.

ప్రపంచ కథలలో ఉత్తమ బహుమతి పొందిన పాలగుమ్మి పద్మరాజు మానవ వాద రచయిత. ఎం.ఎన్.రాయ్ సిద్ధాంతాల ప్రభావంతో అత్యుత్తమ రచనలు చేసి, రాణించారు. అవి చక్కగా పరిశీలనకు వచ్చాయి.

బుచ్చుబాబు చివరకు మిగిలేది ఒక విశిష్టస్థానం తెచ్చుకున్న నవల. దాని పరిశీలన తులనాత్మకంగా చేసి, బుచ్చిబాబు అంచనా చూపారు.

నండూరి సుబ్బారావు ఎంకిపాటలు జానపదగేయాలుగా వన్నెకెక్కాయి. నాజూకు తక్కువ అని ఎవరో విమర్శించినా, వాటి విలువ తగ్గలేదు మరి.

స్త్రీ రచయిత్రులలో కొందరిని ఎంపిక చేసి, ఆంజనేయులు అన్ని రంగాలూ అధ్యయనం చేసిన తీరు గమనార్హం. అందులో ఇల్లిందుల సరస్వతీదేవి, సునిశిత కథా వైచిత్రిని ద్వివేదుల విశాలాక్షి గ్రహణం వీడింది రచనలు బాగా గ్రహించారు. నవలలో దాని ఔచిత్యాన్ని చూపారు.

ముట్నూరి కృష్ణారావు గిడుగు సీతాపతి తెలుగు సాహిత్య సేవలో ఎన్నదగినవారు. ఈ తరంవారిలో వారి సేవలను ఆంజనేయులు వివరంగా చెప్పడం ఆయన సిదృహస్తం గొప్పతనమే. ఇంకెందరో స్త్రీ రచయిత్రులున్నా అందరినీ పరిశీలించే అవకాశం లేకనే వదిలేశారు గానీ అశ్రద్ధ వలనకాదు.

కట్టమంచి రామలింగారెడ్డి తెలుగు సాహిత్యంలో ప్రబంధాల పచ్చి శృంగారాన్ని ఎండగట్టి, ఔచిత్య విమర్శలు ఎలా ఉండాలో చూపారు. వేమన గొప్పతనం చాటారు. ద్రౌపది పాత్ర గంభీరతను లోకానికి చెప్పారు. ముసలమ్మ మరణం కావ్యం ఆకట్టుకున్న సాహిత్య మణిపూస. సి.ఆర్.రెడ్డి స్థానాన్ని ఇందులో తగిన రీతిలో పరిశీలించారు.

తాపీ ధర్మారావు విమర్శకుడుగా, పరిశోధకుడుగా కొత్త దారులు తొక్కిన సాహితీపరుడు, జర్నలిస్ట్. పెళ్ళి విశేషాలు చెప్పడమే కాక, దేవాలయాలపై బూతు బొమ్మల పరిశోధన శాస్త్రీయంగా చేసిన సాహిత్య విమర్శకుడు. అవి ఈ రచనలో చూడగలరు.

విమర్శక పత్రికా రచయితగా శ్రీవాత్సవను అగ్రస్థానంలో ఉంచి గమనించారు. ఆయన అసలు పేరు యండమూరి సత్యనారాయణరావు. ఇలా మారుపేర్లతో ఎందరో తెలుగు రచయితలున్నారు భరద్వాజ వలె.

రచయితల పరిశీలన వి.ఆర్.నార్లతో ముగించారు. ఈ రచనను ఆయనకే అంకితం ఇచ్చారు. నార్ల వెంకటేశ్వరరావు జర్నలిస్ట్ రచయిత, విమర్శకుడు నాటక కర్త, పద్య రచయిత తెలుగు సాహిత్య పోకడలలో ఒక కొత్త ఉపు తెచ్చిన వ్యక్తిగా ఆంజనేయులు ఆయన్ను పేర్కొన్నారు. మానవవాదిగా పరిణమించిన నార్ల కొత్తగడ్డ, మాటామంతి, పిచ్చాపాటి, నార్లమాట, వీరేశలింగం, గురజాడ వేమన రచనలతో అనేక మలుపులు తిప్పారు. ఇంగ్లీషులోనూ నిశిత విమర్శనా గ్రంధాలు, భగవద్గీత పై రాశారు. కొత్త గడ్డలో 7 నాటికలు చాలా చోట్ల ప్రదర్శించారు. జర్నలిజంలో ట్రెండ్ సెట్టర్.

తెలుగులో నిఘంటు కర్తల గురించి సంక్షిప్తంగా ఆంజనేయులు రాయడం బాగుంది. తెలుగు సాహిత్యంపై వివిధ ఉద్యమాల ప్రభావాన్ని చెప్పారు.

విశ్వనాథ ప్రసంగాల నుండి ఆంజనేయులు కొన్ని ఏర్చి కూర్చిన పలుకులు భారతీయ సంస్కృతి వినాశానికి ఇంగ్లీషు విద్యమూలం.

నన్నయ, తిక్కన సున్నితత్వాలతో పోల్చితే షేక్స్‌ఫియర్ అధమాధమం. ధరణిలో ఆంధ్రులు సంస్కృతీపరులు యూరోపియన్లు ఆటవికులు.

భారత చరిత్ర రాసిన బ్రిటిష్ చరిత్రకారులు అబద్దాల ముఠా. తెలుగులో రాసిన మన కొవ్వలి ఇంగ్లీషు రచయిలందరికంటే మిన్న.

తెలుగు భాషకు వెలుగు చూపలేరు. అది మధురమైనది. ప్రపంచంలో తెలుగువారు అత్యుత్తమజాతి.

●●●




# సుఖదుఃఖములు

**-కుంతి**

**సౌఖ్యం బిందుమాత్రేణ దుఃఖం పర్వతమేవచ -**

సుఖము లవలేశముమాత్రమే. కానీ వెనువెంటనే హిమాలయమంత దుఃఖము కాచుకొనిఉంటుంది.

మనసుకు నచ్చినది,ఆనందము నిచ్చునది, తృప్తి కలిగించునది, కలకాలము గుర్తించుకోదగినది, ఎల్లప్పుడు ఇలాగే ఉంటే బాగుండుననుకొనునది సుఖము. కోరినది దొరకనప్పుడు, కష్టనష్టాలు, ఆందోళనలు, అవమానాలు కలిగినప్పుడు, ప్రియులైనవారు దూరమైనప్పుడు, చనిపోయినప్పుడు ,శారీరక, ఆర్థిక ,సాంఘిక రంగాలలో దుర్భరమైన పరిస్థితులు ఎదురైనప్పుడు, చేయూత లేక, సమస్యల వలయములో కొట్టుమిట్టాడుతూ, బ్రతుకు హీనమై, దీనమై ఏమి చేయాలో, ఎటుపోవాలో దిక్కు తోచని వేళలో కలిగేది దుఃఖము. కష్టకాలము దీర్ఘముగను, సుఖము హ్రస్వమనుగను చూచుట మానవ స్వభావము. సుఖమున చెప్పుకొనుననదేముండదు. చెప్పుకొనునది దుఃఖములగూర్చియే. సుఖదుఃఖాలు రంగులరాట్నము వలె గుండ్రంగా తిరుగుతున్నప్పటికీ కొందరికి దుఃఖము దగ్గర ఎక్కువ సేపు ఆగుతుంది.

కావున నాకు దుఃఖమే యని ప్రతి ఒక్కరు భావిస్తుంటారు. దు:ఖానికి ముందు సుఖమంటే ఏమిటో చూద్దాం.

జబ్బులులేకపోవడము, అప్పులు లేకపోవడము, మంచి వారితో సహవాసము, పరాధీనము కాని జీవనోపాధి, భయము లేని జీవితము -ఈ ఐదు అంశాలను సామాన్యుడు సుఖముగా భావిస్తాడు.

సుఖము రెండు రకాలు నిత్యము, అనిత్యము. ఆత్మజ్ఞానముతోకూడిన సుఖము నిత్యము, భోగజన్యమైనది అనిత్యము. వేదార్థ చింతకులైన వారు నశ్వరమైన భోగ జన్య సుఖాన్ని విడిచి, శాశ్వతమైన ఆత్మజ్ఞానము కోసమే యత్నిస్తారు.

అరణ్యకాండము నందు సుతీక్ష్ణాశ్రమ దర్శనానంతరము, అయుధ సంపర్కము వలన ప్రవృత్తిలో కలుగు మార్పును సీతాదేవి రాముడికి చెబుతూ, ఇలా అంటుంది.

"ఆత్మానం నియమై స్తైఇకర్షయిత్వా ప్రయత్నత:
ప్రాప్యతే నిపుణైర్ధర్మోన,సుఖాల్లభ్యతేసుఖమ్ "

నిపుణులైన వారు అనేక ప్రయత్నములచే శరీరము కృషింపచేసి ధర్మమును పొందుచున్నారు. సుఖము వలన సుఖము లభించదు. కానీ నిజానికి సుఖమంటే ఏమిటి? సుఖము ఐహికలోకభోగాలా? మానసికంగా ఒక వ్యక్తి యేదో ఒక స్థాయిలో ఇలా ఉంటే బాగుంటుంది అనుకొని అది లభిస్తే సుఖము లేకుంటే దుఃఖమా,లేదా ఐహిక సంబంధము లేక ఆత్మనిజ్ఞాయె నిష్కామకర్మాచరణ

ద్వారా ఫలాలను ఆశించక, ఫలితాన్ని ఈశ్వరార్పణ చేస్తూ, నిరంతరము భగవత్ చింతనా శీలుడై మనసులో ఆనందము పొందడమా? ఇవీ ప్రశలు. ఇవన్నియు వారివారి సంస్కారాల, వాసనల, సాధనలపై అధారపడి ఉంటుంది.

సుఖమంటే సుఖంగా ఉండడము సుఖమా, దుఃఖము లేకపోవడము సుఖమా, సంసారిక దుఃఖాన్ని అనుభవిస్తూనే ఇది సహజము, నశ్వరమైన సుఖము సుఖము కాదనుకోవడము సుఖమా?

మానవుడు అవతరించినప్పటి నుండి నేటి వరకు తనకు తాను సుఖాన్ని నిర్వచించుకొని దానిని అందుకోవడానికి పరుగెడుతునే ఉన్నాడు.

వివేకానందుల వారి "నా ఆత్మకథ"లో అక్కడక్కడ ఈ సుఖ దుఃఖాల గూర్చి వారు చక్కగా సెలవిచ్చారు.

-ఆశించడమే పరమ దుఃఖము, నిరాశ చెందడమే పరమ సుఖము.

-దుఃఖము ఎవరికీ రావద్దని కోరుకుంటున్నాను. అయినా అది ఒక్కటె జీవితపు లోతులను తిలకించే అంతర్ దృష్టిని ప్రసాదిస్తుంది. మన పరితాప సమయాల్లోనే మూసుకున్న ద్వారాలు సువిశాలంగా తెరవబడి కాంతి పుంజాలను లోనికి రానిస్తాయి.

- జీవితములో సుఖము కన్నా దుఃఖమే ఎక్కువగానున్నది. యాభై శాతము మన జీవితము కేవలము మందకొడితనము, గ్లానితో కూడుకొని ఉన్నది. తక్కిన నలభై శాతము దుఃఖము. కేవలము పదిశాతము సుఖము.

- సుఖదుఃఖాలకు మనసే కారణము. మనసు నిర్మలంగా ఉంటే సర్వమూ నిర్మలమే.

కుమార సంభవ కావ్యములో నన్నెచోడుడు ఇలాతెలుపుతాడు.

"విరహమున కంటెదుఃఖము గరమిష్టముగవయ గాన్పుకంటే సుఖంబున్
బరికింపనొండులేదిది -పరమార్థమమర్త్యమర్త్య ఫణిలోకములన్"

ఎడబాటుకంటే దుఃఖమును,మిక్కిలి యిష్టమైన దానిని పొంద గలుగుట కంటె సుఖమును ఆలోచింపగానింకొకటె లేదు. ఇది దేవతల, మనుష్యుల, నాగుల విషయమున యదార్థము.

సుఖదుఃఖాల గూర్చి మరీ లోతుగా తెలుసుకోవాలంటే భగవద్గీత, పురాణేతిహాసాలు, పూర్వ గ్రంథాలే కరదీపికలు. అవి మనలోకి మనలను పంపించి, మనల్ను గూర్చి ఆలోచింప చేస్తాయి. ఆవిధంగా అవి సుఖకారిణులు, దుఃఖ నివారిణులు.

వాని సాయముతో దుఃఖాన్ని తొలగించుకొని, సుఖాన్ని పొందే ప్రయత్నము చేయాలి.

శ్రీదేవీ భాగవతము నందు ఒక ఘట్టము. వ్యాసుడి ఆజ్ఞమేరకు శుకుడు జనకుడి రాజ్యాన్ని చూడడానికి మిథిలకు బయలుదేరాడు. శుకుడు రెండు సంవత్సరాలు మేరువును దాటి, ఒక సంవత్సరము హిమవన్నగాన్ని దాటి మిథిలకు చేరుకున్నాడు. అక్కడ సర్వభోగ సమృద్ధమైన ఆ నగరాన్ని చూస్తూ, రాజప్రాసాదము చేరుకున్నాడు. నగర ద్వారము దగ్గర ద్వారపాలకుడు ద్వారా నిలిపివేయబడ్డాడు. ద్వారపాలకుడు అతడిని మహానుభావుడని తెలుసుకున్నాడు.

వారి మధ్య ఆసక్తికరమైన సంభాషణ జరిగింది. శుకుడిని ఇలా అడిగాడు." అయ్యా! సుఖమేది? దుఃఖమేది? సుఖాన్ని ఆకాంక్షించేవాడు ఏం చేయాలి? శత్రువు ఎవడు? హితుడు ఎవడు? నాకు వివరంగా తెలుపండి? అన్నాడు.

అప్పుడు శుకుడు ఇలా సమాధానమిచ్చాడు. "సంసార పటలములో పడినవాడిని రక్తుడు అంటారు. వానికి సుఖాలు,దుఃఖాలు కూడా సంప్రాప్తిస్తుంటాయి. ధనదారాసుతాదులవల్లను, మానభిమానాల వల్లను సుఖము,అవి లేని పక్షములో దుఃఖము కలుగుతాయి. కావున అతడు సుఖోపాయానికి ప్రయత్నము చేయాలి. ఈ సుఖోత్పాదన కొరకు తోడ్పడే వాడు మిత్రుడు. సుఖానికి విఘ్నము కలిగించే వాడు శత్రువు. రక్తుల్లో మూర్ఖుడు ఎప్పుడు మోహపరవశుడవుతాడు. చతురుడు అలాకాదు. విరక్తుడైన వారికి ఏకాంత సేవనము,

ఆత్మాను చింతనము,వేదాంత విచారము సుఖ హేతువులు. సంసారకధనాధికము దుఃఖకారణము. అతడికి కామక్రోధాదులు శత్రువులు. సంతోషము ప్రియ బంధువు"అని తెలిపాడు.

శ్రీదేవీభాగవతములోనే మరొక ఘట్టము. మహిషుడు తనపై దండెత్తి వస్తాడని తెలుసుకొని చింతించిన దేవేంద్రుడు గీష్పతిని చేరి సలహా కోరగా,అతడు " దైవ వశంగతమైన ఈ సంసారములో పరితాపము చెందడము అవివేకము. ప్రయత్నము చేయడము వరకే మన విధి. దాని వల్ల మనకు దుఃఖము కలిగినా చింతించాల్సిన పనిలేదు. సుఖదుఃఖాల్లో నిశ్చలంగా ఉండాలి. అధైర్యము వల్ల కలిగినంత దుఃఖము ధైర్యంగా ఉన్నప్పుడు ఉండదు. మమత్వము దుఃఖానికి, నిర్మలత్వము సుఖానికి మూలకారణాలు. కావున ఇంద్రా! మమకారాన్ని విడిచి పెట్టు, ఇదేదుఃఖ వినాశనానికి మొదటి ఉపాయము. ఇదే సుఖము పుణ్యక్షయము అనిన్నీ, దుఃఖము పాపక్షయము అనిన్నీ భావించు" అని బోధిస్తాడు.

మహాభారతము శాంతి పర్వము నందు వ్యాసులవారు ధర్మజుడితో ఇలా అంటాడు.

"పొమ్మని త్రోసిన దుఃఖము పోవునది కాదు. రమ్మనినచో సుఖము వచ్చునది కాదు. సుఖదుఃఖములకు పూర్వజన్మయందలి సుకృత, దుష్కృతములే మూలములు. ఆయా కాలములందు సుఖ దుఃఖాలు వచ్చుచు పోవును. తను ఇతరులను బాధించుట, తను ఇతరులచే బాధ పడుట ఈ రెండు కాలకల్పితాలు. జ్ఞాని యైన వాడు సుఖదుఃఖములు కాలకల్పితాలని తెలుసుకొని, గర్వ, విషాదాలు పొందడు. తనవారి వియోగానికి, ఆర్థిక హానికి కృంగి పోడు. దుఃఖిస్తే కీడు తప్పుతుందా? తప్పదు. కావున దుఃఖించరాదు. చింతించేవాడికే శోకభయకారణములు అనేకములు. మూఢులు, శోకభయాలను తొలగించుకోలేడు, పండితుడు సుఖదుఃఖాలలో పొంగు,కృంగులేక ఉండి శాంతి కలిగి యుంటాడు. మిడిమిడి తెలివి గలవారు ఎప్పటికీ దుఃఖార్తులై ఉంటారు. సంసారముతో పాటు నున్న సుఖదుఃఖాలకు వశుడైనచో మానవుని ఆత్మనవి గాలి మేఘమును తొలగించుకొని తొలగిపోవునట్లుగా అపహరించుకొని పోవును. సుఖదుఃఖాలలో యేది వచ్చినను,నాకిది అనుభవింప దగినది అని ఉద్వేగపడక పోవుటయే వివేకి లక్షణము".

ఆధ్యాత్మ రామాయణము నందు అయోధ్యాకాండనందు లక్ష్మణుడు గుహుడితో సంభాషణ గమనించదగినది.

"సుఖస్యానన్తరం దుఃఖం దుఃఖస్యానన్తరం సుఖం
ద్వయమేతద్ధి జన్తూ నమలఙ్ఘ్యయం దినరాత్రివత్"

ఎట్లు పగలు వెనుక రాత్రి, రాత్రి వెనుక పగలు కలుగునో అట్లే సుఖము వెనుక దుఃఖము, దుఃఖము వెనుక సుఖము ఒకదాని వెంటనొకటి ప్రాణులకు కలుగును.

"సుఖమధ్యే స్థితం దుఃఖం దుఃఖమధ్యే స్థితం సుఖమ్
ద్వయమన్యోన్య సంయుక్తమ్ ప్రోచ్యతే జలపఙ్కవత్"

సుఖము నడుమ దుఃఖము వచ్చును.దుఃఖము నడుమ సుఖము వచ్చును. ఇట్లు ఈ రెండును నీరు,బురద వలె ఒకదానితోనొకటి కలిసి యుండును.

ఆధ్యాత్మ రామాయణము నందు, కిష్కింధకాండలో రాముడు తారకు తత్వ జ్ఞానమును బోధించు సందర్భమున, తార సుఖదుఃఖములను గూర్చి అడిగినప్పుడు రాముడు ఇట్లు చెప్పెను.

"మనేవ హి సంసారో బన్దశ్చైవమనఃశుభే
ఆత్మా మనస్సమానత్వ మేత్య తద్గత బన్దభాక్"

ఈ సంసారమునకు మూలకారణము అంతఃకరణము. అంతఃకరణమునకే సుఖదుఃఖభోగము కలుగుచున్నది. జీవుడు అంతఃకరణమునకు, తనకును భేదమును తెలుసుకొనక అంతఃకరణమే తానని భ్రమించుట వలన అంతఃకరణమునకు కలుగు సుఖ దుఃఖభోగము పొందుచున్నాడు.

కిష్కింధకాండలో దుఃఖము దేని లక్షణమో ,ఎవరికి కలుగుతుందో తెలుపు శ్లోకములు కలవు.

**"దుఃఖ హర్ష భయ క్రోధ లోభ మోహమదాదయః**

**అ జ్ఞానలింగా న్యేతాని కుతఃసంచిదాత్మని"**

దుఃఖము,హర్షము, భయము ,క్రోధము, లోభము ,మోహము, మదము మొదలగునవి అజ్ఞాన లక్షణములు. ఇవి జ్ఞాన స్వరూపుని యందు ఎట్లు సంభవించును?

"దేహాభిమానినో దుఃఖం నాదేహస్వచిదాత్మనః-- దేహమునందు అభిమానము గలవానికే దుఃఖము కలుగును. దేహరహితుడైన జ్ఞాన స్వరూపుడైన ఆత్మకు దుఃఖము లేదు.

మహాభారతము యుద్ధ పర్వము నందు ఊరుభంగమై పడి యున్న దుర్యోధనుడి వద్దకు వచ్చిన అశ్వద్ధామ ఇట్లనును.

"మనుజులకు నిట్టి చందము మును దాత సృజించినది ప్రమోదం ఖేదం

బును వచ్చును బర్యాయంబును దీని నెఱుంగవలదె పురుషుండనఘా"!

దుఃఖము ఆది భౌతిక, ఆది దైవిక ,ఆధ్యాత్మికము అని మూడు విధములు. మరియు ఈ దుఃఖమును గూర్చి మహాభారతము శాంతి పర్వము నందు భృగు మరియు భరద్వాజునకు జరిగిన సంభాషణ పరికింపదగినది. అందు భృగు దుఃఖమును గూర్చి ఇట్లు తెలుపును.

దుఃఖములు శారీరకములు,మానసికములు అని రెండు విధములు. జరావ్యాధులు శారీరకములు, సంతాపశోకాదులు మానసికములు. ఈ రెండు పురుషుని బాధించును. ఈ రెండు విధములగు దుఃఖములు తనను బాధింపకుండుటకయి నియమములతో వానికి ప్రతీకారము చేసిన సుఖమును పొందును. దుఃఖములను తొలగించుకొనిన పురుషుడు సౌఖ్యములందు చిత్తము లగ్నము చేయక వైరాగ్యముపూనినచో అతడికి అది పరమపదము చేకూర్చును. మరియు తృష్ణయే దుఃఖము, పరిత్యాగమే సుఖము.

మహాభారతము అరణ్య పర్వము నందు ధర్మరాజును శౌనకుడు ఊరడిస్తూ, జనక గీతములైన శ్లోకార్దములను ఇట్లు తెలుపును." శోకమునకు కారణములు పెక్కులైనను వివేకవంతుడు వ్యాకులమును పొందడు. జనులు శారీరక, మానసిక దుఃఖములచే మిక్కిలి కృషించి చాలా బాధ పడుతారు. వివేకులైనవారు నిర్మల చిత్తులై శరీరక, మానసిక దుఃఖాలను దూరము చేసుకుంటారు. రోగము, శ్రమ, అనిష్టమును తాకుట, ఇష్టమైన దానిని వదులుట అను నాలుగు శారీరక దుఃఖాలు ప్రతిక్రియతో నశించును. అనురాగముచే కలుగు మానసిక దుఃఖము జలముచే అగ్ని ఉపశమించు తీరు స్వచ్ఛమైన జ్ఞానముచె నుపశమించును. ప్రాణి మమకారమనెడి సముద్రమున మునిగినవాడై మహాదుఃఖములను అధైర్యమును పొందును. దుఃఖితుడు శోకతాపముచే మోహితుడగును. స్నేహముచే అనురాగము, అనురాగముచే కామము, కామముచే క్రోధము, క్రోధముచే తృష్ణ కలుగును. తృష్ణ సర్వదోషాలకు, సర్వపాపాలకు మూలము. తృష్ణయే నిరంతర దుఃఖము కలిగించును.

శ్రీమద్రామాయణమున అయోధ్యకాండ నందు ఒక చక్కని ఘట్టము కలదు. అందు శ్రీరాముడికి దశరధుడు వనవాసము విధించాడు. విషయము తెలుసుకున్న కౌసల్య దశరధుడిని నిందించినది. దశరధుడు జరిగిన దానికి బాధ పడుతు తనను తాను నిందించుకున్నాడు. క్షమించమన్నాడు. కౌసల్య ఊరడిల్లినది. తన తప్పు తెలుసుకొని పశ్చాత్తాప పడినది. క్షమించమన్నది. ఇది నాతప్పు కాదు ఈ దోషము దుఃఖానికి చెందినది అన్నది. మరియు దుఃఖమెట్టిదో తెలిపినది.

"శోకో నాశయతే ధైర్యం, శోకో నాశయతే శ్రుతమ్
శోకో నాశయతే సర్వం నాస్తి శోక సమోరిపుః"

దుఃఖముచే ధైర్యము నశించును, విద్య నశించును, సర్వము నశించు. దుఃఖము వంటి శత్రువు మరిలేడు.

**"శక్య అపతితశ్శైలిడుం ప్రహారో రిపు హస్తతః**
**సోఢు మాపతిత శ్శోక స్సు సూక్ష్మోపి నశక్యతే"**

శత్రువు హఠాత్తుగా కొట్టిన దెబ్బ సహించవచ్చును. కాని తటాలున సంభవించిన అతి స్వల్ప దుఃఖమైన సహింపనలవి కాదు.

**"ధర్మజ్ఞాశ్రుతిమంతోపి చిన్న ధర్మార్ధ సంశయా:**
**యతయో వీర! ముహ్యాన్తి శోక సమ్మూఢ చేతస:"**

వీరుడా! ధర్మజ్ఞులను, వేదవేత్తలను, ధర్మార్థ విషయములందే మాత్రము సంశయము లేని వారును, యతులును దుఃఖము కలిగినపుడు అజ్ఞానము నొందెదరు.

శ్రీరాముడు సముద్రమును చూసి రావణునెట్లు చేరుటోయని కలత చెందుచూ నిరుత్సాహ పడగా, "యుద్ధకాండలో నిరుత్సాహ పడి శోకించు వారికి మతియుండదు. అతడు చేసిన సర్వ కార్యములు భగ్నమగును. ఉత్సాహము వలననే బలము, ఉత్సాహము వలననే విజయము లభించును" అని సుగ్రీవుడు తెలుపును.

మహాభారతము నందు విదురనీతి ఇట్లు తెలుపును.

**" వగ బలము దఱుగు, రూపఱు,వగచిన మతి దప్పు దెవులు వచ్చును దూఱన్**
**వగచి నలంగిన ప్రియమగుమ్ బగతురకును; వగచుటుడుగు,పార్ధివ ముఖ్యా!"**

ధృతరాష్ట్రా! దుఃఖము వలన బలము నశిస్తుంది. ఆకారము చెడుతుంది. మనసు పాడు అవుతుంది. రోగము వస్తుంది. మిక్కిలి దుఃఖిస్తే శత్రువులు సంతోషిస్తారు. దుఃఖము సర్వ నాశహేతువు, కావున దుఃఖించటము మానాలి.

దుఃఖ సాగరాన్ని ఈదడానికి భగవద్గీత నావ. మానవులంతా దుఃఖితులైన పార్థులు. వాసుదేవుడు సుఖతీరాలకు చేర్చగలిగే నావికుడు. అందుకే గీతా ప్రబోధము (శోకింప తగని వారిని గూర్చి) అశోచ్యాన్ -అను పదముతో ప్రారంభమై, (శోకింపవలదు)

మాశుచః అను పదముతో అంతమవుతుంది. అంటే గీత యొక్క పరమోద్దేశము శోకరాహిత్యము, ఆనంద ప్రాప్తి.

**"మాత్రా స్పర్శాస్తు కౌంతేయా శీతోష్ణసుఖదుఃఖదా:**
**ఆగమాపాయినో నిత్యాస్తాం స్తితిక్షస్వ భారత"**

అర్జునా! ఇంద్రియముల యొక్క శబ్ద స్పర్శాది విషయ సంగములౌ ఒకప్పుడు శీతమును, ఉష్ణమును, ఒకప్పుడు సుఖమును, ఒకప్పుడు దుఃఖమును కలుగ జేయును. మరియు అవిరాకపోకడలు గలవై, అస్థిరములై యున్నవి. కావున వానిని ఓర్చుకొనుము.




# మరాఠీ సాహిత్యపు రెండు మణిపూసలు

## గబ్బిట కృష్ణమోహన్

**'అహో తుమ్హీ "యుగాంత" వాచ్లాకా?'**

'నైహో, అజూన్ "యయాతి" కాదంబరీ సుధా వాచ్లా నాహీ. మిళత్ నాహీ.'

'యుగాంత' పుస్తకం చదివారా అన్న ప్రశ్నకి అబ్బే, ఇంకా 'యయాతి' నవల కూడా చదవలేదు, దొరకటం లేదు అన్న జవాబిది. మన తెలుగువాళ్ళు ఈ సినిమా చూశావా, ఆ సినిమా బాగుందా అని మాట్లాడుకున్నట్టు పునేలో ఇంటా బయటా, ఆఫీసుల్లో ఇద్దరు కలిస్తే చాలు 1960 దశకంలో పై సంభాషణ జరుగుతుండేది. మరాఠీ వాడుక భాషలో కూడా నవలకి 'కాదంబరి' అన్న చక్కటి పదాన్ని వాడుతారు. పుస్తకాలు కొని చదివే అలవాటు తక్కువున్న రోజుల్లో వాడవాడలా సర్క్యులేషన్ లైబ్రరీలు పుస్తకప్రియుల అవసరాలు తీరుస్తుండేవి, ఈ రెండు పుస్తకాల్ని అడ్వాన్స్ బుకింగ్ చేసుకునేవారు అప్పట్లో. ఎవరు చూసినా వీటి గురించే మాట్లాడతారెందుకు? ఏమిటి ఈ రచనల గొప్పదనం? తెలుసుకోవాలంటే వాటి ఇంగ్లీషు అనువాదాలు చదవాలి. అవి లభ్యం కావటానికి చాలాకాలం పట్టింది. చదివిన తరవాత నిజం - నిజంగా, సాహితీ ఔన్నత్య సాక్షాత్కారమైంది. ఈ రెండు రచనలకి వ్యాస మహాభారత సంబంధం కాకతాళీయం.

***<u>యయాతి</u>***

ముందుగా వెలుగు చూసింది విష్ణు సఖారాం ఖాండేకర్ (1899-1976) రచించిన యయాతి నవల. మరాఠీ సాహిత్యంలో చేసిన విశిష్ట కృషికి గుర్తింపుగా ఖాండేకర్‌కి పద్మభూషణ్ సత్కారం (1968)తో పాటు యయాతి రచనకి 1960లో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు, 1974లో దేశంలో అత్యున్నత పురస్కారంగా పరిగణించే జ్ఞానపీఠ్ (వాగ్దేవి పురస్కారం) అవార్డులు లభించాయి. రెండున్నర లక్షల పై బడి కాపీలు అమ్ముడైనాయి. ఇంగ్లీషులో యయాతి - ఎ క్లాసిక్ టేల్ ఆఫ్ లస్ట్ పేరుతో వై.పి.కులకర్ణి (ఓరియంట్ పేపర్ బ్యాక్స్), తెలుగులో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ (సాహిత్య అకాడెమీ) అనువాదాలు ఉన్నాయి. తెలుగు యయాతి కేవలం నగర గ్రంథాలయాల్లోనే కానీ బుక్ షాపుల్లో కనిపించదు.

మహాభారతం ఆదిపర్వంలో దేవయాని, కచుడు, యయాతి, శర్మిష్ఠలకు చెందిన ఉపాఖ్యానం ఆధారంగా తెలుగులో యయాతి పేరుతో కాల్పనిక రచనలు వచ్చాయి. గిరీష్ కర్నాడ్ రాసిన మొదటి నాటకం యయాతి. దానికి తెలుగు అనువాదాన్ని అందించిన

భారతీరావు - 'యయాతి' కథలో పది నాటకాలకు సరిపడే ఇతివృత్తాలు నవరసాలుగా ప్రవహిస్తాయి. ఆదిమానవుడి నుండి ఆధునిక మానవుడు వరకూ మనిషిలో అంతర్లీనమైన ఎమోషన్స్ - ప్రేమ, ద్వేషం, స్వార్థం, స్వాభిమానం, అసూయ, విషయలాలసత, యౌవనంలో ప్రకోపించే కామం, దానివలన కోల్పోయే విచక్షణ - ప్రస్ఫుటంగా కనిపిస్తాయి' అన్నారు. 1938లో కచ-దేవయాని తెలుగు సినిమా వచ్చినట్టు గూగుల్ సమాచారం.




హస్తినాపురం రాజు నహుషుడి యయాతి, పరాక్రమవంతుడు. తండ్రి మరణంతో సింహాసనం అధిష్టిస్తాడు. శుక్రాచార్యుడు కుమార్తె దేవయానితో అసురరాజైన వృషపర్వుడి రాజ్యంలో ఉంటాడు. వృషపర్వుడి కూతురు శర్మిష్ఠ. దేవయాని, శర్మిష్ఠలు చెలిమితో మెలుగుతుంటారు. దేవగురువు తన కుమారుడైన కచడుని శుక్రాచార్యుల నుంచి మృతసంజీవినీ విద్య నేర్చుకు రమ్మని పంపిస్తాడు. కచుడు దేవయానిని మచ్చిక చేసుకుని శిష్యరికం చేస్తుంటే రాక్షసులు కచుడు వచ్చిన పని గ్రహించి అతన్ని చంపి, కాల్చి, చితాభస్మాన్ని శుక్రాచార్యుడు ఇష్టంగా సేవించే మద్యంలో కలిపి తాగిస్తారు. దేవయానికి కచుడు మీద వల్లమాలిన ప్రేమ, కానీ గురుపుత్రిక అవడంతో కచుడు ఆమెను సోదరిగా భావిస్తాడు. విషయం తెలుసుకున్న దేవయాని తండ్రిని బతిమాలి, బెదిరించి కచుడికి పునర్జీవం కలిగించమంటుంది. అలానే చేసి శుక్రాచార్యుడు మృత సంజీవినీ విద్యను కూడా అనుగ్రహిస్తాడు. కచుడు దేవలోకానికి తిరిగి వెడతాడు. ఒకసారి జలకాలాటలో దేవయానిని శర్మిష్ఠ అవమానపరుస్తుంది. అవమానం భరించలేక దేవయాని బావిలో దూకుతుంది. వేటకి వచ్చిన యయాతి రక్షిస్తే వామహస్తం పట్టుకున్నందుకు పాణిగ్రహణం చేసుకోమని ప్రాధేయపడుతుంది. సరేనంటాడు యయాతి ఆమె సౌందర్యానికి ముగ్ధుడై. దేవయాని తనను అవమానించిన శర్మిష్ఠను హస్తినాపురానికి దాసిగా తీసుకెడుతుంది. యయాతి, దేవయానిలకి యదు అనే కుమారుడు జన్మిస్తాడు. ఒకసారి శర్మిష్ఠను యయాతి మోహిస్తాడు, ఆమె కూడా యయాతిని గాఢంగా ప్రేమిస్తుంది. వారిద్దరికి కలిగిన కుమారుడు పురు. యయాతి రోజురోజుకీ విషయలాలసకు బానిస అయి పగలు రాత్రి బేధం లేకుండా మద్యం, మగువలతో గడుపుతాడు. విషయం తెలుసుకున్న శుక్రాచార్యుడు కుమార్తెను దుఃఖింపచేసినందుకు యయాతికి వార్ధక్యం కలిగేట్టు శపిస్తాడు. యయాతి తను ఇంకా దేవయానిని అనుభవించాలి, సంతృప్తి కలగలేదు అంటూ వేడుకుంటే నీ కొడుకుల్లో ఎవరైనా తన యవ్వనం నీకిస్తూ బదులుగా నీ వార్ధక్యం పుచ్చుకోడమే దీనికి మార్గం అంటాడు శుక్రాచార్యుడు. యదు ఒప్పుకోడు, పురు ఒప్పుకుంటాడు; యయాతికి తిరిగి యవ్వనం లభిస్తుంది. కొడుకు వార్ధక్యాన్ని చూసి తప్పు తెలుసుకుని పశ్చాత్తాపంతో కుంగిపోతూ మళ్ళీ తన రూపు తనకిమ్మని ప్రాధేయపడి, పురును సింహాసనం మీద కూచోబెట్టి దేవయాని, శర్మిష్ఠలతో వానప్రస్థాశ్రమానికి వెళ్ళడంతో కథ ముగుస్తుంది.

కామాంధుడైన యయాతి భోగలాలసతతో తన ముసలితనాన్ని కొడుకుకి సంక్రమింపచేసి తాను మరలా యవ్వనుడు కావటాన్ని చిన్నప్పుడు భారతంలో చదివిన ఖాండేకర్‌కు, దీనికన్నా - మరణశయ్య మీదున్న హుమాయూన్‌ను చూస్తూ తండ్రి బాబరు తన ఆయుష్షు పోసుకుని కొడుకు బతికితే బావుండునని వాపోయిన ఉదంతం నచ్చిందట. అయినా యయాతి కథ ఆయన మనసులో నలభై సంవత్సరాలపాటు అంతర్లీనంగా ఉండిపోయింది. కాలేజీలో కాళిదాసు శాకుంతలం చదువుతున్నప్పుడు ఆయనకొక సందేహం వచ్చింది. శకుంతలని అత్తవారింటికి సాగనంపుతూ కణ్వమహర్షి, 'యయాతేరివ శర్మిష్ఠా భర్తుర్బహుమతా భవ' (శర్మిష్ఠ ఎంతతా యయాతికి ప్రీతిపాత్రురాలో నీవు కూడా నీ భర్తకి అంత ప్రీతిపాత్రం కావాలి) అని ఆశీర్వదిస్తాడు. యయాతికి దేవయాని అంటే మక్కువ కదా మరి కాళిదాసు కణ్వమహర్షి చేత ఇలా ఎందుకు పలికించాడు? భారత కథలో శుక్రచార్యుడు యయాతికి వార్ధక్యం సంభవించాలని శపిస్తే అతను 'నేను మరింకా దేవయానితో సంభోగ సుఖాన్ని అనుభవించాలి, సంతృప్తి కలగలేదు, కనక నన్నీ వార్ధక్యం నుంచి విముక్తి కలిగించి

నా యవ్వనం నాకు వొసగు' అని వేడుకుంటాడు. ఈ సందేహాన్ని నివృత్తి చేసుకోడానికి డాక్టర్ గుణే అనే సంస్కృత అధ్యాపకుడిని వివరించమని అడిగితే ఆయన, 'శర్మిష్ఠను యయాతి గాంధర్వ వివాహం చేసుకున్నాడు, శకుంతల దుష్యంతులవలె. పైగా దుష్యంతుడు, పురు(యయాతికి శర్మిష్ఠకి పుట్టినవాడు) వంశానికి చెందినవాడు, పూర్వీకుల గాంధర్వ వివాహాన్ని ఉదహరిస్తూ కాళిదాసు గొప్ప ఔచిత్యం ప్రదర్శించాడు,' అని చెప్పారట. ఇది కేవలం పరీక్షా పత్రంలో సమాధానానికే పనికొస్తుంది; ఖాండేకర్ జిజ్ఞాసను సమాధానపరచలేకపోయింది. 'భత్రు బ్రహుమతా భవ' అన్నదాంట్లో చాలా అర్థం ఇమిడి ఉందని తరచూ తొలుస్తుండేది. అంతకు ముందు 'కాంచనమృగ', క్రౌంచవధ' అన్న రెండు నవలలు పురాణ గాథల నేపథ్యంతో రాసి, 1950 దశకంలో సమాజంలో కలుగుతున్న మార్పుల్ని, నైతిక విలువల పతనాన్ని గమనించి సమకాలీనంగా ఉన్న యయాతి ఇతివృత్తాన్ని తన కల్పనా చాతుర్యంతో నవలగా రాశారాయన.

ఈ రచనలో చెప్పుకోతగ్గ అంశం కథని పాత్రలచేత - యయాతి, దేవయాని, శర్మిష్ఠల చేత - చెప్పించడం. ఆయా సమయాల్లో, సందర్భాల్లో పాత్రల మనసులో జరుగుతున్న సంఘర్షణ, కల్లోలాలని పాత్రల చేతనే చెప్పించి మెప్పించగలగటం గొప్ప యత్నం. ముఖ్యంగా  మొదటిరాత్రి కొంచెం మధువు సేవించి వచ్చిన భర్త యయాతిని, తనొక బ్రాహ్మణుడి కుమార్తెనన్న గర్వంతో కుల అహంకారంతో తనకు ఇలాంటివి గిట్టవనీ, ఇకనుంచి అంతఃపురానికి వచ్చినప్పుడు మధువు, మదిరలకు దూరంగా ఉండమని హెచ్చరిస్తుంది. తాను క్షత్రియుడు కనుక వేటాడటం, మదిర సేవించడం క్షాత్ర ధర్మమని యయాతి చెప్పినా వినిపించుకోదు. తండ్రి శుక్రాచార్యుడికి మదిర ఇష్టం. కచుడి చితాభస్మాన్ని కలిపిన మదిరను సేవించి విషయం తెలుసుకున్న పిదప బ్రాహ్మణుడైన శుక్రాచార్యుడు దాన్ని నిషేధించిన ఉదంతం భారతకథలో ఉండటం గమనార్హం.

శుక్రాచార్యుడి నుంచి మృతసంజీవిని విద్య నేర్చుకుని స్వర్గలోకానికి తిరిగి వెళ్ళడంతో భారత కథలో కచుడి పాత్ర ముగుస్తుంది. ఖాండేకర్ రచనలో కచుడు వస్తూ పోతుంటాడు. ముఖ్యంగా పతాక సన్నివేశంలో వచ్చి శుక్రాచార్యుడి కన్నా ఎక్కువ విద్య నేర్చుకున్నందుకు యయాతికి వార్ధక్యం, కొడుకు పురుకు మరల యవ్వనం అనుగ్రహిస్తాడు కచుడు. (పురు భార్య చంద్రలేఖ - కల్పితపాత్ర - భర్త వార్ధక్యాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకోడంతో గిరీష్ కర్నాడ్ నాటకం ముగుస్తుంది.)

***<u>యుగాంత</u>***

డాక్టర్ ఇరావతీ కర్వే రాసిన యుగాంత వ్యాసకదంబం భారతంలోని కొన్ని పాత్రలు అవి వ్యవహరించిన తీరును తులనాత్మకంగా పరిశీలించి రాసినది. మహాభారత కథ కల్పితం కాదనీ, క్రీస్తు శకానికి ముందు వెయ్యి సంవత్సరాలకిందట జరిగిందనీ విశ్వసిస్తారు. ప్రముఖ ఆర్కియాలజిస్ట్, హిస్టోరియన్ - విల్ డ్యురాంట్ (ది స్టోరీ ఆఫ్ సివిలిజేషన్, మొదటి సంపుటం, అవర్ ఓరియంటల్ హెరిటేజ్, పేజీ 562) మహాభారతంలోని కొన్ని పాత్రలు వేదాల్లో కూడా ప్రస్తావించబడినందుకు రెండు గొప్ప వంశాల మధ్య జరిగిన మహాసంగ్రామానికి చారిత్రిక ప్రాతిపదిక ఉన్నట్టు తెలియపరుస్తుంది అన్నారు.

కొంతకాలం కిందట భండార్కర్ ఓరియంటల్ రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ పుణే వారు చేపట్టిన బృహత్తర కార్యక్రమం - వ్యాస మహాభారతంలో శతాబ్దాలుగా ఎవరికి తోచిన విధంగా వారు, ముఖ్యంగా భృగు వంశీయులు, శ్లోకాలని, ఉపాఖ్యాలని కల్పించి చొప్పించిన వాటిని తులనాత్మకంగా పరిశీలించి మధ్యకాలంలో చేర్పుల్ని ఏరి అసలు భారతాన్ని ప్రచురించడం. ఈ కార్యక్రమంలో దేశం నలుమూలల్నించి అన్ని భాషల లిపులలో ఉన్న వ్యాస భారతపు తాళపత్ర గ్రంధాలు సేకరించి పరిశీలించి కాలానుగుణంగా జరిగిన చేర్పుల్ని తొలగించి క్రిటికల్ ఎడిషన్ సంపుటాలు కొన్ని ప్రచురించారు భండార్కర్ ఇన్స్టిట్యూట్ వారు. యుగాంతకి ఆధారం ఈ సంపుటాలే. అయితే ఇప్పటివరకు లభించిన ప్రాచీన తాళపత్ర గ్రంధాలు ఎనిమిది, తొమ్మిది శతాబ్దాలకంటే ముందువి కావు. అయినా మరింత

సంశోధనలో ఇలా కల్పితాలన్నీ తొలగిస్తూ పోతుంటే ఏదో ఒకరోజు - మహాభారతానికి ఆధారమైన జైమిని రచన జయ అందుబాటులోకి రావచ్చనేది కర్వే విశ్వాసం.

క్షత్రియుల వివాహేతర సంబంధాల్లో జన్మించినవారు సూతులు. దర్బారులో రాజుకి సన్నిహితులుగా, సలహాదారులుగా, గాయకులుగా వీరుండేవారు. ఊరూరా తిరిగే కొంతమంది సూతులు పదిమంది గుమికూడే ప్రదేశాల్లో, యజ్ఞ యాగాది క్రతువుల్లో మధ్యాహ్నం పూట విరామ సమయంలో వీరుల గాథల్ని గానం చేస్తుండేవారు. కాలక్రమేణా పురాణ గాథలు కూడా చేరాయందులో. సూతులు గానం చేసిన - మహాభారతం, రామాయణం, మరితర పురాణాలకి శౌత వాంగ్మయమని ప్రత్యేకమైన పేరునిచ్చారు డాక్టర్ యస్.వి.కేత్కర్. ఒకానొక కాలంలో సూతులనుంచి బ్రాహ్మణులైన భృగు వంశీయుల అధీనంలోకి వచ్చి తమ తమ వంశ చరిత్రలు కూడా వీటిలో వారు చొప్పించినట్టు డాక్టర్ వి.యస్. సుక్తంకర్ విశ్వసనీయంగా నిరూపించినట్టు డాక్టర్ కర్వే చెబుతారు.




ఈ వ్యాస పరంపరలో మొదటిది 'ఆఖరి ప్రయత్నం'. శంతనుడి కుమారుడైన దేవవ్రతుడు భీష్ముడిగా మారడం, కురు వంశాభివృద్ధికి ఆయన పడిన పాట్లు; విచిత్రవీర్యుడికి, ధృతరాష్ట్రుడికి, పాండురాజుకి, విదురుడికి తనే స్వయంగా కన్యకలని వెదికి తెచ్చి వివాహాలు చేసి సింహాసనం మీద కూచోకపోయినా రెండు తరాలపాటు అధికార్మ చెలాయించడం; దుర్యోధనుడు యువరాజైన తరువాత అధికారం, ప్రాబల్యం సడలినా కురుక్షేత్ర సంగ్రామం వరకు కౌరవులనే అంటిపెట్టుకుని - యుద్ధంలో ప్రజ్ఞావంతుడు కాకపోయినా సైన్యాధ్యక్ష పదవి స్వీకరించి కర్ణుడిని దూరంగా ఉంచడం మొదలైన అంశాలని పేర్కొంటూ గాంధారి నుంచి మాద్రి వరకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో భారత గాథలో స్త్రీలకి భీష్ముడి వల్ల జరిగిన అవమానాలను, అన్యాయాలను సహేతుకంగా రచయిత్రి నిరూపిస్తారు. ఆత్మత్యాగం చేసినవాడిలో ఎక్కడో ఒక మూలన స్వార్థం నక్కివుందా? విచిత్రవీర్యుడు పెళ్ళయిన కొంతకాలానికే మరణిస్తే దర్బారులో ఎంతోమంది కురువంశ యోధులుండగా వంశాభివృద్ధికి వ్యాసుడిని పిలిపించి మరదళ్ళకి పిల్లల్ని కలిగించడం ఎంతో మంది కురువంశ యోధులుండగా వంశాభివృద్ధికి వ్యాసుడని పిలిపించి మరదళ్ళకి పిల్లల్ని కలిగించడం ఎందుకు చేశాడు? ఎలాగైనా కురువంశం అంతరించ రాదనే పట్టుదలతో భీష్ముడు స్త్రీలకు జరిపిన అన్యాయం వివరిస్తుంటే సమకాలీనత ద్యోతకమవుతుంది. భీష్ముడు గొప్ప రణరంగ యోధుడు కాదని, అయినా తనొక వీరుడునని నమ్మాడని, ప్రజలు కూడా అలానే విశ్వసించారని తెలుస్తుంది. భీష్ముడు చేసిందల్లా మహాభారతంలో అడుగడుగునా ప్రస్తావించబడిన ఒకే ఒక యుద్ధం - మూడువారాలపాటు పరశురాముడితో సాగించిన పోరాటం. దీన్ని రచయిత్రి విశ్లేషిస్తూ అది నిజం కాదని చెబుతారు. కృతయుగంలో హైహయులని మట్టుపెట్టిన వాడు పరశురాముడు. ఆ తరువాత వచ్చినవాడు అయోధ్య రాముడు. రాముడి తరువాత చాలాకాలానికి మహాభారత కథ జరిగింది. కనక భృంగు వంశీయులు భారతంలో ఇమిడ్చిన కల్పనల్లో ఒకటి, భీష్మ - పరుశురాముల సంగ్రామం. కురుక్షేత్ర సంగ్రామంలో మూడవ రోజున జరిగిన యుద్ధంలో కృష్ణుడు చక్రంతో రథం మీద నుంచి దూకి భీష్ముడిని చంపబోవటం (బమ్మెర పోతనగారి భీష్మస్తుతి - కుప్పించి ఎగసిన కుండలంబుల కాంతి వగైరా మనోహరమైన పద్యాలు గుర్తుకొస్తాయి కదూ!) కూడా తరవాతి రోజుల్లో చేర్చిన కల్పన అని, కథాంశానికి భిన్నమని తొమ్మిదవ రోజున రథసారథి అయిన కృష్ణుడు చేతిలో ఉన్న చెర్నాకోలుతో భీష్ముడి మీదకి దూకిన సంఘటన హేతుబద్ధంగా, అతిశయోక్తులకు పోకుండా ఉందంటారు కర్వే. కఠోర ప్రతిజ్ఞ చేసిన భీష్ముడు చివరికి సాధించిందేమిటి అన్నది ప్రశ్నగానే మిగులుతుంది అంటారావిడ.

గాంధారి, కుంతి, ద్రౌపది వ్యాసాలలో కూడా కొన్ని కుతూహలమైన ప్రశ్నలు రేకెత్తించారు.

'తండ్రీ కొడుకులా?' అన్న వ్యాసంలో విదురుడికి, ధర్మరాజుకి మధ్యనున్న అనుబంధాన్ని, సంబంధాన్ని, బాంధవ్యాన్ని విశ్లేషిస్తూ వారి సంబంధమూ, ఆత్మీయతలు - కృష్ణార్జునులలా, దుర్యోధన కర్ణులులా స్నేహానికే పరిమితం కాదనీ ఒక తండ్రీ కొడుకుల అనుబంధమని నిరూపిస్తారు. వాళ్ళిద్దరి జీవితాలు ఒకే రీతిలో గడవటం గురించి తెలుపుతూ మహాభారతం ఏ పాత్రల రహస్యాలనీ దాచలేదంటూ కర్ణుడు కుంతీపుత్రుడని బాహాటంగా వివరిస్తుందనీ; ఒకవేళ ధర్మరాజు - కుంతికి విదురుడికి పుట్టి ఉంటే మరి ఆ విషయం ఎందుకు గోప్యంగా ఉంచిందా గ్రంథం అని ప్రశ్నిస్తారు? పాండురాజు సమ్మతితో కుంతి వేర్వేరు దేవతల అనుగ్రహంతో కుమారులను కన్నది. ముందుగా మృత్యువుకు అధిపతి అయిన యముడిని ప్రార్థించి యుధిష్ఠురుడిని కన్నది. విదురుడు యమధర్మరాజు అవతారమని చెబుతారు. అప్పటి రాజధర్మం ప్రకారం పాండురాజుకి సంతతి కలిగించేందుకు తమ్ముడైన విదురుడు అన్నివిధాల అర్హుడు. కురుక్షేత్ర యుద్ధం ముగిసిన తరవాత జరిగిన రెండు సంఘటనలు కూడా దీన్ని బలపరుస్తాయి.

దృతరాష్ట్రుడు, గాంధారి, విదురుడు, కుంతి వానప్రస్థం చేస్తున్నపుడు పాండవులు వచ్చి కలిసి వెడుతుండేవారు. ఒకసారి విదురుడు కనబడకపోడం గమనించి ధర్మరాజు అడిగితే అతను ఘోర తపస్సు చేస్తున్నాడని, చిక్కి శల్యమైనాడని, బట్టలు కూడా ధరించడం లేదనీ దృతరాష్ట్రుడు చెబుతాడు. వెంటనే ధర్మరాజు పరుగెత్తుకుంటూ వెళ్ళి, 'విదురా, ఆపండిది. నేను, మీ ప్రియమైన యుధిష్ఠిరుడిని,' అంటాడు. విదురుడు యోగవిద్యతో ధర్మరాజు అంగాంగాల్లోకి ప్రవేశించి తన జీవితాన్ని, అవయవాల్ని, బుద్ధిపటిమని అతనికి సంక్రమింపచేస్తాడు. మరణానికి చేరువైన తండ్రి కటిక నేల మీద పడుకుని కొడుకుని తన మీద పడుకోమంటూ తన సర్వాంగాల్ని ధారపోస్తున్నానని చెప్పినప్పుడు ఆ కొడుకు, 'నేను గ్రహిస్తున్నాను' అనడమనేది ఉపనిషత్తుల్లో వివరించిన విషయం. మరి విదురుడు అందుకే అలా చేశాడా? రెండు అధ్యాయాల తరువాత వ్యాసుడు వచ్చి విదురుడు - తనకే విచిత్రవీర్యుడి భార్యకీ యోగశక్తి వల్ల కలిగిన సంతానమని, యముడి అవతారమని; అతని యోగశక్తితో యుధిష్ఠిరుడు కుంతికి జన్మించాడనీ విదురుడే ధర్మరాజనీ, ధర్మరాజే విదురుడనీ దృతరాష్ట్రుడికి తెలుపుతాడు. అప్పటి క్షాత్రధర్మం ప్రకారం సంతానం కలగజేయడానికి క్షత్రియుల్లో కేవలం ఒకే ఒక తనయుడి కోసం మాత్రమే వితంతువైన మరదలితో సంభోగం చెయ్యాలి, అందుకే విదురుడు మరోసారి కుంతిని సమీపించలేదు.

'పరధర్మో భయావహ' అన్నది ద్రోణాచార్యుడి కొడుకు అశ్వత్థామ బ్రాహ్మణ వంశ ధర్మాన్ని మరిచి క్షత్రియ ధర్మాన్ని ఆపాదించుకున్నా సర్వసైన్యాధిపతి కాలేకపోవడం గురించిన వ్యాసం. కౌరవులందరూ మరణించిన తరువాత దుర్యోధనుడు కొలనులో దాక్కుంటే ఆ సంగతి తెలిసి కృపాచార్యుడిని కృతవర్మని వెంటబెట్టుకుని అశ్వత్థామ బాహాటంగా దుర్యోధనుడితో సంభాషిస్తుంటే చూసిన కొందరు ఆ విషయం పాండవులకి తెలుపుతారు. పాండవులు వెంటనే అక్కడికొస్తే దుర్యోధనుడి దుస్థితి తరవాత చూసి ప్రతీకారంగా పాండవుల గుడారాల్లోకి ప్రవేశించి నిద్రలో ఉన్న ధ్రుష్టద్యుమ్నుడినీ, ఐదుగురు ద్రౌపదీ కుమారుల్ని హతమరుస్తాడు. ఆలోగా కృపాచార్యుడు, కృతవర్మ గుడారాలకి నిప్పు పెడితే భయాందోళనలతో పరుగెత్తున్న వారందర్నీ మట్టుపెడతాడు. పరిగెత్తుకుంటూ వెళ్ళి చివరిదశలో ఉన్న దుర్యోధనుడికి ఈ సంగతి తెలపగానే అతను ప్రాణాలు విడుస్తాడు. బ్రాహ్మణ కులంలో పుట్టిన అశ్వత్థామ, తండ్రి ద్రోణాచార్యుల రాజ్యానికి రాజు కాలేకపోయాడు. అర్జునుడికన్నా తండ్రి నుంచి ఎక్కువ విద్యలు నేర్చుకున్నవాడు కౌరవుల విజయానికి తోడ్పడక తన ప్రాణానికి ముప్పు రాకుండా ప్రతిఫలం తీర్చుకున్నాడు. కులధర్మం వదిలినా క్షత్రియుడు కాలేకపోయాడు, స్వధర్మాన్ని త్యజించిన మరచిపోలేని పాత్ర ఇది. చివరికి కృష్ణుడి శాపంతో దేశదిమ్మరిగా వేలాది సంవత్సరాలు జీవిస్తూ, ఎవరూ ఆశ్రయం ఇవ్వని నిర్భాగ్యపు బతుకు గడిపినవాడు అశ్వత్థామ.

'కృష్ణ వాసుదేవ' వ్యాసంలో మహాభారతంలో మానవమాత్రుడిగా ఉన్న కృష్ణుడు వాసుదేవ బిరుదుకి అర్హత సంపాదించే దిశలో చేసిన కృత్యాలు తెలుస్తాయి. వాసుదేవుడంటే వసుదేవుడి కొడుకు అని కాక, జైన వాఙ్మయంలో అగుపడే బిరుదని రచయిత్రి

సహేతుకంగా చెప్తారు. అలాగే భగవద్గీతలో మొదటి ఆరు అధ్యాయాలు మాత్రమే మహా భారతంలోని భాగాలని, తతిమ్మా అధ్యాయాలు తరవాత కాలంలో కలిపినవని, ఉపగీతగా చెప్పుకునేది అసంబద్ధమని. అసలు భారతంలో భాగమే కాదనీ తెలుపుతారు.

మహాభారత యుద్ధ పరిసమాప్తి, యాదవ వంశ నిర్మూలనలతో ఒక శకం, ఒక జీవన శైలి ముగిసి యుగాంతమని చెబుతారు. వేదాలతో, ఉపనిషత్తులతో, మహాభారతంతో ఆరంభించిన సమాజం ఎందుకు తలకిందులైంది? జీవితంపు కఠిన సత్యాల్ని వెరవకుండా ఎదుర్కొన్న సమాజం కాల్పనిక పలాయన వాదంతో భక్తికి, పురాణపురుషుల ఆరాధనకి ఎందుకు తలవొగ్గింది? ఒకప్పుడు జంతుమాంస భక్షణ - గోమాంసంతో సహా - చేసిన సమాజం గోమూత్రం తాగుతూ, గోవు మలాన్ని తింటూ, గోపూజతో ఎందుకు తృప్తి పడుతోందని మిత్రుడు అడిగిన ప్రశ్నలకు తన వద్ద సమగ్రమైన జవాబు లేదంటూ పాఠకులందరూ ఆలోచించడానికే వీటిని ప్రస్తావించానంటారు.

ఏదెలా ఉన్నా ఆ భాష (సంస్కృతం) ఇంక మనకు అర్థం కాగలిగి మహాభారతాన్ని చదివి మెచ్చుకోగలందుకు కృతజ్ఞతా పూర్వకులం అని మరో మిత్రుడు చెప్పాడన్నారు. జీవన వృత్తులు, అన్ని రకాల ప్రామాణిక సాక్ష్యాలు, లిపి ఉండి కూడా దాన్ని చదవలేకపోవడం వల్ల మొహంజదారోలా అగమ్యగోచరం కాకుండా, మూడువేల సంవత్సరాల కిందట పాడుకున్న జయ కావ్యాన్ని ఈనాటికీ తను చదవగలగటం, ఆ కథలో తనని తాను గుర్తించుకోడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని ముగిస్తారు, బెర్లిన్ విశ్వవిద్యాలయంలో ఆంత్రోపాలజీలో డాక్టరేట్ పట్టా (1930) పుచ్చుకున్న శ్రీమతి ఇరావతీ కర్వే.

వ్యాస మహా భారాతాన్ని కానీ ఆంధ్ర మహాభారతాన్ని కానీ చదవలేని, చదివినా అర్థం చేసుకుని విశ్లేషించలేని నాబోటి వారు ఆలోచనలు రేకెత్తించే యుగాంత చదివి తీరాలి. తెలుగు అనువాదం ఉందంటారు కానీ బుక్ షాపుల్లోనూ, నగర గ్రంథాలయల్లోనూ కనబడటం లేదు. ఇరావతీ కర్వే సంక్షిప్తీకరించి స్వయంగా ఇంగ్లీషులోకి అనువదించిన రచన ఓరియంట్ బ్లాక్ స్వాన్ (ఒకప్పటి ఓరియంట్ లాంగ్మన్ వారు ప్రచురించారు) లభ్యమవుతోంది.

●●●




# కవికి విమర్శకుడూ కావాలి!

## కర్లపాలెం హనుమంత రావు

రచనకు ఒక పార్శ్వం రచయిత ఐతే రెండో పార్శ్వం రసాస్వాదన చేసే భావుకుడు.

అపారే కావ్య సంసారే కవిరేకః ప్రజాపతిః।

యథాస్మై రోచతే విశ్వం తథైవ పరివర్తతే- అని శ్లోకం॥

కవి తన ఇచ్చానుసారం చిత్రించడమే కాదు..ప్రజాపతి సృష్టించిన జగత్తు పోకడలను కూడా మార్చగలడు-అని అర్థం.

కవిలోని ఆ సృజనశక్తి సహజమైనది. కొంత మందికి అది గురుకృప తరువాత బైటపడుతుంది. కొంతమంది నిరంతర శాస్త్రాధ్యయనం ద్వారా మెరుగులు దిద్దుకుంటారు. ఎవరెట్లా సాధించినా పండితరాయలు సిద్ధాంతం ప్రకారం కవి అనేవాడికి 'అనాయాసంగా, అప్రయత్నంగా శబ్దార్థాలు స్ఫురించే ప్రతిభ పట్టుపబడటం' ప్రధానం.

రాజశేఖరుడు అనే మరో ఆలంకారికుడు ఈ ప్రతిభను రెండు రకాలుగా విభజించాడు.

కారయిత్రి:కావ్యాన్ని సృజించే ప్రతిభ

భావయిత్రి:కావ్యసౌందర్యాన్ని ఆస్వాదించగలిగే శక్తి

కారయిత్రి అధికంగా ఉంటే కవి .

భావయిత్రి అధికమైతే సద్విమర్శకుడు .

రచన పూర్తయిన తరువాత రచయితా విమర్శక అవతారం ఎత్తవచ్చు. కాని అది తన రచన వరకే పరిమితం . సాధారణంగా ఏ కవీ తనకు పనిపడితే తప్ప వేరే వారి రచనల జోలికి పోయే పని పెట్టుకోడు.

రచనలను చదివి తార్కికంగా ఆలోచించి సహృదయంతో విమర్శ చేయగల సత్తా ఉన్నవాడినే అసలైన విమర్శకుల లెక్కలోకి తీసుకోవాలి.

సరే...

కవి గొప్పా? విమర్శకుడు గొప్పా? అనే చర్చ సహజంగానే వస్తుంది.

కవి సృజన చేస్తేనే కదా...విమర్శకు భూమిక సిద్ధమయేది! కనుక కవే గొప్ప అని ఒక వాదం.

కానీ చాలా సందర్భాల్లో కవీ ఊహించని చమత్కారాలను విమర్శకుడు తన విస్తృత పరిశీలనా పాటవంతో వెలికి తీస్తుంటాడు.

"ఇయం సంధ్యా, దూరాదహముపగతోహన్త! మలయా

దిహైకాన్తే గేహే తరుణి! తవనేష్యామి రజనీమ్,

సమీరేణోక్తైవం నవకుసుమితా చూతలతికా

ధునానా మూర్ధానం నహి నహి నహీత్యేవ వదతి"- అని ఒక కవిగారి శ్లోకం.

''ఎక్కడో మలయపర్వతం నుంచీ వస్తున్నాను.కనుచీకటి పడుతున్నది. తరుణీ! నీ గృహంలో ఏకాంతంలో ఈరాత్రి గడుపుతాను'' అని సమీరం అడిగితే కొత్తగా పుష్పించిన చూతలత(బిడియంతో కాబోలు) 'వద్దు వద్దు వద్దు' అని ముమ్మారు తలడ్డంగా ఊపిందిట"

'శ్లోకం రసవత్తరంగానే సాగింది కానీ చివర్లో ఆ చూతలత మూడు సార్లు అలా వద్దొద్దొద్దని సాగదీయడం దేనికీ?' అని తర్కానికి దిగాట్ట ఒక విమర్శక శిఖామణి.' ముక్కు మొహం తెలీని పరాయి పురుషుడు రాత్రంతా ఇంట్లో ఉంటానంటే ముగ్ధయిన పుష్పం మరి కంగారుపడదా! ఆ తొట్రుపాటులో 'వద్దు... వద్దు' అంది.తప్పా? అని కవిగారి వోట్రింపు.

'బాగుందండీ...మరి మూడోసారీ వద్దు అనెందుకన్నట్లో?" అని విమర్శకుడిగారి సందేహం.

కవిగారి దగ్గర సమాదానం లేదు. "చందస్సు కోసం అలా అన్నాను లేవయ్యా!" అని లోలోన గొణుక్కునుంటాడు పాపం. చందస్సుల్లో ఇమడటం కోసం ఇలా వ్యర్థప్రయోగాలు చేయాల్సి రావడం సంప్రదాయిక సాహిత్యంలోసాధారణమే. కానీ అలాంటి ప్రయోగాలవల్ల రచన ఔన్నత్యం పల్చబడతుంది. కవులందరికీ ఈ విషయమై మనసులో మథనున్నా బైటికి ఒప్పుకోరనుకోండి.

ఇలాంటి సందర్భంలోనే విమర్శకుడి విశిష్టత బైటపడేది.ఇక్కడి శ్లోకం సంగతే చూసుకోండి...కవిగారిని ఇబ్బందినుంచీ విమర్శకుడు ఎంత తెలివిగా తప్పించాడో చూడండి! 'శ్లోకంలో కవిగారు సూచించింది వట్టి కుసుమితను కాదు..నవ కుసుమితను.అంటే అప్పుడే పుష్పించిన కుసుమాన్ని. ఆ పూలబాలకు పరాయిమగవాడితో మరీ మూడు రాత్రులంటే...బెదిరు పుట్టదా! అందుకే అసంకల్పితంగా నవకుసుమిత నోటినుంచీ 'వద్దు వద్దు వద్దు' అన్న మాట అలా మూడుసార్లు తన్నుకు వచ్చేసింది' అని సమన్వయం చేసేశాడు విమర్శకుడు గారు. కవిగారికి ఈ సమన్వయంతోనిజంగాఅ కళ్ళెంబడి నీళ్ళొచ్చేసే ఉంటాయి. ఆనందం ఆపుకోలేక అమాంతం విమర్శకుడిని ఆలింగనమూ చేసేసుకునుంటాడు.

అదీ సాహిత్య పరిశీలనలో విమర్శకుడి దృష్టి చతురత.

అలాగని కవి పాత్రను ఎంత మాత్రం తక్కువ చేయడం కానే కాదు. ఎవరి ప్రతిభ వారిది.

'గురూపదేశాదధ్యేతుం శాస్త్రం జడధియోఽప్యలమ్

కావ్యంతు జాయతే జాతు కస్య చిత్ప్రతిభావతః'- మందబుద్ధులు కూడా గురుశుశ్రూష వల్ల కొంత శాస్త్ర పాండిత్యం సాధించవచ్చు.కావ్యసృజన మాత్రం ఎప్పుడో ఒకసారి కాలం అనుకూలిస్తేనే చేయగలిగేది.అదీ వందలాది ప్రతిభావంతులలో ఏదో ఒక్కడు-అంటాడు భామహుడు.

కావ్యం అంతర్గతంగా మేలిమి బంగారమైతేనే ..ఏ విమర్శకుడైనా దాని వెలుగులను మెరుగుపెట్టకలిగేది!

చేమకూర వెంకటకవి 'విజయవిలాసమే' దీనికి చక్కని ఉదాహరణ.సాధారణంగా కావ్యం మొత్తంలో ఒక పది పన్నెండు చమత్కారాలు ద్యోతకమైతేనే మనం 'ఓహో..ఆహో' అంటుంటాం. రాసిన ప్రతి పద్యంలో ఏదో ఒక విశేషాన్ని దిగ్విజయంగా చొప్పించిన చేమకూరకవి ప్రతిభాపాటవాలను ఏమని పొగడగలం! కొన్ని కొన్ని పద్యాల్లో ఐతే కొన్ని వందల ఏళ్ళ దాకా అందులోని అందాలు బయటపడనేలేదు...తాపీ ధర్మారావు గారు 'హృదయోల్లాసం' పేరుతో సవివరవ్యాఖ్యానం చేసిందాకా.

ఉదాహరణకు ఒక పద్యం చూడండిః

కన్నె నగుమోము తోడం
బున్నమ చందురుని సాటి( బోలుప వచ్చున్
నెన్నెదురు తోడ మార్కొని
మున్నందఱు జూడ రేకమోవక యున్నన్-(1-197)

గతంలో(చిత్రాంగద నుదురుతో పోటీ పడి బహిరంగంగా అవమానం పాలైన సందర్భంలో) అపజయం పాలై ఉండకపోయుంటే పున్నమి చంద్రుణ్ణి ఈ కన్నె నవ్వుమొహంతో పోలిక పెట్టవచ్చు-అని కవి భావన. పున్నమి చంద్రుడిని మించిన అందమైన నవ్వుమొహం ఆ అమ్మాయిది అని కవి ధ్వని. అంతవరకూ బాగానే ఉంది కానీ..నాలుగో పాదంలోని ఆ 'రేక మోవక' అనే ప్రయోగానికి సమన్వయం ఎలా చెప్పాలో కొమ్ములు తిరిగిన పండితులకూ, పరిష్కర్తలకూ, వ్యాఖ్యాతలక్కూడా అంతు పట్టలేదు. జూలూరు అప్పయ్య గారు 'చిన్నదాని నొసటితో పడ్డ పోటీలో ఓడిపోయి చంద్రుడు లేఖలు మోసే పని చేయవలసి వచ్చింది' అని ఏదో పొసగని అర్థం చెప్పే ప్రయత్నం చేసారు. శబ్దరత్నాకరం 'రేక అనే పదానికి 'జాబు' అని ఒక్కర్థం మాత్రమే చెప్పారుకోవడంతో వచ్చిన చిక్కు ఇదంతా. దాదాపు 300ఏళ్ళ పాటు చాలామంది ఇలా హైరానా పడ్డారు. నోరి వారి దగ్గర్నుంచీ వేదుల, బులుసు వారిదాకా అందరూ తమకు తోచిన ఏదో అర్థంతో సమన్వయం చేయబోయారు గానీ...కవి గారి అంతరంగంలోని అసలు భావం ఏమిటొ తాపీవారు తేల్చిన దాకా ఎవరికీ అంతుబట్టలేదు. 'రేక' అంటే 'గాయంతో శరీరంమీద పడ్డ గీత' అని చేమకూర వెంకటకవి భావం అని విజయవిలాసంలోని మరో పద్యం ఉదాహరణగా చూపించి ఒప్పించారు తాపీ వారు. మూడో అధ్యాయంలో అర్జునుడు సుభద్రను తీసుకుని పోయే సందర్భంలో బలరామునిసేనల్తో తలబడాల్సొస్తుంది. సుభద్ర యుద్ధంలో భర్తకు సాయం చేస్తుంది.

కృతజ్ఞతతో భార్యను ఆలింగనం చేసుకునే సమయంలో ఆమె వక్షస్థలానికి రాసుకునున్న కుంకుమరేఖలు చెమటకు తడిసి అర్జునుడి వంటిమీద కత్తిగాట్లులా పడతాయి.అర్జునుడు చమత్కారంగా

" ఒక్కంచుక రేకమోవని నా యురఃస్థలంబున

నీ కుచకుంకుమ రేఖ లంటించి మీ వారికి సూడు తీర్చితివి"అని పరిహాసం చేస్తాడు.ఇక్కడ 'రేకమోవని' పదానికి కత్తిగాయం అని తప్ప వేరే అర్థం కుదరదు కదా!

శత్రువు ఒంటిమీద ఒక్క దెబ్బైనా వేయకుండా ఓడిపోవడం యోధులకు అవమానం.తన అన్నగారిమీద ఆ అపనింద పడకుండా తన కుంకుమరేఖలతో అర్జునుడి వక్షస్థలంమీద కత్తిగాయంలా చేసి పుట్టింటివారి గౌరవాన్ని సుభద్ర కాపాడిందని కవిగారి చమత్కారం' అని తాపీ వారి అన్వయం.ఇదే అర్థాన్ని ముందటి పద్యానిక్కూడా అన్వయించుకుంటే చేమకూరగారి చమత్కారం చక్కలిగిలి పెడుతుంది. 'చిత్రాంగదతో జరిగిన స్పర్థలో ఓడి వంటికి మచ్చతెచ్చుకోకుండా ఉండుంటే పున్నమి చంద్రుడు ఈ కన్నెనవ్వుమోముతో

పోలచుకోవడానికి పనికొచ్చేవాడు కదా!' అని కవిగారిభావం. తాపీవారి పుణ్యమా అని చేమకూర వెంకట కవి పద్యంలోని శ్లేష ఉపమాలంకారంతో కలసి ఎలాద్విగుణీకృతమయిందో చూశారా!

దేవదాసు సినిమాలో'కుడి ఎడమయితే పొరపాటు లేదోయ్..ఓడిపోలేదోయ్' అని ఒక పాట ఉంది.రచయిత సీనియర్ సముద్రాల.చాలా పాప్యులరయింది ఆ పాట. చిత్రవిజయోత్సవం జరిగే ఏదో ఒక సందర్భంలో వేదికమీదనున్న సముద్రాల గారిని ఎవరో గట్టిగా నిలదీశార్ట' కుడి ఎడమవడమేంటండీ అసలు...అర్థమేమన్నా ఉందా?' అంటూ. 'నిజమే కదా'అనిపిస్తుంది తరచి చూసేవాళ్ళక్కూడా. కానీ రాసిన రచయితకు వివరణ ఇచ్చుకోవాల్సిన బాధ్యత ఉంది. సముద్రాల వారు లేచి నిలబడి సముద్రమంత గంభీరస్వరంతో ఇచ్చిన వివరణకు శ్రోతలు ఆగకుండా కరతాళధ్వనులు మొగించేశారని ఆరుద్ర ఒక సందర్భంలో రాశారు.ఇంతకీ ఆ మహాకవి ఇచ్చిన వివరణేంటీ?' అంటే 'కుడి ఎడమవడమంటే right left గా తిరగబద్దం కాదు.కుడిభుజంలాంటి మనిషి దూరంగా జరిగిపోవడం(ఎడంగా వెళ్ళి పోవడం)అని.ఇలాంటి వివరణలివ్వాలంటే కవికి బహుముఖప్రజ్ఞ ఉండాలి.

బహుముఖ ప్రజ్ఞకి విస్తృతగ్రంధపఠనం,విశ్లేషణాత్మకమైన పరిశీలనానుభవం అవసరం.

ఊహ,భావన, బుద్ధి కవికి సహజంగా సిద్ధించే వరాలైతే..బహుగ్రంథపఠనంతో విశ్లేషణ, పాఠకులతో నిరంతరసంపర్కం వల్ల సమాజధోరణి, విమర్శకులతో నిత్య సంభాషణవల్ల తప్పొప్పులు పసిగట్టగలిగే శక్తి మెరుగులు దిద్దుకుంటాయి.

తోచింది రాసేసినా..పదిమందిలోకి వదిలేసిన తరువాత..శల్యపరీక్షకు సిద్ధపడాలి.నిప్పులో కాలితేనే బంగారానికైనా మెరుగు. తనూ సమాజంలోని ఒక భాగమే కనక కావ్యమూ సమాజగతంగా సాగాలంటే కవి జనం మధ్యలో ఉండాలి.

విస్తృత పఠనం, విమర్శకు సహిష్ణుత అలవాటు చేసుకుంటేనే ఏ కవైనా ఎదిగేది. తనలోని విమర్శకుడు నిత్యచైతన్యంతో తొణికిసలాడుతుండాలంటే ఓపిక చేసుకుని తోటికవుల రచనలను విశ్లేషణాత్మక దృష్టితో చదవగలగాలి.చదువుతుండాలి.మంచి పసిగడితే మెచ్చుకునే సహృదయత పెంచుకోవాలి. ఒక్క ప్రశంసావాక్యం చాలు కవిని ఏనుగెక్కించడానికి. తప్పులుంటే సున్నితంగా విప్పిచెప్పి ముందుముందు మరింత మంచి సాహిత్యం సృజించడానికి తనవంతు సాయం చేయాలి.

అసూయాలు, అలకలు, అభాండాలు...అలౌకికులనుకునే కవులను శోభనివ్వవు.

విమర్శకుల పాత్ర ఎంత విశిష్టమైనదో కవులు గ్రహిస్తారని, కవుల కష్టం ఎంత విశేషమైనదో విమర్శకులు అర్థం చేసుకుంటారనే ఇంతగా ఇక్కడ వివరించే ప్రయత్నం చేసింది.

●●●




## *నలోపాఖ్యానం - ఇది నలచరిత్రమా?దమయంతీ చరిత్రమా?*

*- కౌటిల్య చౌదరి*

*(ప్రారంభం)*

***శ్లో: కర్కోటకస్య నాగస్య దమయంత్యా నలస్యచ,***
***ఋతుపర్ణస్య రాజర్షేః కీర్తనం కలినాశనం.***

*ఇది వ్యాసోక్తి.*

కర్కోటక నాగునీ, నలదమయంతులనీ, రాజర్షియైన ఋతుపర్ణుణ్ణీ స్మరించినంత మాత్రాన కలిదోషం సమసిపోతుందట! ఇక వారి చరిత్రని విపులంగా చదివేవారి ఛాయలకు కూడా కలిపురుషుడు రాడు కదా! ఈ నలచరిత్ర గురించి, నేను నా గురువుల ద్వారా నేర్చుకున్న విషయాలు, లోతైన మర్మాలు, నా బుద్ధికి భాసించిన విషయాలు విపులంగా అందిస్తాను. చదివినవారందరి కలిబాధలూ సమసిపోవుగాక!

చిన్నప్పుడు నా ఐదారేళ్ళ వయసులో నాన్న ముఖఃతా నేర్చుకున్నాను,భారతంలో ఉన్న నలోపాఖ్యానం. తర్వాత విశ్వనాథవారు అక్కడక్కడా నలదమయంతుల గురించి చెప్పిన విషయాలు.... అలా నా మనస్సులో ఈ నలదమయంతుల కథ అంటేనే ఒకరకమైన పులకలెత్తిస్తుంది. ప్రతి పద్యం ఒక అమృత గుళిక.

మనకి నలుడి కథ ప్రముఖంగా చెప్పబడ్డ చోట్లు సంస్కృతాంధ్రాల్లో నాలుగైదు చోట్ల ఉన్నాయి. అందులో ప్రముఖమైంది మహాభారతం, అరణ్యపర్వంలో ద్వితీయాశ్వాసంలో వచ్చే "నలోపాఖ్యానం". శివపురాణంలో కూడా మనకు ఈ కథ కనిపిస్తుంది! ఇక అచ్చం నలుడి కథతో రాసినవి రెండు కావ్యాలు, ఒకటి సంస్కృతాన శ్రీహర్షుడు రచించిన "నైషధం",దానికి మన శ్రీనాథుడి తెనుఁగుసేత, "శృంగార నైషధము"...రెండూ రెండే, ఒకదానికొకటి ఏ మాత్రం తీసిపోవు

కాని, మహాభారతంలో ఉన్న నలదమయంతులే ఈ దేశంలో ఉన్న ప్రతి వ్యక్తి మనసులో విహరించారంటే అతిశయోక్తి కాదేమో!

తెలుగు భారతంలో నన్నయ్యగారు నలచరిత్రని ఒక విచిత్రంగా మలిచారు.అసలు నలచరిత్రే ఒక అద్భుతమైన కథ.ఒక విచిత్రమైన కథ....

నలోపాఖ్యానము - నల+ఉపాఖ్యానము - ఉపాఖ్యానమంటే ఒక కథలో సందర్భానుసారంగా వచ్చే ఉపకథ.

ఇక్కడ మహాభారతంలో అరణ్యపర్వం, ద్వితీయాశ్వాసంలో బృహదశ్వుడనే ముని, "నాలా అడవులపాలై కష్టాలు పడ్డవాళ్ళెవరైనా ఉన్నారా?" అనడిగిన ధర్మరాజుకు చెప్పిన కథ ఇది. అంటే ప్రధాన కథ పాండవులది, ఉప కథ నలుడిదీ అన్నమాట! మనకు నలుడంటే

సాధారణంగా పాకశాస్త్ర ప్రవీణుడిగా, షట్చక్రవర్తులలో ఒకడిగా, ఆరుగురు అందగాళ్ళలో ఒకడిగా బాగా తెలుసు. కాని ఇక్కడ భారత కథలో వాటి ప్రస్తావన చాలా తక్కువగా వస్తుంది. అసలు కథ అంతా నల దమయంతులు పడ్డ కష్టాలగురించే!!!

ఇక ఈ నలచరిత్రాన్ని, పూర్వోత్తరభాగాలు రెండుగా విడగొట్టొచ్చు. "హంసదౌత్యం, స్వయంవరం, ద్యూతం, వనాగమనం" ఈ నాలుగు ఘట్టాలు పూర్వభాగం. రెండవభాగం, "నలదమయంతులిద్దరూ విడివడి ఉండటం, ఋతుపర్ణుడు, తిరిగి నలదమయంతుల పునస్సంధానం". అసలు ప్రధానకథ ఇదే. దమయంతి పడ్డ కష్టాలు, తిరిగి నలుణ్ణి కలుసుకోటానికి చేసిన ప్రయత్నాలు, ఆమె వివేకం, ఔన్నత్యం, పతిపట్ల అచంచలమైన ప్రేమ - ఇవన్నీ భారతీయ సంప్రదాయంలో దమయంతి పాత్రని శిఖరాగ్రాన కూర్చోబెట్టి ప్రతిఒక్కరికీ ఆదర్శప్రాయంగా మలిచాయి. నలచరిత్ర ప్రాభవానికి ఆయువుపట్లు ఇవే.....

ఇక కథలోకి ప్రవేశించి ఒక్కో విషయాన్ని చర్చించుకుంటూ మెల్లగా ముందుకు సాగుదాం.....

**శ్రీరమ్య ధర్మనిత్య**
**ప్రారంభవిభాసి రాజపరమేశ్వర ఘో**
**రారిమదకుంభికుంభ వి**
**దారణదారుణ కృపాణ దక్షిణహస్తా!**

{శ్రీరమ్య-రాజ్యలక్ష్మి చేతనొప్పిన వాడా!, ధర్మనిత్య - తన స్వధర్మాన్ని ఎడతెగక, ప్రారంభ - చేయుటచేత, విభాసి - ప్రకాశించువాడా, ఘోర+అరి - భయంకరులైన శత్రువులనే, మదకుంభి - మదపుటేనుగుల యొక్క, కుంభ - గండస్థలాలు(కుంభస్థలాలు), విదారణ - చీల్చునట్టి, దారుణ కృపాణ- భయంకరమైన ఖడ్గం, దక్షిణ హస్తా! - కుడిచేతియందు కలవాడా!}.

ఇది అరణ్యపర్వం, ద్వితీయాశ్వాసం ప్రారంభపద్యం. నన్నయ రాజరాజనరేంద్రుని కీర్తిస్తూ చెప్పిన పద్యం. నన్నయ్య తాను తెలుగుచేసిన మహాభారత భాగాన్ని తన మిత్రుడు, ప్రభువు ఐన రాజరాజుకు అంకితమిచ్చాడని సాధారణంగా అందరూ అనుకుంటారు. కాని, తెలుగులో రాయబడ్డ ఇతరకావ్యాల అవతారికలోలా భారతావతారికలో, రాజరాజు నన్నయ్యని కావ్యం రచించి తనకు అంకితమివ్వమని అడిగినట్టుగాని, నన్నయ్య దానికంగీకరించి కావ్యరచన ప్రారంభించినట్టుగాని, కృతిపతి వంశవర్ణనంగాని, షష్ఠ్యంతాలుగాని, కృతిపతికి అభ్యుదయ పరంపరకలిగేట్లు కావ్యాన్ని ఉపక్రమించటంగాని కనపడవు. **రాజరాజు తనని వ్యాసభారతం తెలుగులో రచించమని కోరాడని చెప్పాడేకాని, రాజరాజనరేంద్రుడు తన కృతికి పతి అని ఎక్కడా చెప్పలేదు.** కాని, ఆశ్వాసం మొదలు, చివర్లలో ఉన్న ఇలాంటి పద్యాలు అంకితమిచ్చాడనే భావం మనకు కలిగేలా చేస్తున్నాయి. పాల్కురికి సోమనాథుడు తన ద్విపదకావ్యాలకి తనకి ఇష్టమైన వాళ్ళని శ్రోతలుగా గ్రహించినట్టు, **నన్నయ్యకూడా రాజరాజుని శ్రోతగా గ్రహించి చెప్పాడేమో!**

ఇక కథా ప్రారంభం జరుగుతుంది....

అరణ్యవాసం చేస్తున్న ధర్మరాజు దగ్గరకు బృహదశ్వుడనే మహర్షి వస్తాడు. ధర్మరాజు ఆ మహర్షిని శ్రద్ధాభక్తులతో పూజించి, ఆయన విశ్రమించిన పిమ్మట ధర్మరాజు తన వనవాస కారణాన్ని, కౌరవుల దౌష్ట్యాన్ని ఆ మునికి తెలిపి ఇలా అడుగుతాడు.

క. "పుడమియు రాజ్యము బంధుల
విడిచి మృగావలులమ్ గలసి విపినంబులలోమ్
గడుకొని మాయట్టిడుములమ్

**బడిన నరులు గలరె యొరులు పరమ మునీంద్రా."**

{మృగావళుల - జంతువులతో, విపినంబులలోన్ - అడవులలో, కడుకొని - మిక్కిలి, మాయాట్లు - మా వలె, ఇడుములన్ - కష్టాలు, పడిన నరులు, ఒరులు - వేరెవరైనా ఉన్నారా?}

అది విని బృహదశ్వుడు,

క. **దైవసములైన యనుజుల**
**తో విప్రులతో రథాళితో వచ్చి యర**
**ణ్యావాసము సేసెదు ధర**
**ణీ వల్లభ నీవు ధర్మనిష్ఠిత బుద్ధిన్.**

{నువ్వు ధర్మబుద్ధివై దైవ సమానులైన నీ తమ్ముళ్ళతో,బ్రాహ్మణులతో, రథాలతో వచ్చి అరణ్యావాసం చేస్తున్నావు.}

క. **నరనుతుఁడు తొల్లి నలుఁడను**
**ధరణీశుమ్డు జూదమాడి తన విభవము పు**
**ష్కరుచేత నోటువడి యొ**
**క్కరుఁడ కరం బిడుమ పడఁడె కాననసీమన్.**

{తొల్లి - పూర్వము, నరనుతుడు - జనులచే పొగడబడిన, నలుడను, ధరణీశుడు - రాజు, జూదమాడి, తన విభవము - తన సంపదలు,రాజ్యము, పుష్కరుడనే వాడివల్ల, ఓటువడి - ఓడిపోయి, ఒక్కరుండ - ఒక్కడే, కాననసీమన్ - అడవులలో, కరంబు - మిక్కిలి, ఇడుమణపడడె - శ్రమ పడలేదా!}."

అని పలకగానే, ధర్మరాజు,"మహర్షీ! ఆ కథేమిటో నాకు వివరంగా చెప్పండి" అని కోరాడు. అప్పుడు బృహదశ్వుడు ఇలా చెప్పటం మొదలెట్టాడు...

"మహారాజా! నిషధదేశాధిపతి యైన వీరసేనుని కుమారుడు నలుడు. అనేక అక్షౌహిణీ సేనలకి రాజు, నిత్య ద్యూతప్రియుడు. తన అజేయమైన ప్రకాశంతో రాజులందర్నీ జయించి, బ్రాహ్మణ భక్తి కలవాడై, వేదాలే ప్రమాణంగా, ప్రజారంజకంగా రాజ్యం చేస్తూ ఉన్నాడు...

సీ. అట విదర్భాధిపుఁడైన భీముండను
వాఁడనపత్యుఁడై వ్రతము లోలి
సలుపుచు దమనుఁడన్ సన్మునిఁబత్నియుఁ
దానుపాసించి తద్వరమున
దమయంతి యను కూతు దమదాంతదమనుల
స్సుతులను బడసె విశ్రుతగుణాఢ్యుఁ
డందు గన్యారత్నమగు దమయంతి దా
నత్యంత కాంతిరూపాభిజాత్య
ఆ. విమలగుణ సమృద్ధి వెలుఁగుచు సురసిద్ధ

సాధ్యకన్యలట్టి సఖులు నూర్వు
రొలసి తన్నుఁ గొలుచుచుండగ మహినొప్పు
చుండె నధిక విభవయుక్తితోడ.

{అట - అక్కడ, విశ్రుత గుణాఢ్యుడు, విదర్భదేశాధిపతి ఐన భీముడు, అనపత్యుడై - సంతానము లేని వాడై, వ్రతములు, ఓలి - క్రమముగా, సలుపుచూ, దమనుడనే మునిని పత్నీ సమేతంగా కొలిచి, ఆయన వరం వల్ల దమయంతి అనే కూతుర్ని, దమదాంతుడు, దమనుడు అనే కొడుకుల్ని పొందాడు. వారిలో కన్యారత్నమైన దమయంతి, తాన్+అత్యంత, కాంతి రూపాభిజాత్య - తేజస్సు, రూపము, గొప్ప వంశమునందు పుట్టుట అనే, విమలగుణ సమృద్ధి - నిర్మలమైన గుణాల కలిమి చేత ప్రకాశిస్తూ, దేవతాకన్యలవంటి సఖులు తనను, ఒలసి - చుట్టి, సేవిస్తూఉండగా, అధిక విభవయుక్తితోడ - మిక్కిలి కలిమితో, మహిన్ ఒప్పుచుండెన్ - భూమిలో ప్రకాశిస్తూ ఉంది.}

ఇక్కడ మనకు కొంత విశ్లేషణకి తావొస్తుంది. అసలు ఇది నిజంగా నల చరిత్రమా? దమయంతీ చరిత్రమా? బృహదశ్వుడు నలచరిత్రమనే చెప్పటం మొదలెట్టాడు. కాని నన్నయ్యగారు దమయంతీ చరిత్రమని చెప్పకనే చెప్పారు. పైన మనం మొత్తం కథని రెండు భాగాలుగా అనుకున్నాం కదా. ప్రథమభాగమంతా దమయంతీ దేవికి  అంత ప్రాధాన్యంలేని కథ. అయినా కథ మొదలెడుతూనే నన్నయ్యగారు, ఈ కథలో ప్రాధాన్యం దమయంతీదేవిది కాని, నలుడిది కాదని చెప్పటానికి పద్య గద్యాల్ని ఉపయోగించాడు....

"నిషధేశ్వరుండైన వీరసేనుని కొడుకు నలుండనువాడు..........ప్రజాపాలనంబు సేయుచుండ" అని ఈ రీతిగా నలుని గురించి వచనంలో చెప్పాడు.నలుడికి ప్రాధాన్యం లేదు! మరి దమయంతి ప్రాధాన్యాన్ని పద్యంలో నిబంధించాడు. దీనిని బట్టే నన్నయ్యగారి దృష్టి తెలుసుకోవచ్చు...

రెండవభాగం మొదలు పెట్టినప్పట్నుంచి కథమొత్తం దమయంతీదేవి చుట్టూనే తిరుగుతుంది. నలుడు వెళ్ళి ఋతుపర్ణుడి దగ్గర ఉన్నాడంతే. రూపం మారాడు. ఇంతకు మించి అతడు పడ్డ కష్టాలేమీ లేవు. అతడు దమయంతిని కలుసుకోటానికి చేసిన ప్రయత్నాలేవీ లేవు! కష్టాలన్నీ పడ్డది దమయంతి, భర్తని కలుసుకోటానికి బహుప్రయత్నాలు చేసిందంతా దమయంతి. ఆమె పడ్డ కష్టాలిన్ని అని చెప్పటానికి లేదు. చివరికి నలుడు కలిదోషం పోగొట్టుకున్నాడంటే అది ఆమె చేసిన ప్రయత్న ఫలమే.......

కాబట్టి ఇది "దమయంతీ చరిత్ర"మే...............

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*






## నలోపాఖ్యానం - **హంసదౌత్యం**

### - **కౌటిల్య చౌదరి**

**నలచరిత్ర పూర్వభాగాన్ని** "హంసదౌత్య, స్వయంవర, ద్యూత, వనాగమనా"లనే నాల్గుభాగాలుగా విడగొట్టొచ్చని క్రిందటి పరిచయవ్యాసంలో చెప్పుకున్నాం కదా! ఈ వ్యాసంలో హంసదౌత్యం గురించి చెప్పుకుందాం. హంసదౌత్యమే నలకథకు ముఖ్యం. అసలు కథాగమనం ఇక్కడ నుంచే మొదలవుతుంది.

**క. నలుగుణములు దమయంతికి**
**నలునకు దమయంతిగుణగణంబులు జను లి**
**మ్ముల౦ బొగడుట నిరువురకును**
**వెలసె మనోభవవికార విభ్రమ మెదలన్.**

{నలుని గుణములు దమయంతికి, దమయంతి గుణగణాలు నలునికి, జనులు+ఇమ్ముల - ప్రజలు బాగా పొగడగా తెలిసి ఇద్దరికీ, వెలసె మనోభవవికార విభ్రమము+ఎదలన్ - మన్మథవికారచేష్ట మనసులో కలిగింది.}

ఒకరియందు ఒకరికి ప్రేమభావన, వారి సద్గుణాలు తెలుసుకోవటం వల్ల కలిగినదేకాని, ఊరికే పుట్టిన తొలిచూపు ప్రేమలు కావు. ఇల్లాంటి ప్రేమలు యుగాలైనా ఇలానే నిలబడిపోతాయి.

శ్రీహర్షుడు, నైషధంలో చాలా చమత్కారంగా వర్ణిస్తాడు దమయంతి మనోభావనలని, ఆమె ఉన్న స్థితిని ఈ ఘట్టంలో.... అందులో ఒక చిన్న ఉదాహరణ చెప్తాను. "నల" అన్నపేరుగల గడ్డిని గూర్చి అయినా చెలికత్తెలు మాట్లాడుకుంటే, అలానే చెవొగ్గి వింటూఉండేదట! దీనినే శ్రవ్యానురాగం అంటారు. ఇక్కడే ఇంకొకటి కూడా చెప్తాడు హర్షుడు. దమయంతీదేవి అంతకు మున్నెప్పుడూ నలుణ్ణి చూసి ఉండకపోయినా, స్వప్నంలో నలుణ్ణి దర్శించిదట! దీనిమీద చాలా పారమార్థికమైన వ్యాఖ్యానం చెప్పుకోవచ్చు. నిద్ర ధర్మాధర్మముల మహిమ వలన ముందెన్నడూ చూడని విషయాలను దృష్టిపథానికి తెస్తుంది. ఇక్కడ హర్షుడు నిద్రను నాయిక చెలికత్తెలా వర్ణిస్తాడు. నిద్ర దమయంతికి చెలికత్తె అయ్యి, నలుణ్ణి రహస్యంగా చూపించిందట! అద్భుతమైన భావన కదా! కుప్తంగా చెప్పుకుంటే, దమయంతి సర్వకాల సర్వావస్థలయందూ, నలుణ్ణే సదా మనసులో నిలుపుకుందన్నమాట.

ఇక, ఒక్కనాడు నలుండు దమయంతీగుణబద్ధ చేతస్కుండై మదనానలంబు సహింపనోపక - ఆ నలుడు అక్కడ ఎల్లా ఉన్నాడయ్యా, దమయంతి యొక్క గుణాలనే తాడు చేత ఈయన మనస్సు కట్టివేయబడి ఉందట. ఊరికే ఉండటం కాదు, మదనానలంబు సహింపనోపక - కాళ్ళు చేతులు కట్టేసి అగ్నిలో పడేసినట్టుందట ఆయనకు పాపం ఆ విరహబాధ! దాన్ని ఉపశమించుకోను ఏం చేశాడూ.. ప్రమదావనంబున నుండున్ - ఉద్యానవనంలో విహరిస్తున్నాడంట! అప్పుడేమయిందయ్యా అంటే..... అంత అంతరిక్ష శ్రీకాంతాహారావళియుంబోలె హంసావళి యవనీతలంబున కవతరించిన - అంతరిక్షమనే స్త్రీయొక్క మెడలోగల ముత్యాలపేరువలె ఉన్న ఒక హంసలగుంపు నేలకు అవతరించిందట! ఇది నన్నయ్య గారి ప్రజ్ఞ. సంస్కృత మూలంలో హంసలు జాతరూప పరిచ్ఛేదాలని విశేషణం ఉంది. నన్నయ్యగారు ఆ విశేషణాన్ని వదిలిపెట్టి, శ్రీకాంతా హారావళి అని రూపకంతో చక్కని ఉపమానాన్ని చెప్తారు. అది పాఠకుడి మనసుకి సృజనాత్మకతని పెంచే ఒక చక్కటి చమత్కారం. పక్షులు ఆకాశంలో అలావెళ్ళటం మామూలుగా అందరూ గమనించే ఉంటారు కదా! నన్నయ లోకజ్ఞత మనకు ఇలా చాలాచోట్ల దర్శనమిస్తుంది.

ఇక్కడ నన్నయ్యగారి ప్రతిభ ఆయన వాడిన రెండు శబ్దాల్లో కనపడుతుంది మనకు. అంతరిక్షమనే శబ్దం, అవతరించటమనే శబ్దం. అంతరిక్షమంటే వాయుప్రసారంగల ఆకాశం. 'వాయురంతరిక్షే సూర్యోదివి చంద్రమాదిక్షు నక్షత్రాణి స్వలోకే' అని వేదం. ఈ హంసలు వాయుమండలంనుండి దిగాయి. ఎక్కడనుంచి వచ్చాయో తెలీదు. వాయుమండలంలోనే ఉద్భవించాయేమో! అవతరించటమనే శబ్దం దిగటమనే సామాన్యార్థాన్నే చెపుతున్నా, 'భగవంతుడవతరించెను' అన్నచోటి అర్థాన్ని కొడుతోంది. కాబట్టి వాయువు తనువుగా గల దైవం అవతరించిందన్న స్ఫూర్తి ఈ శబ్దాలలో ఉంది. ఆ హంసలో ఉన్న దైవీ భావన గురించి, నన్నయ్యగారి ఉపజ్ఞ గురించి మళ్ళా చెప్పుకుందాం.

అప్పుడు,

> **వీరసేనసుతుండు వీరుండు హంసల**
> **నడబెడంగుమ్ జూచి నగుచు వాని**
> **నెగిచి యెగిచి యందు నెగయకుండఁగ నొక్క**
> **హంసఁ బట్టుకొనియె నతిరయమున.**

నలుడు, 'హంసల నడబెడంగుమ్ జూచి నగుచు' - ఆ హంసలు నేలకు దిగి వయ్యారంగా నడుస్తున్నాయి కాబోలు! వాటి నడకలో వయ్యారం, సొబగు చూసి నవ్వుకున్నాడట! ఎందుకు నవ్వాడూ? అవి స్త్రీలవలె నడుస్తున్నాయి. ఆ సొబగు అల్లా ఉంది. దమయంతీగత బుద్ధి కదా మరి, అల్లానే అనిపిస్తుంది. 'వాని నెగిచి యెగిచి'- అసలే ప్రియావిరహంతో వైకల్యంచెందిన మనసుతో ఉన్నాడాయెను. వాటిని చూడగానే ఎక్కడలేని కుతూహలం కలిగింది. వాటిని తరిమాడట, క్రీడా వినోదంగా... 'యందు నెగయకుండఁగ నొక్క హంసఁ బట్టుకొనియె నతిరయమున.' - అలా ఎగరగొట్టినా, వాటిలో ఒక హంస ఎగరలేదట! ఆ ఎగరకుండా ఉన్న హంసను త్వరగా పట్టుకొన్నాడు. ఆ హంస ఎగరనేలేదు, కాని తొందరగా పట్టుకొన్నాడు. ఎందుకూ! ఎగిరిపోతుందేమోనని భయం... కాని, ఆ హంస యితడు పట్టుకోవాలనే ఎగ్రజలేదు. మరి, అవతరించిందే అందుకాయెను.

నైషధంలో హర్షుడు, ఈ హంసను అద్భుతంగా వర్ణిస్తాడు. కాంచనమయ పక్షాలతో ఉందట! మొత్తం బంగారు రంగులో మెరిసిపోతున్న దానిని చూసి ఈయన కుతూహలంతో పట్టుకొన్నాడు. ఈ సన్నివేశంలో మనకి నాయక లక్షణాలు కొంచెం తప్పినట్టు కనిపిస్తుంది. నన్నయ్యగారి నలుడు ధీరుడు. ఆ లక్షణాలకి విరుద్ధంగా హంసని పట్టుకోవాలన్న చపలం, విరహమూలంగా కలిగినట్టు నన్నయ్యగారు చెప్తారు. శ్రీహర్షుని నలుడు ధీరోదాత్తుడు. ఇక్కడా చపలత్వం నాయక లక్షణానికి విరుద్ధమే! కాని, హర్షుడు దానికి చాలా మంచి వివరణ ఇసాడు.

**శ్లో. అవశ్యభవ్యేష్వనవగ్రహ గ్రహా**

**యయా దిశా ధావతి వేధసః స్పృహా |**

**తృణేన వాత్యేవ తయానుగమ్యతే**

**జనస్య చిత్తేన భృశావశాత్మనా||**

గడ్డిపోచ గాలివెంటబడి పోయినట్టు, పరాధీనమైన మనిషి చిత్తంకూడా జరగవలసిన విషయాలలో ఈశ్వరేచ్ఛననుసరించే వెళుతుందని భావం. కాబట్టి నలమహారాజెంత ధీరోదాత్తుడైనా, భగవదిచ్ఛవల్ల హంసను పట్టుకోవటానికి అల్పవిషయ చాపల్యం కలగక తప్పింది కాదు. అది దైవాయత్తం. ఇందులో ఇంకో నిగూఢార్థంకూడా ఉందని విశ్వనాథవారు అంటారు. "అసలు నైషధమంతా సర్వవిద్యారహస్యాలకి తావు. శ్రీహర్షుడు శ్రీవిద్యోపాసకుడు. చింతామణీ మంత్రోపాసన ఫలితంగా నైషధాన్ని రాస్తున్నానని ఆయనే ప్రథమ సర్గ చివర చెప్పుకున్నాడు.' దమయంతి అచ్చమైన శ్రీవిద్యా స్వరూపం. పరా రూపం. నలుడు సాధకుడికి చిహ్నం. ఇక హంస ఉన్నదే, అదే అసలు కీలకమైన వస్తువు. సాధకుడు పట్టుకోవలసిన వస్తువు, కుండలినీ శక్తి. హంస కుండలినీ స్వరూపం." దాన్ని పట్టుకొని, ఆ హంస ద్వారా ఆ పరదేవతను చేరుకోవాలంటే మరి ఈశ్వరేచ్ఛ ఉండాల్సిందేగా మరి! ఈ హంస దౌత్యానికి వెళ్ళేప్పుడు అది ప్రయాణించిన మార్గం, దాని వర్ణన; తర్వాత కుండిన నగర వర్ణన; దమయంతి వర్ణన నిశితంగా పరిశీలిస్తే కుండలినీ విద్యా రహస్యాలన్నీ బోధపడతాయి......

సరే! నలుడు ఆ హంసను పట్టుకున్నాడు. అప్పుడేమయింది?

**దాని విడిచిపోవమ్గా నోపకఱచుచు**

**నంతరిక్షమునను హంసలెల్లన్**

**బిండు గట్టి తిరుగుచుండె వాతోద్ధత**

**శారదాభ్ర శకలచయముమ్ బోలె.**

{దాని విడిచిపోవగాన్, ఓపక+అఱచుచూ, అంతరిక్షంలో హంసలన్నీ, వాతోద్ధూత - గాలిచే విడగొట్టబడిన, శారద+ అభ్ర - శరత్కాల మేఘంయొక్క, శకలచయము వోలె - ముక్కల సమూహంలా, పిండు కట్టి తిరుగుచుండె - గుంపు కట్టి తిరుగుతున్నాయంట!}

ఇది నన్నయ్యగారి హృద్యమైన ఉపమాలంకారం. ఈ ఉపమానం వట్టి హంసల ఆకారాన్నే కాకుండా, ఒకే మేఘంయొక్క ముక్కలు అనటంలో వాటి సంఘీభావాన్ని, అక్కడే తిరుగాడుతూ ఉండటంలో వాటి మనస్తత్వాన్ని చక్కగా వర్ణిస్తోంది. ఇదికూడా నన్నయ్యగారి లోకజ్ఞతకి తార్కాణం. గుంపులో ఒకపక్షికి ఆపద కలిగితే మిగతాపక్షులు ఇలానే చేస్తాయి.

నైషధంలో ఈ సందర్భంలో,

**పతత్రిణా తద్రుచిరేణ వంచితం**

**శ్రియః ప్రయాంత్యాః ప్రవిహాయ పల్వలమ్|**

**చలత్పదాంభోరుహ నూపురోపమా**

**చుకూజ కూలే కలహంసమండలీ ||**

**న వాసయోగ్యా వసుధేయమీదృశ**

**స్త్వమంగ యస్యాః పతిరుజ్ఘితః స్థితిః|**

**ఇతి ప్రహాయ క్షితిమాశ్రితా నభః**

**ఖగాస్తమాచుక్రుశురారవైః ఖలు ||**

అనే శ్లోకాలున్నాయి. మల్లినాథ సూరి దీనికి వ్యాఖ్యానం రాస్తూ, "స్వయూథ భ్రంశే కూజనం పక్షిణా స్వభావః" అని వివరిస్తాడు. మల్లినాథసూరి, నన్నయకు తర్వాతి వాడవటంవల్ల నన్నయ్య ఈ వ్యాఖ్యానం చూసి ఉండకపోయినా హర్షుని శ్లోకాన్ని అనుసరించి ఈ పద్యం వ్రాసుంటాడని అనుకోవచ్చు.

అప్పుడా హంస, నలుడు తనకు అపకారం చేస్తాడేమోనని భయపడిందట. భయపడి మానవ భాషలో ఇలా అందట. {దానికి ఇన్ని భాషలు ఎలా వచ్చునో మరి! నైషధంలో ఈ హంస తాను బ్రహ్మవాహనమైన హంసయొక్క వంశముదాననని చెప్పుకుంటుంది. మరి అలాంటప్పుడు మానవభాష తెలియటం దానికొక లెఖ్ఖా!}

"యేను నీకుం బ్రియంబు సేసెద నీ హృదయేశ్వరియైన దమయంతి పాలికింబోయి నీ గుణంబులు దానికి వర్ణించి చెప్పి యక్కన్య యన్యుల నపేక్షించక నీయందు బద్ధానురాగ యగునట్లు చేసెద."

ఈ హంసకు, దమయంతి నలుని హృదయేశ్వరి అని ఎలా తెలిసిందో మరి. సరే, తెలిసింది అనుకుందాం. అది విని నలుడేం చేశాడూ! నీకెల్లా తెలుసూ అని విడ్డూరపడి దాన్ని ఎదురుప్రశ్న వెయ్యాలా, వద్దా! అబ్బే! అలా చెయ్యలా ఆయన...

**అనిన విని హంసవచనము**

**దన హృదయంబునకు నమృతధారాపాతం**

**బును బోలెనైన నృపనం**

**దనుఁడనురక్తుఁడయి విడిచెఁదడయక దానిన్.**

ప్రశ్నించలేదు సరికదా, ఆ పలుకులు అమృతధారాపాతంలా ఉన్నాయట. అది అంత అందమైన పలుకులతో చెప్పిందో లేక తన విరహంతీరే తావు కనపడిందనోమరి, అనురక్తుడయి విడిచాడంట. అంటే, అనురాగం పొందాడని ఒక అర్థం, అనుసరించి రక్తుడయ్యాడన్న మరో అర్థం రెండూ చెప్పుకోవచ్చు.

అప్పుడా హంస, తన గుంపుతోకలిసి విదర్భకు వెళ్ళి అక్కడ, దమయంతి విహరిస్తున్న వనంలో దిగి విహరిస్తోంది. దమయంతి చెలికత్తెలతో విహరిస్తూ ఈ హంసల్ని చూచింది. ఇక అందరూ వీటిని పట్టుకోను వీటి వెంటబడ్డారు. ఒక్కొకళ్ళూ ఒక్కొక్క హంసనీ పట్టుకొన్నారు. నలుడితో విడవబడ్డ హంస ఎవరికీ దొరకట్లేదు. దమయంతి రావాలి, పట్టుకోవాలి. చివరికి దమయంతి చేతికే చిక్కిందట! మరి ఇంతదూరం వచ్చిందే అందుకాయెను! ఇక్కడ నన్నయగారు "నలునిచేత విడువంగబడిన హంస చెలువముగ నందు దమయంతి చేత బట్టువడియె", అంటారు. ఇందులో "చెలువముగ" అన్న పదం వాడుకను గూర్చి విశ్వనాథవారు ఒక మంచి వ్యాఖ్యానం చెప్తారు. "ఈ శబ్దము వృథా ప్రయుక్తంగా కనిపించవచ్చు. కాని కాదు. మనం మాటాడుకొనేప్పుడు "చమత్కారంగా ఇల్లా జరిగిందిరా" అంటాం. ఇదికూడా అలాంటిదే! వట్టి వాక్యాలంకారమే కాకుండా మధురార్థ సంఘటనా సామర్థ్యంకలది కూడా. అన్ని హంసలు, అంతమంది సౌందర్యవతులు. వాటిని పట్టుకోను వీళ్ళంతా పరిగెడుతున్నారు. అవి ఎగిరిపోతున్నఇ. అందమైన పూలతోట. ఆ అందం చెప్పటానికసలు వీలు పడుతుందా! "

అప్పుడా హంస దమయంతితో మనుష్యభాషలో ఇల్లా అంది. "నీ హృదయేశ్వరుండైన నలునొద్దనుండి వచ్చితి." నలుడే దమయంతికి కూడా హృదయేశ్వరుడని ముందే తెలుసునులా ఉంది ఈ హంసకి. ఇంకా ఏమంది? "అపారపారావార పర్యంత మహీతలంబునందు నా చూడని రాజులెవ్వరు లేరు, సర్వగుణ సౌందర్యంబుల నెవ్వరు నలుం బోలరు"- సముద్రాంతాలవఱకు ఉన్న ఈ భూమండలమంతటా ఉన్న రాజులలో నాకు తెలియనివారు లేరు. వాళ్ళెవ్వరూ కూడ గుణంలోకాని, రూపంలోకాని నలునికి సాటి రాలేరు.

**నీవు నలునకు బేర్మితో దేవివైనమ్**
**గాక నీసముజ్జ్వలరూపకాంతి విభవ**
**నిత్య సౌభాగ్యభాగ్యాభిజాత్య భద్ర**
**లక్షణావళు లవి సఫలంబులగునె.**

నువ్వు నలుడికి భార్యవైతేనేగాని నీ రూపలావణ్యాలు, నీ సౌభాగ్యము, నీ అదృష్టం, నీ వంశము అన్నీ సార్థకతనొందవు. కనుక "నీవు నారీరత్నంబవు అతండు పురుషరత్నంబు మీ యిద్దర సమాగమంబన్యోన్య శోభాకరంబగును" అని పలికింది.

అది విన్న దమయంతి ఆనందంతో, "ఆ మహారాజు గుణగణాలు నాకు చెప్పినట్లే, దయతో నన్ను కూడా ఆ రాజుకు ఎఱిగించు" అని పలికింది. అంత ఆ హంస నిషధదేశానికి ఎగిరివెళ్ళి, నలునికి దమయంతి గుణరూప వైభవాన్ని వర్ణించింది. వాళ్ళిద్దరి మనసుల్లో పరస్పరానురాగం ఇంకా పెంపొందటానికి కారణమయ్యింది......

ఇదీ హంసదౌత్యం. ఇక్కడ విశ్వనాథవారి వల్ల నేను తెలుసుకొన్న మరికొన్ని ముఖ్యమైన విషయాలు చెప్తాను. ఇవే నలచరిత్రలో అసలు అంతరార్థాలు. అసలీ హంస యెవరు? దీనికీ మాట్లాడే శక్తి ఎక్కడనుండి వచ్చింది? హర్షుడు బ్రహ్మవాహన వంశజాతమని కల్పన చేశాడు సరే! నన్నయ్యగారి ఉద్దేశమేమిటి? తన ప్రేమ రహస్యం ఆ హంసకు తెలియటాన్ని, నిశ్శంకంగా నలుడెలా స్వీకరించాడు? ఈ హంస "అవతరించింది". ఇది దమయంతికి నలుడికి సంగమకారణ దూత. అంటే సంగమానికి కారణమైన దూత అని అర్థం. ఈ హంస లేకపోతే వాళ్ళ సంగమం జరగదా? వాళ్ళదివరికే అన్యోన్య లగ్నమనస్కులు. ఈ దౌత్యంవల్ల దమయంతి అధిక విరహతప్త అవ్వటం, భీముడు స్వయంవరం చాటించటం తర్వాత జరిగిన కథ నిజమే! అంత మాత్రానికే సంగమకారణ దూత అనాలా? ఇంకేవిధంగా చెప్పకూడదు? ఇలా ఆలోచించుకుని చూస్తే విశ్లేషణ మొదలవుతుంది. ఇక్కడ "కారణ"శబ్దమే చమత్కారంగా ఉంది. కారణజన్ముడు మొదలైన శబ్దాలున్నాయి కదా! అలానే, వీళ్ళ సంగమమే కారణంగా గల దూత అన్నమాట! ఈ హంస మఱింకెక్కడా లేదు. ఈ ఒక్క కారణం కోసమే ఈ హంస భూమికి అవతరించింది. ఇతర కావ్యాలలో హంసలు, చిలకలు మొదలైన పక్షులు మాటాడితే పంచతంత్రంలో పక్షులు మాట్లాడినట్టు.

ఇక్కడ అలా కాదు. ఈ హంస నలదమయంతుల సంగమార్థమైన కారణజన్మకలది. అంత కారణజన్మమెత్తింది ఎవరో తెలుసునా, శివుడు! అవును, ఈ హంస సాక్షాత్తూ పరమశివుడు. ఇది శివపురాణంలోని కథ. యుగాంతరంలో, ఆహూకులనే భిల్లదంపతులు చేసిన తపస్సుకు మెచ్చి, శివుడు ప్రత్యక్షమై, "మీఱిద్దరు నలదమయంతులుగా జన్మిస్తారు. మీకు నేను దూతనవుతాను." అని మహాకరుణతో అనుగ్రహించిన వరం. ఆ కథ ఇక్కడ అన్వయించుకుంటే నన్నయ్యగారి సముద్రంలాంటి నిగూఢమైన రచన మన మనసులకి అర్థమవుతుంది. రత్నాలవంటి విషయాలు ఆ సముద్ర గర్భంలో వెతుక్కోవచ్చు.

మరి నన్నయ్యగారు తాను "నానా పురాణ విజ్ఞాన నిరతుడన" ని చెప్పుకోవటం స్వోత్కర్షకాదు. మనంకూడా చదివి, ఆలోచించి సరైన విధంగా అన్వయించుకుని, విజ్ఞాన నిరతులమవుతామని........

●●● *(కొనసాగింపు వచ్చేసంచికలో)*

# వ్యాస కౌముది



## నలోపాఖ్యానం

### దూత్యసిద్ధి - దమయంతీ విరహము - స్వయంవర ప్రకటనము

- **కౌటిల్య చౌదరి**

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**హంసదౌత్యం ముగిసింది.** తిరిగివచ్చిన హంస నలుడికి దమయంతి గుణరూపవైభవాన్ని వర్ణించి చెప్పింది. ఊరికే వర్ణిస్తే ఏం లాభం? అసలు వెళ్ళిన పని అయిందా లేదా! అంటే దౌత్యసిద్ధి జరిగినదా, లేదా! ఆ విషయం మనకు నన్నయ్యగారు అంత విపులంగా చెప్పరు. నన్నయ్యగారి దమయంతి, "నాపై దయతో ఆ రాజు గుణగణాలు నాకు చెప్పినట్టు నాగురించి కూడా ఆయనకు చెప్పు" అని మాత్రమే అడుగుతుంది. కాస్త గుంభనగా ఉంటుందన్నమాట!

అయితే, హర్షుడి దమయంతి, హంస మనకి ఇంకాస్త విపులంగా కనిపిస్తారు. నన్నయ్యగారి దమయంతి కావ్యనాయిక కాదు. మధ్యలో వచ్చిన పిట్టకథలో పాత్ర. కాబట్టి అంతగా విశదీకరించటానికి తావు తక్కువ. మరి హర్షుడికో ఉన్న ఇరవైరెండు సర్గల కావ్యం మొత్తం ఆ దమయంతి కోసమేనాయె! చక్కగా వర్ణిస్తాడు కావ్యనాయికా లక్షణాలతో.

ఇక హర్షుడి హంస ఎవరు? భారతీదేవి ముంజేతి పలుకు చిలకకు సబ్రహ్మచారి ఆయెను. బ్రహ్మవాహనమైన హంస వంశములోనిదాయెను. నిత్యం వాణీహిరణ్యగర్భుల సన్నిధానవర్తిని ఆయె. మరి అల్లాంటి దూత చేసిన దౌత్యం సిద్ధించకుండా ఉంటుందా!

దూతలు మూడురకాలని విశ్వనాథ కవిరాజులు "సాహిత్యదర్పణం"లో పేర్కొంటారు.

"నిసృష్టార్థో మితార్థశ్చ తథా సందేశహారకః
కార్యప్రేష్యస్త్రిధా దూతో దూత్యశ్చాపి తథావిధాః.

ఉభయోర్భావమున్నీయ స్వయం వదతిచోత్తరం
సుశ్లిష్టం కురుతే కార్యం నిసృష్టార్థస్తు సస్మృతః.

మితార్థభాషీ కార్యస్య సిద్ధికారీ మితార్థకః,
యావద్భాషిత సందేశహారకః సందేశహారః.

ఇక్కడ హర్షుడి హంస, మామూలు దూతికలా దమయంతి వద్దకు వెళ్ళిపోయి, "నలుడు నీయందు బద్ధానురాగుడ"ని చెప్పదు. ఆమె ఏకాంతంగా ఉండేటు చెయ్యటానికి చెలుల నుంచి దూరంగా తీసుకెళుతుంది. ముందు తనగురించి తాను చెప్పుకుంటుంది. తాను

బ్రహ్మవాహనమైన హంస వంశస్థురాలనని చెప్పి, ఒక విలాసమైన మాట చెప్తూంది. "అస్మాదృశాం చాటు రసామృతాని స్వర్లోకేతర దుర్లభాని" అని. అంటే, తాను చెప్పే శృంగార రసమొలికించే చమత్కారోక్తులు సురలోకవాసులకు తప్ప అన్యులకు దుర్లభం అని ఛ్రెజింది. అని చెప్పి ఊరుకోకుండా, ఫలానా-ఫలానా నలమహారాజున్నాడు, ఆయన అంతటివాడు, ఇంతటివాడు అని నలుని గుణగణాలన్నీ వర్ణిస్తుంది. ఆయనకు నా బంగారు రెక్కలతో వీస్తూ, చక్కటి కబుర్లు చెపుతుంటానంటుంది. నలుడి గురించి చాలా అతిశయోక్తి అలంకారాలతో వర్ణిస్తుంది, ఔచిత్యభంగం లేకుండా.{రంభ నలుడిని పొందలేక "నల" అన్న పేరు ఉంది కనుక "నలకూబరుడి"ని వివాహమాడి తృప్తిపడిందట!} ఇలా అన్నీచెప్పి, చివరికి ఏమీ తెలియనిదానివలె,"సరే! ఇవన్నీ అప్రస్తుత ప్రసంగాలనుకో. నన్ను పట్టుకోను ఇంత శ్రమపడ్డావు, నీకు ఏదన్నా సహాయం చేస్తాను, ఏం కావాలో చెప్పు" అంటుంది. అప్పుడు దమయంతి చెప్పిన మాటలను బట్టి ఆమె నలునియందు బద్ధానురాగయని ధ్రువీకరించుకుని, ఆమె అనురాగాన్ని ఇంకా దృఢపరచటానికి, ఆమెను సంతుష్టి పరచడానికి, నలుడుకూడా ఆమెయందు ప్రేముడి కలవాడని, ఆమెనే నిత్యం స్మరిస్తున్నాడని చెపుతుంది. దమయంతి నలుణ్ణి కాదంటే, అది నలుడికి అవమానమని ముందే అతని ప్రేమని దమయంతితో చెప్పలేదు. ఇది రాయబారంలో హంసకు గల నిపుణతని చూపిస్తుంది. కాబట్టి ఈ హంస "నిసృష్టార్థ దూత" అనే ఉత్తమదూత అని విశదమవుతుంది.

ఆ హంస వచ్చి నలుడితో దమయంతి గుణగణాలనీ, అందచందాలనీ, ఆమె చెప్పిన విషయాలన్నిటినీ చక్కగా వర్ణించి ఛ్రెజింది. ఇంతకీ దమయంతి ఏం చెప్పిందో దాన్నిబట్టి కదా, దూత్యసిద్ధి జరిగిందని అనుకోవాలి. మరి ఆమె ఏం చెప్పింది? "నలుడే నా ప్రాణపతి. ఆయనయందే మనసావాచా బద్ధానురాగనై ఉన్నాను. ఆయన్ని తక్క అన్యులెవరినీ వివాహమాడను. కాని పక్షంలో మరణమే నాకు శరణ్యం. ఆ అష్టదిక్పాలకులు, దేవాదులు వచ్చినా నా నిర్ణయం మారదు" అంటుంది. అదన్నమాట సంగతి. హంస తనపనిని తాను చక్కగా నెరవేర్చింది. నలదమయంతులిరువురికి ఒకరిమీద ఒకరికి ప్రేమ ఇనుమడించేట్లు చేసింది.

కాని, నన్నయ్యగారి హంస ఇలా ఉండదు. తాను సాక్షాత్తూ పరమేశ్వరుడాయె. ఇద్దరికీ ముందే చెప్తూంది. మీ ఇద్దరి గురించీ నాకు తెలుసును, మీకు నేను రాయబారం చేస్తాను అని. నర్మభాషణాలు, శృంగారరసపూరిత చాటూక్తులు ఉండవు. అందుకే ఈయనది "నలచరిత్రం" అయింది, ఆయనది "శృంగార నైషధం" అయింది.

ఈ సన్నివేశంలో శ్రీనాథుడు తన శృంగారనైషధంలో ఒక చిన్న కల్పన చేస్తాడు. హంస దమయంతి చెప్పిన విషయాలేమీ చెప్పకుండా "కార్యసిద్ధి జరిగింది" అని కుప్తంగా చెప్పి తనకు బ్రహ్మసేవకు వేళైందని, వెళ్ళాలని చెప్పి ఎగిరిపోతుంది......

తర్వాత ఏం జరిగింది?

"నలదమయంతు లిద్దఱు మనః ప్రభవానల బాధ్యమానలై
సలిపిరి దీర్ఘవాసరనిశల్ విలస న్నవనందనమ్ములన్
నలిన దళంబులన్ మృదు మృణాళములన్ ఘనసార పాంసులం
దలిరులు శయ్యలన్ సలిలధారలఁ జందన చారు చర్చలన్."

{మనః ప్రభవుడు - మన్మథుడు ; అనలము - అగ్ని ; నళిన దళంబులు - తామరాకులు ; మృణాలములు - తామర తూడులు ; ఘనసారపాంసులు - కర్పూరధూళులు}

లక్ష్మీనారాయణులు, సీతారాములు, రుక్మిణీకృష్ణులు - ఇలా మామూలుగా స్త్రీపేరు మొదట ఉంటుంది. ఇక్కడ నలదమయంతులు. పురుషుడి పేరు ముందున్నది. తక్కువ అక్షరములుగల శబ్దము ముందురావాలని ద్వంద్వసమాస నియమము. ఒక్కోసారి ఈ నియమాన్ని

పట్టించుకోరనుకోండి..:).. అది పక్కనపెడితే, పురుషుడి పేరు ముందు, స్త్రీ పేరు చివర. సమాసం చివర ఉన్నది స్త్రీలింగశబ్దము. అందుచేత "బాధ్యమానలై" అన్న సమాసం కూడా స్త్రీలింగాంతశబ్దంగానే వాడబడింది.

దీర్ఘవాసర నిశలు సలిపిరట! అంటే రేయింబవళ్ళు నిడివి పెరిగినట్లనిపించి చాలా కష్టంగా గడిపారట! ఇక్కడ "సలిపిరి" అన్న శబ్దం కష్టంగా గడిపారన్న భావణ్కెలిరకంగా ఉంది. మరి అంత కష్టం ఎందుకొచ్చిందట! మనఃప్రభవానల బాధ్యమానలై - వాడి దుంపతెగ, వాడు మన మనస్సులోనే పుడతాడు, మనల్నే కష్టపెడతాడు. ఎంత దుష్టుడో కదా మన్మథుడు! ఆ మన్మథుడు పెట్టే వేడిబాధలకు తట్టుకోలేక వీళ్ళిద్దరూ ఏం చేశారూ? అప్పుడే కొత్తగా పెరిగిన పూదోటలలో, మెత్తటి తామరాకులు, తూండ్లు పరిచి, మంచి కర్పూరప్పొడులు చల్లి ఏర్పరచిన శయ్యలమీద పడుకుని చందనపు మైపూతలు పూసుకుంటూ భారంగా గడిపారట! వీటన్నిటినీ శిశిరోపచారాలంటారు. తాపాన్ని తగ్గిస్తాయట!

ఒక గొప్పకవి శైలి వానికి ప్రత్యేకంగా ఉంటుంది. ఆ శైలియొక్క గొప్పదనమంతా కొన్ని పద్యాలల్లో మరీ కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. మదమాతంగ తురంగ కాంచన, కురువృద్ధుల్ గురువృద్ధబాంధవులు - మొదలైన పద్యాలల్లో నన్నయ్యగారి రచనలో మాధుర్యముంటుంది కాని, మొదటిదానిలో ఉదాత్తత, రెండవదానిలో రౌద్రరసము కనిపిస్తాయి. కాని ఈ పద్యంలో సౌకుమార్యము ప్రధానంగా ఉంది. ఒత్తక్షరాలు తక్కువ. ఒక రమణీయమైన పద్యం.

ఇల్లా ఇద్దరూ ఒకరి గురించి ఒకరు ఆలోచిస్తూ గడుపుతున్నారట! అప్పుడు ఆ దమయంతీదేవి ఎల్లా ఉందయ్యా అంటే, అంతఃకరణ సంతత మనోజాత సంతాప వివర్ణవదనయై - లోపల పుట్టిన తాపానికి ముఖం పాలిపోయి ఉందట! అల్లా ఉన్న దమయంతిని చూచి ఆమె చెలికత్తెలంతా గుడుసుళ్ళు పడ్డారు, మడమలు తొక్కుకున్నారు. ఏం చేద్దామంటే ఏం చేద్దామనుకున్నారు. చివరికి నిశ్చయించుకుని దమయంతి తండ్రియైన ఆ భీమమహారాజు వద్దకు వెళ్ళి ఇలా విన్నవిస్తున్నారు....

"కలహంస పలికినపలుకులు గణియించు
వడి దానిపోయినవలన చూచుఁ
బలుకదు సఖులతో లలితాంగి మిన్నక
యలయుచు నుండుఁదా ననుదినంబు
చారువిభూషణాహార విహారశ
య్యాసనభోగంబులందు విముఖ
యై రేయుఁబగలు నిద్రయు నెప్పుడెఱుఁగక
దమయంతి నలుఁడను ధరణినాథు

నంద బుద్ధి నిలిపి కందర్పబాధిత
యగుచు నున్న యది ధరాధినాథ
ధరణిపతుల నౌరుల నురుగుణాఢ్యుల
వినవొల్ల దెంత విభవ యుక్తులైన."

" మహారాజా! ఒక హంస వచ్చి దమయంతీదేవితో ఏవో మాటలు చెప్పి వెళ్ళింది. అప్పటి నుంచీ ఆ హంస పలుకులే ఎప్పుడూ తలుచుకుంటూ ఉన్నది. ఆ హంస వెళ్ళినవైపే చూస్తూ కూర్చుంటున్నది. సఖులమైన మాతో మాటలాడదు. సొగసుగా ఉండే సొమ్ములు

ధరించదు. మంచి భోజనము చేయదు. విహారాదులయందు నిరాసక్త. వేడుకైన ఆటలాడదు. సరిగా మెత్తని పాన్పులపై పవళించదు. అన్ని భోగాలందూ విముఖంగానే ఉంటోంది. రాత్రింబవళ్ళు నిద్రలేక, నలుడనే మహారాజుమీద చిత్తము నిలిపి, ఆయనయందు బద్ధానురాగయై మరుని బాధ పడుతోంది. ఇతరులైన రాజులెంత గొప్పవారైనా వారిగురించి వినటానికి కూడా యిచ్చగించుట లేదు."

ఎంతమంచి చెలులో కదా! విషయాన్ని చక్కగా గ్రహించి, నేర్పుగా దమయంతి మనసుని తండ్రికి ఎఱింగించారు. ఆయన మారు మాటాడే వీల్లేకుండా, దమయంతి నలుణ్ణి తప్ప వేరొకరిని వివాహమాడదని రూఢి చేసి చెప్పారు. నన్నయ్యగారు ప్రతి పాత్రనీ తీర్చే తీర్పు ఇలానే ఉంటుంది. ఔచిత్యం ఎక్కడా చెడకుండా చిన్నపాత్రలు కూడా ప్రధానపాత్రనే పోషిస్తాయి.

ఇక్కడ నన్నయ్య నలదమయంతులిద్దరి విరహావస్థనీ వర్ణిస్తాడు. కాని హర్షుడు ఒక సర్గ మొత్తం దమయంతీ విరహావస్థను మాత్రమే వర్ణిస్తాడు. నలుడి గురించి ముందే హంసతో చెప్పిస్తాడు. కాబట్టి అతని విరహావస్థను భావించి దమయంతి మరింత విరహతప్త అయినదని అనుకోవచ్చు.

హర్షుడు వర్ణించిన దమయంతీ విరహవర్ణన సర్వ శృంగార కావ్యాలలోకీ తలమానికం. అంతగా ఒక రాచపడుచు పడే విరహవేదన వర్ణించటం అన్యులకి సాధ్యంకాదేమో! అందుకే అంతటి శ్రీనాథుడు కూడా హర్షుడి వర్ణనలని తన కావ్యమంతటా యథాతథంగా రాసేస్తాడు. సొంతకల్పన, కవిత్వం చాలా తక్కువ. చూస్తుంటే అనువాదంలానే ఉంటుంది.

ఉదాహరణకు,

"అథ నలస్య గుణం గుణమాత్మభూః
సురభి తస్య యశః కుసుమం ధనుః.
శ్రుతి పథోపగతం సుమనస్తయా
తమిషుమాశు విధాయ జిగాయతాం."
(శృం.నై - చతుర్థ - )

"నల వసుధాకళత్రుని గుణంబె గుణంబుగ, సార సౌరభా
కలిత తదీయ కీర్తి కలికామయమైన శరాసనంబునన్,
విలసిత సౌమనస్య పదవీ రుచిరంబగు తద్విలాసమున్
ములికిగమ్జేసి, మన్మథుడు ముద్దియ నేయదొడంగె నెవ్వడిన్."
(శృం.నై - ద్వితీయ - )

{ఆత్మభూః - మన్మథుడు; గుణం - అల్లెత్రాడు; ఇషుం - బాణము; కలిక - మొగ్గ;}

మన్మథుడు నలుని గుణాలనే అల్లెత్రాడుగా, ఆయన యశఃకుసుమాలనే ధనుస్సుగా, దమయంతి హంసవల్ల విన్న ఆ నలుణ్నే బాణంగా చేసి ఆమె మీదే ప్రయోగిస్తున్నాడట!

తర్వాత దమయంతి మన్మథావస్థలని వర్ణిస్తాడు శ్రీహర్షకవి.

అసలు మన్మథావస్థలు పన్నెండు.

**"చక్షుః ప్రీతిర్మనః సంగస్సంకల్పో అథ ప్రలాపితాః
జాగరః కా ర్శ్యమరతిర్లజ్జా త్యాగోథ సంజ్వరః
ఉన్మాదో మూ ర్ఛనం చెవ మరణం చరమం విదుః"**

వీటిలో మొదటిదైన "చక్షుః ప్రీతి"ని నలుడి విరహవేదనని చెపుతున్నపుడు హంస చెప్తుంది. అంటే, దమయంతి చిత్రాన్ని చూచినపుడల్లా నలుడికి కళ్ళు నిలిచిపోయి జలపూరితాలగుతున్నాయట! చివరికి "మరణావస్థ"లో ఉన్నాడని స్ఫురింపజేసింది.

ఇక్కడ దమయంతికి తొమ్మిదవ అవస్థయైన "సంజ్వరం" వర్ణితం. దమయంతి విరహజ్వరంతో ఉండి, నలుడి కథ అనే నీళ్ళలో మునుగుతూనే ఉందట! జ్వరపడ్డ వారికి స్నానాదులు నిషిద్ధంకదా! అందువల్ల జ్వరం ఇంకా మిక్కుటమైందట!

ఒకచోట దమయంతి మరణావస్థని వర్ణిస్తూ, ఆమె మన్మథుని పంచమబాణమైంది అంటాడు. పంచమత్వం అంటే మరణం. {మన్మథుడి విల్లు చెరకుగడ, అల్లెత్రాడు తుమ్మెదలు. శరాలు కుసుమాలు. అవి ఐదు - అరవింద, అశోక, చూత, నవమల్లిక, నీలోత్పలాలు. ఒక్కోబాణం ఒక్కో అవస్థని కలిగిస్తుంది. మన్మథుడు నాలుగుబాణాలు మాత్రమే సంధించడం ఔచిత్యం, ఐదవది సంధిస్తే నాయికగాని, నాయకుడుగాని మరణిస్తాడు.} అలా దమయంతి మరణానికి దగ్గరగా ఉన్నదని చెప్పటమన్నమాట!

అలా దమయంతి విరహం ఉన్మాదావస్థకి దారితీస్తుంది. ఉన్మాదంలో ఉన్నదనడానికి ప్రతిగా చంద్రుణ్ణి రకరకాలుగా దూషిస్తుంది. రాహువే మంచివాడు. ఎటులైనా నిను గ్రసించుగాక యనుకొంటుంది. మన్మథుణ్ణి దూషిస్తుంది. ఆ తియ్యవిలుకాణ్ణి దుయ్యబడుతుంది. ఆ రెండుమూడమ్ములవాణ్ణి ములికి పలుకుల మాటలతో నిందిస్తుంది.

ఇలా ఉన్మాదస్థితి దాటి, "నా ప్రియుడైన నలుడు నానుంచి వేరు చేయబడినచో "హతాస్మి" అని మూర్ఛపోతుంది. పక్కనున్న చెలులు ఖంగారుగా శిశిరోపచారాలు చేస్తారు. ఆ చెలికత్తెల పేర్లు చాలా గమ్మత్తుగా ఉంటాయి. ఏడుగురు - కళ, చల, మేనక, కల్పలత, చారుమతి, కేశిని,తరంగిణి. వారిలో వారు కంగారు పడుతూ పిలుచుకుంటూ చేసిన కలకలం విని భీమరాజు కన్యాంతఃపురానికి వస్తాడు. విషయం చెలికత్తెల వల్ల కనుగొని, దమయంతిని సమీపించి, "తల్లీ! త్వరలో స్వయంవరాన నీకిష్టుడైన వరుడిని వరించగలవు" అని ఆశీర్వదించి వెళతాడు.

ఇలా సర్గ మొత్తం దమయంతీ విరహ వర్ణనమే! అంతా విప్రలంభ శృంగారరస పోషణ. ఈ రోజుల్లో పనికిమాలిన సాహిత్యం చదివే వాళ్ళకి ఇలాంటి అచ్చమైన రసపోషణలోని మాధుర్యం అర్థంకాదు. రసాస్వాదన చెయ్యలేక దీనిని బూతుగా పరిగణించి పక్కకి తప్పుకుంటారు. విశ్వనాథవారన్నట్టు చేవచచ్చి, ఆస్వాదించలేని నోటిచేదుగాళ్ళకి ఒక మహాశక్తివంతమైన, మధురరస పదార్థం వెగటుగా తోస్తుంది.

ఇక నన్నయ్యగారి కథాగమనంలోకి వస్తే, దమయంతి చెలికత్తెలు చెప్పిన మాటలువిని భీమనృపతి,, సంప్రాప్తయౌవనయైన కుమార్తెను చూచి, ఆ నలుణ్ణి ఎలా ఇక్కడకు రప్పించాలా అని ఆలోచించి,

"ఆ వైదర్భుండు నిఖిలధ
రావలయములోనఁ
గలుగు రాజన్యులనా
నావిషయాధీశ్వరులను
రావించెం దత్స్వయంవర
వ్యాజమునన్."

●●●

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*




## *నలోపాఖ్యానం*
## నలదౌత్యం

***- కౌటిల్య చౌదరి***

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**"ఈ నలోపాఖ్యానం మొత్తం దౌత్యాలూ, రాయబారాలేనా! "**

"చూస్తుంటే అల్లానే ఉంది మరి!"

"ఇప్పుడు ఏకంగా నలుడే రాయబారి అయ్యాడా! ఎవరికి దౌత్యం చేశాడు? ఎవరి దగ్గరకు వెళ్ళాడు దూతగా? ఏ విషయం మీద వెళ్ళాడు రాయబారానికి?"

ఇన్ని అనుమానాలు తీరాలంటే, మనం మనకథలోకి వెళ్ళి కొనసాగించాల్సిందే మరి!

పోయినసారి ఎక్కడ ఆపాను? ఆఁ! ఆ భీమ మహారాజు తన కుమార్తె విరహావస్థ తెలుసుకుని, స్వయంవరం చాటించాడు. నిఖిల భూమండలంలో ఉన్న రాజులందరికీ ఆహ్వానాలు పంపాడు.

**"మనుజేశ్వరు లెల్లను బో**
**రన దమయంతీస్వయంవరమునకు నొప్పన్**
**జనుదెంచిరి సైన్యస్యం**
**దనఘట్టన నవనితలము తల్లడపడగన్."**

{బోరన - వేగముగా; సైన్యస్యందన ఘట్టన - సైనికుల యొక్క, రథాల యొక్క తాకిళ్ళకు; తల్లడపడ - కంపించుట}

ఆహ్వానాలందుకున్న సర్వరాజలోకమూ అరుదెంచింది. ఊరికే ఒంటరిగా రారు కదా, కూడా పరివారం, రథాలు, కొంతసైన్యం... ఇంతమంది ఇలా సేనాసమేతంగా ఒక్కచోట చేరేపాటికి వాళ్ళ కాళ్ళతాకిళ్ళకి, రథాల ఉరుకుల పరుగులకి భూమి కంపించిందట!

ఇది ఇల్లా ఉండగా, నారదుడు పర్వతుడితో కలిసి భూలోకమంతా తిరిగి తర్వాత స్వర్గానికి వెళ్ళాడు. {ఇక్కడ నన్నయ్యగారు వీళ్ళిద్దర్నీ "పురాణ మునులు" అని చెప్పి ఊరుకుంటాడు. కాని, హర్షుడు పర్వతుణ్ణి మునిగా కాక, పర్వతుడిగానే వర్ణిస్తాడు. పైగా నారదుడికి "కలహ భోజన" తత్వం బాగా ఆపాదిస్తాడు.} వచ్చిన మునులను చూసి ఇంద్రుడు ఎదురేగి సగౌరవంగా, అర్ఘ్యపాద్యాలిచ్చి ఆసీనులని గావిస్తాడు. ఇక్కడ నైషధంలో ఒక మంచి గృహస్థధర్మాన్ని చెప్తాడు శ్రీహర్షుడు.

**"అర్చనాభి రుచితోచ్చతరాభి**

**శ్చారు తం సదకృతాఽతిథిమింద్రః|**
**యావదర్థకరణం కిల సాధోః**
**ప్రత్యవాయధుతయే న గుణాయ||"**

ఇంద్రుడు, అతిథిగా వచ్చిన నారదమహర్షిని శాస్త్రవిహితమైన వాటికంటే అధికమైన పూజలతో సత్కరించాడు. ఎందుకూ? శాస్త్రం చెప్పిన పరిమితిలో కనుక చేసినట్లఇతే, అది చెయ్యకుండా ఉండటంవల్ల వచ్చే పాపం కలుగదు కాని, విశేషమైన ఫలితమేమీ కలుగదు.{అర్థాంతరన్యాసాలంకారం} కాబట్టి ఇంద్రుడు నారదుణ్ణి విశేషంగా సత్కరించాడు. అదీ మనం అలవాటు చేసుకోవలసిన విషయం.

ఇక ఆసీనుడైన నారదుడితో ఇంద్రుడు క్షేమసమాచారాలడిగి, ఆమాటా ఈమాటా మాట్లాడుతూ మధ్యలో ఇలా అన్నాడు. " **యిది యెట్లు ధర్మపాలనపరులై వీరులై రణనిహతులైన రాజు లక్షయలోకసుఖంబు లనుభవింప నతిథులై యిందుల కెంతకాలం బయ్యె రానికారణం బేమి"-** బొత్తిగా స్వర్గానికి రాజులెవరూ రావట్లేదు ఈ మధ్యన. యుద్ధాలలో వీరమరణం పొంది, వీరస్వర్గం అలంకరించి, అక్షయమైన ఈ స్వర్గలోక సుఖాలనుభవించటానికి మాకు అతిథులుగా ఎవరూ రావటంలేదు. కారణమేమిటి?" అని. దానికి నారదుడు,"మహేంద్రా! నరసిద్ధసాధ్య విద్యాధర సురాంగనలందరికన్నా మహా అందగత్తెయైన "దమయంతి" అనే సుందరి విదర్భరాజు కూతురుగా పెరుగుతున్నది. ఆమెకు యుక్తవయసు వచ్చినప్పటి నుంచీ రాజులందరూ ఆమెయందే లగ్నమనస్కులై ఉన్నారు. ఆమెను గురించి ఆలోచించుచూ కామవ్యసనులై భూమియందే ఉండుటకు ఇచ్చగించుచున్నారు కాని, యుద్ధవ్యసనులై స్వర్గాగమనకాంక్షితులగుట లేదు. పైగా,ఇప్పుడు ఆ విదర్భరాజు తన పుత్రిక స్వయంవరాన్ని ప్రకటించాడు. ఇక ఈ రాజలోకమంతా ఆ వేడుకకు వెళ్ళే సందడిలో ఉన్నారుకాని, పక్కవాడితో కయ్యం పెట్టుకునే ఆలోచనలో లేరు." అన్నాడు.

నైషధంలో ఈ సన్నివేశంలో నారదుడు ఒక చమత్కారమైన మాట అంటాడు." ఆ దమయంతి యుక్తవయసు వచ్చినప్పటి నుంచి ఒక యువకునియందు అనురాగబద్ధయై ఉన్నది. ఆ యువకుడెవరు అని అడగవద్దు. అది నాకు కాదుకదా మహాయోగులకు కూడా తెలుసుకొనలేని విషయం.

**యత్పథావధిరణుః పరమస్సా**
**యోగిధీరపి న పశ్యతి యస్మాత్|**
**బాలయా నిజమనఃపరమాణౌ**
**హ్రీదరీశయహరీకృత మేనమ్||**

యోగి బుద్ధి పరమాణువు వరకూ తెలుసుకొనగలదు, అంటే పరమాణు రూపమైన మనస్సును మాత్రం గ్రహింపగలడు. కాని ఆ బాలికయొక్క పరమాణురూపమైన మనస్సులో ఉండే లజ్జ అనే గుహని తెలుసుకోలేడు. ఎప్పుడైతే ఆ లజ్జని గ్రహించలేకపోతాడో, ఆ గుహలో నిద్రించే సింహమంటి ఆ యువకుణ్ణి ఎలా తెలుసుకుంటాడు?!!... కాబట్టి ఆడవాళ్ళ మనస్సు తెలుసుకోవటం ఆఖరికి సాక్షాత్తూ బ్రహ్మమానసపుత్రుడైన, ఆ నారదమహామునికి కూడా వల్లకాలేదన్నమాట! అలాంటప్పుడు మనబోటి సామాన్యుల సంగతి ఏం చెప్పుకోవాలి!...;)

**అది విని యింద్రుండును లోకపాలవరులును దదాలోకన కౌతుకంబునం గనకరత్నరమ్య విమానారూఢులై భూలోకంబునకు వచ్చి-** ఇంకేముంది? నారదుడి మాటలువిని ఇంద్రుడు, దిక్పాలకుల్ని తోడు తీసుకుని బైల్దేరాడట! ఎక్కడికీ, ఎందుకూ? తదాలోకన కౌతుకంబునం - దమయంతీ స్వయంవరానికి జరుగుతున్న ఈ సందడి చూడటానికో లేక దమయంతీదేవిని చూడటానికో మరి!

సరే వచ్చారు. ఏం చేశారు వచ్చి? **దమయంతీ స్వయంవరంబునకుం బోయెడువాని-** ఆ దమయంతీ స్వయంవరానికి వెళ్తున్న ఒక యువకుణ్ణి చూశారు. ఆయన ఎల్లా ఉన్నాడయ్యా అంటే, **ఆదిత్యులలోన విష్ణుండునుంబోలె తేజోధికుండైనవానిన్-** అమిత తేజస్సు కలిగి ఉన్నాడట! అదీ ఎలాంటి తేజస్సు, పన్నిద్దరు ఆదిత్యులలో విష్ణువుయొక్క తేజస్సువంటి తేజస్సు. {ఆదిత్యాః - అదితేరపత్యాని ఆదిత్యాః. అదితి కొడుకులు. వీళ్ళు పన్నెండు మంది.- ఇంద్రుడు, ధాత, పర్జన్యుడు, త్వష్ట, పూష, అర్యముడు, భగుడు, వివస్వంతుడు, విష్ణువు, అంశుమంతుడు, వరుణుడు, మిత్రుడు}. ఇంకా ఎలా ఉన్నాడు?- **అనన్య సాధారణరూప విభవంబున రెండవ మన్మథుండునుం బోనివాని** - రూపంలో రెండో మన్మథుడా అన్నట్టున్నాడట! నలుంగని - ఎవరయ్యా ఆతడు, సాక్షాత్తూ మన కథానాయకుడు నలుడు. మరి ఉన్నాడంటే ఉండడూ మన్మథుళ్ళా! ఆరుగురు అందగాళ్ళల్లో ఒకడాయె! {కంత,వసంత,జయంత, నల,నకుల, నలకూబరులు; కంతుడు- మన్మథుడు}. ప్రియావిరహంతో ఆదరాబాదరా వస్తున్నాడులా ఉంది స్వయంవరానికి. అశ్వహృదయం తెలిసినవాడాయెను. ఆయన గుఱ్ఱాలడెక్కల చప్పుడు మేఘనాదంలా ఉన్నదట! అల్లా వస్తూ ఉన్న నలుణ్ణి ఈ ఇంద్రాది దిక్పాలకులు చూచారు. విమానాలు ఆకాశంలో ఆపి భూమ్మీదకు దిగారు. {ఆ విమానాలకు ల్యాండింగూ గ్రటా ప్రాబ్లెంసు లేవు కామోసు! ఆకాశంలోనే ఆగిపోతాయిలా ఉంది.}.

దిగివచ్చి నలుణ్ణి ఆపి ఇల్లా అంటున్నారు,"**నిత్యసత్యవ్రత నిషధేశ నీవు మాకమరంగ దూతవై యభిమతంబు సేయుము** - ఎప్పుడూ సత్యమే పలికే ఓ నిషధాధిపా! మాకు దూతవై మాకు ప్రియము సేయుము." ఆహా! దేవతల తెలివే తెలివి. ముందరికాళ్ళకు బంధం వేసేశారు, కనీసం తామెవ్వరో కూడా చెప్పకుండానే. అది విని నలుడేమన్నాడు,"అలానే చేస్తాన్నాయనా! ఇంతకీ మీరెవరు? మీకు దూతనై ఏం చేయాలి, ఎవరి వద్దకు వెళ్ళాలి" అన్నాడు. దానికి వాళ్ళ లీడరు ఇంద్రుడు," వీళ్ళు దిక్పాలకులు, నేను ఇంద్రుణ్ణి. ఇక్కడ భూలోకంలో జరుగుతున్న దమయంతీస్వయంవర వేడుకలు చూడాలని వచ్చాం. నీవు వెళ్ళి ఆ దమయంతికి మా గుణగణాలు విశేషంగా వర్ణించి చెప్పాలి. అప్పుడు ఆ కోమలి మాలో తనకిష్టుడైనవాణ్ణి వరిస్తుంది." అని సెలవిచ్చాడు.

ఇంతకన్నా పురుషుడికి పరీక్ష ఉంటుందా! ప్రేమించిన ప్రియురాలి వద్దకువెళ్ళి,"ఫలానా వాళ్ళు చాలా గొప్పవాళ్ళు. వాళ్ళని పెళ్ళాడు" అని చెప్పడంకన్నా బాధాకరమైన విషయం మరొకటి ఉండదు. నలుడు వారికి నమస్కరించి ఇలా అంటున్నాడు," **ఎఱిఁగి యెఱిఁగి నన్ను నేకార్థసమవేతుఁ బాడి యయ్య యిట్టిపనికిఁ బనుప** - దేవేంద్రా! నేనుకూడా అదేపనిమీద వెడుతున్నాను. ఆ దమయంతిని వరించిన వాడను. ఈ విషయం తెలిసికూడా మీరు నన్ను ఈ పనికి నియోగించాలనుకొనుట న్యాయమేనా?"

దానికి దేవేంద్రుడు, "ముందు ఉత్సాహంగా చేస్తానని ఎందుకు మాట ఇచ్చావు? ఇప్పుడు చెయ్యననటం నీకు తగునా! నువ్వు నిత్యసత్యవంతుడవని, ఈకార్యము చెయ్యగలవని అనుకుని నిన్ను దూతగా పంపాలని నిర్ణయించుకుని అడిగాము. దేవతలకు కావలసిన ఈ పనిని నీవు తప్పక నెరవేర్చాలి. భటులతో రక్షింపబడే కన్యాంతఃపురంలోకి ఎలా వెళ్ళాలా అని సందేహపడొద్దు. నీవు అంతఃపురం ప్రవేశించేప్పుడు నిన్ను ఎవరూ వారించరు." అని పలికాడు.

ఇక్కడ మహేంద్రాదులు సత్యవాక్పరిపాలన అనే బంధంవేసి నలుణ్ణి తమకు దూతగా మార్చుకోవాలనుకున్నా ఎక్కడా యాచించినట్టుగా కనిపించరు. దేవతలమన్న ఔద్ధత్యంతో ఆజ్ఞాపిస్తున్న ధోరణే ఉంటుంది. నలుడే కాస్త దీనంగా కనిపిస్తాడు. పైగా నలుడి మనసులో అంతఃపుర ప్రవేశ అనుమానం ఉన్నదోలేదోగాని, వీళ్ళు ముందే ఉన్నట్టు చెప్పి నీవు ద్వారపాలకులను దాటుకు వెళ్ళగలవు అని మాత్రమే చెడిపోరు. కాని నైషధంలో దిక్పాలకులు నలుణ్ణి యాచిస్తారు. తగ్గి మాట్లాడతారు. ఇంద్రుడు కపటమైన తెలివితో నలుణ్ణి వాక్పరిపాలనా బంధంలో ఇరికిస్తాడు. కాని నలుడు వీళ్ళ కపటాన్ని గుర్తించి తెలివిగా సమాధానాలు చెప్తాడు. దానికి దేవతలు,"నీవు చంద్రవంశ ప్రతిష్టకి మచ్చతెస్తున్నావు. యాచకులకు లేదు పొమ్మంటున్నావు" అని ధర్మసంకటంలో పడవేసి తమ కోఋఁకు నెరవేర్చుకుంటారు. ఇక ఆఖరికి నలుడు ఏమీ చెయ్యలేక "సర్వభట రక్షితమైన అంతఃపుర ప్రవేశం ఎలా చెయ్యగలను?"అని ప్రశ్నిస్తే,

నలుడికి తిరోధాన విద్యనిచ్చి నీవు కావాలనుకున్నప్పుడు, కావలసినవారికి కనిపించగలవు అంటారు. నైషధంలో ఈ సన్నివేశంలో హర్షుడు దానాన్ని గురించిన కొన్ని ముఖ్యమైన ధర్మాలు నలుడితో చెప్పిస్తాడు.

**"తం ధిగస్తు కలయన్నపి వాంఛా**
**మర్థివాగవసరం సహతే యః||**

**ప్రాపితేన చటుకాకువిడంబం**
**లంభితేన బహుయాచన లజ్జామీ**
**అర్థినా యదఘమార్జతి దాతా**
**తన్నలుంపతి విళంబ్య దదానః||"**

"యాచకుడి కోరిక తెలిసికూడా అతడు అడిగే వరకు ఎదురుచూసే దాత నిందార్హుడు. ఇంకా, దాత గనుక యాచకుణ్ణి చమత్కారవచనాలతో, ఈసడింపులతో, హాస్యమాడుతూ, పలుమార్లు అడిగించుకుని ఆలస్యం చేసి దానం చేస్తే అది ఫలితాన్నివ్వకపోగా, దుష్ఫలితాల్నిస్తుంది. పాపం సంక్రమిస్తుంది. అటువంటి పాపానికి ప్రాయశ్చిత్తం కూడా లేదు."

ఇంకా దానం ఇచ్చేప్పుడు ఆ దానం ఏదైనా దానితోపాటుగా, దర్భలని, జలాన్ని కూడా ఇవ్వాలి. దానం ఇచ్చేప్పుడు యాచకుని హస్తాలలో ఉంచాలికాని, విసరివేయడం, నేలమీద పెట్టడం వంటివి చెయ్యకూడదు.

ఇలా కావ్యంలో ప్రధానకథ సాగుతుండగా దానితోబాటు ఎన్నో ధర్మాలు, జ్ఞానాన్ని పెంపొందించే విషయాలు పాఠకుడి బుఱ్ఱలోకి ఎక్కించేవాళ్ళు పూర్వకవులు. అదీ అసలు కావ్యప్రయోజనం. ఊరికే ఏదో నాలుగుపాత్రలు సృష్టించి, వాటి మధ్యజరిగే విషయాల్ని,పోచికోలు కబుర్లని మాత్రమే చెప్పే ఈకాలపు రచనలకి, ఆ మహాకవుల రచనలకీ ఉండే ప్రధానమైన తేడా అదే రసాస్వాదనంతో పాటు జ్ఞానసముపార్జన కూడా చెయ్యగలుగుతాడు అప్పుడు పాఠకుడు.

{ఇక్కడనుంచి నైషధంలో నలరాయబార ఘట్టం మొత్తం నాలుగు సర్గలుగా సాగుతుంది. అంత విస్తారంగా ఉన్నదాంట్లోనుంచి నాలుగు విషయాలు చెప్పాలన్నా చాలా అవుతుంది. అందువల్ల గ్రంథవిస్తారభీతి వల్ల ఎక్కువగా నైషధంలో విషయాలు చర్చించదలచుకోలేదు. ఎక్కడన్నా ముఖ్యమైన విషయాలుంటే ఒకటీ, రెండు చెప్తాను. నలుడు దమయంతీ అంతఃపురంలో విహరించటం, ఆమెకొరకు వెతకడం, ఇంద్రాదులు వాళ్ళ దూతికలను విడిగా దమయంతి వద్దకు పంపడం, దమయంతి నిరాకరించటం ఇంతవరకు ఒక సర్గ. నలుడు దమయంతిని చూచాక ఆమె సౌందర్యాన్ని మనసులో భావించటం మొత్తం మరో సర్గ. నలుడు దమయంతికి దేవతల సందేశం వినిపించటం తరువాతి సర్గ. దమయంతి నిరాకరించటం, నలదమయంతుల సమ్వాదం, హంస వచ్చి నలుడికి నచ్చచెప్పటం ఇవన్నీ తరువాత సర్గ. ఇంతవరకు నలరాయబార ఘట్టం జరుగుతుంది. ఎక్కువగా వర్ణనలుంటాయి.}

ఇక్కడ నుంచి నన్నయ్యగారి నేర్పు చూద్దాం. **"దమయంతీ నివేశంబు ప్రవేశించునపుడు నిన్నెవ్వరు వారింప నోడుదురు"** అని యింద్రుడన్నాడు. అశంకితుడై నలుడు దమయంతీ గృహంబు సొచ్చెను. ఇక్కడ పని చూడవలసినది దేవతలు. నలుడికి అదృశ్యమణుల్లాంటివేవీ ఇవ్వలేదు. ఇస్తే కనిపించటం, కనిపించకపోవటం నలుడి అధీనంలో ఉంటుంది. అప్పుడు దేవతలకు నలునిమీద అధికారముండదు. వారు సర్వవ్యాపులు. అదృశ్యులయ్యి నలుడివెంట ఉండవచ్చు. ఒక పరిస్థితి తమకనుకూలము కానప్పుడు నలుడు కనిపించకుండ చేయవచ్చును, కనిపించునట్లు చేయవచ్చును. కాని నైషధంలో మాత్రం "నీకు తిరోధాన విద్యనిస్తున్నాం. వెళ్ళిరా. అంతవరకు మేం ఇక్కడే వేచి ఉంటాం" అని చెప్తారు. నన్నయ్యగారు అలా చెప్పకుండా ఇక్కడ ఒక చమత్కారమైన సన్నివేశాన్ని కల్పిస్తారు.

**" హంసచేఁ దనవిని నంతకంటెను రూప**

విభవాతిశయముల వెలయుదాని
సురకన్యలయట్టి సురుచిర శతకన్య
కాళిచేఁబరివృత యైనదాని
హృదయేశుఁడైన తన్నెప్పుడు వినుచున్కి
నలయ కాశ్వాసితయైనదాని
దమయంతిఁ జూచి కందర్పశరావిద్ధుఁ
డయ్యెఁజు నలుండంత నతనిఁజూచి

యితఁడపూర్వ మనుజుఁడెందుండి వచ్చెనో
యనుచు నదరిపడి లతాంగులెల్ల
నాసనముల డిగ్గి యపుడు ప్రత్యుద్గత
లైరి మనములందు హర్షమొసగ."

ఇలా జరిగింది. దమయంతి అంతఃపురంలోకి వచ్చిన నలుడు, హంస చెప్పిన దానికంటె ఎక్కువ అందకత్తెను మొదట చూచాడు. చూడగానే అతని మనస్సెలా ఉంటుంది? "ఇంత అందకత్తె నాకు కాకపోతుందే" అనిపిస్తుంది. "ఈమెను దేవతలు వరిస్తున్నారే! ఈమె ఇంద్రాణీ భోగాలు అనుభవిస్తుంది. అనుభవించటం కోసమే పుట్టినదానిలా ఉంది. ఇప్పుడు కూడా దేవతాస్త్రీలవంటి వందమంది కన్యలచేత సేవింపబడుతూ ఉంది" అని అనుకొన్నాడు. ఈ భావాలే పాఠకుడు గ్రహించేట్టు చేయటానికి సామర్థ్యంకల వర్ణన, నన్నయ్యగారు ద్వితీయచరణంలో చేశారు. అప్పుడేమవుతుంది? అతని ఆశ అంతా తునిగిపోయింది. కాని, మూడవ చరణంలో అతడి ఆశ మళ్ళా రేకెత్తడానికి హేతువు చూపబడ్డది. ఏమిటా హేతువు? ఆ దమయంతి ఏం చేస్తూ ఉన్నదయ్యా అంటే, తన చెలులు తన హృదయేశ్వరుడైన నలుడి గురించి ఎడతెగక చెప్తూ ఉంటే విని ఊరటబొందుతూ ఉన్నది. అల్లాంటి ఆమెను చూడగానే ఈయనలో మళ్ళా ఆశలు చివురించాయి. కందర్పశరావిద్ధుడయ్యాడు.

**"అంత"** చెలికత్తెలు అతణ్ణి చూచారు. 'అంత' అనగా ఎప్పుడు? నలుడికి మనస్సులో దమయంతీగత విరహభావం పుట్టగానే అని అర్థం. పుట్టగానే అతడు అక్కడ ఉన్న స్త్రీలందటికీ కనిపించాడు. ఎందుచేత? దేవతలు నలుడి మనస్సులో ఉన్నారు. నలుడు దౌత్యం మాట మర్చిపోయి విరహావస్థ పొందుతున్నాడు. తమ పని చెడిపోతోంది. అతడక్కడి స్త్రీలకు వెంటనే కనిపిస్తే వాళ్ళు తొందరపడతారు. ఇతడు వెంటనే తానెవరో చెప్పుకోవాలి. తాను తన విరహవ్యథలో ఉండటానికి వీల్లేదు. **"అంత"**అన్న శబ్దంలో ఇంత అర్థముంది. ఇదీ నన్నయ్యగారి రచన. ఇలా ఎన్నో శబ్దాలు పరమార్థభూతాలుగా వాడతారు.

నైషధంలో పై సన్నివేశానికి కూడే ఒక విషయం ఉంటుంది. దేవతలు నలుడితో మాట్లాడుతూ,"మేము నిన్నే దూతగా ఎందుకు ఎంచుకున్నామంటే, నీవు సౌందర్యంలో మన్మథుణ్ణి జయించినవాడవు. కాబట్టి మన్మథుని వల్ల నీకు భయంలేదు.మన్మథుని వల్ల భయమున్నవాడు ఈ రాయబారము చేయలేడు. ఎందుకంటే దమయంతియందు వానికి కామమేర్పడి అతి దౌత్యానికి ప్రతిబంధకం కావచ్చు. నీవు మన్మథుణ్ణి జయించావు కాబట్టి నీవు ఈ దౌత్యాన్ని సులభంగా చేయగలవు" అంటారు. అంటే వారి అర్థం నలుడు ఆమెను చూసి విరహావస్థను పొందితే దౌత్యం చెడిపోతుందని. నన్నయ్యగారు ఈ విషయాన్ని పై విధంగా చెప్పి ఉండవచ్చు.

అల్లా అందరిముందు హఠాత్తుగా ప్రత్యక్షమైన ఆ నలుణ్ణి దమయంతి చూచింది. ఆమెకు ఎల్లా కనిపించాడు ఈయన! **మనోభవ నిభు -** మన్మథునికన్నా అందంగా ఉన్నాట్ట! **అమరేంద్ర ప్రతిము దినకరాభు సుధారుక్సము వరుణ సదృశు ధనదోపము నశ్విసమాను నిషధపతిన్-** ఆయా గుణాల్లో దేవతలకి, సూర్యచంద్రులకి సమానంగా ఉన్నాడట! ఇలా అందరు దేవతల గుణాలూ పుణికిపుచ్చుకున్న నలుణ్ణి వరిస్తే మంచిదికానీ, ఎవరో ఒకటే లక్షణంకల్ల దేవతని వరిస్తే ఏం ఉపయోగం అని నన్నయ్యగారి అంతరార్థం కాబోలు!

ఆయన్ని చూడగానే కొంతపోల్చుకుంది కాబోలు, ఈమెకూడా మన్మథప్రేరిత అయినది. ఆ అవస్థలో సిగ్గు విడిచి నలునితో మృదుమధురంగా ఇల్లా అంటూంది." నీవెవరవో మహానుభావుడవు. ఇక్కడకు ఏకారణమ్మీద వచ్చావు? నా జనకుని సేనచే నిత్యం రక్షింపబడే ఈ అంతఃపురం ఎవరికీ చొరరానిది. ఎవరికీ తెలియకుండా నీవెలా వచ్చావో నాకర్థమగుటలేదు. నా మనోవేదన నీవల్ల హెచ్చినది. నీవెవరవో చెప్పుము"

దానికి నలుడు, " నేను దేవదూతను. నలుడనువాడను. ఇంద్రవరుణాది దిక్పాలకులు నీ స్వయంవరానికి విచ్చేశారు. వారి పంపున నేను నీ వద్దకు వచ్చితిని. వారు వారిలో ఒకరిని,నీకు నచ్చినవారిని వరింపుమని కోరిరి. వారి ప్రభావం వల్లనే నేనెవరి కంటనూ బడక అంతఃపురం ప్రవేశించాను. ఇంద్రాదులకు ప్రియము చేయుము" అని ఇంద్రాదుల విన్నపాన్ని దమయంతికి తెలియజేశాడు.{నైషధంలో నలుడు ముందు తనగురించి చెప్పడు. ప్రసంగవశంలో చివరన దమయంతి అనురాగానికి ముగ్ధుడై మైమరచి తానెవరో చెప్తాడు}

నలుడి మాటలు విని దమయంతి శిరసు వాల్చింది. తాను హంసవల్ల విని బద్ధానురాగయయి ఎదురుచూస్తున్నది ఈ నలుడే అని తెలుసుకున్నది. దుఃఖపడుతూ నలునికి ఇల్లా అంటోంది." నేనెక్కడ? ఇంద్రాదులెక్కడ? వారిని నిత్యం పూజించుదానను. నేను నీ సొత్తును. నీ గుణగణాలు హంసవల్ల విని నిన్నే మనసులో నిలుపుకున్నాను. నిన్ను రప్పించటం కోసమే నా తండ్రి ఈ స్వయంవరం చాటించాడు. నన్ను కరుణించి నీ అర్థాంగిగా స్వీకరించు. నీవు అంగీకరించని యెడల నాకు మరణమే శరణ్యము. రజ్జువిషాగ్నిజలంబుల దేహపరిత్యాగంబు చేసెద."

దమయంతి తీవ్రంగా పలికిన ఈ పలుకులు విని నలుడు,"నిన్ను కోరుతున్నవారు సర్వలోకపాలకులు, అమరులు. నేను మనుష్యుడను, వారి పాదధూళికి కూడా సరిపోలను. కాబట్టి నన్ను కోరటం నీకు తగదు.

**దేవతల కప్రియంబులు**
**గావించి మనుష్యులధమగతు లగుదు రిలన్**
**గావున వారికి నిష్టముమ్**
**గావింపుము నన్నుమ్ బ్రీతిమ్ గావుము తరుణీ."**

సామానికీ, దానానికీ ఆమె మరలకపోయేసరికి ఇల్లా ఆమెను భయపెట్టైనా ఆమె మనసు మరల్చి తన దూతకర్తవ్యం నెరవేర్చుకోవాలని ప్రయత్నించిన ఆ నలమహారాజు సత్యసంధత, వాక్పరిపాలనాదక్షత నిత్యశ్లాఘనీయాలు.

నలుడి ఈ మాటలు విని దమయంతి కళ్ళు వర్షించి చెక్కిళ్ళు తడుపుతుండగా చాలాసేపు ఆలోచించి, దృఢనిశ్చయంతో ఇల్లా అంది," నీ అభిప్రాయానికి చెఱుపులేని ఉపాయం ఆలోచించాను. ఇంద్రాదులు నా స్వయంవరానికి వచ్చెదరుగదా! వారి యెదుటనే నిన్ను వరిస్తాను. అప్పుడు దోషముండదుగదా!"

అది విన్న నలుడు ఇంద్రాదుల వద్దకు తిరిగి వచ్చి ఆమె చెప్పిన ప్రకారంగా వివరించాడు. తనకి ఒప్పగించిన రాయబార బాధ్యతను పూర్తి చేశాడు.

అదన్నమాట నలుడు చేసిన దౌత్యం. అరుదైన రాయబారం.....

●●● *(కొనసాగింపు వచ్చేసంచికలో)*

# వ్యాస కౌముది

## *నలోపాఖ్యానం*
## *దమయంతీ స్వయంవరము*
### *- కౌటిల్య చౌదరి*

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

నలదౌత్యం ముగిసింది. దమయంతి ఆతణ్ణి తప్ప అన్యులని వరించనని స్థితప్రజ్ఞతతో చెప్పింది...

**అంత పుణ్యతిథినక్షత్ర ముహూర్తంబున దమయంతీ స్వయంవరంబు ప్రవర్తిల్లిన -** అలా దమయంతీ స్వయంవర తిథి రానే వచ్చింది. ఈ దేవతలని దమయంతి వరించనని చెప్పిందాయెను. ఇక ఏం చేశారూ!

**నలున కాని నలినదళ నేత్ర వరియింప**
**దట్టి చూత మనుచు నమరవరులు**
**నలువురును గడంగి నలరూపముల వచ్చి**
**రాస్వయంవరమున కతిముదమున.**

ఈ దమయంతి నలుని తప్ప వరించనంటోంది, ఎలాగో మనమూ చూద్దాం అనుకున్నారు. దేవతలు కామరూపధారులు కదా! నలుగురూ నలుడి రూపాన్ని ధరించి స్వయంవరానికి వచ్చారు. ఎందుకూ! అల్లా వస్తే ఎవరో ఒకర్ని వరిస్తుందికదా అన్న ఆశ! ఇరవైశాతం ఛాన్సన్నమాట!..:) అది కూడా వదులుకోవడం ఎందుకూ అనుకున్నారేమో!

నన్నయ్యగారు స్వయంవర ఘట్టాన్ని అంత విపులంగా చెప్పరు. నాలుగైదు పద్యాల్లో తేల్చేస్తారు. కాని ఆ నాలుగైదు పద్యాల్లోనే ఆయన వాడిన పదాల్లో ఇమిడ్చిన లోతైన భావాలు చెప్పుకోవాలంటే పెద్ద వ్యాఖ్యానాలే తయారవుతాయి. అదీకాక, నన్నయ్యగారు పూర్వభాగానికి అంత ప్రాముఖ్యం ఇవ్వరు. ఆయన ప్రాముఖ్యం అంతా దమయంతీదేవి పడ్డ కష్టాల గురించే! అందుకే నలోపాఖ్యానం మొత్తం కరుణరస ప్రధానంగా తీర్చారు నన్నయ్యగారు.......

కాని, స్వయంవర వేడుకలు అసలు ఎలా జరుగుతాయి, ఆ పద్ధతులూ, సంప్రదాయాలూ విపులంగా చర్చిద్దామన్న ఉద్దేశంతో ఈ భాగాన్ని కొంచెం ఎక్కువగా పెంచి విపులంగా రెండు భాగాలుగా రాస్తాను. శ్రీహర్షుడు నైషధంలో మొత్తం ఆరుసర్గలలో విపులంగా వర్ణిస్తాడు స్వయంవర ఘట్టాన్ని. శ్రీనాథుడు కూడా దానిననుసరించే అటూఇటూగా రెండాశ్వాసాలు మొత్తం స్వయంవర వర్ణనమే! వాటిల్లో ముఖ్యమైన అంశాలు చెప్తాను.

స్వయంవరానికి సకల భూమండలంలో రాజులూ,రాజకుమారులూ విచ్చేశారు.

**రాజవంశజుడై యుండి రానివాడు**
**కామబాణంబులకు గుఱిగానివాడు**

**సప్తసాగర మధ్య భూచక్రమునను**
**నృపకుమారుండు లేడు**
**పన్నిదమునకును.{శృం.నై}**

అల్లా వచ్చిన రాజసందోహంతో కుండిన నగరమంతా నిండిపోయిందట! నువ్వులు పైన వేస్తే కిందకు రాలేటంత ఎడం కూడా లేకుండా ఉన్నదట! మరి రాజులు ఒంటిగా రారుకదా, కూడా సైన్యమూ, పరివారమూ! ఇక రాచవీధులన్నీ కిక్కిరిసిపోయాయి. ఎవడు ముందు చొరబడితే వాడికే దమయంతి దక్కుతుందన్నట్టు నెట్టుకుంటూ ఉన్నారట!అసలు ఈ వచ్చిన వాళ్ళంతా నిజంగా దమయంతి తమని వరిస్తుందన్న ఆశ ఉన్నవాళ్ళేనా! కాదట!

**కొందఱు తరుణి వరింపం,**
**గొందఱు బలిమిని హరింపఁ,గొందఱు సూడన్**
**గొందఱు భూషింపను, నృప**
**నందను లేతెంచిరుబ్బున న్మహమునకున్.{శృం,నై}**

అదన్నమాట సంగతి! ఒక్కోడిదీ ఒక్కో వ్యాపకం, ఒక్కో కారణం......

ఇంకా ఒక్క రాజకుమారులేనా వచ్చింది. పైలోకాల్నుంచి దేవతలూ వచ్చారు. ఇంకా కిందిలోకాల్నుంచి కూడా వచ్చారట! ఎవరూ! **కోటి భుజంగ పుంగవులు గొల్వగ,......... కర్కోటకుడేగుదెంచె మద ఘూర్ణిత పాటల నేత్రపద్ముడై** - కర్కోటకనాగుడొచ్చాడట, ఫణ సంభృత రత్నదిశా విభాసియై. ఆయన కన్నులెలా ఉన్నాయయ్యా అంటే, గర్వంతో ఎరుపెక్కి, ఎరుపూ,తెలుపూ కలిసిన వర్ణంలో కనిపిస్తున్నాయట! ఇంకా, వాసుకి వచ్చాడు, ఫణాపర్యంత మాణిక్య మంజు మయూఖాంకుర పుంజ మంజుల నభస్కుడై, భుజంగాంగనలు ఇరుపక్కలా యశఃగీతికలు పాడుతుండగా విచ్చేశాడు.......

ఇంద్రాగ్ని యమవరుణులూ విచ్చేశారు. తక్కిన దిక్పాలకులు రాలేదు. ఎందుకూ? స్వయంవరం కదా, రాజ పురోహితులు మంత్రోక్తంగా అసురీశక్తులు చొరబడకుండా దిగ్బంధం చేశారు. అందువల్ల నైరుతి దిక్పాలకుడైన నిరుతి( ఈయన రాక్షసుడు) రావీలు లేకపోయింది. వాయుదేవుడెందుకు రాలేదూ! ఆయన వాహనమైన లేడి రానన్నదట. ఎందుకో మరి! ఏమిటోయ్ నీ సంగతీ అంటే, "నా చూపులకన్నా ఆ దమయంతి చూపులే బహు సుందరంగా ఉన్నాయని అందరూ పొగుడుతున్నార"ని స్పర్థపూనిందట. మరి ఉత్తర దిక్పాలకుడైన కుబేరుడు ఎందుకు రాలేదుటా? దారిలో వస్తూ వస్తూ కైలాస పర్వతంలో తన ప్రతిబింబం చూచుకున్నాడట. పర్వతంలో ప్రతిబింబం చూచుకోటమేంటా అనుకుంటున్నారా? అవును మరి, కైలాస పర్వతం వెండి, శుద్ధస్ఫటికంతో నిండి ఉంటుంది. {రజతాద్రిస్తు కైలాసో అష్టాపదఃస్ఫటికాచలః} కాబట్టి కైలాసానికి దర్పణంగా ఉపయోగం చెప్పబడింది. ఎల్లా కనపడిందట ప్రతిబింబం. ఈయన కురూపట! కుబేరః - కుత్సితం బేరం శరీరం యస్య సః కుబేరః, కుత్సితమైన శరీరము కలవాడు అనివ్యుత్పత్తి. ఎలాంటి రూపం అది, "మన్దాక్షం హ్రీ స్త్రపా వ్రీడా లజ్జా"- మూడు పాదాలు, ఎనిమిది దంతాలు, మెల్లకన్ను - ఈ రూపం గౌరీదేవి శాపం వల్ల కలిగింది. మరి ఇల్లాంటి రూపం ఉన్నదని చూసుకున్నాక ఎల్లా వెళ్ళబుద్ధవుతుంది మరి!?

ఇక ఈశానుడు అర్ధనారీశ్వరుడు కదా! ఆయన వెళ్దామని బైల్దేరి ముందుకు నడిచినా, ఆవిడ వెనక్కు లాగుతుంది కదా, వెళ్ళటం పడదు. అందువల్ల ఎందుకు అనవసరమైన శ్రమ అని ఊరుకున్నాడట. తాను వహిస్తున్న భూమిభారం మొయ్యను వేరెవ్వరూ లేరులే అని ఆదిశేషుడు రాలేదు. ముదిసిపోయిన వయసులో పెండ్లికి మొహంవాయటం మంచిదికాదని పితామహుడు వద్దులెమ్మని మానుకున్నాడట! {ఇది శ్రీనాథుడు వాడిన ప్రయోగం. ఇక్కడ హర్షుడు "పితామహ"శబ్దం వల్ల బ్రహ్మ దమయంతి తండ్రికి తండ్రి అన్న ఉపమానంలో చెప్పి, సపిణుడు-సమాన దేహుడు, సమానగోత్రుడు, అవుతాడు కాబట్టి వివాహానికి తగదని మానుకున్నాడని చెపాడు.}

అలా త్రిలోకవాసులూ ఏతెంచారు.

ఇంద్రాగ్నియమవరుణులు ఎల్లా వచ్చారు? నలుడి రూపం ధరించి వచ్చారు. కాని, ఆ నలుని రూపం ధరించటానికి ఎంతో ప్రయాస పడ్డారు. ఎంత చేసినా నలుడి రూపం సంతృప్తికరంగా పొందలేకపోతున్నారట. లోకసామాన్యంగా, స్వాభావికంకన్నా కృత్రిమం ఎప్పుడూ భిన్నంగానే ఉంటుంది, ఎంత ప్రయాసపడి సామ్యం తెద్దామనుకున్నా. నలుడితో సామ్యం పొందటానికి ఒక్కో శరీరభాగాన్ని మార్పు చేసుకున్నారట. ముఖాన్ని ఒకసారి పూర్ణచంద్రుడిలా, ఒకసారి వికసించిన పద్మంలా చేసుకు చూసుకుని ఎంతకూ సామ్యం రాకపోవటం వల్ల విసుగెత్తి, ఆ చూసుకున్న అద్దాలు పగులగొట్టారట.

హర్షుడు ఇన్ని శ్లోకాల్లో చెప్పిన దేవతల ఈ శ్రమనీ, విఫలప్రయత్నాలనీ నన్నయ్యగారు "కడంగి" అన్న చిన్నమాటతో తేల్చేస్తారు. {మొదట చెప్పిన పద్యం...కడంగి అంటే మిక్కిలిప్రయత్నం అని అర్థం}. వాళ్ళు ఎంత ప్రయాసపడ్డారో ఆ చిన్న పదంలో మనకు అవగతమవుతుంది. చిన్న పదాలలో మహార్థాలని ఇముడుస్తారు. అదీ నన్నయ్యగారి ప్రతిభ!

●●●

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

# వ్యాస కౌముది



## నలోపాఖ్యానం
## దమయంతీ స్వయంవరము
### - కౌటిల్య చౌదరి

(క్రిందటి సంచిక నుంచి తరువాయి)

**అసలు స్వయంవరమంటే ఏంటి?** ఎల్లా జరుగుతుంది? మన సినిమాల్లో చూపించినట్టు రాకుమారి వరమాల పుచ్చుకుని సభలో నడుచుకుంటూ వెళ్ళి నచ్చినవాళ్ళ మెళ్ళో మాల వేసిరావడమేనా? అసలలా ఎలా నచ్చుతారు ఒక్కసారి చూడగానే? ఏమో మరి! లవ్ ఎట్ ఫస్ట్ సైట్‌గా పుట్టాలేమో? ఇంతేనా స్వయంవరమంటే? ఇల్లాంటి ప్రశ్నలు పుడతాయి. అదే మన ఖర్మగాలి విశ్వవిద్యాలయాలవాళ్ళకి ఈ ప్రశ్నలు మనసుల్లో తొలిచాయనుకో. {మరి వాళ్ళేగా అన్నిటికీ అర్థాలూ, పరమార్థాలూ నిర్ణయించాల్సింది.} ఏం చేస్తారూ? ఒక కమిటీ వేస్తారు. ఆ కమిటీలో మెంబర్లుగా మహామహోపాధ్యాయులని పేరుబడ్డవాళ్ళని ఎత్తుకొచ్చి వేస్తారు. వీళ్ళంతా నాలుగైదు నెల్లపాటు తర్జనభర్జనలు పడిగానీ ఆ విషయాన్ని ఓ కొలిక్కి తీసుకురారు. ఈ మధ్యకాలమంతా వీళ్ళందరికీ దారి ఖర్చులూ, రోజు భత్యాలూ, హోటళ్ళూ, వగైరా వగైరా తలకుమాసినవన్నీ అందించాలి. ఎక్కడనుంచొస్తుంది డబ్బు? మరి జనంకోసమే చేస్తుంటిరాయెను, జనమే చచ్చినట్టు ఇవ్వాలి.

చివరాఖరికి ఏం తేలుస్తారు! ఎన్సైక్లోపీడియా బ్రిటానికా వంటి గ్రంథాలు మన భాండాగారాల్లో వెలిగిపోతుంటాయి చక్కటి బౌండు అట్టలతో. వేలుపోసి తెప్పిస్తారాయెను. కాబట్టి అవే స్టాండర్డు మరి! అల్లాంటివాటిల్లో ఒక గ్రంథంలో ఇల్లా రాసిఉంది కాబట్టి అదే ఫైనలు చేస్తారు. అందులో ఏముంటుంది? " స్వయంవరమనగా మగని తనకు తానే ఎన్నుకొనుట. పూర్వం హిందూదేశంలో ఈ ఆచారం ఉండేది. ఇది అనాగరకజాతి లక్షణం. కాని ఇది స్త్రీల విషయంలో జరుగుతున్నట్టు కనిపిస్తుంది. అందరు స్త్రీలకు జరుగునో జరగదో తెలియదు. కొందరు రాజకన్యలకు జరిగెడిదట. రామాయణకథలోని సీతాస్వయంవరము స్వయంవరమనుటకు వీలు లేదు. మొత్తము మీద స్వయంవరమన్న శబ్దమునకు అర్థం నిర్ణయించటం కష్టం. ఉజ్జాయింపుగా పెళ్ళి అని చెప్పవచ్చు." ఇదీ ఆ సర్వజ్ఞానభాండాగారాల్లో ఉండేది. పోన్లెద్దూ, వాళ్ళదేశం వాళ్ళకు తెలీడంకోసం వాడేదో రాసుకున్నాడూ అనుకుందామా అంటే, మనవాళ్ళకూ ఆ తెల్లతోలువాడు ఏది చెప్తే అదే పరమార్థమాయె. ఎన్ని గ్రంథాలు పరిశీలించినా, ఇంతకు మించిన సంతృప్తికరమైన సమాధానం దొరకలేదంటారు. మరేం, పరిశీలించేవన్నీ పరభాషాగ్రంథాలే, వాళ్ళు వాళ్ళకిష్టమెచ్చినట్టు రాసినవే.

ఆ విశ్వవిద్యాలయంలోనే ఒక చిన్న గుమాస్తా ఉన్నాడనుకోండి. కాస్త తెలుగూ, సంస్కృత జ్ఞానం ఉన్నవాడు. వాడు చెప్తాడు, "ఇంత ప్రయాస పడటమెందుకు? ఆ మహాగ్రంథాలు తిరగెయ్యడమెందుకు? రఘువంశం చదువుకుంటే సరిపోతుందాయె. చక్కగా మల్లినాథవారు వ్యాఖ్యానంకూడా రాసిపెడితిరాయె. ఎంత చక్కగా వర్ణిస్తాడు "ఇందుమతీ స్వయంవరా"న్ని. అంతగా శబ్దార్థమే కావాలంటే అమరంలో చూసుకుంటే పోతుందాయె. {స్వయంవరా - స్వయం వృణుతే పతిమితి స్వయంవరా. వృఞ్ వరణే. తానే మగని

కోరుకొనునది. అనగా వరించుటయందు నేర్పుగల స్త్రీ అని. అల్లాంటి నేర్పుగల స్త్రీకి జరిగేదాన్ని స్వయంవరం అంటారు} ఇంత తేలిగ్గా తేలిపోయేదానికి, కమిటీలు ప్రయాసలు దేనికి" అని. వాడి మాటెవరు లెక్కచేస్తారు, వాడేమన్నా పీహెచ్‌డీలు తెచ్చుకున్నాడా లండను, అమెరికాల నుంచి. ఒకవేళ పొరపాటున రఘువంశం చూడాలన్న బుద్ధి పుట్టినా అది చదవడం మనకు రాదుగా. ఇంగ్లీషులో తర్జుమా ఉంది, వ్యాఖ్యానం ఉంది. అదే చదువుతాం. ఆ తెల్లవాడి ముందు మన మల్లినాథుడు ఎందుకూ పనికిరాడాయెను. ఈ వ్యాఖ్యానం రాసిన తెల్లవాడుకూడా పైన చెప్పినట్టే రాస్తాడాయె. కాబట్టి అదే స్టాండర్డు. ఇల్లా తగలడింది మనవాళ్ళ తెలివి.

వార్నీ! స్వయంవరమన్న పదానికి అర్థం చెప్పటానికి ఇంత పాఠం చదివావూ అంటారేమో.. మరేం, అల్లాంటి వాళ్ళను చూసినప్పుడల్లా ఇలా ఆవేశం తన్నుకొస్తుంటుంది. ప్రతిదానికీ ఏ తెల్లోడో రాసిన పుస్తకం ఆధారంగా తెచ్చి చూపించటం. అదేమంటే వాళ్ళు చేసినంత కూలంకషంగా మనవాళ్ళు పరిశోధన చెయ్యరు అంటారు. వాడికి అసలేమీ తెలీదుకాబట్టి కూలంకషంగానో, సర్వంకషంగానో చేసుకుంటాడు. మనకు అర్థమయ్యే విధానంలో మనవాళ్ళు అరటిపండు వలిచి చేత్తో పెడితే మింగడానికి మనవాళ్ళకి దొబ్బుడాయియ్యి, తెల్లవాడి స్పూనుతో పెడితేనే మింగుతానంటే ఏమనిపిస్తుంది? లాగి ఒకటి పీకి కూచోపెట్టాలనిపిస్తుంది మనపిల్లవాడైతే. పక్కపిల్లవాడైతే పోన్లెద్దూ, వాడిఖర్మ వాడిది అని వదిలేస్తాం. సర్లెండి, ఇక మన విషయంలోకి వద్దాం.

ఇంతకూ మన దమయంతీదేవి, నలుణ్ణి వరించిందని భీమరాజుకి తెలుసునుగదా! మరి ఈ స్వయంవరమూ హడావుడీ ఎందుకటా! ఆయన్నే పిలిచి మాటాడి పిల్లనిచ్చి పెళ్ళిచెయ్యొచ్చు కదా! అలా కాదు, తాను రాజు, క్షత్రియుడు. స్వయంవరం క్షత్రియకాంతలకి ఉచితమైన విషయం. అదీగాక ఆమె ఏదో హంసవల్ల వినింది, ఇష్టపడింది. అంతేగాని నేరుగా చూచింది లేదు. ఇప్పుడు నేరుగా చూస్తే ఇందరు రాజుల మధ్య నలుని గొప్పతనం ఇంకా శోభిస్తే ఆమెకి ఇంకా బాగా తెలుస్తుంది కదా! ఎటూ తన వరుణ్ణి తాను ఎంచుకోగల సమర్థురాలనే నమ్మకం ఉండనే ఉందాయె. మరి బ్రహ్మదేవుడెందుకు ఇలా స్వయంవరం సంఘటితం చేశాడు, వాళ్ళిద్దరినీ సతీపతులుగా ముందే నిర్ణయించినపుడు?

"నలస్య పశ్యత్విదయన్తరం తై
ర్త్సైమీతి భూపాన్ విధిరాహ్వత్బ్బుజు|
స్పర్థాం దిగీశానపి కారయిత్వా
తస్యైవ తేభ్యః ప్రథిమానమాఖ్యత్ ||

అదీ సంగతి! బ్రహ్మదేవుడు నలునికీ, ఇతర రాజులకీ మధ్య తారతమ్యమును దమయంతి చూడాలని వారినందరినీ ఒకచోట చేర్చాడు. అలాగే దిక్పాలకులకు స్పర్థనేర్పరిచి, వారికంటె నలునికున్న గుణాధిక్యమును దమయంతికి కనపరచాడు. నలుని సౌందర్యము, గుణగణాలూ ముల్లోకములనూ మించినవని దమయంతి ప్రత్యక్షముగా గ్రహించటం కోసమే, స్వయంవర నెపంతో మూడులోకాలలోని ప్రజలని ఒకచోటికి ఆకర్షించాడు.

ఇక స్వయంవరం హడావుడి మొదలైంది. సకల రాజమణ్డలమూ, సప్తద్వీపాధిపతులూ, దేవతలూ, నాగులూ, యక్షులూ..ఇలా అన్ని లోకాలవాళ్ళూ ఏతెంచారు. విచ్చేసిన వారందరినీ ఆ భీమనృపతి ఎటువంటి తారతమ్యాలూ లేకుండా చక్కని నివాసాలేర్పరిచి గౌరవించాడు. కుణ్డిన నగరమంతా దమయంతి స్వయంవర వేడుకల కోసం చక్కగా అలంకరించారు. రకరకాల చిత్తరువులమీద దమయంతి చరిత్రను, లీలావిశేషాలను చిత్రించి నగరమంతా అలంకరించారు. వచ్చిన రాజులు ఆ చిత్రాలని చూస్తూ పగలంతా గడిపారట. ఇక రాత్రికి కొందరు దమయంతీ విరహంతో నిద్రపట్టక బాధపడుతుంటే, కొందరు హాయిగా దమయంతి తమనే వరించినట్టు కలలుగంటూ నిద్రించారు.

మఱుసటి దినాన, భీమరాజు యొక్క దూతలు ప్రార్థనాపూర్వకంగా ఆహ్వానించగా ఈ రాజలోకమంతా తమ విడిది గృహాలనుంచి స్వయంవర మండపానికి తరలి వచ్చారు. స్వయంవర మండపం అంటే చిన్న సభా భవనం కాదు. విశాలమైన ప్రదేశంలో ఎత్తైన బంగారు మంచెల మీద సింహాసనాలు ఏర్పరచి ఉన్నాయి. ప్రతిరాజూ తన పరివారంతో సహా తనకు నిర్ణీతమైన మంచెను అధివసించి దమయంతి రాకకై ప్రతీక్షిస్తూ ఉన్నారు. అపుడు నలుడు ప్రవేశించాడు ఆ స్వయంవర మంటపంలోకి. నలుణ్ణి చూచి, ఆయన సౌందర్యానికి రాజలోకమంతా అచ్చెరువొందింది. ఈతడు చంద్రుడా, మన్మథుడా, అశ్వినీకుమారుడా అని అనుమానపడ్డారట! కొంత ఈర్ష్యాళువులై పార్శ్వదృక్కులు ప్రసరింపజేశారు.

సర్వదేవతలూ స్వయంవర వేడుక తిలకించాలని వచ్చి, ఆ స్వయంవర మంటపం పైన వినువీథుల్లో తమ విమానాల్ని నిలిపి, దమయంతి ఎవర్ని వరిస్తుందా అన్న ఆత్రుతతో వేచి చూస్తున్నారు. లక్ష్మీ సమేతుడై నారాయణుడు ఆకాశంలో నిలిచి ఉన్నాడు. వాణీహిరణ్యగర్భులు కూడా ఉన్నారు. వాల్మీకి, బృహస్పతి, శుక్రాచార్యుడు మొదలైన మునులు స్వయంవర మంటపానికి విచ్చేసి, ఆ వేడుకలని, దమయంతి గుణగణాలని ఎంతగానో కొనియాడారు.

ఇక స్వయంవర ఆచారం ప్రకారం దమయంతిని పల్లకిలో తీసుకురావాలి. ముందు వేత్రహస్తురాలైన వృద్ధపరిచారిక నడుస్తూ ఉంటుంది. ఈమె పండితురాలై, సర్వమైన రాజలోకాన్ని గురించి తెలిసి ఉంటుంది. పల్లకీ ఒక్కో రాజు దగ్గర ఆగుతుంది. ఆ వృధ్ధపరిచారిక ఆ రాజు గుణగణాల గురించి వర్ణించి చెప్తోంది రాకుమారికి. అప్పుడు రాకుమారి ఆ రాజు రూపము, గుణగణాలు నచ్చినట్లఇతే ఆతణ్ణి వరిస్తుంది. ఇదీ పద్ధతి. కాని భీమరాజు ఆలోచించాడు. ఇక్కడ వచ్చిన వాళ్ళు వట్టి రాజులు కాదు. సకల దేవతా సంఘమూ విచ్చేసింది. యక్ష,నాగ, కిన్నర, విద్యాధరాధులూ వచ్చారు. ఈ ముల్లోకాల వీరుల గురించి దమయంతికి వివరంగా చెప్పగలవారెవరో దిక్కు తోచలేదు. వివరించకున్న దమయంతి వీరి గురించి ఎలా తెలుసుకొనగలదు. ఇలా చింతించి, చివరకు తమ కులదైవమైన శ్రీమన్నారాయణుని ఏకాగ్రతతో ప్రార్థించాడు ఆ భీమ భూపతి.

ఆ భీమరాజు ప్రార్థనను విని కరుణాంతరంగుడైన ఆ శ్రీమన్నారాయణుడు, పలుకులతల్లి సరస్వతిని ఉద్దేశించి ఇలా అన్నాడు." సరస్వతీ! పెక్కుదేశములనుండి వచ్చిన వీరందరి కులశీలములు విపులంగా తెలిసినదానవు నీవే. కావున వారి గురించి సవిస్తరంగా దమయంతికి వివరించుము". అది విని సరస్వతి నారాయణునికి నమస్కరించి బయలుదేరింది.

"మధ్యే సభం సా అవతతార బాలా
గన్ధర్వ విద్యామయ కణ్ఠనాళా |
త్రయీమయీ భూత వలీ విభఙ్గా
సాహిత్య నిర్వర్తిత దృక్తరఙ్గా||"

అలా బయలుదేరిన ఆ వరవీణాపాణి, సభామధ్యమాన బాలికారూపంతో ఆకాశమునుండి దిగింది. ఆమె ఎలా ఉందీ అంటే, కణ్ఠనాళాలు గానవిద్యారూపాలుగా ఉన్నాయట! ఆమెయొక్క త్రివళులూ ఋగ్యజుస్సామ రూపంగా వెలసిన మూడు వేదాలుగానూ, ఆమె నేత్ర విలాసాలు కావ్య నాటక చంపూ రూపాలుగా వెలసిన సాహిత్యముగానూ శోభిస్తున్నాయట!

ఇక్కడ తర్వాత పద్నాలుగు శ్లోకాల్లో సరస్వతీ స్తుతి ఉంటుంది. అద్భుతమైన వర్ణనలు. ఎన్నో పారమార్థికమైన విషయాలతో ఆ పలుకుతల్లిని, తేనెపలుకులతో వర్ణిస్తాడు హర్షుడు. అయితే శ్రీనాథుడు ఈ స్తుతినే దండకరూపంలో {భీమరాజు నారాయణుణ్ణి కాకుండా నేరుగా సరస్వతినే ప్రార్థించినట్టు} చెప్తాడు. దండకం మొత్తం సంస్కృతంలోనే సాగుతుంది.

"జయ జయ జనయిత్రి, కళ్యాణ సంధాత్రి, గాన్ధర్వ
విద్యా కళా కణ్ఠనాళాం, త్రివేదవళీం సార సాహిత్య సౌహిత్య నిర్వర్తిత
ప్రోల్లస దృక్తరఙ్గాం,............ విద్యామయీం త్వాం భజే.
.................................... నమస్తే శరణ్యే, నమస్తే
వరేణ్యే, నమశ్శర్మదాయై, నమో నర్మదాయై, నమశ్శాశ్వతాయై,
నమో విశ్రుతాయై, నమశ్శారదాయై నమస్తే నమస్తే నమః."

ఇలా అద్భుతంగా సాగుతుంది దండకం. చక్కటి సరస్వతీ స్తోత్రంగా పిల్లలకి నేర్పి చదివించుకోవచ్చు. హర్షుడు చెప్పినదాన్నే దండక రూపంలో చెప్పినా శ్రీనాథుడి దండకమే బాగుందనిపించింది. ఆ ఛందస్సులో ఉన్న అందమేమో మరి!

ఆ దండకానికి కరుణించి ఆ సరస్వతీ దేవి తన నిజరూపంతోనే సభా మధ్యన అవతరించిందట!

"జగతీనాథుని ముందట నిలిచె సాక్షాత్కారముం
బొంది యా
జగదేక స్తవనీయ శారద శరచ్చంద్రా తపాలోకము
న్నగవుం దేటయు దివ్యదేహా రుచియున్
సమ్మేళనంబొంది చె
ల్వగుచుండన్ గరుణా పరాయణత నయ్యాస్థాన మధ్యంబునన్".

{శృం. నై}

●●●

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*




## *నలోపాఖ్యానం*
## *దమయంతీ స్వయంవరము*
### *- కౌటిల్య చౌదరి*

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

**అది దమయంతీ స్వయంవర మంటపం.** సకల రాజలోకమూ విచ్చేసి ఉన్నది. భీమరాజు ప్రార్థనను మన్నించి నారాయణుడు పంపగా స్వయంవర మంటప మధ్య భాగాన బాలికా రూపాన దిగిన భారతీదేవి భీమరాజుతో ఇల్లా అంటోంది.

**"అవిన్దతా సౌ మకరన్దలీలాం**
**మన్దాకినీ యచ్చరణారవిందే**
**అత్రావతీర్ణా గుణవర్ణనాయ**
**రాజ్ఞాం తదాజ్ఞావశగా??? స్మికాపి**

"సుప్రసిద్ధమైన మందాకిని ఎవ్వని పాదారవిందములందు జన్మించిన మకరందవాహినిగా నున్నదో అట్టి శ్రీమహావిష్ణువుయొక్క ఆజ్ఞ చేత, ఈ స్వయంవర సభకే తెంచిన రాజుల చరిత్రలను వర్ణించుటకు వచ్చినదానను నేను. నీవు చింతపడవలదు."

అంత, భీమరాజు ఆ మహాదేవిని పూజించి, తన నిజ తనూజయగు దమయంతిని తోడ్కొని రావలసిందిగా అంతఃపుర పరిచారికా జనాలను ఆదేశించాడు. అప్సరఃస్త్రీలవంటి సౌందర్యవతులు ఇరుపక్కలా పాడుతూ, వింజామరలతో వీస్తూ ఉండగా దమయంతి సర్వాలంకార భూషితయై, పల్లకీలో స్వయంవర మంటపానికి విచ్చేసింది. అల్లా విచ్చేసిన ఆ దమయంతి సౌందర్యానికి విస్మయం చెందిన రాజవర్గం తమలో తాము ఇల్లా అనుకుంటున్నారు.

**"సాక్షాత్ సుధాంశుర్ముఖమేవ భైమ్యాః**
**దివః స్ఫుటం లాక్షణికః శశాఙ్కః ।**
**ఏతద్భ్రువౌ ముఖ్యమనఙ్గ చాపం**
**పుష్పం పునస్తద్గుణమాత్ర వృత్త్యా ॥"**

**"తరుణి వదనంబె సాక్షాత్సుధాకరుండు**
**లలి నభంబు శశాంకుండు లాక్షణికుఁడు**
**ముఖ్యమగు కామచాపంబు ముదితబొమలు**
**పువ్వు గుణమాత్రవృత్తి సద్బుద్ధిఁ**

దలప.''(శృం.నై.)

{సుధాకరుడు,శశాంకుడు - చంద్రుడు; అభంబు - ఆకాశం; లాక్షణికుడు - కళంకముతో కూడుకున్నవాడు}

ఇలాంటి పద్యాలు చూసినప్పుడే నైషధం తెలుగుసేతలో శ్రీనాథుడు ఆట్టే కష్టపడలేదనిపిస్తుంది....:). అనువాదాలంటే ఇలానే ఉండాలేమో మరి! అసలు కవిహృదయం దెబ్బతినకుండా ఇలానే పట్టుకురావాలేమో! లేకపోతే శ్రీనాథుడంతటివాడికి ఇలా మక్కికిమక్కి దింపాల్సిన పన్లేదుగా అనిపిస్తుంది. లేకపోతే హడావుడిగా, ఏ రెండురాత్రుల్లోనో రాసిపడెయ్యాల్సిన అవసరమూ పడి ఉండవచ్చు, అంత పెద్దగా బుఱ్ఱ ఉపయోగించాల్సిన అవసరం లేదనుకునీ ఉండొచ్చు...:). ఏది ఎలా ఉన్నా ఇదిమాత్రం చాలా చమత్కారంతో కూడుకున్న పద్యం. హర్షుడి ప్రతిభ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది ఇక్కడ.

దమయంతి ముఖమే ప్రత్యక్షమైన సుధాంశువు. ఆకాశంలో ఉన్న చంద్రుడు కళంకితుడు కాబట్టి స్వయంగా ఉపమానం కాలేడు. తక్కువగుణాలు కలవాడు కావటం చేత ఉపమేయమే అవుతాడు. కవి సంకేతాలలో ప్రసిద్ధ ఉపమానంగా స్వీకరించబడే చంద్రుడికన్నా దమయంతికి ఉన్న ఎక్కువగుణాలేవిటీ, చంద్రుడి తక్కువేంటీ! శశాంకుడాయే, అంటే మచ్చలున్నవాయె. దమయంతి ముఖంలో ఒక్క కళంకంకూడా భూతద్దంవేసి వెదికినా కనిపించదాయె. ఇంకా చంద్రుడికన్నా దమయంతి ముఖమే ఎక్కువ గుండ్రంగా ఉన్నదట! పైగా, ఆకాశాన ఉన్న చంద్రుడు పేరుకు అమృతకిరణుడేగాని, నిజంగా ఎప్పుడన్నా అమృతం కురిపించాడా, లేదే! మరి దమయంతీదేవి ముఖాన ఉన్న అధరాలు మాత్రం నిత్యమూ అమృతాన్నే వర్షిస్తూ ఉంటాయి కదా!

ఇక్కడ ఇంకోవిధంగా కూడా అర్థం చెప్పుకోవచ్చు. ఒక శబ్దానికి అర్థనిర్ణయం చేసేప్పుడు రెండు రకాలుగా చేస్తారు. ఒకటి అభిధావృత్తి, రెండవది లక్షణవృత్తి. శబ్దాన్ని ఉచ్చరించగానే ఏ అర్థం సమీపార్థంగా అనిపిస్తుందో, ఏది మొదట స్మరణకు వస్తుందో అది అభిదావృత్తిననుసరించి వచ్చిందని చెప్తారు. అలాగే శబ్దాన్ని ఉచ్చరించగానే అర్థోపస్థితి కలుగకుండా ఉన్నపుడు ఏ అర్థం కల్పితమవుతుందో అది లక్షణావృత్తిచేత వచ్చింది. ఇక్కడ ''సుధాంశు'' పదాన్ని ఉచ్చరించగానే అధర సంబంధమైన అమృతము కలదగుటచేత దమయంతి వదనమే దానికర్థమని అభిధావృత్తిచేత చెప్పబడుతున్నదని భావము. కాని శశాంకుడు లక్షణావృత్తి చేత మాత్రమే సుధాంశువని పిలవబడుతున్నాడు.

అలాగే దమయంతీదేవి కనుబొమలే అభిధావృత్తి చేత మన్మథుని చాపమని చెప్పబడుతున్నవి. కాని, మన్మథ చాపమని చెప్పబడుతున్న పుష్పం మాత్రం నిజంగా ఆలోచించి చూస్తే అలా అనిపించదు. కామోద్దీపన మొదలైన గుణాలను బోధించటంవల్ల, గౌణవృత్తిననుసరించి (అప్రధానమైన) మన్మథచాపమైంది.

ఇదంతా అతిశయోక్తి అలంకారం. అసలు పిండితార్థమేమిటంటే, దమయంతి వదనం చంద్రుణ్ణి మించుతున్నదనీ, కనుబొమలు మన్మథుని విల్లువలె ఉన్నవని అన్నమాట!

ఇంకా ఆ రాజులు ఇల్లా అనుకుంటున్నారు,

''ఉల్లాస్య ధాతుస్తులితా కరేణ
శ్రోణౌ కిమేషా స్తనయోర్గుర్వా ఈ
తేనా న్తరాళే స్త్రిభిరఙ్గులీనా
ముదీత మధ్య త్రివలీ విలాసా ॥''

''చనుఁగవ ఘనమో జఘనము
ఘనమో యని నడిమిచక్కి గమిచి విధి

గరం

బునఁ దూఁచె దీనిమ్ గా కి

ట్లనువు పడునె వళులపేర నంగుళి

రేఖల్ ."(శృం.నై)

ఇదీ శ్రీనాథుడు మక్కికిమక్కి అనువదించిన పద్యమే. ఇలాంటి విప్రలంభ శృంగారం ఒలికిపోతోంది కాబట్టే శ్రీనాథుడు తన అనువాద నైషధానికి ముందు "శృంగార" తగిలించడం సమంజసం అనుకుని ఉండొచ్చు..:)

ఇలా రాజులు అనుకుంటుండగా, దమయంతి పల్లకీదిగి సరస్వతికి ప్రణామమాచరించినది. అంత పదునాలుగులోకాల జనులకు వంద్యురాలైన ఆ సరస్వతి దమయంతిని దీవించి, పిమ్మట పల్లకీ ఎక్కమని అనుజ్ఞ ఇచ్చి, తాను దక్షిణపార్శ్వాన నిలబడి ఇలా అంది.

**"తొయ్యలి వీరె వేలుపులు తూర్పున ముప్పది**

**మూడుకోటులీ**

**యయ్యల వేఱువేఱఁ గొనియాడఁగఁ బట్టు**

**సహస్రవర్షముల్**

**నెయ్య మెలర్ప నిందొకరినిన్ వరియింపఁ**

**దలంచితేని నా**

**దయ్యము నెత్తికోలు తుది దాఁకుట గాదె**

**సరోజలోచనా."(శృం.నై.)**

"ఓ దమయంతీ! ఈ తూర్పుభాగమందున్న వారే ముప్పది మూడుకోట్ల దేవతలూ! వారి చరిత్రలన్నీ వివరంగా చెప్పాలంటే వేయి సంవత్సరాల పైననే పడుతుంది. వీరిలో నీవు ఒక్కరిని వరించెదవేని ఆ దైవసంకల్పము నెరవేరుటే సుమా!"

అదివిన్న దమయంతి వారిని వరించలేనన్నదానికి సంజ్ఞగా వారికి చేతులెత్తి అంజలి ఘటించింది. అంత దేవతలు, ఆమె మానవుణ్ణే వరించాలన్న నిశ్చయంతో ఉన్నదని గ్రహించి ఆమె ముందుకు వెళ్ళుటకు సెలవొసంగిరి. బోయీలు పల్లకీ ముందుకు తీసుకువెళ్ళి సర్పరాజైన వాసుకి దాపున నిలిపిరి. అంత సరస్వతి వాసుకిని గూర్చి వర్ణించి చెప్పినది. ఆ వాసుకి వేయిపడగలను చూచి భయపడ్డ దమయంతికి శరీరమందు సాత్త్వికభావాలు ఏర్పడ్డాయి. {"స్తంభ ప్రలయ రోమాఞ్చః స్వేదోవైవర్ణ్య వేపథూ అశ్రు వైస్వర్య మిత్యష్టా సాత్త్వికాః పరికీర్తితాః." - మ్రాన్పడుట, చేష్టలుడుగుట, రోమాంచము, స్వేదము, తెల్లబోవుట, శరీరము కంపించుట, కన్నీరు కార్చుట, గొంతు తడబడుట అని సాత్త్వికభావాలు ఎనిమిది రకాలు. భయాందోళనలు కలిగినపుడు, శృంగారభావనలు కలిగినప్పుడు ఇవి సహజంగా కలుగుతాయి...} అది గ్రహించిన వాహకులు ఆమెను, తరువాత ఉన్న రాజసమూహము కడకు తోడ్కొనిపోయిరి.

అంత ఆ పలుకుల తల్లి, ఇంపైన వర్ణనలతో సప్తద్వీపాధిపతులైన ఆ రాజుల గురించి వర్ణించింది. వరుసగా పుష్కర, శాక, క్రౌంచ, కుశ, శాల్మలి, ప్లక్ష ద్వీపాధిపతులని వర్ణించింది. దమయంతి ఎవరియందూ ఆసక్తి చూపకపోవడంతో సరస్వతి ఇక జంబూద్వీపాన్ని పరిపాలిస్తున్న ఒక్కోరాజు గురించీ, వారి ధైర్య సాహసాల గురించి, వివరించి చెప్పసాగింది. జంబూద్వీపాన్ని చాలా మనోహరంగా వర్ణిస్తుంది ముందర.

**"దీవు లాఱును దనుఁజుట్టుఁదిరిగి కొలువ**

**దీవులకు రాజు నేరెటిదీవి యొప్పు**

**మేరు కైలాసగిరులు బంగారుగొడుగు**

**ధవళవర చామరంబునై తనకుఁ దనర.''**

''ఆఱు దీవులకు రాజు వంటిదైన నేరేటిదీవి(జంబూద్వీపం) ఆ దీవులన్నీ చుట్టూ పరివేష్టించి కొలుస్తూ ఉండగా, మేరువు బంగారుగొడుగై, కైలాసగిరి ధవళచామరమై ప్రకాశిస్తూ ఉన్నది.''

జంబూద్వీపాన్ని పాలిస్తున్న రాజవరేణ్యులొకొక్కరి గురించీ వర్ణిస్తూ చెప్పసాగింది. వరుసగా ఉజ్జయిని, గౌడ, మధుర, కాశీ, అయోధ్య, పాండ్య, కళింగ, నేపాళ, కామరూప, ఉత్కళ, కీకట దేశాధిపతులందరినీ వర్ణించి చెప్పింది. దమయంతి వీరిలో ఎవ్వరినీ వరించకపోవటంతో ఆ పల్లకీని ముందుకు నడపవలసిందిగా సరస్వతి వాహకులకు ఆజ్ఞాపొసగింది.....

మరి దమయంతి నలునియందే బద్ధమనస్కురాలు కదా, మిగిలినవారు ఎంత గొప్పవారైనా ఎల్లా వరిస్తుంది. ఇక ఆఖరికి ఆ స్వయంవర మంటపంలో మిగిలింది నలుడూ, ఆయన రూపందాల్చి వచ్చి ఉన్న ఇంద్రాగ్నియమవరుణులూ! ఈ అయిదుగురిలో అసలు నలుణ్ణి దమయంతి ఎలా గుర్తిస్తుందో మరి!

●●●

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

# వ్యాస కౌముది



## నలోపాఖ్యానం
## పంచ నలీయమ్
## కౌటిల్య చౌదరి

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

**స్వయంవర మంటపంలో ఉన్న సకల రాజన్యుల** చరిత్రలనీ, వారి ధీసంపదలనీ వరుసగా సరస్వతి, తన చక్కనైన పలుకులతో వర్ణించి చెప్పింది. నలునియందే బద్ధానురాగయయిన దమయంతి ఎవ్వరినీ వరించక ముందుకు సాగిపోయింది. నలాకృతి ధరించి ఉన్న ఇంద్రాగ్నియమవరుణులు నలువురూ, నలుడూ ఒక చోట ఆసీనులయ్యి ఉన్నారు.

"వాణి యిట్లను నక్కీరవాణి కెలమి
గూఢశబ్దార్థ సంశ్లేషరూఢి మెఱయ
నిర్జరాధీశ్వరులకును నిషధపతికి
వర్ణనావాక్యరచన నన్వయము గలుగ."

{శృం. నై}.

అంత ఆ సరస్వతి తన వర్ణనా చాతుర్యము చేత, ఇంద్రాదులకును, నలరాజునకు సంబంధముండేట్లు శబ్దార్థాలని శ్లేషిస్తూ, {ఇంద్రాదులందరూ అక్కడ నలరూపం ధరించి ఉన్నారు కదా! అందుకని ఆ అయిదుగురిలో ఎవరి గురించి వర్ణించినా నలుడి గురించి చెప్పినట్టే చెప్పాలి. దేవతల రహస్యాన్ని వెల్లడి చేయకూడదు కదా! అలా అని దమయంతికి సహాయం చెయ్యకుండానూ ఉండలేకపోయింది, ఆ కరుణాంతరంగ. అందుకని నలరూపంలో ఉన్న ఇంద్రుణ్ణి వర్ణించేప్పుడు, నలపరమైన అర్థమూ, ఇంద్ర పరమైన అర్థమూ రెండూ వచ్చేలా శ్లేషతో వర్ణించసాగింది. అలానే మిగతా వారిని కూడా} దమయంతికి ఇలా చెప్పసాగింది.

"అతివ! అపవ్యపాయుని ననల్పవిలోచన
పంకజాతుఁ(బీ
ణితనిజవీరసేనుని వినిర్జిత సర్వమహీభృదావళిన్
హత మదవద్విరోధిబలు నాత్మచమూచర
వారణానన
స్రుత మదగంధియుద్ధ మహిఁజూడుమువీని
మహిన్మహేంద్రునిన్." {శృం. నై}.

సరస్వతీదేవి, నలరూపంలో ఉన్న ఇంద్రుణ్ణి చూపిస్తూ అన్నమాటలివి. ఇక్కడ నలపరమైన అర్థమూ, ఇంద్రపరమైన అర్థమూ రెండూ ఉన్నాయి. విడివిడిగా చెప్పుకుందాం.

***ఇంద్రపరమైన అర్థము :–*** అతివ – ఓ దమయంతీ!; అపవ్యపాయుని, అ+పవి+అపాయుని – వజ్రాయుధము ఎప్పుడూ చేత ధరించువానిని ; అనల్ప విలోచన పంకజాతున్ – పెక్కు నేత్రములు కలవానిని(ఇంద్రుడు సహస్రాక్షుడు కదా!); ప్రీణిత నిజ వీరసేనుని, ప్రీణిత–సంతోషింపజేయబడిన, నిజ – తన స్వంతమైన, వీరసేనున్ – పరాక్రమవంతమైన సైన్యము కలవానిని ; వినిర్జిత సర్వ మహీభృదావళిన్ – మహీభృదము అంటే పర్వతము అని అర్థం. పూర్వం కృతయుగాన పర్వతాలకు రెక్కలుండేవి. అవి సంచరిస్తూ జనపదాలపై వాలుతూ జనులకు నష్టం కలిగిస్తూ ఉండేవి. అప్పుడు ఇంద్రుడు తన వజ్రాయుధంతో వాటి రెక్కలను దునిమి జనులను రక్షించాడు. ఆ విషయం ఇక్కడ అనుసంధిస్తూ సర్వ పర్వత సమూహాన్నీ జయించినవాడని చెప్పబడింది; హత మదవద్విరోధిబలున్ – బలాసురుడనే రాక్షసుని వధించినవాడును; ఆత్మచమూచర– తనసేనయందు చరించుచున్న; వారణానన – విఘ్నేశ్వరుని; స్రుత మదగంధి – ముఖమునుండి స్రవించుచున్న మదజలముయొక్క వాసనగల; యుద్ధమహిన్ – యుద్ధభూమిగలవానిని, అనగా వినాయకుడు కూడా ఇంద్రుని పక్షాన యుద్ధం చేస్తూ ఉంటాడని ఆశయం.; మహిన్ – భూమికి దిగివచ్చిన; మహేంద్రునిన్ చూడుము.

ఓ దమయంతీ! నిత్యమూ వజ్రాయుధమును ధరించువాడు, వేయికన్నులజేడు, తన సైన్యమును సంతసింపజేయువాడు, పర్వతాలను జయించినవాడు, బలాసురుని వధించినవాడు, సాక్షాత్తూ ఆ వినాయకుడే తన సేనయందుగలవాడు, నీకై భూమికి దిగివచ్చినవాడు అయిన ఆ మహేంద్రుని చూడుము.

***నలపరమైన అర్థము :–*** అపవ్యపాయునిన్ – తొలగిన అపాయముకలవాని; అనల్ప – పెద్దవైన; విలోచన పంకజాతున్ – నేత్రపద్మములు కలవానిని; ప్రీణిత నిజ వీరసేనున్ – తండ్రియైన వీరసేనుని సంతుష్టునిగా చేసినవానిని; వినిర్జిత సర్వ మహీభృదావళిన్ – సర్వరాజలోకాన్నీ జయించినవానిని; హతమదవద్విరోధబలున్ – మదించిన శత్రుసైన్యాన్ని వధించినవాడును; ఆత్మచమూచర – తన సేనయందు సంచరించుచున్న; వారణానన స్రుత – ఏనుగుల ముఖాల నుంచి స్రవించుచున్న ; మదగంధి యుద్ధమహిన్ – మదజలముయొక్క వాసనచే నిండిన యుద్ధభూమిగలవాడు, అనగా ఈతనికి మదగజబలము ఎక్కువగా కలదు అని ఆశయము. ; మహిన్ – భూమిలో; మహేంద్రునిన్ – ఇంద్రతుల్యుడైన వానిని; చూడుము.

ఓ దమయంతీ! నిరపాయుడును, విశాలమైన నేత్రాలు కలవాడును, తనతండ్రియైన వీరసేనుని నిత్యం సంతసింపజేయువాడును, సమస్తరాజలోకాన్నీ జయించినవాడును, శత్రుసైన్యములను కూల్చువాడును, అధికమైన గజబలము కలవాడును, భువిలో దేవేంద్రతుల్యుడైనవాడును అగు నలుని చూడుము.

ఆపైన ఆ భారతీదేవి, నలరూపం వహించియున్న అగ్నిని దమయంతికి చూపి ఇల్లా అంటోంది.

**"భాస్వరరూప సంపన్నుఁడుద్గతిమంతుఁ**
**డధికప్రతాపసమన్వితుండు**
**హేతి సంభూత ప్రభూత భూతియుతుండు**
**శుచి ధనంజయుఁడు**
**విస్ఫూర్తిశాలి**
**నానా మహా సమిన్మధ్యప్రదీప్తుండు**
**సతతంబు విబుధసంతతికి**
**ముఖము**

లాలిత బాలప్రవాళ తాంరకరుండు
తనకు శాత్రవ సముత్కరము
తృణము

తామరసపత్ర నేత్ర యీతం డనలుఁడు
లావు గలవాఁడు లోకపాలకులలోన
బహుతర స్నేహరుచి మహాబల సహాయ
సంపదుద్దాముఁడెలమి వీక్షింపు మితని."

అగ్నిపరమైన అర్థము :- తామరస పత్ర నేత్ర - పద్మదళములు వంటి నేత్రములుగల దమయంతీ!; భాస్వరరూప సంపన్నుడు - దేదీప్యమానమయిన రూపముగలవాడు ; ఉద్గతిమంతుడు - ఊర్ధ్వమనముగలవాడు. అగ్నిజ్వాలలు ఎప్పుడూ పైకి ఎగయటమే స్వభావసిద్ధం కదా!; అధికప్రతాప సమన్వితుండు - గొప్పదైన ఉష్ణస్పర్శగలవాడు ; హేతిసంభూత - జ్వాలల వలన పుట్టిన, ప్రభూత భూతియుతుండు - అధికమైన భస్మంతో కూడియున్నవాడు, అనగా తన జ్వాలలతో పార్థివ వికారాలైన సమస్త వస్తువులను దహించి అధికమైన భస్మం కలిగినవాడగుచున్నాడని ఆశయము. ; శుచి - పవిత్రతగలవాడు; ధనంజయుండు - ధనంజయుడనే పేరుగలవాడు; విస్ఫూర్తిశాలి - మిక్కిలి యదటుచే నొప్పువాడు ; నానా మహా సమిన్మధ్య ప్రదీప్తుండు - వివిధ రకాలైన శ్రేష్ఠాలైన సమిధల మధ్య ప్రకాశిస్తున్నవాడు ; విబుధసంతతికి - దేవతా సమూహానికి, సంతతము ముఖము -ఎల్లప్పుడు నోరగుచున్నవాడు. అనగా యజ్ఞాదులయందు తనయందు హోమము చేయబడిన హవిస్సులను దేవతలకిచ్చుచు వారికి ముఖమువంటి వాడగుచున్నాడని భావము. "అగ్ని ముఖావై దేవా", అనగా దేవతలగ్నియే ముఖముగా కలవారని వేదప్రమాణము.; లాలిత బాలప్రవాళ తాంరకరుండు - మనోహరమైన లేతచిగుళ్ళవంటి ఎఱ్ఱనైన కిరణాలు గలవాడు; తనకున్, తృణము, శాత్రవ సముత్కరము - శత్రుసమూహము, అనగా తృణము అవలీలగా భస్మము చేయగలవాడని అర్థము. ; యీతండు + అనలుండు - అగ్నిహోత్రుడు; లోకపాలకులలోనన్, లావుగలవాడు - సామర్థ్యముగలవాడు; బహుతర స్నేహరుచి - స్నేహమంటే నెయ్యి, రుచి అనగా కాంతి. ఎప్పుడూ వ్రేల్చబడుతూ ఉండే విస్తారమైన నెయ్యి వలన కాంతివిశేషముగా కల్గినవాడు; మహాబల సహాయ సంపదుద్దాముడు - మహాబలుడంటే వాయువు. వాయువుయొక్క సహాయంతో అడ్డులేక సాగిపోవువాడు అని అర్థం. అనగా, వాయుప్రేరితమైన అగ్నిని ఎవ్వరూ శాంతింపజేయలేరని భావము.

ఓ దమయంతీ! ఈతడు అగ్నిహోత్రుడు, దేదీప్యమానమైన రూపసంపదగలవాడు, మహోష్ణమును కలిగించగలవాడు, సర్వ వస్తువులనూ దహించగలవాడు, సర్వదేవతలకూ ముఖముగానున్నవాడు, విశేషకాంతివంతుడు. అటువంటి ఈతనిని వీక్షింపుము.

***నలపరమైన అర్థము*** :- భా-దీప్తితోను, స్వర-మధురమైన కంఠస్వరముతోను,రూప-సౌందర్యముతోను, సంపన్నుడు- కూడియున్నవాడు; ఉద్గతిమంతుడు - అభ్యుదయము కలవాడు; అధికప్రతాప సమన్వితుండు - గొప్ప క్షాత్రతేజస్సు గలవాడు; హేతి- ఆయుధమువలన, సంభూత- పుట్టిన, ప్రభూత భూతయుతుండు-అధికైశ్వర్యముతో కూడియున్నవాడు, అనగా ఆయుధబలంతో శత్రురాజులను జయించి విస్తారమైన ఐశ్వర్యమును సంపాదించినవాడని భావము.; శుచి-స్వధర్మముచేతనే, ధనంజయుండు- ధనమునార్జించినవాడు. అనగా నలుడు క్షాత్రధర్మము చేతనే ధనమునార్జించినాడని భావము; విస్ఫూర్తిశాలి- అమోఘమైన జ్ఞాపకశక్తిగలవాడు; నానా మాహాసమిత్ - అనేకములైన యుద్ధముల, మధ్య- నడుమ, ప్రదీప్తుండు - ప్రకాశించువాడు; సతతంబు విబుధ సంతతికి- పండిత సమూహమునకు, ముఖమువంటివాడు. అనగా పండితులలో అగ్రేసరుడని భావము.; లాలిత బాలప్రవాళ -

మనోహరమైన లేచిగుళ్ళవంటి, తాంరకరుండు-ఎఱ్ఱనైన చేతులుకలవాడు; తనకున్ శాత్రవ సముత్కరము తృణసమానము- అనగా శత్రు సమూహములను గడ్డిపోచప్రాయంగా నిర్మూలించగలడని భావము.; ఈతండు+అణనలుడు- ఈతడే ఆ నలుడు; లోకపాలకులలోన లావుగలవాడు - దిక్పాలకులలో అందరికన్నా బలముకలవాడు; బహుతర స్నేహరుచి- గొప్పవారైన, నిష్కపటులైన స్నేహితులు గలవాడని భావము; మహాబల- అటువంటి మహాబలవంతులైన స్నేహితులయొక్క, సహాయసంపదుద్దాముడు- సహాయముచేత ఈతడిని ఎవరూ అడ్డగింపలేరు. అనగా స్నేహాతిశయముతో, గొప్పబలవంతులను కూర్చుకుని దుర్నిరీక్ష్యుడై ప్రకాశించుచున్నాడని భావము.; ఎలమి - సంతోషముతో, ఈతని వీక్షింపుము.

తాత్పర్యం స్పష్టంగా ఉంది కాబట్టి, చర్విత చర్వణమవుతుందని మళ్ళా చెప్పటం లేదు.

●●●

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*




## నలోపాఖ్యానం
## పంచ నలీయమ్
## కౌటిల్య చౌదరి

(క్రిందటి సంచికనుంచి తరువాయి)

ఇక ఆ శారదాదేవి, నలరూపధారియై ఉన్న యమధర్మరాజు వంక చూపించి ఇల్లా చెప్తోంది.

*"పరభయంకర పటు గదాప్రహరణుండు*
*దండనిపుణుండు సమవర్తి ధర్మరాజు*
*మిత్రనందనుఁ డంభోజనేత్ర ! చూడు*
*మితని దక్షిణనాయకు నింపు మీఱ"*

**యమ పరమైన అర్థము :-** అంభోజనేత్ర! ఇతడు, పర- ఇతరులకు, భయంకర-భయము కల్గించు, పటు-సమర్థమైన, గద- రోగములను, అప్రహరణుండు- అంతటను ప్రయోగించువాడు. అనగా ఇతడు ప్రజవారిపై భయంకరములగు రోగములను ప్రయోగించుచు బాధించునని భావము.; దండనిపుణుండు- దండమనే తన ఆయుధాన్ని ప్రయోగించటంలో మిక్కిలినేర్పరి; సమవర్తి- అందఱియందు, వారివారి పాపపుణ్యఫలముల ననుసరించి సమముగా ప్రవర్తించువాడు; ధర్మరాజు- ధర్మమునకు అధిపతి; మిత్రనందనుడు- సూర్యుని కుమారుడు; దక్షిణనాయకు- దక్షిణదిక్కుకు అధిపతియైన ఈతనిని చూడుము.

**నలపరమైన అర్థము :-** పర భయంకర పటు గదా ప్రహరణుండు- శత్రువులయందు భయంకరమైన గద అనే ఆయుధాన్ని ప్రయోగించువాడు; దండనిపుణుండు- ప్రజలను శాసించుటాయందు నేర్పుగలవాడు; సమవర్తి- అందఱియందు సమానముగా ప్రవర్తించువాడు; ధర్మరాజు -బ్రహ్మచర్యాది రూపమగు ధర్మమునందు సమర్థుడు; మిత్రనందనుడు- మిత్రులను సంతసింపజేయువాడు; దక్షిణనాయకున్- ఇది నాయకా లక్షణాలలో ఒకటి. దక్షిణనాయకుడు, పెక్కుమంది భార్యలున్నా అందరియంది ఒకే విధంగా ప్రవర్తిస్తాడు. అనగా ఈయనకు ఎంతమంది భార్యలున్నా, నిన్నేమీ తక్కువగా చూడడని భావం కాబోలు!..:)..అట్టి ఈనలుని ఇంపుమీఱగా చూడుము.

తరువాత ఆసీనుడై ఉన్న వరుణదేవుని ఉద్దేశించి, ఆతని అసలు రూపు తెలిసేలా శ్లేషభంగితో సరస్వతి ఇలా పలుకుతోంది.

*" ధవళాక్షి! చూడు మీతని*
*భువనాధీశ్వరు నపార భూరిగభీర*
*త్వవిశేషనిధి నదీనునిఁ*
*బ్రవిమలతర వారి నధిక బల*
*సత్త్వాఢ్యున్."*

***వరుణ పరమైన అర్థము :-*** దమయంతీ! భువనాధీశ్వరున్ - జలములకధిపతియైనట్టివానిని, భువనమనగా జలమని ఒక అర్థం. ''జీవనం భువనం వనం'' అని అమరకోశపాఠం.; అపార భూరి - హద్దులేనిది గొప్పదియైన, గభీరత్వ విశేష- గాంభీర్య గుణాతిశయమునకు, నిధిన్- స్థానమైనవానిని; నదీనునిన్- నదులకు అధిపతియైన వానిని; ప్రవిమలతర వారిన్- మిక్కిలి నిర్మలమైన జలముగలవాడును; అధికబల- గొప్పదైన బలముకల, సత్త్వ- జలజంతువులచే, ఆఢ్యున్- నిండినవాడును; అగు ఈ వరుణదేవుని చూడుము.

**నలపరమైన అర్థము :-** ఓ ధవళాక్షీ! భువనాధీశ్వరున్- లోకమునకు అధిపతియు; అపార భూరి- విస్తారమైన బంగారము, గభీరత్వ విశేష- గాంభీర్యగుణము, నిధిన్- నిధులుగా గలవాడు; అదీనున్- దైన్యము లేనివానిని; ప్రవిమల- స్వచ్ఛమైన,ధగధగలాడుచున్న, తరవారిన్- ఖడ్గముకల్గినట్టి; అధికబల- గొప్పదైన దేహబల సామర్థ్యముచేతను, సత్త్వ - ప్రయత్నము చేతను(యుద్ధాదులయందు అధిక ప్రయత్నముచేత వర్తించు), ఆఢ్యున్- నిండినవాడునగు ఈ నలరాజును చూడుము.

ఈ విధంగా శ్లేషభంగితో ఆ అరవిందభవుని రాణి ఆ నలువురి గురించి చేసిన వర్ణనలు విని, వారిని చూసి దమయంతి వారిలో ఎవరు నలుడో తేల్చుకోలేక డోలాయమాన స్థితిలో పడింది. ఆమె చిత్తము చలించిపోయినది. వారిలో ఒకరిని వరించుటకుగాని, కాదని చెప్పుటకుగాని సమర్థురాలు కాలేకపోయింది. అప్పుడు సరస్వతి, స్వతఃసిద్ధమైన ప్రకాశముగలవాడు, మన్మథాకారుడు అయిన నలుని దమయంతికి చూపింది. అంతట, మధురాలాప విశారదయైన ఆ శారదాదేవి, ఇంద్రాదులకు కూడా అర్థం సరిపోయేట్టు శ్లేషతో నలుని గూర్చి చెప్పసాగింది.(పాపం! దమయంతిని ఎంత తికమక పెట్టదలచుకుందో, ఆమె మనోనిశ్చయాన్ని ఎంతగా పరీక్షించదలచుకుందో ఆ తల్లి)..

*''నలిననేత్రీ! ప్రత్యర్థి దానవశతాహి*
*తాత్మ చేష్టాగరిష్ఠత నరసి చూడ*
*నితఁడు జీమూతవాహనుఁడింత నిక్క*
*మింపు పొంపిరివోవ వీక్షింపు మితని.''*

**నలపరమైన అర్థము :-** దమయంతీ! ప్రతి+అర్థి- ప్రతి యాచకుని గూర్చియు; దానవశతా- దానపరాధీనత్వముచే, అనగా దానగుణముచే యాచకులకు వశుడగుచున్నాడని అర్థము.; ఆహితాత్మ చేష్టాగరిష్టతన్- ఈ దానమనే గొప్ప పనివలన; అరసి చూడన్- ఆలోచించి చూస్తే ఈ నలరాజు, జీమూతవాహనుడనే రాజుకు సాటివచ్చువాడు. {జీమూతవాహనుడొక విద్యాధరరాజు. ఈతడు తన ప్రాణాలని ఒక పామును రక్షించటంకోసం దానమిచ్చిన మహాదాత. ఇంత నిక్కము- ఇది సత్యము; ఇంపు పొంపిరివోవ- ఆనందాతిశయంతో ఆతనిని చూడుము.

**ఇంద్రపరమైన అర్థము :-** ప్రత్యర్థి- శత్రువులయిన; దానవశత- వందల సంఖ్యలోగల రాక్షసులకు; అహిత- ప్రతికూలమయిన; చేష్టా- వ్యాపారముచేత; గరిష్ఠతన్- శ్రేష్టత్వమును; అరసి చూడన్- ఆలోచించగా; ఈ మహారాజు, జీమూతవాహనుడు- మేఘములు వాహనముగా గల ఇంద్రుడే!

ఈ నలుడు, అగ్నిహోత్రునివలె ప్రకాశముగలవాడు, ఈశానుడనెడి లోకపాలకుని అపరస్వరూపుండు, యమునివలె శత్రువుల ప్రాణములను హరించువాడు, వరుణుడు ఎలా అయితే సహస్రాదిగాగల నదులచే సేవింపబడుతున్నాడో, ఈ నలుడు సహస్రాధికమైన సేనాసమూహములచే సేవింపబడుచున్నాడు. కావున ఈ అయిదుగురి పురుషులలో నీకు నచ్చినవానిని వరింపుము'' అని ఆ పలుకుదొయ్యలి ఊరకున్నది. అయితే పురాకృత పుణ్యవశాననో, పాతివ్రత్య గుణ ప్రభావంవల్లనో, లేక తమ యిద్దఱి జన్మాంతర

సంపర్కంవల్లనో దమయంతి చూపు నలరూపుదాల్చి ఉన్న, ఆ యింద్రాదులలను దాటి ఆ నలునిమీదనే స్థిరంగా నిలిచింది. కాని వారిలో అసలు నలుణ్ణి ఎలా వేరుపరిచి గుర్తించి వరిస్తుందో మరి!

ఈ ఘట్టంలో నైషధంలో హర్షుడు ఇంద్రాదులొక్కొకరి గురించి ఐదేసి శ్లోకాలతో నలుడి గుణాలతో శ్లేష వచ్చేట్టు వర్ణిస్తాడు. అలానే మరలా నలుణ్ణికూడా నలువురు దిక్పాలకులతో శ్లేష వచ్చేట్టు విడివిడిగా నాలుగు శ్లోకాలలో వర్ణిస్తాడు. శ్రీనాథుడు పైన వర్ణించిన శ్లోకాలలో ప్రయోగాలు దాదాపు హర్షుడివే. చివరిగా చెప్పిన అయిదవ శ్లోకం మొత్తం నైషధ కావ్యానికే మకుటాయమానం. ఈ ఒక్క శ్లోకంలోనే ఆ అయిదుగురి లక్షణాలనీ శ్లేషతో వర్ణిస్తాడు. అందుకే "నైషధం విద్వదౌషధం" అన్నారు!

*"దేవః పతిర్విదుషి నైషధరాజగత్యా*
*నిర్ణీయతే న కిము న వ్రియతే భవత్యా.*
*నాయం నలః ఖలు తవాతి మహానలాభో*
*యద్యే నముజ్ఝ వరః కతరః పునస్తే."*

●●●




# బౌద్ధం - దుష్ప్రభావాలు

## డా.పాతూరి తేజేంద్ర

**సహస్రాల చరిత కలిగిన భారతావనిలో** ఎందరో మహానుభావులు, యుగకర్తలు ఉదయించి వారి జ్ఞానజ్యోతులతో అజ్ఞానాంధకారాన్ని ప్రారద్రోలారు, ప్రాతఃస్మరణీయులయ్యారు. అలాంటి వారిలో గౌతమ బుద్ధుడు విశిష్టస్థానంలో అలరారుతున్నాడు. భారతీయులకు బుద్ధుడు, బౌద్ధంతో ఉన్న అనుబంధం ప్రత్యేకమైనది. సర్వార్ధ సిద్ధుడుగా జన్మించి, బుద్ధుడుగా మారి తన బోధనలు వినిపించి తన జీవిత పర్యంతం సంచరించిన ఉత్తర ప్రదేశ్, బీహార్ రాష్ట్రాలతో సమానంగా ఆంధ్రదేశంలో బౌద్ధ స్థూపాలు, విహారాలు ఉన్నాయి. ఇది ఆంధ్రులలో ఉన్న బౌద్ధమతాదరణను, బౌద్ధమతాధిక్యాన్ని తెలియజేస్తోంది. ఆంధ్రులపై, భారతీయులపై ఇంతటి ప్రభావం చూపిన ఆ మహామనీషి పాదాలకు అంజలి ఘటించి ఎందరో ప్రశాంతతను పొందారు. అయితే ఉత్తర ప్రదేశ్, బీహార్ ప్రాంతాలకు ఆంధ్రదేశానికి మధ్య ఉన్న ప్రాంతాలలో బౌద్ధం నామమాత్రంగా ఉంది. బుద్ధుడు నడయాడిన ప్రాంతాలలో బౌద్ధానికి ఆదరణ, ఆయన ప్రభావం అనేది సహజమైన విషయం. ఎంతో దూరంలో ఉన్న ఆంధ్రులలో మాత్రమే బౌద్ధానికి ఆదరణ, వ్యాప్తి ఎందుకు కలిగాయో గతంలో ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావుగారు తెలియజేసారు. వీరు పేర్కొన్న అంశాలపై దృష్టి సారిస్తే అనేక అపరిష్కృత చారిత్రకాంశాలకు పరిష్కారం లభించే అవకాశం కలుగుతుంది. ఏమైనప్పటికీ నేటికీ ఆంధ్రులలో సిద్ధార్ధుడు, బుద్ధుడు పట్ల అమితమైన పారవశ్యం (Fascination) Heroic Nature నెలకొన్నాయి.

బుద్ధుని జీవితంతో పెనవేసుకున్న అతిమానుష శక్తులు, అభూతకల్పనలను తొలగించి చూస్తే మనకు కనిపించే బుద్ధుడు చారిత్రక పురుషుడే తప్ప, విష్ణుమూర్తి అవతారం కానీ మరొకటి కానీ కాదు. తన బోధనలతో, నడవడికతో తన తరంలో వారికిగానీ తరువాతి తరాలవారికి గానీ భగవానుడయ్యాడు. బుద్ధుని అనంతరం అతని అనుచరులే ప్రజలలో మరింతగా విశ్వాసం పెరిగేందుకు అనేక కల్పనలతో కూడిన బుద్ధ చరిత్రను ప్రజలలో వ్యాప్తి చేసారనేది చరిత్రకారులు కూడా అంగీకరించిన వాస్తవం. కాబట్టి బుద్ధుడు - అతని బోధనలను చారిత్రక నేపథ్యంలో పరిశీలించి అవి భారతీయులపై ఎలాంటి ప్రభావం చూపించాయి, వాటి వలన కలిగిన దుష్పరిణామాలు, బౌద్ధమతానుయాయుల దేశద్రోహచర్యలు వంటి అంశాలన్నీ నిష్పక్షపాతంగా అంచనా వేయవలసి ఉంటుంది.

బుద్ధుని బోధనలు అనేక విషయాలలో భారతీయుల మనస్తత్వాన్ని, ఆలోచనా విధానాన్ని శాశ్వతంగా మార్చివేసాయి అనడంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. అహింస, శాంతి, భూతదయ వంటి అంశాలలో ఈ మార్పున గమనించవచ్చు. మనం గమనించవలసిన అంశం ఏమిటంటే ఎంత గొప్ప సిద్ధాంతమైనా సరే, ఆ సిద్ధాంతకర్త సజీవంగా ఉండే రోజుల్లో దాని ఆచరణకు,

సిద్ధాంతకర్త లేనపుడు అతని అనుచరగణం ఆ సిద్ధాంతాల మూలాలను సరిగా అర్థం చేసుకోకుండా, చేసుకున్నా వారి స్వార్థంతో వారికి నచ్చినట్లుగా మార్చుకుని ఆచరించడానికి ఎంతో మార్పు ఉంటుంది అంటే సిద్దాంత కర్త చెప్పిన మూల ఆశయాలకు భిన్నమైన దారిలోకి వెళ్ళటంతో అసలు సిద్దాంతం మరుగున పడే అవకాశం ఉంది. బౌద్ధం ఇందుకు మినహాయింపు కాదు.

సర్వార్థసిద్ధుడు (సిద్ధార్థుడు) అర్ధరాత్రి ఇంటిని వదిలి వెళ్ళిన తరువాత రైవతకుడు, రాజకుడనే మహర్షుల ఆశ్రమాలు దర్శించి తదుపరి వైశాలి నగరంలో కలాపమనే వేద శాఖను అధ్యయనం చేసిన 'అరూఢుడు' అనే బ్రాహ్మణ తపస్వి వద్ద వేదాంత శాస్త్ర విద్యలు గ్రహించినప్పటికీ అతని సందేహాలు తీరలేదు, తృప్తి కలుగలేదు అని చరిత్రకారులు పేర్కొంటున్నారు. దీనిని బట్టి బుద్దుడు వేదాంతాన్ని అధ్యయనం చేసాడనేది స్పష్టమౌతోంది. వేదాలలో ఉండే విశ్వమానవ సౌభ్రాతృత్వం, శాంతి వంటివి బుద్దుని ప్రభావితమొనర్చాయి. 'బుద్దుడు వేద ప్రామాణ్యం అంగీకరించలేదు. వేదాలను నిరసించాడు' అని చదువుకున్నాం. బుద్దుడంటేనే బుద్ధికలవాడని కదా అర్థం. అలాంటి బుద్దుడు వేదాలను ఎలా ఖండించి ఉంటాడు? నిజానికి బుద్దుడు అంగీకరించనిది వైదికాచారాల పేరుతో జరుగుతున్న యాగాలు, ఆ యాగాలలో జరుగుతున్న అపారమైన పశుసహనం. వేదాలు, ఉపనిషత్‌లు ఘోషించే 'సర్వేజనాస్సుఖినోభవన్తు', 'ఓం శాంతి శాంతి శాంతి' అనే మంత్రాన్ని బుద్దుడు ఎలా ఖండిస్తాడు. ఎందుకు ఖండిస్తాడు. తమ మత సిద్ధాంతాల ప్రాబల్యం కోసం అతని అనుయాయులు, చాలా అనంతర కాలంలో చేసిన దుష్ప్రచారమిది. బుద్దుని బోధలను పరిశీలిస్తే వేదాలలోని ఎన్నో విషయాలు మనకు కనిపిస్తాయి. ఇది ఇప్పటికే నిరూపించబడిన సత్యం.

బుద్దుడు ఈనాడు మనకు భగవానుడు, ఆ మాటకొస్తే కొన్ని వేల సంవత్సరాల క్రిందే భగవానుడయ్యాడు. అయితే బుద్దుడు ఈ నేలపై నడయాడే రోజులలో అతడిని భగవానుడిగా ఎంతమంది అంగీకరించారు. భారతదేశంలో మొదటినుంచి సాధువులు, సన్యాసులపై అమితమైన గౌరవం, భక్తి భావనలు ఉండటం మనకు తెలిసిన విషయమే. ఆవిధంగా నాటి ప్రజలలో ఎందరో బుద్దుని తొలినాళ్ళలో గౌరవించారు. భక్తితో సేవించారు. ప్రజలు ఎప్పుడైనా, ఏ మత సిద్ధాంతమైనా తమకు అనుకూలంగా ఉంటేనే ఆదరిస్తారనేది సార్వకాలిక సత్యం. బౌద్ధానికి కూడా అందుకే ఆదరణ లభించింది. భారతదేశం నాటికి, నేటికి వ్యావసాయక దేశం. వ్యవసాయానికి ప్రాణం పశుసంపద. అలాంటి పశుసంపదను ప్రజాభీష్టానికి విరుద్ధంగా యజ్ఞాల పేరుతో చంపుకుంటుంటే అది ఎలాంటి దుష్ప్రభావం చూపుతుందో నాటి వైదిక ధర్మవేత్తలు పట్టించుకోలేదు, దానికి కారణం వారి స్వార్థమే. ఫలితంగా ప్రజాభిమానాన్ని, ప్రజాదరణను కోల్పోయింది. శూన్యత ఏర్పడింది. ఆ శూన్యతను భర్తీ చేసేవారిని నాటి ప్రజలు అందలమెక్కించుకుంటారు. అదే సమయంలో బుద్దుని బోధలు ఆ శూన్యతను భర్తీ చేసాయి. ప్రజలకు కావలసిన విషయాన్ని, వారికర్థమయ్యే సరళభాషలో బోధించాడు. ఎంతమంది రాజులు, ప్రజలు, వ్యాపారస్తులు.. ఇలా ఎందరో అతని అనుయాయులయ్యారు. ఇప్పుడు బుద్దుడు కేవలం ప్రజల భక్తి, గౌరవ శ్రద్ధలు పొందే సన్యాసి మాత్రమే కాదు, సంక్షుభితమైన వ్యవస్థను తిరస్కరించిన తిరుగుబాటుదారుడు, సంఘ సంస్కర్త కూడా అయ్యాడు. తన బోధనలతో ఎంతోమంది అనుయాయులను సంపాదించుకున్నాడు. వారందరికీ బుద్దుడు చెప్పిందే వేదం, శిరోధార్యం. బౌద్ధంలోని అంశాలు వారికి ఎంతగానో నచ్చాయి. విపరీతమైన వేగంతో దేశంలోని కొన్ని ప్రాంతాలలో మాత్రమే విస్తరించింది. అనేక ప్రాంతాలలో విస్తరించలేదు అలా ఎందుకు జరిగిందనేది ప్రత్యేక పరిశీలనాంశం. అలా విస్తరించిన వాటిలో ఆంధ్రదేశం ఒకటి. బుద్దుని బోధనలైన అహింస, భూతదయ, శాంతి వంటివాటికి ప్రజలలో ఆదరణ లభించింది. ఇవన్నీ వేదాలలో ఉన్నప్పటికినీ వాటికి ప్రజలలో ఆదరణ, ఆచరణ లభింపజేసింది మాత్రం బౌద్ధమతమే అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

అహింస, భూతదయ, శాంతం అనేవి ఎంతో గొప్పభావనలు. మానవాళి సుఖశాంతులతో ఉండటానికి పనికివచ్చే దివ్యౌషధాలు. ఈ ఔషధాలను భారతీయులు మోతాదుకు మించి సేవించటం చేత అవి దుష్ప్రభావాలు చూపాయి. ఫలితం నేటికీ అనుభవిస్తున్నాం. నిజానికి పైన పేర్కొన్న అహింస, శాంతి వంటివి ప్రపంచంలోని ప్రజలందరూ ఆచరిసేనే ఫలితం ఉంటుంది. కేవలం ఒక జాతి

(భారతీయులు) ఆచరిస్తే, ఆ జాతిని ఇతరులు దుర్బలులు, చేవలేని వారు అనుకునే ప్రమాదం ఉంది, అనుకుంటున్నారు కూడా. బుద్ధుడు బోధించిన శాంతి, అహింసలు ఇతర జాతులు వారికి ఆచరణలోకి రాని, రాదగని ఊహామాత్ర సిద్ధాంతంలాగానే ఉండిపోయాయి. భారతదేశ చరిత్రను నిశితంగానూ, నిస్పాక్షికంగాను అధ్యయనం చేస్తే నేటివరకు ఎందరో, భారతీయులను 'చేవలేనివారుగా' చూడటమనే చేదు వాస్తవం మనకు కనబడుతుంది. దీనికి కారణం 'శాంతి' మంత్ర జపమే. అంటే కనపడిన ప్రతి ఒక్కరిపైకి కయ్యానికి కాలుదువ్వమని కాదు, ఎవరైనా మనపై కాలు దువ్వాలంటేనే భయపడే స్థాయిలో ఉండే మానసిక స్థైర్యం మనకు లేదు. పిరికితనాన్ని శాంతి అనే కవచం అడ్డుపెట్టుకుని బ్రతుకుతున్నాం. ఇవన్నీ మనదేశపాలకులు ఎవరైనా సరే వారి చర్యలలో, విదేశాంగ విధానంలో గమనించవచ్చు భారతదేశం 'soft nation' అనే ముద్ర పొందింది.

బుద్ధుని బోధల వలన శాంతి భారతీయుల నరనరాలలో ఇంకిపోయింది. వికృత ఫలితాల నిచ్చింది, ఇతరులకి అలుసుగా కనపడింది. మన చేష్టలలో, భావాలలో, ఆలోచనలలో భారతీయులను ఇంతగా శాంతి మంత్రం జపింపజేసిన మతం బౌద్ధమే. ఈ శాంతిమంత్రం భారతీయులలో పోరాట పటిమను, ప్రతీకారకాంక్షను దెబ్బతీసింది. ఆత్మవినాశకంగా పరిణమించింది. "పరోపకారం, దయ, అహింస, శరణాగత రక్షణ, శత్రువుల మీద దయచూపడం, ప్రాణాలు తీయడానికి వచ్చిన శత్రువునుకూడా క్షమించి విడిచిపెట్టడం ఇత్యాది సద్గుణాలను దేశ, కాల, పాత్రలకు విరుద్ధంగా ఆచరణలో పెట్టడమే సద్గుణ వికృతి అనబడుతుంది. మనుష్యుడి సర్వనాశనానికి దారి తీసే ఏ గుణమైన దాన్ని దుర్గుణంగానే భావించి వదిలివేయాలి." సావర్కర్. చివరకు భారతీయులకు శాంతి మంత్రం వీరసావర్కర్ చెప్పినట్లు 'సద్గుణ వికృతి'గా రూపుదాల్చింది.

బౌద్ధమతం ప్రముఖంగా ప్రబోధించే మరో సూత్రం అహింస. బుద్ధుడు జీవించి వున్న రోజులలో, తరువాత కొంతకాలం వరకు పాక్షికంగానైనా ఆచరింపబడిందని చెప్పవచ్చు. ప్రాణి మనుగడలోనే ఆత్మరక్షణ విషయమై హింస ఉంటుంది. హింస లేకుండా, ఇతర ప్రాణులను తెలిసో తెలియకో హింసించకూడదనే ప్రయత్నం జైనమతం మాత్రమే చేసింది. ఫలితంగా కఠిననియమాలతో సాధారణ ప్రజల ఆదరణ పొందలేకపోయింది. బౌద్ధం ఈ విషయంలో మరీ అంత కఠినంగా లేదు. మధ్యే మార్గంలో వెళ్ళిందనే విషయం తెలిసిందే కదా. బౌద్ధం ప్రవచించిన అహింస కూడా భూతదయతో కూడుకున్నది, అనగా ప్రాణహింసను సమర్ధించదు. అంటే మాంసాహారాన్ని నిషేధించింది. శాఖాహారాన్ని సమర్ధించింది. ఇది సామాన్య జనానికి (అధికశాతం ప్రజలకు) నచ్చని అంశం. జిహ్వాచాపల్యానికి సంబంధించిన విషయమిది. పైగా అందరికీ శాఖాహారం సరఫరా కాగల నమ్మకం కూడా లేదు. ఎలాంటి మతమైనా సరే ఎక్కువకాలం ప్రజలను మాంసాహారానికి దూరంగా ఉంచలేదు. బుద్ధుడు తన జీవిత పర్యంతం బోధించిన అహింస సిద్ధాంతానికి వ్యతిరేకంగా జీవిత చరమాంకంలో ఒక భక్తుడి ఇంట పందిమాంసం తిన్నాడనే విమర్శ ఉంది కదా. మాంసం రుచి మరిగిన వారు దానిని వదలలేరు. ఇందువలన మాంస భక్షణ పరిత్యాగమే అహింస అని ఆర్యుల బోధ. యజ్ఞయాగాదులలో జరిగే జంతువధ వలన ఎలాంటి పాపం ఉండదని మహాభారతం మినహాయింపు నిచ్చింది.

మహాభారతం చెప్పినా, బుద్ధుడు చెప్పినా ఇంకెవరైనా చెప్పినా అధికశాతం ప్రజలు మాంసాహారులే కదా. ముందు చెప్పుకున్నట్లు జిహ్వాచాపల్యం అణచివేత దుష్కర కార్యం. బౌద్ధం యొక్క అహింసా సిద్ధాంత ప్రభావం తరువాతి కాలం రచయితలపై గమనించవచ్చు సంస్కృత రామాయణ, భారతాలకీ, ఆంధ్ర రామాయణ, భారతాలకి ఇలాంటి విషయాలలో మార్పు వచ్చింది. మూల గ్రంధాలలో (సంస్కృత) నాయకులు సందర్భానుసారంగా మాంసాహారం తీసుకోవడం విభిన్న సందర్భాలలో గమనించవచ్చు. బౌద్ధ ప్రాభవం క్షీణించి లుప్తమైన తరువాతి కాలంలో వచ్చిన ఆంధ్రరామాయణ, మహాభారతాది గ్రంధాలలో నాయకులు శాఖాహారులుగా మారిపోయారు. ఈ మార్పు హఠాత్తుగా సంభవించినది కాదు. బౌద్ధం ప్రవచించిన అహింస సమాజంలోని కొన్ని వర్గాలపై చూపించిన శాశ్వత మార్పును సూచిసోంది. ఏది ఏమైనప్పటికి నేడు భారతీయ దేవుళ్ళుగా ఉన్నవారిని (రాముడు, కృష్ణుడు..) మాంసాహారులుగా మనం చూపితే

ప్రజలు అంగీకరించని పరిస్థితి ఉంది. ఇది ఖచ్చితంగా బౌద్ధమత ప్రభావమే. అయితే ఇది ఇంతవరకే, ప్రజలందరిలో వ్యాపించలేదు. వ్యాపించదు కూడా. గ్రామదేవతల పూజలో మాంసాహారం తప్పదు కూడా. బౌద్ధాన్ని అనుసరించిన అశోకుడు, హర్షుడు వంటి చక్రవర్తులు మాంసాహార భక్షణను కఠిన శిక్షలతో అణచడానికి ప్రయత్నించి విఫలురయ్యారు "మాంస భక్షణ చేసినా, ఏ ఇతర ప్రాణిని చంపినా హర్షుడు ఉరిశిక్ష విధించేవాడని తెలుస్తుంది. ఆ శిక్షను రాజు కూడా తొలగించలేడు ఈ నియమానికి సడలింపు లేదు" - సావర్కర్.

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

# వ్యాస కౌముది



## బౌద్ధం - దుష్ప్రభావాలు

### డా.పాతూరి తేజేంద్ర

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**విదేశీయుడైన విన్సెంట్ స్మిత రచించిన** Early History Of Indiaఅనే గ్రంథంలో ఈ విషయం పేర్కొనబడింది"..7th Century King Harsha who obviously aimed at copying closely the intentions of Asoka did not shrink from inflicting capital punishment without hope of pardon of any person, who dared to infringe his commands by staying anything on using fleshes food in any part of his domain.."

ఇటువంటి కఠిన శిక్షలున్నప్పటికి మాంసాహార నిషేధం సంపూర్ణంగా విజయవంతం కాలేదని నిస్సందేహంగా చెప్పవచ్చు. వద్దన్న పని చేయాలనుకోవడం మానవనైజం. పైగా ఇక్కడ జిహ్వాచాపల్యం కూడా ఉంది. వ్యభిచారం, మద్యపానం, మాంసాహారం వీటిని ఎంతటి నిరంకుశ చక్రవర్తి అయినా సంపూర్ణంగా అమలు చేయించలేడు. ఇవి మానవ నైజం, ప్రాణినైజం. ఈ విషయాన్ని గ్రహించకుండా మూర్ఖత్వంతో నిర్భందంగా నిషేదాలు విధించి, అమలు జరపాలనుకున్న ఆశోకుడి నుంచి నేటి వరకు గల పాలకులను గమనిస్తే వారు ఎలా విఫలమయ్యారో మనకు తెలుస్తుంది. మాంసాహారం అనేది మానవ జీవితంలో ఒక చిన్న అంశం. అయితే దానికి అహింస, భూతదయ అనే మతసిద్ధాంతాలు తోడై ప్రజలతో బలవంతంగా మాన్పించాలని అనుకోవడం వలన ప్రజలపై అనేక దుష్ప్రభావాలు చూపాయి. చేపలు పటి జీవించే మత్స్యకారులు, వేట వృత్తిగా జీవించే వేటగాళ్ళు, మాంసాహార వ్యాపారులు, చర్మవృత్తిలో ఉండే చర్మకారులు వీరందరికి బలవంతపు నిషేధాజ్ఞలు, కఠిన శిక్షలు పిడుగుపాటు వంటిదయింది. వారి వృత్తి జీవనోపాది నిషేధింపబడటంతో వారి జీవనోపాధి దారుణంగా దెబ్బతిని ఆకలి బాధలతో అల్లాడిపోయుంటారు. ఇలాంటి వారందరికీ ప్రభుత్వం ఎలాంటి ప్రత్యామ్నాయం చూపించగలదు, ఎంతకాలం పోషించగలదు. అలాంటి ప్రయత్నాలు దేశ ఖజానాకు ఆర్థికంగా ఎంతో భారంగా పరిణమించాయి. ఇది దీర్ఘకాల ఆచరణలో అసాధ్యం. నిశిత పరిశీలన చేయకుండా నిషేదాలు విధించడంతో బౌద్ధం ఇలాంటి ఎన్నో వర్గాల వారికి దూరమైపోయింది. ఇలాంటి అర్థంలేని అహింసా విధానాచరణలతో మాంసాహార భక్షణ, చర్మవృత్తులు మానలేని వారిని ఊరికి దూరంగా ఉంచి అస్పృశ్యతను మరింతగా పెంచడానికి బౌద్ధం కూడా కారణమయింది, అంతేగాని కొందరు బౌద్ధమతాభిమానులు పేర్కొన్నట్లు బౌద్ధం కులమత బేధాలను పాటించదు, వర్ణ విచక్షణ ఉండదు అని భావించడం తప్పు. చర్మవృత్తికారులు, మాంసవిక్రయవృత్తిలో ఉండేవారికి తమ అర్థంలేని అహింసా విధానాలతో బౌద్ధం ఎలాంటి మినహాయింపు ఇవ్వలేదు, ప్రత్యామ్నాయం చూపలేదు. కాబట్టి

అంటరానివారి పట్ల సమానత్వంలాంటి అంశాలు బౌద్ధం ఉచ్చస్థితిలో ఉండే రోజుల్లో కూడా ఉండదు అనడానికి ఎలాంటి సందేహం అవసరం లేదు. ఈదేశం నుంచి బౌద్ధం అంతరించడానికి గల కారణాలలో ఇది ఒక ముఖ్యమైన కారణం.

సన్యాస్రాశమం అనేది భారతీయులకు వేలాది సంవత్సరాలుగా ఉన్న విషయమే సాధు సన్యాసులకు మన సమాజంలో గౌరవాదరాభిమానాలు నాటి నుంచి నేటి వరకు లభిస్తూనే ఉన్నాయి. బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ ఆశ్రమాలను దాటుకుని చివరిదశలో సన్యాస్రాశమం స్వీకరించటం సంప్రదాయంగా వచ్చిన ఆచారం. ఇది ఒక పద్ధతి. ఇలా కాకుండా బ్రహ్మచారి దశ నుంచి నేరుగా సన్యాసిగా మారటానికి సనాతన ధర్మం (నిజానికి ఇది మతం కాదు, జీవనవిధానం) అంగీకరించదు. ఎందుకంటే వ్యక్తికి తన బాధ్యతతోపాటు సమాజంలో భాగస్వామిగా కాబట్టి సామాజిక బాధ్యత కూడా అతనిపై ఉంటుంది. కుటుంబ బాధ్యతలు నెరవేర్చవలసి ఉంటుంది. ఇలా వ్యక్తులు వారి బాధ్యతలు, వృత్తులు సక్రమంగా నిర్వర్తిస్తేనే సమాజం సక్రమంగా పురోగమిస్తుంది. బౌద్ధం వలన కొంత స్థాయిలో కుటుంబ వ్యవస్థకు కూడా అస్థిరత్వం ఏర్పడింది. సిద్ధార్థుడు గృహాన్ని వదిలి అర్ధరాత్రి వెళ్ళిపోవడాన్ని మహాభినిష్క్రమణ అని ఎంతో గొప్పగా వర్ణించబడింది. సిద్ధార్థుడు కేవలం ఒక మనిషి కాదు. అతడినే నమ్ముకున్న భార్య, కుమారుడూ, తండ్రి ఎంతో శోకించారు. వారిపట్ల తన బాధ్యతలు నెరవేర్చకుండా వెళ్ళిపోవడం సమంజసం కాదనేది నిష్ఠురసత్యం. బ్రహ్మచారి (విద్యార్థి) ఓ దశనుంచి వివాహం చేసుకుని గృహస్తుగా మారి సంతానాన్ని పొంది సమాజంలో భాగమవ్వాలి. ఇంత ప్రాధాన్యం ఉన్న అంశం కాబట్టి సన్యాసిగా మారాలంటే బౌద్ధానికి ముందున్న భారతీయ సమాజంలో ఎన్నో నియమాలు ఉండేవి. ముఖ్యంగా సన్యసించాలనుకునే వ్యక్తి తనకున్న బాధ్యతలన్నీ నెరవేర్చాలి, బ్రహ్మచారి అయితే తల్లినుంచి అనుమతి పొందడంకాక రాజానుమతి కూడా పొందాలి. వానవాసానికి కూడా ఇదే నియమం. అలా చెప్పడానికి కారణం లౌకికమైన సాంఘిక స్థితిలో వ్యత్యాసస్థితి సంభవించకుండా చూడటం. ఇంటిలో వారిమీద అలిగి సన్యాసం తీసుకుంటానంటే, వారిపై ఆధారపడిన వారి బాధ్యత ఎవరిది? ఇది సమాజానికి, రాజ్యవ్యవస్థకు అదనపు భారం కనుకనే ఇన్ని కఠిన నియమాలుండేవి. భర్త తన ధర్మాన్ని విడిచివెళ్ళగా ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్న సంగతి మనకు విదితమే. "అశోకుని తర్వాత ఈ నిషేధాలు పోయాయి. అందువలన ఏ వయసులోని వ్యక్తికైనా భిక్షువుల సంఘంలో చేరటానికి సంపూర్ణ స్వాతంత్ర్యం ఇవ్వబడింది.భిక్షు సంఘంలో చేరినవారి అన్న వస్త్రాలు, వసతి మొదలైన సౌకర్యాలు ఉచితంగా చేయబడేవి. అందుకయ్యే ఖర్చు రాజకోశం నుంచి ఇవ్వబడేది అందులో నివసించే వారికి అశోకుడు తన రాజకోశం నుంచి కోట్లాది రూపాయలు ఖర్చు చేసేవాడు" - సావర్కర్. ఇటువంటి ఉచిత పథకాలకు సమాజంలోని అధికశాతం ఆకర్షితులవుతారు. ఎందుకంటె బిక్కు (భిక్షువు)గా మారితే అన్నీ ఉచితం, మరింక శ్రమ ఉండదు అనే ఆశతో ఎందరో భిక్షువులుగా మారేవారు. ఇది సమాజం యొక్క క్రియాశీలతకు, పురోభివృద్ధికి గొడ్డలి పెట్టువంటిది. జవసత్వాలుండి, కష్టపడగలిగేవారు సన్యాసులైతే ఆ సమాజానికి ఎంతో నష్టం కలుగుతుంది. వీరందరినీ ఆరామాలు, చైత్యాలు ఇతరత్రా స్థానాలలో ఉంచి నిష్క్రియాపరులుగా పోషించడానికి రాజ్యంపై ఎంత ఆర్థిక భారంపడిఉంటుందో మనం ఊహించుకోవచ్చు. ఇది సుదీర్ఘకాలంలో రాజ్యం యొక్క పునాదులనే కదిలించివేయడం చారిత్రక సత్యం. ఉచిత సంక్షేమ పథకాలతో రాజ్యాలు దివాళా తీయడం నాటి నుంచి నేటి వరకు జరుగుతూనే ఉందనే విషయానికి వర్తమానమే సాక్షి.

భారతదేశ చరిత్రను అశోకుని తర్వాత, అశోకుని ముందు అని విభజించుకుని అధ్యయనం చేస్తే మనం గ్రహించే మరో ముఖ్య విషయం ఏమిటంటే భారతీయులు ప్రతీకార శక్తిని, కోల్పోవటం (Loss Of Ferociousness) దీనికి కారణం అందరూ అంగీకరించిన శాంతిమంత్ర జపం. బౌద్ధం వలన విపరీతంగా ప్రభావితమయిన అశోకచక్రవర్తి నాడు తన రాజ్యంలో, ఇతర దేశాలలోను విస్తృతంగా చేయించిన ధర్మ ప్రబోధాల వలన, మితిమీరిన అహింసా సిద్ధాంత ఆచరణ వలన ప్రజలలో ఆయుధం పట్టే అవసరం కనిపించలేదు. కానైతే సైనికబలం వల్లనే సురక్షితంగా ఉంటుంది. అటువంటి సైనిక బలాలను నిర్వీర్యం చేసే విధంగా అశోక చక్రవర్తి అవలంబించిన మతవిధానాలు అసవిస్తరననే ప్రోత్సహించాయి. తన తాత మౌర్యచంద్రగుప్తుడు అంతటి సామ్రాజ్యాన్ని ఎలా నిర్మించాడో తెలియనంతగా

అశోకుడు బౌద్ధమతావేశ మోహంలో మునిగిపోయాడు. ఇదెలాంటిదంటే హైందవ రాజ్యస్థాపనే లక్ష్యంగా ఆవిర్భవించిన విజయనగర రాజ్యంలో శ్రీకృష్ణదేవరాయలు 'యవనరాజ్య స్థాపనాచార్య' అనే బిరుదు పొందడంలాంటిది. ఫలితంగా అజేయ సైనిక శక్తితో అలరారే భారత సైన్యంలో, ప్రజలలో ఆత్మవిఘాత సాత్విక భావాలు' ఏర్పడ్డాయి.

అశోకుని చర్యలన్ని బౌద్ధమతాభినివేశంతో, బౌద్ధమతాచార్యుల ప్రబోధం వలన జరిగినవనేవి అందరూ అంగీకరించే వాస్తవం. ఆ విధానాలు ఈ దేశానికి తన సామ్రాజ్యానికి వినాశకారణమని అశోకుడూ గ్రహించలేకపోయాడు, ఫలితం అశోకుని మరణానంతరం మూడు దశాబ్దాలలోపే భారతదేశంపై విదేశీయులు దాడులు చేయడం, వారు విజయం సాధించడం జరిగింది. అశోకుడు 'ధర్మ విజయం శస్త్ర విజయం కన్నా గొప్పది' వంటి భావాలను ప్రచారం చేయించడం వలన భారతీయులు ప్రతీకార వాంఛను, క్షాత్రతేజాన్ని కోల్పోయారు. ప్రపంచంలో మరెక్కడా ఇంతటి ఆత్మవిఘాత చర్యలు చేపట్టినట్లు కనిపించదు. మితిమీరిన శాంతి, అహింస, ధర్మవిజయం అనే ఊహాప్రతిపాదిత సిద్ధాంతాలు భారతీయులు మనస్సులపై బలవంతంగా రుద్దబడ్డాయి. దేశం చుట్టూ ఉన్న అనాగరిక, ఆటవిక మూకలపై ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది. ఫలితంగా దేశం పారతంత్రంలో కూరుకుపోయిందనేది చేదు నిజం.

బౌద్ధమతావలంబకులు ఎందరో భారతదేశ చరిత్రలో దేశద్రోహులుగా మిగిలిపోయారు. హిందువులలో మాత్రం దేశద్రోహులు లేరా అనే ప్రశ్న ఇక్కడ ఉద్భవిస్తుంది. అయితే హిందూ అనేది మతమే కాదు కాబట్టి హిందూ మతావేశం అనేది మొదటి నుంచీ లేదు. ఎక్కడన్నా ఒకరిద్దరు అలాంటివారున్నా సమాజం పట్టించుకోని పరిస్థితి. కానీ బౌద్ధంలో దీనికి విరుద్ధ పరిస్థితి. బౌద్ధులలో కొందరు కేవలం మతావేశంతో విదేశీ దురాక్రమణదారులకు త్రికరణ శుద్ధిగా సహాయం చేసారనేది వాస్తవం. ఇటువంటి ఘట్టాలు చరిత్రను తవ్వుకుంటే అనేకం లభిస్తున్నాయి. 'దాహిర్' సింధురాజ్యాన్ని పాలిస్తున్న రోజులలో మహ్మద్ బిన్ ఖాసిం దండెత్తి వచ్చినప్పుడు వైదిక ధర్మంపై ద్వేషంతో విదేశీయుడైన ఖాసింకు అడుగడుగునా బౌద్ధులు సహాయం చేస్తూ దాహిర్ సామ్రాజ్య వినాశనానికి కారకులవ్వడానికి చరిత్ర మౌనసాక్షి. ఈ విషయంలో భారతీయ చరిత్రకారులకు పక్షపాత దోషాన్ని ఆరోపించవచ్చు అందుకే పాశ్చాత్య చరిత్రకారుల రచనలలో ఇలాంటి సంఘటనలు అనేకం లభిస్తాయి. ఆ బౌద్ధులు చేసిన ఆత్మవినాశక సహాయ సహకారాలు చివరకు వారిని కూడా నిశ్శేషంగా నిర్మూలించివేసాయి. గాంధార ప్రాంతం నుంచి సింధువరకు బౌద్ధం నశించిపోయింది. నాటి నుంచి నలంద విశ్వవిద్యాలయం ధ్వంసం చేయబడిన కాలం వరకు ఎప్పుడు దురాక్రమణదారులతో బౌద్ధులు యుద్ధం చేసినట్లు ఆధారాలు లేవు. వైదిక ధర్మావలంబకులు (హిందూ) ఉన్నంత కాలమే 'నలంద, తక్షశిల'లు నిలిచాయి. వారి పతనంతోనే అవీ పతనమైపోయాయి. బౌద్ధుల "అహింస" అనే సిద్ధాంతం యొక్క దుష్ప్రభావానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనం వేరేమీ అవసరం లేదు. తమ మూలాలు మరచి, కేవలం వైదికమతంపై ఒడలెరుగని ద్వేషంతో విదేశీయులకు సహాయం చేసి చివాకు వారే భరతభూమి నుంచి అంతరించిపోయారు. ఒక్క ఖాసిం విషయంలోనే కాదు, గ్రీకులు ఆక్రమణలు చేసినపుడు, కనిష్కుడు, మినాండర్ ఇలా ఎన్నో సందర్భాలలో ఒడలెరుగని మతావేశంతో విదేశీయులకు సహాయం చేసి వైదిక ధర్మ నాశనానికై వారి శాయశక్తులా కృషిచేసారు. వైదిక ధర్మ పతనంతోనే వారూ నాశనమయ్యారు. వారి విద్యాలయాలు ఇతరత్రా అన్నీ ధ్వంసమయ్యాయి.

ఇప్పటివరకు పేర్కొన్నది సాంఘిక ఆర్థిక, రాజకీయ అంశాలలో బౌద్ధం వలన కలిగిన దుష్పరిణామాలు, దుష్ప్రభావాలు. కేవలం ఈ కారణాల వలనే భారతదేశం నుంచి బౌద్ధం నశించలేదు. బాగా బలహీనపడింది. బౌద్ధమత విలుప్తానికి ప్రధాన కారణం బౌద్ధారామాలలోని అనైతికత, వారిలో పెరిగిన విశృంఖలత. బుద్ధుని బోధనలకు అనుకూల భాష్యాలు చెప్పుకుంటూ తమ మతంలోలేని మాంసాహారం వంటివి చేర్చుకుని క్రమంగా విశృంఖలతకు అలవాటుపడ్డారు. బౌద్ధారామాలలో భిక్షువులుగా చేరిన స్త్రీలతో వీరి కామకేళీ ప్రవర్తనలు ప్రజలలో వీరిపట్ల అసహ్యాన్ని పుట్టించాయి. సామాన్య ప్రజలు వారు నివాసముండే ప్రాంతాలను "లంజెదిబ్బలు" నై ఈసడించుకునారు. అలాంటి లంజెదిబ్బలలో ఉండేవారిని ఎలాంటి దృష్టితో చూసారో ప్రత్యేకించి వివరించనవసరం లేదు. ప్రజలలో ఈ

స్థాయికి బౌద్ధులు దిగజారడానికి ఏ వైదిక ధర్మాచార్యుల కుట్రలు లేవు. వారి స్వయంకృత అపరాధాలే కారణం. ఇంత జరిగినా ప్రజలలో బుద్ధుని పట్ల ఆరాధనా భావం పూర్తిగా తగ్గలేదు.

పన్నెండవ శతాబ్దంలోని తీరాంధ్రప్రాంతాలలో లభించిన కొన్ని శాసనాలలో బుద్ధుని ప్రస్తావన ఉంది.

"భీమాపురము డాకరేమి వాల్గొలన్ముదాచ్యారామపు
రిశ్రీముదమరడాలు యను న్ముధధరణి పంచారామముల
మహాదేవరలకు బుద్ధదేవరకును. జేంబ్రోలన్మసేనునకునుం
బిదపురముకార శంకరికిం గరము రూఢకెక్కిన

బెజవాడ మల్లేశ్వరదేవరకు నఖండదీపతులు వెట్టి" అంటూ సాగే భీమపరంలో లభించిన శాసనం పాలకొల్లు, ద్రాక్షారామం, అమరావతి వంటి పంచారామాలలోని దేవతలతోపాటు బుద్ధదేవునికి కూడా అఖండదీపదానం చేసినట్లు పేర్కొంటున్నది. నాడు ప్రసిద్ధికెక్కిన చేబ్రోలు (గుంటూరు జిల్లా) కుమారస్వామి ఆలయం, బెజవాడ మల్లేశ్వర స్వామి దేవాలయాల పాటుగా బుద్ధదేవునికి దానం చేయబడింది. ఈ శాసనం ఆధారంగా నాటికీ ప్రజలలో బుద్ధుని పట్ల ఆరాధనా భావం ఏమాత్రం తగ్గలేదని అమరావతి స్థూపానికి పూజాదికాలు జరుగుతున్నట్లు మనం గ్రహించవచ్చు.

ఈ శాసనం భారతీయుల పరమత సహిష్ణుతను కూడా తెలుపుతోంది. కేవలం ఒక శంకరాచార్యుల వారు చెప్పినంత మాత్రాన ప్రజలు బౌద్ధాన్ని వీడరు. ఏ విశృంఖలత్వంతో వైదిక ధర్మం ప్రజలకు దూరమయిందో అదే అనాచారంతో బౌద్ధం ప్రజలకు దూరమయింది. బౌద్ధారామాలు, స్తూపాలు లంజెల దిబ్బలుగా పిలవబడ్డాయని ముందు చెప్పుకున్నాం. అటువంటి ప్రదేశానికి సంసారులు వెళ్ళటం మానివేసారు. ఇటువంటి పరిస్థితులలోనే బౌద్ధారామాలు శివాలయాలుగా మార్చబడ్డాయి, ఎందుకంటే ప్రజలకు ఎప్పుడు దైవం అవసరముంటుంది. ఆధ్యాత్మిక శూన్యతను ఎవరో ఒకరు భర్తీ చేయవలసిందే, ఆ పనిని స్మార్తంగా రూపు మారిన వైదిక ధర్మమే చేసింది. ఇవన్నీ ప్రజామోదంతోనే జరిగే మార్పులు, ఇంతటి భారీ మార్పులు ప్రజల ఆమోదమోనే జరుగుతాయి. ఏ లౌకిక ధర్మం సర్వకాల, సర్వావస్థలకు అనుకూలమైన సిద్ధాంతాలను బోధించలేదు, కాలానుగుణంగా మార్పులు చేసుకుంటూ పోవాల్సిందే. కాలానుగుణంగా మారని మతాలు ప్రజాకంటకాలుగా మారతాయని చరిత్రేకాదు వర్తమానం కూడా ఘోషిస్తున్న వాస్తవం.

ఆయుధం పట్టని విప్లవ కారుడిగా అహింసా సిద్ధాంత వ్యాప్తికర్తగా ప్రపంచానికే వెలుగైన బుద్ధుని బౌద్ధం అతని తరువాత ఎన్నో మార్పులు పొందింది, అనేక శాఖలుగా విస్తరించింది, మితిమీరిన అహింస, జంతుదయ వంటి విధానాలతో క్రమక్రమంగా ప్రజలకు దూరమవుతూ, బౌద్ధారామాలలో నైతిక విలువల పతనంతో పూర్తిగా ప్రజలకు దూరమైపోయింది. ఇదంతా వందల సంవత్సరకాలంలో జరిగిన పరిణామాలు. ఇబ్బందంతా ఎక్కడంటే ధర్మం, సత్యం శాశ్వతాలు, కానీ లౌకిక ధర్మం వేరు. కాలంలో వచ్చే లౌకిక ధర్మంలోని మార్పులే మతాలుగా పరిణమిస్తాయి. అన్నింటికంటే ఘోరమైనది సనాతన ధర్మాన్ని ఎవరో హిందూ మతం అంటే దాన్ని అంగీకరించినంత దుర్మార్గం మరొకటి లేదు. ఈ కారణంగానే ఇటీవల నేను హిందువును కాను అనడంకూడా మనం గమనిస్తున్నాం. ధర్మ ఏదైనా దాన్ని ఆచరించే ప్రజలను బట్టే దాని గుణాధిక్యలు నిర్ణయించబడతాయి. బౌద్ధం కూడా ఇందుకు మినహాయింపు కాదు. బౌద్ధం సర్వరోగనివారిణి కాదని దానికి కూడా ఇతర ధర్మాతాలకు వలే అనేక లోపాలున్నాయని, భారతదేశానికి ఎంతో నష్టం కూడా కలిగిందనే విషయం సహృదయంతో అంగీకరించడానికి ఎంతో మానసిక పరిణితికావాలి.

**ఆధార గ్రంధాలు:**

1. భారతీయ చరిత్రలో ఆరు స్వర్ణపత్రాలు - వీరసావర్కర్ (2002)
2. భగవాన్ బుద్ధుడు - బౌద్ధము - రాజాశ్రీ వాసిరెడ్డి దుర్గాసదాశివేశ్వర ప్రసాద్ బహుదూర్ (1993)

3. ధర్మదీక్ష - తిరుమల రామచంద్ర (1968)
4. **South Indian Inscriptions Vol – IV – A.S.I - 1989**
5. Early History Of India – Vincent smigh – Atlantic Publishers (1999)
6. పన్నెండవ శతాబ్దపు శాసనాల అధ్యయనం - డా. పాతూరి తేజేంద్ర (అముద్రిత సిద్ధాంతవ్యాసం) 2009
7. క్షేమేందుని బోధిసత్వావదానకల్పలత - తిరుమల రామచంద్ర (అనువాదం) 1962
8. ఆంధ్రమహాభారతం, అనుశాసనిక పర్వం (వచనం) - త్రివేణి ట్రస్ట్ - 1991

***(సమాప్తం)***




## మను చరిత్రము

## (కళాఖండానికి ఒక పామరుడి ప్రశంస)

**బాలాంత్రపు వేంకట రమణ**

<u>*మూలం:*</u>

*1 ) "మనుచరిత్రము" - శ్రీ వావిళ్ళ రామస్వామి శాస్త్రులు & సన్స్ చెన్నై ప్రచురణ, 2001.*

*2 ) "పద్య కవితా పరిచయం - 1" by డా. బేతవోలు రామబ్రహ్మం, 1997 ఎడిషన్ (పెద్దన - మనుచరిత్ర: ప్రవర సిద్ధులు కథ)*

**ఓం నమో విఘ్నేశ్వరాయనమః**

**సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణి**

**విద్యారంభం కరిష్యే సిద్ధిర్ భవతుమే సదా !**

శ్రీ కృష్ణ దేవరాయల వారి ఆస్థానంలో 'భువన విజయ' సభామండపాన్ని అలరించిన అష్టదిగ్గజ కవులలో అల్లసాని పెద్దనామత్యునిది అగ్రస్థానం. ఆయన 'ఆంధ్ర కవితా పితామహ' బిరుదాంకితుడు. నందవరీక బ్రాహ్మణుడు. తండ్రి పేరు చొక్కన. బళ్ళారి ప్రాంతం లోని దోసపాడు పరగణాలోని దోరాల ఇతని నివాస స్థలం. "మనుచరిత్రము" గా ప్రసిద్ధి గాంచిన "స్వారోచిష మనుసంభవము" అనే ప్రబంధం ద్వారా తెలుగు భాషామతల్లి మకుటంలో కల్కి తురాయిగా నిలిచాడు. పెద్దనామాత్యుడు "మనుచరిత్రము" కాక "హరికథాసారము" అనే ప్రబంధాన్ని కూడా రచించి తన గురువైన శఠకోపయతికి అంకితం చేశాడు.

మార్కండేయ పురాణంలో ఉన్న "స్వారోచిష మనుసంభవం" అన్న కథని రాయలవారే పెద్దనకి సూచించారు. "....భవచ్చతుర రచన కనుకూలంబున్" - "నీ రచనా స్వభావానికి ఈ కథ అనుకూలంగా ఉంటుంది" అని రాయల సూచన. "మనుసంభవ మరయ రసమంచిత కథలన్ వినవింపు" అనేది పై సూచనకి హేతువు. రసవత్కథలు ఉన్నాయి. నీది రసవద్రచన. కాబట్టి అనుకూలిస్తుంది అని రాయల వారి ప్రోత్సాహం.

పెద్దన గారి ప్రత్యేకతలని చెబుతూ రాయల వారే -

హితుడవు చతురవచోనిధి
వతుల పురాణాగమేతి హాస
కథార్థ స్మృతియుతుమ్డ వాంధ్ర కవితా
పితా మహుమ్డ వెవ్వరీడు పేర్కొన నీకున్ (మనుచరిత్ర, పీఠిక)

*"ఆంధ్రకవితాపితామః" అన్న బిరుదు పెద్దన కంటే ముందు ఇద్దరికీ (శివదేవయ్య క్రీ. శ. 1260, కొరవి సత్తేనారన క్రీ. శ. 1400 ) పెద్దన తరవాత కాలంలో మరో ఇద్దరికీ (ఉప్పు గుండూరి వేంకట కవి క్రీ.శ. 1600, ఎనమండ లక్ష్మీ నృసింహ కవి క్రీ.శ. 1680 ) ఇవ్వబడింది. కానీ ఒక పెద్దన యందే ఈ బిరుదు స్థిరంగా నిలిచిపోయింది.

---

ఇందులో పురాణ-ఆగమ-ఇతిహాసాలు అన్నీ తెలుసు అనడం వాటిలో ఉండే కథల పరమార్థాలను నీవు యెరుగుదువు అనడం. ఇది పెద్దన గారి పాండిత్యానికి సూచకం. "హితుడవు" అనేది వ్యక్తిత్వానికి కితాబు. "చతుర వచోనిధివి" (నిపుణమైన వాక్కులకు గనివి) అనేది కవితాశక్తికి నివాళి. "నీతో సరితూగేవారు లేరు" అన్నాడు రాయలు.

రాయలవారి ఈ ప్రేరణతో ఆంధ్ర కవితా పితామహుడు అల్లసాని పెద్దనామాత్యుడు "స్వారోచిషమనుసంభవం" అనే ప్రబంధాన్ని కడు రమణీయంగా తీర్చిదిద్దాడు. ఇది "మనుచరిత్రము" గా ప్రసిద్ధి చెందింది. తెలుగు పంచమహాకావ్యాల్లో ఒకటిగా నిలిచిపోయింది. తెలుగులో "పంచ మహా కావ్యాలు"గా పరిగణింపబడు తున్న గ్రంథాలు:

1) పెద్దనామాత్యుని "మనుచరిత్రము"
2 ) నంది తిమ్మన గారి "పారిజాతాపహరణము"
3) శ్రీ కృష్ణదేవరాయ విరచిత "ఆముక్తమాల్యద"
4) తెనాలిరామకృష్ణుని "పాండురంగమాహత్మ్యము "
5) రామ రాజభూషణుని "వసుచరిత్రము"

ఈ ఐదు కావ్యాలు క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకుంటే తెలుగు భాష సంపూర్ణంగా వచ్చేస్తుందని పెద్దల ఉవాచ.

పెద్దన గారంటే రాయలవారికి అపరిమితమైన గౌరవం. ఎంతటి గౌరవం అంటే "ఎదురైనచో తన మదకరీంద్రము నిల్పి కేలూత యొసగి ఎక్కించుకొనేవా"డట. స్వయంగా కాలికి గండపెండేరం తొడిగాడట. మనుచరిత్రం కృతి స్వీకరించినప్పుడు తాను కూడా పల్లకి మోసాడట! అంతటి గౌరవం, మర్యాద. పెద్దన తన సమకాలీన కవులచేత కూడా అంతగానూ గౌరవింప బడ్డాడు. అందరికీ ఏవో వంకలు పెట్టి కొంటె కోణంగి అనిపించుకున్న కవి చౌడప్ప కూడా తన వెక్కిరింపు స్వభావాన్ని మానుకొని:

పెద్దన వలెఁగృతి సెప్పిన
బెద్దనవలె, నల్ప కవినిఁ బెద్దనవలెనా?
ఎద్దనవలె మొద్దనవలె
గ్రద్దనవలెఁ గుందవరపు గవి చౌడప్పా!

అని పెద్దనార్యుని గూర్చి తన మెప్పుని వెల్లడించాడు.

<u>మనుచరిత్రము - కథా సంగ్రహం</u>

అనగా అనగా ఒక ఊరు. ఆ ఊరి పేరు అరుణాస్పదపురం. ఆ ఊళ్ళో ప్రవరుడు అనే పేరు గల ఒక బ్రాహ్మణుడుండేవాడు. చూడ్డానికి అత్యంత సుందరుడు. "మన్మథుడు, చంద్రుడు, ఇంద్రకుమారుడైన జయంతుడు, నలకూబరుడు మొదలైన జగన్మోహనాకారులు ఇతనిముందు తీసికట్టు" అనిపించేటంతటి అందగాడు. ఎంతటి అందగాడో అంతకుమించిన సుగుణాలరాశి. తరుణ వయస్సులో ఉన్నాడు. వేదవేదాంగ పండితుడు. యౌవనమందే యజ్ఞయాగాలు చేసిన ఘనుడు. అతడు నిజంగా బ్రాహ్మణకుల దీపకుడు. పైగా ధనవంతుడు. పుష్కలంగా పండే మాన్యక్షేత్రాలున్నాయి. ఏ రాజుగారైనా అనివిధాలా దానం ఇవ్వడానికి

ఇతడే అర్హుడు అని యెంచి దానం ఇవ్వబోతే, దానం స్వీకరించడం కూడా పాపం అని భావించి పరిగ్రహించేవాడు కాడు. దానంపుచ్చుకుంటే దానికో ప్రాయశ్చిత్తం చేసుకోవాలట. ఒక్క సాలగ్రామ దాన స్వీకరణకే యేపాపం అంటుకోదట. ప్రవరాఖ్యుడు దాన్ని కూడా స్వీకరించేవాడు కాడు. అంతటి నిష్ఠాగరిష్టుడు.

అతని భార్య సోమిదమ్మ, అతనికి అన్నివిధాలా అనుకూలవతి. ఎంతో భక్తిశ్రద్ధలతో అతన్నీ, అత్తమామల్నీ సేవిస్తూ ఉంటుంది. వెయ్యిమంది అతిథులు అర్థరాత్రి సమయంలో వచ్చినా సరే, చిఱునవ్వుతో వారికి వండి పెట్టి సంతుష్టుల్ని చేస్తుంది.

ప్రవరుడి తలిదండ్రులు పార్వతీ పరమేశ్వరుల్లాగా ఉండి ఇంటి పనీ, బయట పనీ చక్కగా చూసుకుంటూ ఉంటారు. వారు వృధ్ధులు. ప్రవరుడు వాళ్ళని నిత్యం ఎంతో భక్తిప్రపత్తులతో సేవించుకుంటూ ఉంటాడు.

ప్రవరుడికి అతిథిపూజ అంటే పరమానందం. అంతేకాదు, తీర్థయాత్రలన్నా, తీర్థయాత్రలు చేసివచ్చిన పుణ్యమూర్తులన్నా ఎంతో భక్తి. అటువంటివారు వస్తున్నారని తెలిస్తే, ఎంతదూరం అయినా వాళ్ళకి ఎదురేగి, పాదాలకి నమస్కరించి ఇంటికి ఆహ్వానించి, భక్తితో ఆతిధ్యమిచ్చి, వాళ్ళకి ఇష్టమైన భోజన పదార్థాలని వండించి, వడ్డించి, సంతృప్తులుగాచేసి, వాళ్ళు భుజించి కూర్చున్నాకా వాళ్ళని సమీపించి వాళ్ళు వెళ్ళి వచ్చిన, చూసిన ప్రదేశాల గురించి, తీర్థ క్షేత్రాల గురించీ అడిగి తెలుసుకొనేవాడు. అవి తన ఊరినుంచి ఎంతెంత దూరంలో ఉన్నాయో అడిగి తెలుసుకొనేవాడు. ఆయా ప్రదేశాలకి తాను వెళ్ళలేకపోతున్నానే అని చింతిస్తూ, నిట్టూర్పులు విడుస్తూ ఉండేవాడు. వెళ్ళాలని ఉబలాటపడేవాడు. కానీ నిత్యాగ్నిహోత్రి, పితృసేవాతత్పరుడు అయిన ప్రవరుడు తన నిత్యకృత్యాలయిన అనుష్ఠాలని వదిలి ఒక్క రోజు కూడా ఉండడానికి ఇష్టపడకపోని కారణం వలన అరుణాస్పదపురాన్ని విడిచి ఎక్కడికీ వెళ్ళేవాడు కాడు.

ఇలా ఉండగా ఒకనాడు ప్రవరుని ఇంటికి ఒక సిధ్ధుడు హఠాత్తుగా వచ్చాడు. యధావిధిగా ప్రవరుడు అతనికి అర్ఘ్యపాద్యాలిచ్చి, సకలోపచారాలు చేసి, మంచి భోజనం పెట్టి, అతను విశ్రాంతి తీసికొన్న తరవాత చెంతచేరి "మహాత్మా! మీరు ఎక్కడ నుండి ఎక్కడికి వెళుతూ ఇలా నా ఇల్లు పావనం చేసారు? మీరు ఏయేదేశాల్నీ, ఏయే పర్వతాల్నీ చూశారు? ఏయే తీర్థాలలో స్నానాలు చేశారు? ఏయే ద్వీపాలు, ఏయే పుణ్య స్థలాలు, ప్రదేశాలు సందర్శించారు?" అని అడిగాడు తన ధోరణిలో.

అందుకు ఆ సిధ్ధుడు "నేను మెట్టని గుట్ట, సేవించని తీర్థం, క్షేత్రం, చూడని ప్రదేశమూ లేవు" అంటూ తాను ఆసేతు హిమాచలం ఏమేమి వింతలూ, విడ్డూరాలూ చూశాడొ చెప్పుకొచ్చాడు. అదంతా విని ప్రవరుడు ఆశ్చర్యచకితుడయ్యాడు, ఆపైన కొంచెం అనుమానమూ కలిగింది. "స్వామీ, మీరు వర్ణించినవన్నీ సందర్శించి రావాలంటే ఏళ్ళూ పూళ్ళూ పడతాయికదా, మీరు చూస్తే అంత వయసు ఉన్నవారిలా కనపడ్డంలేదు, అదెలా సాధ్యమయింది?" అని ప్రశ్నించాడు అనుమానంగా.

దానికి ఆ సిధ్ధుడు నవ్వి "నువ్వన్నది నిజమే, నడకే ఆధారం గలవారికి ఇది పొసగనిదే, కాని నా దగ్గర ఈశ్వరకృపవల్ల ఒక పాదలేపనం ఉంది. ఆ పసరు ప్రభావంతో ఎంత దూౄజమైనా లిప్తమాత్రంలో పోగలను. ఆకాశంలో సూర్యుడి రథాలు ఎంత వేగంగా ప్రయాణించగలవో భూమి మీద నేనూ అంత దూరమూ, అంతే వేగంగా అలసట లేకుండా ప్రయాణించగలను" అని చెప్పాడు.

ప్రవరుడికి ఎంతోకాలంగా తీరకుండా ఉండిపోయిన తన తీర్థాయాత్రా సందర్శనాభిలాష తీరే మార్గం దొరికింది. ఇలా వెళ్ళి అలా వచ్చేయ్యగలిగితే తన నిత్యకర్మలకీ, అనుష్టానాలకీ, తలిదండ్రుల సేవకీ యేమీ అంతరాయం కలగదుకదా మరి. అతను వెంటనే ఆ సిధ్ధుడికి భక్తిశ్రద్ధలతో అంజలిఘటించి,తన చిరకాల వాంఛ తీర్చమని ప్రార్థించాడు. సిధ్ధుడు ప్రసన్నుడై, తన బుట్టలోంచి పసరు తీసి, దీని పేరు ఇదీ అని చెప్పకుండా, ప్రవరుడి పాదాలకి దాన్ని పూసి తన దారిన తాను వెళ్ళిపోయాడు. ఆ పసరుపూసి అతడలా వెళ్ళగానే ప్రవరుడు తన మనసులో "హిమవత్పర్వతాన్ని చూడాలి" అని సంకల్పించాడు. మరుక్షణంలోనే అతడు హిమగిరిశిఖరం మీదికి పోయి నిలిచాడు.

●●●

హిమగిరిపై ప్రవరుడు అనేక రమ్యమైన స్థలాల్ని చూశాడు. ఎన్నో పవిత్రమైన ప్రదేశాలని చూశాడు. నరనారాయణులు తపస్సు చేసిన బదరీ వనాన్ని సందర్శించి పులకించిపోయాడు. భగీరథుడు తపస్సు చేసినచోటు, ఆకాశగంగ భువికి దిగిన చోటు, పార్వతి పరమేశ్వరునికి శుశ్రూష చేసిన ప్రదేశము, మన్మధుడు శివుని మూడవ కంటిమంటచే బూడిదయి జాలిగలిగించు ప్రదేశం, అగ్నిదేవుడు సప్తర్షుల కాంతలపై మోహం చెందిన ప్రాంతం, కుమారస్వామి జననం చెందినరెల్లుదుబ్బులనూ మొదలైన ఎన్నో దివ్యమైన, మనోహరమైన ప్రదేశాలనీ, సుందరమైన లోయలనీ, గుహలనీ, సెలయేళ్ళనీ చూసి పరవశించిపోయాడు. హిమాలయ పర్వత ప్రకృతి సౌందర్యం ప్రవరుణ్ణి ముగ్ధుణ్ణి చేసింది.

ఆ అందాలకి ఎంత ముగ్ధుడైపోయినా, పరమ నిష్ఠాగరిష్ఠుడైన ప్రవరుడు, "నిత్యం అనుష్ఠించే కర్మకలాపాలకి వేళ దాటిపోతోంది. ఈ చోటులగల చోద్యాలని రేపు మళ్ళీవచ్చి ఆస్వాదిస్తాను" అనుకొని 'ఇంటికి చేరాలి' అని సంకల్పించాడు. కానీ ప్రయోజనం కలగలేదు. తీరాచూస్తే ఏముంది, పాదాలకి పూసుకున్న పసరు మంచు వలన కరిగిపోయింది! ప్రవరుడి గుండెలో రాయిపడినట్లయింది. "అయ్యో! ఇక ఇక్కడి నుండి నాకు విముక్తి లేదు. నా జీవితం ఇక్కడే క్షుద్రమార్గంలో అంతమైపోతుంది కాబోలు. ఆ పసరు ప్రభావాన్ని పరీక్షించడానికి, నేను ఏ కాశీయో, గయో, కురుక్షేత్రమో, ప్రయాగో వెళ్ళకుండా, నరమానవులెవరూ అగుపించనిదీ, క్రూరమృగాలు విశేషంగా సంచరించేదీ అయిన ఈ మంచుకొండకే ఎందుకొచ్చాను? ఓ దైవమా, నా నిత్యానుష్ఠాలకి దూరంచేసి, తీసుకొచ్చి ఇలా మిన్నులుపడ్డచోటున పడేశావు కదయ్యా!" అని పరిపరి విధాల చింతించాడు.

కొంచెంసేపటికి తేరుకొని "ఈ హిమగిరి మునీంద్రులకి నిలయం. నన్ను ఇల్లు చేర్చగల మహాత్ముడు ఒక్కడైనా ఇక్కడ కనిపించకపోడు" అని ధైర్యం తెచ్చుకొని ముందుకి సాగాడు. కొంతదూరం వెళ్ళగా, అక్కడ అతనికి ఒక గానం వినిపించింది. వెంటనే అతని హృదయంలో ఒక ఆశాజ్యోతి వెలిగి నట్లయింది. "అక్కడేదో ముని ఆశ్రమం ఉన్నట్లుంది, ఇక నేను రక్షింపబడతాను" అనుకుంటూ ఆ పాట వినవచ్చిన దిక్కుగా త్వర త్వరగా వెళ్ళాడు. అక్కడ మధురంగా పాడుతూ, వీణ వాయిస్తూన్న ఒక అద్భుతమైన సౌందర్యవతి అతనికి కనిపించింది.

ప్రవరుడు ఆమెను సమీపించి "ఓ సుందరీ, తోడు లేకుండా ఒంటరిగా చరిస్తున్న నీవు యెవతెవు? నేను బ్రాహ్మణ్ణి. నన్ను ప్రవరుడంటారు. దారి తప్పి ఉన్నాను. నా ఊరు చేరేమార్గం చెప్పి పుణ్యం కట్టుకో, నీకు శుభమౌతుంది" అన్నాడు.

అతను తనని సమీపిస్తూండగానే అతనిని గమనించి, అతని రూపలావణ్య తేజోవిలాసాలకి ముగ్ధురాలై , అతనిమీద మనసు తగులుకొన్న ఆ గంధర్వాంగనకి, ప్రవరుడి అమాయక పలుకులు విని నవ్వు వచ్చింది. అతనితో ఇలా అంది. "చెంపకి చారడేసి కన్నులు పెట్టుకొని, దారి ఎవరినయ్యా అడుగుతున్నావు? ఒంటరిగా ఉన్న జవరాల్ని పలకరించే నీ దుందుడుకుతనం ఇకచాలు. నువ్వు వచ్చిన త్రోవ ఇంతలోనే మర్చిపోయావా. ఇంకమాటలేమిటికి?

"నా పేరు వరూథిని. గంధర్వకాంతని. రంభ, తిలోత్తమ, ఘృతాచి, హరిణి, హేమ మొదలైన అప్సరస శిరోమణులు నాకు ప్రాణసఖులు. ఓ అపరమన్మధాకారా! నీ మేను ఎండతాపానికి ఎంత కందిపోయిందో చూడు. ముద్దులొలికే నీమోము వాడిపోయింది. నా ఆతిధ్యాన్ని స్వీకరించి, నా ఇంట విశ్రమించి, బడలిక తీరినతరువాత వెళుదువుగానిలే. తొందరేమీ లేదు" అంది.

అతని మీద ఎంతో మోహితచిత్త అయిన వరూథిని, తన మనోభావాన్నంతటినీ ఈ మాటల్లో వెల్లడించాననుకుంది. కానీ ఆ వైదిక బ్రాహ్మణుడికి ఇలాటి అర్థాలే తెలియవు. అతని హృదయ దర్పణం అమూల్యమైనది. నిరుపమానమైనది. అది ఉన్న రూపాన్ని ఉన్నట్టే గ్రహిస్తుంది.

అతను ''ఈ పడుచు.. పాపం మర్యాద తెలిసినది. బ్రాహ్మణులయందు, అతిథులయందు భక్తి శ్రద్ధలుగల ఆస్తికురాలు'' అనుకున్నాడు. వరూధిని తనని చూడగానే తత్తరపాటుతో లేవడం, ఆమె ఒళ్ళంతా కంపించడం, ఓరచూపులూ, మోహాన్ని ప్రకటించే హావ భావ చేష్టలు అవేమీ అతనికి పట్టలేదు. అవన్నీ పర పురుషుల్ని చూసినప్పుడు స్త్రీలకి కలిగే సహజసిద్ధమైన లజ్జాచేష్టలనుకున్నాడు.

అతను ఆమెతో ''రమణీలలామా! నువ్వు చూపించిన ఆదరణే చాలు. అగ్నిహోత్రాదికములైన కర్మకాండము నెరవేర్చవలసిన సమయం సమీపించింది. వేళ అతిక్రమించిపోతోంది. మీ గంధర్వులకి అసాధ్యమైనది ఏదీ లేదు. త్వరగా నన్ను నా ఊరు చేర్చు'' అన్నాడు.

వరూధిని చిరునవ్వునవ్వి ''ఓయి వెర్రిబ్రాహ్మడా! ఊరో, ఊరో అంటావు, నీ ఊరెక్కడికి పోతుంది? ఇంతలో నీ ఇల్లెక్కడికి పోతుంది? ఈ మణిమయాలైన గుహలు, చక్కటి ఈ ఉద్యానవనాల్లోని మంచి గంధపుచెట్లు, ఇక్కడి గంగానదిఒడ్డున ఉన్న ఇసుకతిన్నెలూ, వెన్నెలతీగల పొదరిళ్ళూ, ఇవేవీ నీ కుటీరానికి సరితూగవా? ఇంక చల్లకి వచ్చి ముంత దాచడం ఎందుకు? నీ మీద నాకు పట్టరానంత మోహం కలిగంది. మదనుడు నన్ను నీకు కన్యాదానం చేశాడు. నన్నేలుకొని ఈ స్వర్గసుఖాలన్నిటినీ అనుభవించు'' అని కుండ బద్దలుకొట్టినట్టు చెప్పేసింది.

అగ్నిహోత్రుడిలాగ పవిత్రమైనవాడు, పరమ నిష్ఠాగరిష్ఠుడు, సచ్ఛీలుడు అయిన ప్రవరుడు,ఆమె పలుకులు విని నిశ్చేష్టుడైపోయాడు. అతని గుండె గుభిల్లుమంది. ''అయ్యో! ఇదెక్కడికర్మరా!'' అనుకొని, ఆమెతో ''కాంతా! నీవు వెర్రిదానివి. వ్రతినై కర్మకాండలతో దినాల్ని గడిపే నన్ను ఏమని కామించావు? సంగతి సందర్భాలు, ఎదుటివారి మానమర్యాదలూ అవీ గమనించనక్కరలేదా? నాకిలాటివేవీ తెలియవు. అగ్నిహోత్రానికీ, దేవతార్చనకీ వేళ అతిక్రమించిపోతోంది.నా తలిదండ్రులు వృద్ధులు. ఆకలితో నకనకలాడుతూ నారాకకోసం ఎదురుచూస్తూఉంటారు. నేను సమయానికి ఇల్లు చేరకపోతే సమస్తధర్మాలూ చెడిపోతాయి. ఇక నా ఎదుట నీ పిచ్చి కలాపాలు కట్టిపెట్టి, చేతనైతే ఇల్లుచేరడానికి నాకు సాయం చెయ్యి'' అని తన ధ్రుఢనిశ్చయాన్ని తెలియజేసాడు.

ఊహించని, ఎదురుచూడని ఈ నిరాదరణకి వరూధిని హృదయం జల్లుమంది. ఎందరో యక్ష గంధర్వ కిన్నెర కింపురుష యువసుందరులు ఆమె కడకంటిచూపుకోసం పరితపించడమే ఆమెకి తెలుసు, కానీ ఈ మానవుడి నిరాకరణ ఆమెకి మింగుడుపడలేదు. అంతవరకూ ఉన్న గుండెధైర్యం తొలగిపోయింది. అయినా తేరుకొని ఎన్నోవిధాలుగా తన పాండిత్యమంతా ఉపయోగించి, హొయళ్ళూ, టక్కులూ ప్రదర్శించి, ఎన్నో ప్రలోభాలుచూపించి అతన్ని వశపరచుకోవాలని ప్రయత్నించింది.

''మీ మానవులు అన్ని ఆపసోపాలూ, అష్టకష్టాలూ పడి తపస్సులూ, యజ్ఞాలూ అవీ చేసేది స్వర్గసుఖాలనీ, మాలాటి అప్సరసల సంభోగాలనీ అనుభవించడానికేగదా! అయాచితంగా నా అంతటనేను నీకు లభిస్తూ ఉంటే కాదంటావేమిటి? గంధర్వాంగనల పొందుకాదని సంసారకూపంలో పడతానంటావేమిటి?'' అంది.

''నీ యందు మరులుగొని, మన్మథబారినిపడి హింసపడుతున్నాను. ఆ పాపం నీకు చుట్టుకుంటుంది'' అని బెదిరించింది.

''ఓ దయారహితుడవైన బ్రాహ్మణుడా, ఎందుకు చెడతావు? హృదయం దేనిమీద లగ్నం ఔతుందో, ఇంద్రియాలు దేనివల్ల సుఖిస్తాయో, అదే పరబ్రహ్మము. అదే ఆనందోబ్రహ్మ. దాన్ని ఊహించుకో!'' అని మెట్టవేదాంతం బోధించబోయింది.

ఇలా వరూధిని శతవిధాలా ప్రయత్నించినా, ప్రవరుడు చలించలేదు. బ్రహ్మవాదుల ఐహిక ఇచ్ఛలపట్ల వైముఖ్యాన్నీ, వైదిక కర్మలయొక్క ధర్మపరత్వాన్నీ, బ్రహ్మవర్చస ప్రభవాన్నీ వివరించాడు. వాటిముందు నువ్వు చెప్పిన సుఖాలన్నీ తుచ్ఛమైనవి అన్నాడు. నాకు నా ఆరణులు, అగ్నులూ, ధర్మకర్మలూ ముఖ్యమైనవి అన్నాడు.

అయినాసరే వరూధిని వదలకుండా అతనిమీదపడి కౌగలించుకోడానికి ప్రయత్నించింది. ప్రవరుడు "హరి, హరీ" అని 'పో' అంటూ ఆమెను త్రోసివేసాడు. ఆమె పరాభవంతో సిగ్గుపడి, ఆ వెంటనే మితిమీరిన దుఃఖంతో "దయలేనివాడా, ఇలా మోటుగా గెంటేస్తే సౌకుమార్యులైన ఇంతులు తట్టుకోగలరా? చూడు నీ గోరు ఎలాగీసుకుపోయిందో" అంటూ చనుకట్టు చూపి, అవ్యక్తమధురంగా ఏడ్చింది.

"ఓ సుందరాకారా, పరాశరుడు దాసకన్యతో క్రీడించలేదా? అతన్ని మీ బ్రాహ్మణులు వెలివేసారా? మేనకతో చుట్టరికం సాగించిన విశ్వామిత్రుడికి కులంలో వన్నెతక్కువయిందా? అప్సరసా మేళంతో భోగించినందుకు, మాందకర్ణి తన మహిమని కోల్పోయాడా? అహల్యాజారుడైన ఇంద్రుణ్ణి దేవతలు స్వర్గలోకాన్ని ఏలనీయం అన్నారా? వారందరికన్నా నువ్వు గొప్పవాడివా? ఇనుపకచ్చడాలు కట్టుకున్న మునిముచ్చులందరూ మా తామరసనేత్రల ఇండ్ల బందీలు కారా?" అని ప్రశ్నించింది.

పరమపవిత్రుడైన ప్రవరుడు ఆ మాటలకి బదులైనా ఇవ్వకుండా, ఆమె తనపైబడినప్పుడు తనవంటికి అంటుకున్న జవ్వాది మొదలైన సుగంధద్రవ్యాల్ని కడుక్కొని, శుచియై, అగ్నిహోత్రుణ్ణి ఇలా ప్రార్థించాడు.

"ఓ హవ్యవాహనా! వహ్నిదేవుడా! దాన-జప-అగ్నిహోత్రములయందు నేను పరతంత్రుడనైతే, ఎల్లప్పుడూ త్రికరణశుద్ధిగా నీ యొక్క పాదపద్మాల ధ్యానమందే నేను భక్తిగలవాడనైతే, ఇతరులయొక్క భార్య-ధనాదులను నేను ఎన్నడూ కోరనివాడనైతే, నన్ను సగౌరవంగా, సూర్యుడు పశ్చిమాద్రిని క్రుంకకముందు ఇంటికి చేర్చు, తండ్రీ!" అని ప్రార్థించాడు.

ప్రవరుడలా ప్రార్థించగానే, అగ్నిదేవుడతని దేహంలో ఆవహించి, అతనికి అమితమైన తేజోబలాల్ని కలిగించాడు. అంతట అద్భుతంగా ప్రవరుడు వాయువేగమనోవేగాలతో తన ఇల్లు చేరి, తన నిత్యకర్మలని సక్రమంగా నిర్వర్తించుకుంటూ జీవనం సాగించాడు.

ఔరా! ప్రవరా! సర్వసంగపరిత్యాగులైన మహామునీశ్వరులు కూడా సాధించలేని ఇంద్రియనిగ్రహాన్ని మామూలు సంసారివి అయి ఉండి కూడా సాధించి "భళా" అనిపించుకున్నావు!

(భర్తృహరి సుభాషితాల్లో ఒక పద్యం:-

వనదళవాతముల్ మెసవువారు పరాశర కౌశికాదు, లా
ఘనులును సుందరీజనులమ్ గర్తాని మోహితచిత్తులైరి; హె
చ్చినఘృత పాయసాన్నము భుజించెడి వారలన్ మనోజయం
బు నెగడునేని వింధ్యము సముద్రజలంబులఁ దేలి యాడదే?

నీరు-ఆకులు-గాలి భుజించే పరాశరుడు, విశ్వామితుడు మొదలైన మహానుభావులు కూడా ఆడవారిని చూచి మోహము పొందారు. నెయ్యి, పాలు, అన్నము ఎక్కువగా తినే సాధారణమైన మనుష్యులకు మనోనిగ్రహం కలిగితే, వింధ్యపర్వతం సముద్రజలాల్లో తేలియాడదా?)

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

# వ్యాస కౌముది



## మను చరిత్రము

## (కళాఖండానికి ఒక పామరుడి ప్రశంస)

### బాలాంత్రపు వేంకట రమణ

(క్రిందటిసంచిక నుంచి తరువాయి)

**ప్రవరుడు వరూధినిని** అలా తిరస్కరించి వెళ్ళాకా, ఆమె భరించలేని విరహవేదన పాలయింది. ఆమె చెలికత్తెలు ఆమెకి ఉపశమనం కలిగించడానికి శతవిధాలా ప్రయత్నించారుగానీ ఉపయోగం లేకపోయింది. ఆమెకి విచారం పొంగి పొంగి పొరలసాగింది.

ఇలా ఉండగా, అంతకుపూర్వం వరూధినిని మోహించి ఆమెచే తిరస్కృతుడైన ఒక గంధర్వుడున్నాడు. అతడు, ప్రవరుడు వరూధినీల మధ్య జరిగిన ప్రహసనాన్నంతా గమనించాడు. వరూధిని విరహాన్నంతా తిలకించాడు.

అతడు కామరూప విద్యాప్రభావంతో ప్రవరుడి రూపాన్ని ధరించి, వరూధిని కంటబడ్డాడు. ఆమె వెంటనే మహోత్కంఠతతో మాయాప్రవరుడి వద్దకు వెళ్ళి అతిదీనంగా తన కోరికని తీర్చమని ప్రార్థించింది.

గంధర్వుడు కూడా తన చిరకాల వాంఛ నెరవేరుతున్నందుకు మదిలో పరమానందభరితుడై, పైకి మాత్రం బలవంతాన ఆమె కోరికని తీరుస్తున్నట్టు నటిస్తూ, ఆమెకి కొన్ని షరతులు విధించాడు. అవేమిటంటె: ఒకటి, సంభోగ సమయంలో నువ్వు కళ్ళుమూసుకోవాలి. (ఎందుచేతనంటే, మరణసమయంలోనూ, సంభోగసమయంలోనూ కామరూప మహిమ తొలగిపోయి, నిజరూపం వచ్చేస్తుందిట - అందుకే గంధర్వుడు ఈ నియమం పెట్టాడు. "ఇది మాదేశ ఆచారం" అన్నాడు).

ఇక రెండవ షరతు ఏమిటంటె "నేను నిన్ను సమ్మతింపచేసి వెళ్ళేదాకా నువ్వు నన్ను విడువకూడదు" అని. అతడు తనని అనుగ్రహిస్తే చాలు అదే మహద్భాగ్యం అని భావిస్తున్న వరూధిని మాయాప్రవరుడి షరతులకి వెంటనే అంగీకరించేసింది. తరవాత వారిరువురూ చాలాకాలం మన్మథ సామ్రాజ్యంలో ఓలలాడి సుఖించారు.

కొంతకాలానికి వరూధిని గర్భవతి అయింది. మాయాప్రవరుడు ఇకపై తన ఆటలుసాగవని గ్రహించి, వరూధినికి తన కపటనాటకం తెలిసిపోతే శపిస్తుందని ఎలాగో ఆమెను ఒప్పించి చల్లగా తన దారిన తాను జారుకున్నాడు.

పాపం వరూధిని తనతో ఇన్నాళ్ళూ కాపురం చేసింది ప్రవరాఖ్యుడే అన్న భ్రమలోనే ఉండిపోయింది.

●●●

నవమాసాలు నిండిన పిమ్మట వరూధిని ఒక శుభముహూర్తాన ఒక చక్కని కుమారుణ్ణి కన్నది. మునులు బాలుడికి జాతక కర్మ నిర్వహించి అతడు సూర్యచంద్రులలాగా ప్రకాశిస్తూ ఉండటంచేత అతనికి "స్వరోచి" అని నామకరణం చేశారు. యుక్తవయసులో

అక్షరాభాసం చేసి సకలవిద్యలూ ఉపదేశించారు. స్వరోచి యౌవనవంతుడై, మహావీరుడై మందరగిరిమీద విశ్వకర్మ నిర్మించి ఇచ్చిన నగరాన్ని, ఆటవికులందరూ భయభక్తులతో కొలుస్తూ ఉండగా రాజ్యం ఏలసాగాడు.

ఒకనాడు స్వరోచి వేటకి వెళ్ళాడు. అక్కడ అతను పరిజనులతో కలిసి, తనివి తీరా క్రూరమృగాలని వేటాడి వినోదిస్తూ ఉండగా, ముందుగా కొన్ని అపశకునాలూ, తరువాత శుభశకునాలూ కనిపించాయి. స్వరోచి "ముందు ఏదో మహాయుద్ధం జరిగిన తరవాత శుభమయ్యేలాగా ఉంది" అనుకుంటూ ఉండగా "అయ్యో, అబలని, రక్షించండి! రక్షించండి!!" అన్న ఒక స్త్రీ ఆర్తనాదం వినిపించింది.

వెంటనే స్వరోచి ఆర్తనాదం వినిపించిన దిక్కుగా పంచకల్యాణిని ఉరికించాడు. అటునుంచి ఒక దివ్యమైన సుందరి భయంతో కంపించిపోతూ అతనికి ఎదురై "ఓ రాజా! నన్ను రక్షించు. నేటికి మూడుదినాలుగా ఒక రాక్షసుడు నన్ను వెంబడిస్తున్నాడు. నేను ఇందీవరాక్షుడు అనే గంధర్వరాజు కుమార్తెను" అని ఇంకా తన కథని ఇలా వివరించింది.

"ఓ మహావీరా! నా పేరు మనోరమ. నాకు కళావతి, విభావసి అనే ఇద్దరు చెలికత్తెలు ఉన్నారు. ఒకనాడు మేము హిమాలయపర్వతమ్మీద పువ్వులకోసం వెళ్ళి, అక్కడ ఒక గుహలో ఒక ముసలిముని తపస్సుచేసుకుంటూ ఉండగా చూశాం. అతడు బూచిలాగా ఉండడం చూసి, బాల్యచాపల్యంతో "ఇతని నోరేది? ఇతని కళ్ళు ఎక్కడున్నాయి? ఇతని చెవులు ఏవి?" అని అతని మొహం పట్టుకుని ఊపాను. దానితో మునికి తపోభంగమయ్యి, "వయసు మదంచేత ఒళ్ళెరక్క వృద్ధుడనైన నన్నిలా అవమానించావు కనుక నువ్వు రాక్షసుడిబారినపడి ప్రాణభయం పడుదువుగాక" అని శపించాడు. పైగా నన్ను తన బెత్తంతో చావగొట్టాడు. అప్పుడు నాచెలికత్తెలు తెగబడి అతనిని మందలించగా, అతను కోపించి వాళ్ళిద్దర్నీ క్షయరోగ పీడితులుకమ్మని శపించాడు.

"ఓ రాజా, శాపప్రభావంవల్ల మూన్నాళ్ళగా ఒక బ్రహ్మరాక్షసుడు నన్ను కబళిస్తానని వెంటపడుతున్నాడు. నన్ను రక్షించు. నేను నీకు 'అస్త్రహృదయం' అనేవిద్యని ప్రసాదిస్తాను. ఈ విద్యని తొలుత ఈశ్వరునిచే స్వయంభువ మనువు, అతనివలన వశిష్టుడు, అతనిద్వారా చిత్రాశ్వుడు అనే మా మాతామహుడు, క్రమంగా పొందారు. ఆయన ఈ విద్యని నా తండ్రికి అరణంగా ఇచ్చాడు. మా తండ్రి నాకు ప్రసాదించాడు. ఈ విద్యని ఇప్పుడు నేను నీకు ఇస్తాను. దీని సాయంతో నువ్వు రాక్షసుణ్ణి సంహరించి నన్నుకాపాడు. ఒక స్త్రీ వలన విద్య స్వీకరించడానికి సందేహించకు" అని పలికింది.

స్వరోచి సంతోషించి, శుచియై, మనోరమ వద్ద అస్త్రహృదయాన్ని ఉపదేశం పొందాడు. అటుపిమ్మట స్వరోచి బ్రహ్మరాక్షసుడితో ఘోరమైన యుద్ధం చేసి, చివరగా అగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ వేటుతో రక్కసుడు నేలకూలాడు. ఆశ్చర్యకరంగా ఆ ఘోరదేహంనుండి ఒక దివ్యపురుషుడు ఉద్భవించాడు. అతను స్వరోచిని ప్రేమతో కౌగలించుకుని ఇలా అన్నాడు.

"వత్సా, నేను ఇందీవరాక్షుడు అనే గంధర్వరాజుని. ఈ మనోరమ నా ముద్దుల కుమార్తెయే. అంతేకాదు, నేను నీ తల్లి వరూధినికి తమ్ముణ్ణి. శాపవశాత్తూ నేను బ్రహ్మరాక్షసుడినై చివరికి నా కుమార్తెనే భక్షించడానికి సిద్ధం అయ్యాను. ఇంతకీ నాకు ఈ శాపం ఎలా వచ్చిందంటే, ఒక మునీశ్వరుడు తన శిష్యులకి ఆయుర్వేదవిద్యని ఉపదేశమిస్తూ ఉండడం చూసి, నేను మునిని నాకు కూడా ఆయుర్వేదాన్ని నేర్పమని అడిగాను. అతను అందుకు నిరాకరించాడు. అప్పుడు నేను అదృశ్యకరణి అనే విద్యాప్రభావంతో, ఎవరికీ కనబడకుండా ముని తన శిష్యులకి వైద్యవిద్య నేర్పుతుండగా శాస్త్రాన్నంతా నేర్చుకున్నాను. అంతటితో ఆగకుండా, నిజరూపంతో మునీశ్వరుడివద్దకి వెళ్ళి "ఓయీ, నాకు విద్యనేర్పమంటే గొణుక్కున్నావు. ఆసక్తి ఉన్నవారికి విద్య ఎలాగైనా రాకపోతుందా? సన్నికల్లు దాచేస్తే పెళ్ళి ఆగిపోతుందా? చూడు, నీకు తెలియకుండానే నీ విద్యనంతా నేర్చేసుకున్నాను" అని అపహాస్యంచేశాను. దానితో ముని మహోగ్రదగ్రుడై నన్ను బ్రహ్మరాక్షసుడవైపోమని శపించాడు. నేను పశ్చాత్తాపంతో అతని కాళ్ళమీదపడి క్షమాపణ కోరగా ఆయన కనికరించి "కొన్ని దినాలకి నీ కుమార్తెనే మ్రింగబోయి ఒక ధన్యునిశరముల వాతబడి శాపవిముక్తుడ వౌదువుగాని" అని దయ చూపించాడు.

"ముని శాపం వలన నాకు క్రమక్రమంగా రాక్షసత్వం ప్రాప్తించింది. నా పౌరలందరినీ మ్రింగేశాను. ఇరుగుపొరుగు పట్టణాలని కూడ నాశనం చేయడం మొదలుపెట్టాను. నా మంత్రులు నా భార్యాపిల్లల్ని నా నుండి దాచేసి నాకు మహోపకారం చేశారు. చివరికి ఇలా నా ముద్దులకుమార్తెనే కబళింపబోయాను. నేటికి నీ దయవలన శాపవిముక్తి కలిగింది. నా కుమార్తెనీ, నేను నేర్చుకున్న ఆయుర్వేదవిద్యనీ గ్రహించి నన్ను ధన్యుణ్ణి చెయ్యి" అని వేడుకున్నాడు. అందుకు స్వరోచి సంతోషంతో అంగీకరించాడు.

ఇంతలో ఇందీవరాక్షుని మంత్రి సామంతాదులందరూ వచ్చి, తమ ప్రభువుని స్వాగతించారు. ఇందీవరాక్షుడు, స్వరోచి మనోరమలతో కలిసి మహావైభవంగా తన రాజ్యానికి వెళ్ళి, ఒక శుభముహూర్తంలో మనోరమని స్వరోచికిచ్చి అంగరంగ వైభోగంగా వివాహం జరిపించాడు.

శోభనంనాటి రాత్రి మనోరమ అన్యమనస్కంగా ఉండడం చూసి, స్వరోచి కారణం అడిగాడు. అందుకు ఆమె "ప్రాణనాథా, అక్కడ అడవిలో నా ప్రియతమ చెలికత్తెలిద్దరూ దుర్భరమైన క్షయరోగంతో బాధ పడుతూంటే, ఇక్కడ నేను నీతో సుఖాలెలా అనుభవించగలను?" అని దుఃఖంతో పలికింది. వెంటనే స్వరోచి మనోరమతో కలిసి, అరణ్యానికి వెళ్ళి, ఇందీవరాక్షుడివద్ద నేర్చుకున్న ఆయుర్వేదవిద్యా ప్రభావంతో, వారిద్దరికీ చికిత్సచేసి, వాళ్ళని సంపూర్ణ అరోగ్యవంతురాళ్ళగా చేశాడు. దానితో ఇరువురు కన్యలూ తమ పూర్వపు సౌందర్యాన్ని తిరిగి పొంది, తమ దగ్గర వున్న దివ్య గంధర్వ విద్యల్ని అతనికి ఇచ్చి, తమని కూడా పరిణయమాడమని కోరారు. స్వరోచి మనోరమ సమ్మతితో వాళ్ళిద్దరినీ పెళ్ళిచేసుకున్నాడు.

స్వరోచి అటుపిమ్మట తన ముగ్గురు భార్యలతో చాలా కాలం సర్వ సుఖాలనీ అనుభవించాడు.

ఒకనాడు స్వరోచి వేటకి వెళ్ళి, అక్కడ ఒక అడవి పందిని చంపబోగా, ఒక ఆడలేడి ఎదుటికివచ్చి "రాజా, దానిని చంపకు దాని వలన నీకు ప్రయోజనం లేదు. నన్ను చంపు" అని మనుష్యభాషలో పలికింది. స్వరోచి ఆశ్చర్యచకితుడై "నేను నిన్ను ఎందుకు చంపాలి?" అని అడిగాడు. అప్పుడు లేడి "ఇతర అంగనలతో సుఖిస్తున్న వానిని కోరడం కన్నా, చావడమే మేలు కదా!" అంది. "నువ్వు ఎవరిని మోహించావు?" అని అడిగాడు. "నిన్నే!" అంది లేడి.

స్వరోచి విభ్రాంతుడై "నేను మానవుడిని, నువ్వు మృగానివి. అదెలా సాధ్యం?" అని అడిగాడు. అంతట లేడి "నువ్వు నన్ను కౌగలించుకో, అదే చాలు" అంది. స్వరోచి ఆ లేడిని కౌగిలించుకోగానే, లేడి ఒక అద్భుతసౌందర్యవతియై అతని ఎదుట నిలిచింది. అతనితో "ఓ రాజా! నేను ఈ వనదేవతని. సమస్తదేవతలూ నీవలన మనువుని కనాలి అని నన్ను ప్రార్థించగా, ఇలా వచ్చాను. నువ్వు అదృష్టవంతుడివి. నన్ను అంగీకరించు" అని చెప్పింది. స్వరోచి పరమానంద భరితుడై, మిగతా ముగ్గురి భార్యల అంగీకారంతో, - ఆమెని స్వీకరించాడు.

●●●

కొన్నిదినాలకి వనదేవత గర్భంధరించి, నవమాసాలు నిండిన పిదప ఒక చక్కని కుమారుణ్ణి కంది. అతనికి "స్వారోచిషుడు" అని నామకరణంచేశారు. అతడు సకల సద్గుణసంపన్నుడై, సమస్తవిద్యలనీ అభ్యసించి, యుక్తవయసులోనే శ్రీ మహావిష్ణువు గురించి ఘోర తపస్సు చేశాడు. శ్రీహరి ప్రసన్నుడయ్యాడు. స్వారోచిషుడు అనేక విధాల శ్రీమన్నారాయణుని స్తుతించి, మోక్షాన్ని ప్రసాదించమని వేడుకున్నాడు. అందుకు భక్తజనావనుడు "నువ్వు కోరినట్లే మోక్షం ఇస్తాను. కానీ కొంతకాలం ద్వితీయ మనువువై భూమిని పాలించి, నీతినీ, ధర్మాన్నీ చక్కగా ధరలో నెలకొల్పు" అని ఆనతినిచ్చాడు.

స్వారోచిషుడు దామోదరుని ఆజ్ఞ ప్రకారం రెండవ మనువై సకల ధరామండలాన్నీ పాలించాడు. ధర్మసంస్థాపన చేశాడు. అతని పాలనలో సమయానికి వానలు కురిశాయి. పంటలు పుష్కలంగా పండాయి. ప్రజలు సంతానవంతులై, భోగ భాగ్య సంపదలతో

సంపూర్ణాయుష్కులై జీవించారు. అగ్నివల్లా, చోరులవల్లా భయంలేకుండెను. వ్యాధులు లేకుండెను. పళ్ళు, పాలు, సుగంధద్రవ్యాలూ, పుష్పాలూ సమృద్ధిగా లభించాయి. ప్రజలు ఈతి బాధలు, అకాలమరణాలు లేకుండా తామరతంపరలుగా వృద్ధిచెందారు.

***ఫలశ్రుతి***

ఈ స్వారోచిషమనుచరిత్రమును కోరికతో విన్నా, వ్రాసినా, చదివినా, ధనధాన్య-ఆరోగ్యాదులు కలిగి సంతానవంతులై, పిదప నిశ్చయంగా దేవత్వాన్ని పొందుదురు.

పూర్వం మార్కండేయుడు ప్రియశిష్యుడైన క్రోష్టి అనే మునికి చెప్పిన ఈ పుణ్యచరిత్రను పక్షులు జైమినికి చెప్పాయి.

ఇదీ "స్వరోచిషమనుసంభవం" యొక్క కథాసంగ్రహము..

***పద్యాల సొబగులు***

మచ్చుకి కొన్ని పద్యాల సొగసులు పరిశీలిద్దాం.

వరణాద్వీపవతీ తటాంచలమునన్ వప్రస్థలీ చుంబితాం<br>
బరమై సౌధసుధాప్రభా ధవళిత ప్రాలేయ రుఙ్మండలీ<br>
హరిణంబై యరుణాస్పదంబనగ నార్యావర్త దేశంబునన్<br>
బురమొప్పున్ మహికంఠహార తరళ స్ఫూర్తిన్ విడంబింపుచున్

ద్వీపవతి అంటే నది. దీవులు కలది అని. నది ఒడ్డున ఈపట్టణం, అరుణాస్పదపురం. సంస్కృతికీ సంపదకూ లవాలం. సౌధాగ్రభాగలతో (వప్ర) కాశాన్ని చుంబిస్తోంది. అంతేకాదు రాత్రిపూట సౌధాల తెల్లని కాంతులు (సుధాప్రభలు) చంద్రబింబంలో ఉన్న నల్లని మచ్చని కూడా తెలుపు చేసేస్తున్నాయి.

ప్రాలేయ (మంచు) రుక్ (కిరణం) మంచుకిరణాలు కలవాడు, చంద్రుడు. చంద్రమండలంలో మచ్చని లేడి, దుప్పి, కుందేలు - ఇలా రకరకాలుగా ఊహించారు. చంద్రమండలంలో ఉండే హరిణాన్ని ఈ పట్టణం తన సౌధ (మేడల) సుధాప్రభలతో ధవళితం (తెల్లగా) చేస్తోంది.

భూదేవికి ఒక కంఠహారం ఉంటే అందులో నాయకమణిలాగ ఈ అరుణాస్పదపురం ప్రకాశిస్తుంది. మహికంఠహార తరళస్ఫూర్తిన్ విడంబింపుచున్ (అనుకరిస్తూ) అరుణాస్పదంబనగ పురమొప్పున్ - అని అన్వయం.

ఇది కథాప్రారంభ పద్యం. ఇందులో భావి కథా సూచన ఉంది. అది ఎలాగంటే -

వరూధిని కామవాంఛని ప్రవరుడు తిరస్కరించి తన సచ్ఛీలాన్నీ, నిగ్రహాన్నీ చాటుకున్నాడు. కథలోని ఈ అంశాన్ని సూచిస్తోంది ఈ పద్యం.

వరూథిని అప్సరస. అప్సరసలు చంద్రాంశసంభూతలు. వరూధినిలో ఉన్న కామవాంఛ చంద్రునిలో ఉన్న కళంకం. కామాది దుర్గుణాలను నల్లటి వస్తువులతోనూ, సచ్ఛీలాది సద్గుణాలను తెల్లటి వస్తువులతోనూ పోల్చడం పరిపాటి. ఇది కవి సమయం. అందుచేత చంద్రునిలో ఉన్న నల్లటిమచ్చ వరూథిని కామవాంఛకు ప్రతీక అవుతుంది. అరుణాస్పదపౌరుడైన ప్రవరుడి సచ్ఛీలానికి ప్రతీక "సౌధసుధాప్రభలు"; వీటి ప్రభావం ఆనలుపుని తెలుపుచేస్తోంది. అంటే భౌమ్యమైన సచ్ఛీలం అభౌమ్యమైన కామాన్ని తిరస్కరించి, తన స్వచ్ఛతని ప్రకటించుకుంటోంది - అని వ్యంగ్యం.

నిజానికి ఇది జరగడం లేదు. "వప్రస్థలీ చుంబితాంబరమై" (ఆకాశాన్నంటుకునే కోట గోడలు) అన్నదీ అంతే. అతిశయోక్తి. సంబంధించని వస్తువులు సంబంధించినట్లు చెప్పడం.

పురవరనలో చతుర్వరాలవారినీ ప్రసావించడం ఒక సాంప్రదాయం. వారి వారి వృత్తులలో ఎవరెవరు ఎంతటివారో చెప్పడం.

అచటి విప్రులు మెచ్చరఖిల విద్యాప్రౌఢి
    ముదిమదిదప్పిన మొదటివేల్పు
నచటి రాజులు బంటునంపి భార్గవునైన
    బింకానఁ బిలిపింతు రంకమునకు
నచటి మేటి కిరాటులలకాధిపతినైన
    మునుసంచి మొదలిచ్చి మనుపదక్షు
లచటి నాలవజాతి హలముఖాత్త విభూతి
    నాది భిక్షువు భైక్షమైన మాన్చు
నచటి వెలయాండ్రు రంభాదులైన నొరయఁ
గాసెకొంగున వారించి కడపఁగలరు
నాట్యరేఖా కళా ధురంధర నిరూఢి
నచటఁ బుట్టిన చిగురుఁ గొమ్మైనఁచేవ.

ఆ ఊళ్ళో బ్రాహ్మణులు అఖిలవిద్యలలోనూ - వేదవేదాంగాలలో ఉద్దండులు. వేదపఠన పరీక్షల్లో కూచుంటే సాక్షాత్తూ వేదస్రష్ట అయిన బ్రహ్మదేవుణ్ణి సైతం ఓడించగలరు. "వయసుమీరిన కారణంగా నీకు మతి తప్పింది పో"మ్మని అతన్ని తరస్కరించగలరు.

ఆ ఊళ్ళో క్షత్రియులు మహావీరులు. పరశురాముణ్ణికూడా బంటుతో కబురు పంపి అంకానికి (యుద్ధానికి) పిలిపించుకోగలిగిన బింకం ఉంది వాళ్ళకి. భార్గవరాముడంటే ఇరవైయొక్కమార్లు క్షత్రియుల్ని ఊచకోతకోసినవాడు. అంతటివాణ్ణి కూడా సవాలు చెయ్యగల మహావీరులు వీరు.

ఆ ఊళ్ళో వైశ్యులు ఎంతటి ధనవంతులంటే, కుబేరుడికి కూడా పెట్టుబడి పెట్టగలిగేతంటి స్తోమతగల వారు.

ఇక అక్కడి నాల్గవజాతి. సకలప్రాణికోటికీ అత్యవసరమైన హారాన్ని ఉత్పత్తి చేసే అత్యంత ప్రధానమీన వృత్తి వీరిది. పైమూడు జాతుల వారికీ వీరే అన్నదాతలు. నాగేటి కర్రు నుంచి (హలముఖాత్త) ఐశ్వర్యాన్ని వీరు సంపాదించి శివుడికి కూడా పెట్టగలరు. దిభిక్షువుకి బిచ్చమెత్తుకోవలసిన అవసరం (భైక్షము) లేకుండా చెయ్యగలరు వీరు. అందరూ అంతగా పంటలు పండించే ఉత్తమ కృషీవలులే ఆ ఊళ్ళో. శివుడికి సంబంధించి మాట్లాడుతున్నాడు కనుక "విభూతి" అనే మాటను సార్థకంగా ప్రయోగించాడు. ఇక్కడ విభూతి అంటే ఐశ్వర్యం.

ఇక ఆ ఊళ్ళొ వేశ్యలుకూడా ఉన్నారు. వాళ్ళు నాట్యవిద్యావిలాసాల్లో (నాట్యరేఖా కళా ధురంధర నిరూఢిన్) అందె వేసిన చేతులు. కొంగు బిగిస్తే చాలు (కాసెకొంగు) రంభాది అప్సరసలు పోటీకి వచ్చినా (ఒరయన్) ఓడిపోయి తిరిగి వెళ్ళిపోవలసిందే నాట్యందాకా అవాసమే లేదు. వీళ్ళు కాసెకొంగు బిగిస్తేచాలు - వాళ్ళు గిపోతారు.

ఇవన్నీ ఎందుకు - ఊళ్ళో పుట్టిన చిగురుకొమ్మ కూడా చేవగలదే సారవంతమే.

ఆపురిఁ బాయకుండు మకరాంక శశాంక మనోజ్ఞ మూర్తి భా
షాపరశేషభోగి, వివిధాధ్వర నిర్మల ధర్మ కర్మ దీ
క్షాపరతంత్రుఁడ ంబురుహ గర్భ కులాభరణం బనారతా
ధ్యాపన తత్పరుండు, ప్రవరాఖ్యుఁడలేఖ్య తనూ విలాసుడై

'అఖ్య" అంటే పేరు. ప్రవరుడు అనే అఖ్యకలవాడు. "పురిన్ ఉండు" అని చెప్పి ఊరుకోకుండా " పురిన్ పాయక ఉండున్" అని చెప్పడంలో ఒక విశేషం ఉంది. "పాయక" అంటే విడిచిపెట్టకుండా. విడిచిపెట్టి ఎక్కడెక్కడికో వెళ్ళాలనీ, బహు దేశాలు చూడాలని లోపల ఎంతకోరికగా ఉన్నా, విడిచిపెట్టి వెళ్ళలేకపోతున్నాడు. అందుకే ముక్కూ మొగం తెలియని సిద్ధుడెవరోవచ్చి పాదలేపనం ఇవ్వగానే హిమాలయాలకి ఎగిరిపోయాడు.

మకరాంక శశాంక మనోజ్ఞ మూర్తి. అంటే మన్మధుడిలా, చంద్రుడిలా మనోహరమైన మూర్తి గలవాడు. వాక్కునందు రెండవ - ఆదిశేషుడు. వివిధాధ్వర నిర్మల ధర్మ కర్మ దీక్షా పరతంత్రుడు. పలు తెఱగులైన యజ్ఞములయొక్క పుణ్యకర్మముల యొక్క నియమములకు అధీనుడగువాడు.

అంబురుహగర్భ కులాభరణంబు, బ్రాహ్మణ కులమునకు అలంకారము అగువాడు. ఎల్లప్పుడూ (అనారత) వేదాధ్యయనం చేయించుటయందు (అధ్యాపన) సక్తి కలవాడు (తత్పరుడు). అంటే వేదపఠనం నిత్యం తాను చేయడమే కాకుండా, శిష్యులకు కూడా నేర్పడంలో మహా శ్రద్ధ కలవాడు. ధర్మాచరణం, కర్మాచరణం తప్పనివాడు.

లేఖ్యము అంటే లిఖింపతగినది. చిత్రించి చూపించగలిగిన విలాసం - లేఖ్యవిలాసం. అలా లిఖించి, చిత్రించి చూపించలేనంతటి, వీలుకానంతటి తనూ విలాసం కలవాడు - అలేఖ్య తనూ విలాసుడు.

ఇలా ఈ పద్యంలో ప్రతీ విశేషణమూ భావికథలో సార్థకమయ్యేట్టుగా కవి నిబంధించాడు.

అతని దినచర్య ఎలావుండేదంటే -

వరణాతరంగిణీదర వికస్వరనూత్న
　　కమలకషాయగంధము వహించి
ప్రత్యూష పవనాంకురములు పైకొను వేళ
　　వామనస్తుతిపరత్వమున లేచి
సచ్ఛాత్రుడగుచు నిచ్చలు నేగి యయ్యేట
　　నఘమర్షణస్నాన మాచరించి
సాంధ్యకృత్యము దీర్చి సావిత్రి జపియించి
　　సైకతస్థలి గర్మసాక్షి కెఱగి
ఫల సమిత్కుశ కుసుమాది బహు పదార్థ
తతియు నుదికిన మడుగు దోవతులు గొంచు
బ్రహ్మచారులు వెంటరా బ్రాహ్మణుండు
వచ్చు నింటికి బ్రజ తన్ను మెచ్చి చూడ

ప్రత్యూషం అంటే ప్రాతఃకాలం తూర్పుదిక్కున అరుణారుణరేఖలు రాకముందు తెలతెలవారుతున్న సమయం. ప్రశాంతవేళ చల్లని పిల్లతెమ్మెరలు (పవన+అంకురములు) మెల్లమెల్లగా వీస్తూ ఉంటాయి. అరుణాస్పదంలో పక్కనే వరణానది ప్రవహిస్తోంది. కనక తరంగిణి ఒడ్డున అప్పుడే వికసిస్తూ, ఇంకా సగం విచ్చుకునీ (దర వికస్వర) సగం విచ్చుకుంటూ ఉన్న క్రొందమ్ములు (నూత్న కమలములు). వాటి కషాయ గంధం - రవ్వంత వగరు అనిపించే సుగంధాన్ని ప్రత్యూష పవనాంకురాలు వహించి వీతెంచుతున్నాయి. అవి అలా పైకొనే వేళ ప్రవరుడు నిద్ర లేస్తాడు. విష్ణుదేవుడి స్తోత్రాలు పఠిస్తూ (వామనస్తుతి పరత్వమున) నిద్రలేస్తాడు.

***(కొనసాగింపు వచ్చేసంచికలో)***




## మను చరిత్రము

## (కళాఖండానికి ఒక పామరుడి ప్రశంస)

### బాలాంత్రపు వేంకట రమణ

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**శిష్యులతో సహా (సచ్ఛాత్రుడగుచు)** రోజూ వెళ్ళి ఆ నదిలో (అయ్యేటన్ - ఆ యేరునందున్) అఘమర్షణ స్నానం చేస్తాడు. అఘమును - పాపాన్ని - తొలగించేది. పాప పంకిలాలను తొలగించే మంత్రాలు చదువుకుంటూ చేసే స్నానం అఘమర్షణ స్నానం, దాన్ని ఆచరించి సంధ్యాసమయంలో సూర్యుడికి చెయ్యవలసిన అర్ఘ్య తర్పణ ప్రదానాలు నిర్వహించి (సాంధ్య కృత్యమున్ తీర్చి) గాయిత్రీ మంత్రాన్ని (సావిత్రిన్ - సవిత్రు) జపించి, ఇసుకతిన్నెమీద నిలబడి, కర్మసాక్షి సూర్యభగవానుడికి నమస్కరించి (ఎఱగి) ఆ తరువాత తన శిష్యులతో కలిసి (బ్రహ్మచారులు వెంటరాన్) ఇంటికి వచ్చేవాడు. సమీపంలో దొరికిన ఫలాలు సమిధలు దర్భలు (కుశ) పువ్వులు (కుసుమాలు) ఇటువంటి పూజాద్రవ్యాలను సేకరించి కొందరు శిష్యులు తెస్తున్నారు. మరి కొందరు ఉతికిన మడుగు దోవతులు పట్టుకొని గురువుగారి వెంట నడుస్తున్నారు. ఇలా శిష్యపరివారం వెంటరాగా, ఆ బ్రాహ్మణుడు నడుచుకుంటూ ఇంటికి చేరుకొనేవాడు.

ప్రవరుడు ఇంత నిష్ఠగా ఉండటం, శిష్యులకి విద్యాబోధన చెయ్యడం, క్రమశిక్షణ - ఇవన్నీ గమనించి ప్రజలు సంతోషించి ప్రవరుణ్ణి మెచ్చుకుంటూ చూసే వారట. వారి చూపులో ఆ మెప్పుదల కనిపించేది. అంటే పట్టణ పౌరులు అతడిపట్ల గౌరవంగానూ బాధ్యతాయుతంగానూ మెలిగేవారని. "ప్రజ తన్ను మెచ్చి చూడ" అని ముగించడంలో వ్యక్తి బాధ్యత - సంఘ బాధ్యతలు వాటి పరస్పర సంబంధం - అన్నీ స్ఫురణ ఉంది.

ఇది ఏ ఒకరోజో, అడపా తడపానో జరిగే ప్రక్రియ కాదు. నిత్యం (నిచ్చలు) క్రమం తప్పకుండా జరిగే దినచర్య.

అతని భార్య ఎంతటి అనుకూలవతి అంటే -

వండనలయదు వేవురు వచ్చిరేని
నన్నపూర్ణకు నుద్దియౌ నతని గృహిణి
యతిథు లేతేర నడికి రేయైన బెట్టు
వలయు భోజ్యంబులింట నవ్వారి గాగ.

ఒక్క సారిగా వెయ్యిమంది (వేవురు) భోజనాలకు వచ్చినా ఆవిడ వండటానికి అలిసిపోదు. బద్ధకించదు. అన్నపూర్ణాదేవికి సాటివస్తుంది (ఉద్దియౌ) అతని భార్య (గృహిణి). అతిథులు అర్ధరాత్రి వేళ వచ్చినాసరే వండిపెడుతుంది. కావలసిన పదార్థాలు ఇంటిలో యెప్పుడూ సమృద్ధిగా (అవ్వారిగాగన్) ఉండటంతో సోమిదమ్మగారు సాక్షాత్తూ అన్నపూర్ణ అయ్యింది. యజ్ఞం చేసినవాడు సోమయాజి; అతని భార్య సోమిదమ్మ.

తీర్థ సంవాసు లేతెంచినారని విన్న
నెదురుగా నేగు దవ్వేంత యైన
నేగి తత్పదముల కెఱఁగి యింటికి దెచ్చు
దెచ్చి సద్భక్తి నాతిథ్యమిచ్చు
నిచ్చి యిష్టాన్న సంతృప్తులుగా జేయు
జేసి కూర్చున్నచో జేరవచ్చు
వచ్చి యిద్ధరగల్గు వనధి పర్వత సరి
త్తీర్థ మాహత్మ్యముల్ దెలియ నడుగు

నడిగి యోజన పరిమాణ మరయు, నరసి
పోవలయు జూడ ననుచు నూర్పులు నిగుడ్చు
ననుదినము తీర్థ సందర్శనాభిలాష
మాత్మ నుప్పొంగ నత్తరుణాగ్నిహోత్రి.

తీర్థయాత్రలు చేసినవారెవరైనా అరుణాస్పదం వైపు వస్తున్నారని తెలిస్తే చాలు, ఎంత దూరమైనా ఎదురువెళతాడు. వెళ్ళి వారి పాదాలకు నమస్కరిస్తాడు, నమస్కరించి (ఎఱగి) ఇంటికి ఆహ్వానించి తీసుకు వస్తాడు. తెచ్చి మంచి భక్తితో ఆతిథ్యం ఇస్తాడు. ఇచ్చి ఇష్టాన్న సంతృప్తుల్నిగా చేస్తాడు. చేసి వారు విశ్రాంతిగా కూచున్న సమయంలో దగ్గరకి చేరతాడు. చేరి - ఈ భూమి మీద ఉన్న (ఈ ధరన్ కలుగు) సముద్రాలు, పర్వతాలు, నదులు (సరిత్) తీర్థాలు, వాటి మహత్తులూ తెలియజెప్పమని అడుగుతాడు. వారు చూసినవి చెబుతారు. అవి ఇక్కడికి ఎన్ని యోజనాలదూరంలో ఉన్నాయో అడిగి తెలుసుకొంటాడు. అరసి - నేనుకూడా చూడటానికి వెళ్ళాలి అంటూ నిట్టూర్పులు విడుస్తాడు (చూడన్ పోవలయుననుచు ఊర్పులు నిగుడ్చున్).

తరుణ వయస్సులో ఉన్న ఆ నిత్యాగ్నిహోత్రుడి మనస్సులో ఎప్పుడూ ఒకటే కోరిక. వెళ్ళాలి, తీర్థాలు సందర్శించాలి అనే అభిలాష రోజురోజుకీ ఆత్మలో ఉప్పొంగుతోంది.

మీ మాటలు మంత్రంబులు
మీ మెట్టిన యెడ ప్రయాగ, మీ పాద పవి
త్రామల తోయము లలఘు
ద్యోమార్గ ఝరాంబు పౌనరుక్త్యములుర్విన్

స్వామీ! మీ మాటలే మంత్రాలు. మీరు కాలుపెట్టినచోటు ప్రయాగ (అంతటి పవిత్రస్థలం అని). మీ కాళ్ళు కడిగిన నీళ్ళు ఆకాశ గంగాజలానికి (ద్యోమార్గఝరి) భూమిమీద పునరుక్తులు. వాటికంటే రెట్టింపు పవిత్రమైనవి అని. లఘు అంటే చిన్న; అలఘు: చిన్నదికానిది, గొప్పది.

కెలకుల నున్న తంగేటి జున్ను గృహమేధి
యజమానుడంక స్థితార్థ పేటి
పండిన పెరటి కల్పకము వాస్తవ్యుండు
దొడ్డి బెట్టిన వేల్పుగిడ్డి కాపు
కడలేని యమృతంపు నడబావి సంసారి
సవిధ మేరు నగంబు భవన భర్త
మరుదేశ పథ మధ్యమప్రప కులపతి
యాకటి కొదవు సస్యము కుటుంబి

బధిర పంగ్వంధ భిక్షుక బ్రహ్మచారి
జటి పరివ్రాజకాతిథి క్షపణ కావ
ధూత కాపాలికాద్యనాథులకు గాన
భూసురోత్తమ ! గార్హస్థ్యమునకు సరియె !

ఓ బ్రాహ్మణోత్తమా! ఆశ్రమాలు నాల్గింటిలోకీ గృహస్థాశ్రమమే (గార్హస్థ్యము) గొప్పది. తక్కిన అన్ని ఆశ్రమాలవారికీ ఇదే ఆధారం. చెవిటి, కుంటి (పంగు), గ్రుడ్డి, భిక్షువులు, బ్రహ్మచారులు, జటి (వానప్రస్థులు), పరివ్రాజకులు (సన్యాసులు), అతిథులు, క్షపణకులు (బౌద్ధ భిక్షువులు), అవధూతలు (దిగంబరులు), కాపాలికులు (శాక్తేయులు) - ఈ మొదలైన అనాథులకు అందరికీ గృహమేధి (యజమానుడు, వాస్తవ్యుడు, కాపు, సంసారి, భవన భర్త, కులపతి, కుటుంబి - ఇవి పర్యాయపదాలు) దగ్గరలో ఉన్న తంగేటిజున్ను లాంటివాడు (చేతితో తీసుకోవచ్చునని) ఒడిలో ఉన్న ధనపేటిక (డబ్బుపెట్టి), పెరటిలో ఉండి పండిన కల్పవృక్షం, దొడ్డిలో కట్టేసుకున్న కామధేనువు (వేల్పుగిడ్డి) అంతులేని అమృతకూపం, అందుబాటులోఉన్న మేరుపర్వతం, ఎడారిదారిలో (మరుదేశపథం) చలివేంద్రం (ప్రప). ఆకలికి అమిరే పంట - అన్నీ అభేద రూపకాలు.

ఇంత గొప్పది గృహస్థాశ్రమం. గృహమేధిగా ఉంటూ నువ్వు సన్యాసుల్ని మమ్మల్ని పొగుడుతావేంటి, పిచ్చివాడా! అని సిద్ధుడి అభిప్రాయం.

ఓ చతురాస్య వంశ కలశోదధి పూర్ణ శశాంక! తీర్థయా
త్రాచణశీలినై జనపదంబులు, పుణ్యనదీనదంబులున్
జూచితి నందు నందుఁగల చోద్యములున్ గనుఁగొంటి నాపటీ
రాచల పశ్చిమాచల హిమాచల పూర్వ దిశాచలంబుగన్

చతురాస్యుడు - నాలుగు ముఖాలు కలవాడు - బ్రహ్మ. ఆ వంశం అనే క్షీరసముద్రం (కలశ + ఉదధి). ఆ సముద్రానికి పూర్ణచంద్రుని వంటి వాడా ! అని ప్రవరుణ్ణి సంబోధించాడు. పున్నమి చందమామను చూస్తే సముద్రం ఉప్పొంగుతుందిట. అలా ప్రవరుడు ఉదయించినందువల్ల అతడి వంశం సంతోషతరంగితమయ్యిందని. చంద్రుడు క్షీరసముద్రంనుంచి జన్మించాడని క్షీరసాగర మథనకథ. బ్రాహ్మణవంశం అనే క్షీరసముద్రం నుంచి ప్రవరుడు అనే పూర్ణ శశాంకుడు జన్మించాడు.

ఈ సుదీర్ఘ సంబోధన సిద్ధుడికి ప్రవరుడిపై కలిగిన ఆదరాతిశయాన్ని సూచిస్తుంది.

చణుడు అంటే నేర్పరి. వ్యాకరణ చణుడు అంటే వ్యాకరణంలో నేర్పరి - పండితుడు అని. మహాకవి శ్రీ శ్రీ ఒకచోట ''హింసనచణ ధ్వంస రచన'' అన్నారు.

తీర్థయాత్రాచణుడంటే, తీర్థయాత్రలు చెయ్యడంలో నేర్పరితనం కలవాడు. అదే శీలంగా, అదే పనిగా, జనపదాలూ, పవిత్ర నదీ నదాలూ (తూర్పునకు ప్రవహించేవి నదులు, పశ్చిమానికి ప్రవహించేవి నదాలు) అన్నీ తిరిగాను. ఆయా చోట్లగల వింతలు (చోద్యాలు) చూశాను. తెలుసుకున్నాను. ఎంతదేశం తిరిగానంటే మలయాద్రి, పశ్చిమాద్రి, హిమాద్రి, పూర్వాద్రి సరిహద్దులుగా మధ్యలో ఉన్నదేశంలో అన్ని జనపదాలూ, అన్ని నదీ-నదాలూ దర్శించాను. పటీరం అంటే మంచిగంధం. దక్షిణదిక్కున మలయ పర్వతం ఉంది. దానిమీద మంచి గంధం చెట్లు ఎక్కువగా ఉంటాయని కవుల వర్ణన. అందుకని మలయ పర్వతాన్ని పటీరాచలం అంటారు.

ఆకర్ణాంతం అంటే చెవిదాకా. ఆశాంతం. అలాగే ఆ పటీరాచల, పశ్చిమాచల....అంటే ఆయా పర్వతాలచివరిదాకా అని.

కేదారేశు భజించితిన్, శిరమునన్ గీలించితిన్ హింగుళా
పదాంభోరుహముల్, ప్రయాగ నిలయుం బద్మాక్షు సేవించితిన్,
యాదోనాథ సుతాకళత్రు బదరీ నారయణుం గంటి, నీ
యా దేశంబన నేల? చూచితి సమస్తాశావకాశంబులన్

కేదారేశ్వరుణ్ణి సేవించాను. హింగుళాదేవి పాదపద్మాలు శిరస్సున కీలించాను. శిరస్సు ఆన్చి నమస్కరించానని. ప్రయాగనిలయుడైన పద్మాక్షుణ్ణి భజించాను. బదరీనారాయణుడు - క్షీరసముద్రరాజతనయ యొక్క పతిని దర్శించాను. (యాదస్ = నీరు, యాదోనాథుడు = సముద్రుడు. యాదోనాథుని సుత = లక్ష్మీదేవి. లక్ష్మీదేవి కళత్రంగా - భార్యగా కలవాడు - విష్ణుమూర్తి).

ఈ దేశమూ, ఆ దేశమూ ఏమిటి, అన్ని దిక్కులా అన్ని భాగాలనూ అన్ని ప్రాంతాలనూ చూసాను. (సమస్త + అశా = దిక్కు + అవకాశంబులన్ = ప్రాంతాలను, మధ్యభాగాలను).

దివి బిసరుహబాంధవ సైం
ధవ సంఘం బెంత దవ్వు దగలే కరుగున్
భువి నంత దవ్వు నేమును
తవతవలే కరుగుదుము హుటాహుటి నడలన్

బిసము అంటే తామరతూడు. దానినుంచి పుట్టింది బిసరుహం = పద్మం. పద్మబాంధవుడు - సూర్యుడు. సూర్యోదయంకాగానే పద్మాలు వికసిస్తాయి కనక. సైంధవం అంటే గుర్రం. సూర్యుడి రథాశ్వాలు ఏడూ ఆకాశంలో దప్పిక (దగ) అనేది లేకుండా ఎంత దూరం (దవ్వు) వెడతాయో - మేమూ (ఏమును) భూమి మీద అలసట (తవతవ) అనేది లేకుండా హుటాహుటి ప్రయాణాలతో వెళ్ళగలం.

సూర్యుడు ఆకాశంలో ఈ చివరినుంచి ఆ చివరికి ప్రయాణిస్తాడు. అలాగే మేమూ ఒక్క రోజులో భూగోళం మీద ఈ చివరినుంచి ఆ చివరికి వెళ్ళగలం అని పాదలేపన ప్రభావాన్ని నాటుకొనేటట్లు చెప్పాడు.

ఆ మందిడి యత డరిగిన
భూమీసురు డరిగెఁ దుహిన భూధర శృంగ
శ్యామల కోమల కానన
హేమాద్వదరీ ఝురీ నిరీక్షాపేక్షన్

ఆ మందు పులిమి ఆ సిద్ధుడు అలా వెళ్ళగానే, భూమీసురుడు ప్రవరుడుకూడా వెళ్ళాడు. హిమాలయాలకు వెళ్ళాడు. తుహినం అంటే మంచు. భూధరం అంటే పర్వతం. మంచుకొండ. ఆ కొండ కొమ్ముల మీద (శృంగం), పచ్చగా (శ్యామలం) కోమలంగా ఉండే కాననాలు, బంగారు గుహలు (దరీ) సెలయేళ్ళు (ఝరీ) - వీటిని వీక్షించాలనే అపేక్షతో వెళ్ళాడు.

భూధర శృంగ శ్యామల కోమల కానన హేమాఢ్యదరీ ఝరీ నిరీక్షాపేక్షన్.. కొండకొమ్ముల ఎత్తుపల్లలూ సెలయేళ్ళ వంకర టింకరలూ స్ఫురించేటట్టు కట్టిన సమాసమిది.

**ఈ క్రింది పద్యంలో ఇది ఇంకా బాగా స్ఫురిస్తుంది.**

అటఁజని కాంచె భూమిసురుఁడంబర చుంబి శిర స్సరీ ఝ్ఝరీ
పటల ముహుర్ముహుర్లుఠద భంగ తరంగ మృదంగ నిస్స్వన
స్ఫుట నటనానుకూల పరిఫుల్ల కలాప కలాపి జాలమున్
గటక చరత్కరేణు కర కంపిత సాలము శీతశైలమున్

ఇది తెలుగు సాహిత్యంలో బహు ప్రసిద్ధి గాంచిన పద్యం. ప్రవరుడు సిద్ధుడిచ్చిన పాదలేపన ప్రభావంతో తలుచుకోగానే హిమాలయపర్వతం చేరుకున్నాడు.

అక్కడ ఆకాశాన్నంటుతున్న శిఖరాలనుండి పడుతున్న జలపాతాల్నీ, సెలయేళ్ళనీ చూశాడు. అవి ఎడతెరిపిలేకుండా ప్రవహిస్తున్నాయి. లయబద్ధంగా ఉన్న వాటి ప్రవాహ ధ్వనులు మృదంగధ్వనుల్లా వినబడుతున్నాయి. నీటితుంపర్లు అన్నిదిక్కులకీ తుళ్ళుతున్నాయి. వాటినిచూసి పులకించిన నెమళ్ళు గుంపులు గుంపులుగా పురులు విప్పుకుని నాట్యం చేస్తున్నాయి. ఆ పర్వతమధ్య ప్రదేశమంతా చెట్లూ చేమలతో అరణ్యంలా ఉంది. ఆడ ఏనుగులు (కరేణులు) గొప్ప మద్దివృక్షాల్ని (సాలమున్) కదిలించడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాయి. ప్రవరుడు ఈ హిమవత్పర్వత (శీతశైలమున్) సౌందర్యాలనంటినీ చూశాడు.

ఇక్కడ ఆడ ఏనుగులు ఎంత ప్రయత్నించినా ఆ మద్దివృక్షాలు చలించడం లేదు అన్నాడు. భావిసూచన. త్వరలో వరూధిని అనే ఆడ మదగజం ప్రవరుణ్ణి నైతికంగా కూల్చడానికి ప్రయత్నించబోతోంది. కానీ ప్రవరుడు సాలవృక్షంలాగా చలించకుండా నిలబడ్డాడు.

ఆకాశాన్ని తాకుతున్న (అంబరచుంబిత) కొనలనుండి (శిరః) ప్రవహిస్తున్న (సరత్) సెలయేళ్ళమొత్తము నందు (ఝరీపటల) మాటిమాటికీ (ముహుర్-ముహుర్) దొరలుతున్న (లుఠత్), అడ్డులేని (అభంగ) కెరటాలచే (తరంగ), మృదంగధ్వనులతో (నిస్స్వన) వెల్లడి అవుతున్న (స్ఫుట), నాట్యం చేయడానికి అనుకూలంగా ఉన్న (నటనానుకూల) విచ్చుకున్న (పరిఫుల్ల) పింఛములుగల (కలాప) నెమిళ్ళ సమూహము కలదానిని (కలాపి జాలమున్).

ప్రకృతిసౌందర్యంతో పరవశం కలిగించే దృశ్యాలే కాదు, హిమలయాల్లో ప్రవరుడు కొన్ని పవిత్రమైన పురాణఘట్టాలకి నెలవైన ప్రదేశాలు కూడా చూశాడు.

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

●●●




## మను చరిత్రము

## (కళాఖండానికి ఒక పామరుడి ప్రశంస)

బాలాంత్రపు వేంకట రమణ

నిడుద పెన్నెఱిగుంపు జడగట్ట సగరుము
    మ్మనుమండు తపము గైకొనిన చోటు
జరఠకచ్ఛప కులేశ్వరు వెన్ను గాన రా
    జగతికి మిన్నేఱు దిగినచోటు
పుచ్ఛడీకతనంబు పోఁబెట్టి గిరికన్య
    పతిఁకొల్వ నాయాసపడిన చోటు
వలరాచరాచవాఁడలికాక్షు కనువెచ్చఁ
    గరఁగిన యలకనికరపుఁ జోటు

తపసి ఇల్లాండ్ర చెలువంబు దలఁచి తలఁచి
మున్ను ముచ్చిచ్చును విరాళిగొన్న చోటు
కనుపపులు వేల్పుఁబడ వాలుఁ గన్న చోటు
హర్షమునఁ జూచి ప్రవరాక్షుఁ డాత్మలోన.

సగర చక్రవర్తి మునిమనుమడు (ముమ్మనుమండు) భగీరథుడు  ఆకాశగంగని భూమి మీదికి తెచ్చేందుకు ఘోరమైన తపస్సు చేసిన చోటు  చూసాడు.  అలా తపస్సు చేసినప్పుడు అతని నిడుపయిన నిగనిగలాడుతున్న తలవెండ్రుకలు (నిడుద పెన్నెఱి గుంపు) జడలు బాగా కట్టాయి. ఆకాశగంగ భూమి మీద పడినప్పుడు ఆ  ధారాపాతానికి భూమి విచ్చుకుని  భూమిని మోస్తున్న  ముదుసలి (జరఠ) ఆదికూర్మము (ఆది కచ్ఛప కులేశ్వరు) యొక్క వీపు  కూడ కనిపించిందిట.  అలా ఆకాశగంగ భూమి మీద పడినచోటు; కన్నెసహజమైన సిగ్గుని (పుచ్ఛడీకతనంబు) విడిచిపెట్టి (పోబెట్టి)  పార్వతీ దేవి పరమశివుణ్ణి పతిగా బడయటంకోసం ఆయాసపడిన, శ్రమపడిన - తపస్సు చేసిన - ప్రదేశమూ; మన్మధుడు (వలరాచరాచవాడు) శివుని (ఫాలాక్షు) కంటిమంటచే కాలిబూడిదయిపోయిన (కరగిన) ఆ జాలికలిగించే చోటూ (అల  కనికరపుచోటు); సప్తఋషుల భార్యల (తపసి ఇల్లాండ్ర) అందాన్ని (చెలువంబు) చూసి,

స్మరించి స్మరించి (తలచి తలచి) (మునిపత్నులను కామించడం యుక్తంకాదని తెలిసి కూడా, ఎట్టకేలకి ఇక ఉండబట్టలేక తెగించి, ముచ్చిచ్చును (అగ్నిదేవుణ్ణి) (గార్హపత్య, ఆహవనీయ, దక్షిణాగ్నులు - ముచ్చిచ్చులు) మోహం (విరాళి) గొన్నచోటు (ఆక్రమించిన) ప్రదేశమూ; అగ్నిదేవుడు అలా మునిపత్నులయందు మోహాన్ని పొందిన చోటూ, దేవతలసేనాథిపతి (వేల్పుబడవాలున్) జనించిన జెల్లుపొదల్ని (కనుపపులు). ఈ ప్రదేశాలన్నీ

ప్రవరుడు చూశాడు. ఆత్మలో సంతోషం ఉప్పొంగగా చూశాడు.

హిమగిరి సౌందర్యంతో పులకించిపోయి కూడా ప్రవరుడు తన నిత్యకృత్యాలయిన కర్మాచరణాన్ని విస్మరించలేదు. అతను ఇలా అనుకున్నాడు.

**తలమే బ్రహ్మకునైన నీనగ మహత్త్వంబెన్న నేనియ్యెడన్**
**గలచోద్యంబులు జేపు గన్గొనియెదన్ గాకేమి నేఁడేఁగెదన్**
**నలినీబాంధవ బాను తప్త రవికాంతస్యంది నీహారకందళ చూ**
**త్కారపరంపరల్ పయిపయిన్ మధ్యాహ్నమున్ దెల్పెడిన్**

ఈ హిమాలయ సౌందర్యం, మహత్యం గణుతింపడం ఆ బ్రహ్మకైనా తరం కాదు. సూర్యకిరణాలు తాకి వేడెక్కిన సూర్యకాంత శిలలపైనున్న చెట్లకొమ్మలనుండి మంచుబొట్లు పడి చుయి చుయి అనడం వల్ల మధ్యాహ్న సమయం అయిందని తెలుస్తోంది. నేటికి ఇంటికి వెళ్తాను. రేపు మరల వచ్చి ఇక్కడ గల మిగతా వింతలూ విశేషాలూ చూస్తాను.

**నను నిముసంబు గానక యున్న నూరెల్ల**
**నరయు మజ్జనకుఁ డెంతడలు నొక్కొ**
**యెపుడు సంధ్యలయందు నిలు వెళ్ళనీక న**
**న్నోమెడు తల్లి యెంతొఱలునొక్కొ**
**యనుకూలవతి నాదు మనసులో వర్తించు**
**కులకాంత మది నెంత కుందునొక్కొ**
**కెడఁదోడునీడలై క్రీడించు సచ్ఛాత్రు**
**లింతకు నెంత చింతింతురొక్కొ**

**యతిథిసంతర్పణంబు లేమయ్యెనొక్కొ**
**యగ్ను లేమయ్యె నొక్కొ నిత్యంబులైన**
**కృత్యములఁ బాపి దైవంబ కినుక నిట్లు**
**పాఱువైచితె మిన్నులు పడ్డ చోట.**

తను అక్కడే చిక్కుబడిపోయి ఇంటికి వెళ్ళలేకపోతే ఎవరెవరు ఎంత బెంగపెట్టుకుంటారో, ప్రవరుడిలా చింతిస్తున్నాడు. నేను ఒక్క నిముషం కనిపించకపోతే ఊరంతా వెదికే (అరయు) నా తండ్రి ఎంత విచారిస్తాడో (అడలునో)కదా; ఉదయ, మధ్యాహ్న, సాయం సంధ్యలయందు (త్రిసంధ్యలయందు) ఇలు దాటనీయక నిత్యం నన్ను కాపాడుతూ ఉండే (నన్నోమెడు) నా కన్నతల్లి ఎంత

దుఃఖిస్తుందో కదా (ఒఱునొక్కొ); అనుకూలవతి, ఎల్లప్పుడూ నామనసులో వర్తించే నా భార్య ఎంత వెతపడుతుండో కదా (కుందునొక్కొ) ; ఎప్పుడూ నాకు తోడునీడలుగా , నా చెంతనే (ఎడన్) ఉంటూ, నాతో ఆటలాడే (క్రీడించు), నా మంచి శిష్యులు (సచ్ఛాత్రులు) - ప్రవరుడు శిష్యుల్ని స్నేహితుల్లాగా చూసుకుంటాడన్నమాట - నేను ఇల్లు చేరకపోతే (ఇంతకు) ఎంత విచారిస్తారో కదా; నేను చేసే అతిథి సంతర్పణలు ఏమైపోతాయో కదా! నిత్యాగ్నిహోత్రినైన నా అగ్నులేమైపోతాయో కదా! నేను భక్తిశ్రద్ధలతో చేసే నా దినచర్యనుండి (నిత్యకృత్యములన్) దూరంచేసి, తప్పించి (పాపి) - ఓ దైవమా నన్నెందుకిలా ఇలా దూరంగా (మిన్నులు పడ్డచోట) విసిరేశావు (పారవైచితివి) తండ్రీ ! అని మొరపెట్టుకున్నాడు ప్రవరుడు.

**మృగమదసౌరభ విభవ**
**ద్విగుణిత ఘనసార సాంద్ర వీటీగంధ**
**స్థగితేతర పరళ మై**
**మగువ పులుపుఁ దెలుపునొక్క మారుత మొలసెన్**

కస్తూరిపరిమళంతో (మృగమద సౌరభ విభవ), దానికి రెట్టించిన (ద్విగుణిత) పచ్చకర్పూరం కలిపి (ఘనసార) పరిమళం (గంధ) ఇంపారగా, ఇంకా ఇతర పరిమళ వస్తువులు కలిపిన (స్తగిత + ఇతర) సువాసనలతో నిండిన (సాంద్ర) తాంబూలం (వీటీ) యొక్క సువాసనలను తెలుపుతూ ఒక్క (ఒకానొక) చిరుగాలి (మరుత్ + అంకురము) వీచింది (ఒలసెన్). ప్రవరుడి ముక్కుపుటాలకి సోకింది. ఆ సువాసనని బట్టి, సమీపంలో ఒక జవరాలు (మగువ) ఉందని గ్రహించాడు. ఆ చిరుగాలి ఆమె జాడని (పొలుపున్) తెలిపింది.

తాంబూల సేవనంలో వైభోగం. మగవారైతే రెండు పాళ్ళు కస్తూరి, ఒక పాలు పచ్చకర్పూరంతో తాంబూలం సేవిస్తారు. మగువలైతే తాంబూలంలో ఒకపాలు కస్తూరి, రెండు పాళ్ళు పచ్చకర్పూరం వేసుకుంటారు. కాబట్టి ప్రవరుడు తనకేసి వీచిన చిరుగాలిలో ఆ పరిమళాన్ని బట్టి మగువ పొలుపుని, అంటే ఈ సమీపంలో ఎక్కడో ఒక జవరాలు ఉంది అని గ్రహించాడు.

**అతఁడా వాత పరంపరా పరిమళ వ్యాపారలీలన్ జనా**
**న్వితమిచ్చోటని చేరఁబోయి కనియెన్ విద్యుల్లతా విగ్రహన్**
**శతపత్రేక్షణఁ జంచరీకచికురన్ జంద్రాస్యఁ జక్రస్తనిన్**
**నతనాభిన్ నవలా నొకానొక మరున్నారీ శిరోరత్నమున్**

ప్రవరుడు గాలి జాలునందు సుగంధము యొక్క ప్రవర్తన విలాసము చేత, ఈ ప్రాంతం జనులు కలదిగా గ్రహించి, వెళ్ళేసరికి అక్కడ అతనికి ఒక అత్యద్భుతమైన సౌందర్యవతి అగుపించింది. మెఱుపుతీగలాటి మేను కలదానిని (విద్యుల్లతావిగ్రహన్); కమలములాటి కన్నులు గలదానిని(శతపత్ర+ఈక్షణన్), తుమ్మెదరెక్కలవంటి కురులు గలదానిని (చంచరీక చికురన్), చంద్రబింబం లాటి మోముగలదానిని (చంద్ర+ఆస్యన్), చక్రవాకముల వంటి చన్నులుగలదానిని (చక్రస్తనిన్), లోతైన బొడ్డు కలదానిని (నత నాభిన్) ఒకానొక, దేవతాస్త్రీశిరోమణిని (మరుత్ నారీ శిరోరత్నమున్), జవరాలిని (నవలాన్) చూశాడు (కనియెన్) ప్రవరుడు.

సర్వశుభలక్షణ అని వర్ణన.

తనకేసి వస్తున్న ప్రవరుణ్ణి చూడగానే, ఆ దేవతాస్త్రీకి -

అబ్బురపాటుతోడ నయనాంబుజముల్ వికసింపఁగాంతి పె
ల్లుబ్బి కనీనికల్ వికసితోత్పల పంక్తులఁ గ్రుమ్మరింపఁగా
గుబ్బ మెరుంగుఁజన్గవ గగుర్పొడువన్ మదిలోనఁ గోరికల్
గుబ్బతిలంగఁ జూచె నలకూబర సన్నిభు నర్ధరామరున్

నలకూబరునితో సమానమైన అందంకల ఆ బ్రాహ్మణుణ్ణి (ధర+అమరున్) చూడగానే ఆశ్చర్యంతో ఆమె కళ్ళు విప్పారాయి; కాంతిపెల్లుబ్బి కంటినల్లగుడ్లు విచ్చిన (వికసిత) కలువపూవుల్లా అయ్యాయి (ఉత్పలపంక్తులని గ్రుమ్మరించాయి); గుండ్రనైన మిసమిసలాడే స్తనద్వయం (గుబ్బమెఱుంగు చన్గవ) గగుర్పొడిచింది. మదిలోన కోరికలు పెల్లుబికాయి (గుబ్బతిలంగన్).

ఎక్కడివాఁడొ యక్షతనయేందు జయంత వసంత కంతులన్
జక్కఁదనంబునన్ గెలువఁ జాలెడువాఁడు, మహీసురాన్వయం
బెక్కడ యీ తనూవిభవ మెక్కడ యేలని బంటుగా మరున్
డక్కఁ గొనంగ రాదె, యకటా! నను వీడు పరిగ్రహించినన్!

ఎక్కడివాడో ! అబ్బ! ఎంత సౌందర్యం ! నలకూబరుణ్ణి (యక్షతనయ), చంద్రుడ్ని (ఇందు), జయంతుడిని (ఇంద్రకుమారుడైన జయంతుణ్ణి) వసంతపురుషుణ్ణి, మన్మధుణ్ణి (కంతున్) అందంలో గెలవగలిగినవాడు! బ్రాహ్మణకులం ఎక్కడ? ఈ శరీరసంపత్తి (తనూ విభవము) ఎక్కడ? అకటా, నన్ను ఇతడు పరిగ్రహిస్తే మన్మధుడిచేత వెట్టిచాకిరీ చేయించుకోనా! అంటే మన్మధ సామ్రాజ్యాన్ని జయించి దాని అధిపతి అయిన మన్మధుడి చేతనే బానిసలాగా వెట్టిచాకిరీ చేయించుకోనా, అని.

ఆ దివ్యాంగన ప్రవరుడి రూపలావణ్యాన్ని ఇలా వర్ణిస్తోంది:

వదన ప్రభూత లావణ్యంబు సంభూత
　　కమలంబు లన వీని కన్నులమరు
నిక్కి వీనులతోడ నెక్కసక్కెము లాడు
　　కరణి నున్నవి వీని ఘన భుజములు
సంకల్ప సంభవాస్థాన పీఠిక వోలె
　　వెడఁద యై కనుపట్టు వీని యురము
ప్రతిఘటించు చిగుళ్ళపై నెఱ్ఱవాఱిన
　　రీతి నున్నవి వీని మృదుపదములు

నేరేటేటి యసల్ తెచ్చి నీరజాప్తు
సానఁబట్టిన రాపొడి చల్లి మెదిపి
పదను సుధ నిడి చేసెనో పద్మభవుఁడు
వీనిఁ గాకున్నఁ గలదె యీ మేని కాంతి!

ఈ అందగాని కన్నులు ముఖ కాంతి అనే నీట పుట్టిన కమలాలలాగ ఉన్నాయి. అతని ఎగుభుజాలు నిక్కి చెవులతో ఆటలాడుతున్నాట్టున్నయి. ఇతని విశాల వక్షస్థలం మన్మథుడి సింహాసనంలాగ ఉంది. పాదాలు ఎంత సుకుమారంగా వున్నాయంటే, నడుస్తున్నప్పుడు గడ్డి చిగుళ్ళు తగిలి కందిపోయాయి కాబోలు, బాగా ఎఱ్ఱబారి ఉన్నాయి.

ఆ బ్రహ్మదేవుడు జంబూనది యందలి బురద తెచ్చి (నేరేటి+ఏటి+అసల్) (జంబూనదిలోని అడుసు బంగారమని చెప్పబడింది), సూర్యుణ్ణి సానబట్టగా రాలిన పొడిని (రజను) అందులో జల్లి, కలయగలిపి, ముద్ద పాకానికి కావలసిన (పదను) తడిని, అమృతంతో కలిపి రంగరించి ఇతనిని చేశాడేమో ! లేకపోతే ఇంతటి శరీర కాంతి, లావణ్యం ఎలా సాధ్యం ?

ఇంకా -

**సుర గరుడోరగ నరఖే**
**చరకిన్నర సిద్ధ సాధ్య చారణ విద్యా**
**ధర గంధర్వకుమారుల**
**నిరతము గనుఁగొనమె, పోలనేర్తురె వీనిన్?**

దేవతలు (సుర) గరుడ (పక్షీంద్రుడైన గరుత్మంతుడు), నాగజాతి (ఉరగ), ఆకాశంలో సంచరించే దివ్యపురుషులు (ఖ అంటే ఆకాశం, దానిలో చరించేవారు ఖేచరులు), కిన్నర, సిద్ధ, సాధ్య, చారణ, విద్యాధర, గంధర్వ - వీరిలో యుక్తవయసులో ఉన్నవారిని (కుమారులన్), నిత్యం చూస్తూ ఉండనా? వారిలో ఎవరైనా వీనితో సరిపోలగలరే (పోలనేర్తురే)? అనుకుంది.

**ఇంతలు కన్నులుండఁ దెరు వెవ్వరివేఁడెదు భూసురేంద్ర! యే**
**కాంతమునందు నున్న జవరాండ్ర నెపంబిడి పల్కరించులా**
**గింతియ కాక నీ వెఱుఁగవే మును వచ్చిన త్రోవచొప్పు నీ**
**కింత భయంబు లే కడుగ నెల్లిద మైతిమె, మాటలేటికిన్?**

చెంపకి చారడేసి కళ్ళు పెట్టుకుని ఎవరినయ్యా దారి అడుగుతున్నావు? ఒంటరిగా ఉన్న జవరాలిని పలకరించే నెపం కాకపోతేను! నువ్వు వచ్చిన త్రోవ అప్పుడే మర్చిపోయావా? ఇంత భయంలేకుండా అడగడానికి నేను నీకు చులకనగా కనబడుతున్నాను.

"భూసురేంద్రా" అని సంబోధించింది. బ్రాహ్మణులలో ఇంద్రునివంటి వాడా అని. నేను అప్సరసని - నీవు ఇంద్రుడివి. చక్కటి కన్నులతో ఉన్నావు. నీ ఆందం నాకు నచ్చింది. జవరాలిని. యుక్తవస్సులో ఉన్నదానిని. ఒంటరిగా ఉన్నాను. అన్ని సూచనలనిచ్చింది. ఇంక మాటలెందుకు - నేను నీకు భోగ్యురాలిని - అని నర్మగర్భంగా పలికింది.

ఇంకా అతడు తనని సామాన్యురాలిగా తలచకూడదని ఇలా చెప్పింది.

**చిన్ని వెన్నెలకందు వెన్ను దన్ని సుధాబ్ధిఁ**
**బొడమిన చెలువ తోఁబుట్టు మాకు**
**రహి పుట్ట జంత్ర గాత్రముల ఠాల్ గరఁగించు**
**విమల గాంధర్వంబు విద్య మాకు**
**ననవిల్తు శాస్త్రంపు మినుకు లావర్తించు**
**పని వెన్నతోఁ బెట్టినది మాకు**
**హయమేధ రాజసూయము లనఁ బేరుఁ**

**సవనతంత్రంబు లుంకువలు మాకుఁ**

**గనకనగ సీమఁ గల్పవృక్షముల నీడఁ**
**బచ్చరాచట్టుగమి రచ్చపట్టు మాకుఁ**
**బద్మసంభవ వైకుంఠ భర్గ సభలు**
**సాముగరిడీలు మాకు గోత్రామరేంద్ర.**

ఓ భూసురోత్తమా ! పాల సముద్రంలో (సుధాబ్ధిన్) బాల చంద్రుని (చిన్ని వెన్నెలకందు) వెనుకనే ప్రభవించిన అందగత్తె (చెలువ) - సాక్షాత్తూ లక్ష్మీదేవి - మాకు తోబుట్టువు; వీణ మొదలైన జంత్రవాయిద్యాలచేతనూ, కంఠగానం (గాత్ర) తోనూ బాగా రక్తి కలిగించే గొప్ప సంగీత విద్య మా గంధర్వుల సొత్తు; కామశాస్త్రపాఠాలు (మినుకులు - పలుకులు; ఆవర్తించడం - వల్లెవేయడం) బాల్యంలోనే వెన్నతో పాటు మాకు వంటబడతాయి.

అశ్వమేధం, రాజసూయంలాటి గొప్ప యజ్ఞాలు చేసినవాళ్ళకి మాత్రమే మేం దక్కుతాం. ఆ యజ్ఞఫలాలే వాళ్ళు మాకు ఇచ్చే కట్నాలు (ఉంకువలు).

మేరుపర్వతం (కనక నగ సీమ), కల్పవృక్షాల నీడలో పచ్చజాళ్ళ చరియలపై మేము కూటమి తీరుస్తాం. బ్రహ్మ, విష్ణు మహేశ్వరుల సభలు మాకు నాట్యశాలలు. అంత గొప్పదాన్ని సుమా !

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*




## మను చరిత్రము

## (కళాఖండానికి ఒక పామరుడి ప్రశంస)

### బాలాంత్రపు వేంకట రమణ

ఎక్కడియూరు కాల్ నిలువకింటికిఁబోయెద నంచుఁ బల్కెదీ
వక్కట, మీకుటీరనిలయంబులకున్ సరిరాకపోయెనే
యిక్కడి రత్నకందరము లిక్కడి నందన చందనోత్కరం
బిక్కడి గాంగసైకతము లిక్కడి యీ లవలీ నికుంజముల్

ఊరు, ఊరని పలవరిస్తున్నావు. అదేం ఊరయ్యా? కాలునిలబడకుండా ఉంది! ఇంటికిపోతానంటావు. ఇక్కడి మా మణిమయములైన గుహలూ, ఈ ఉద్యానములందలి మంచి గంధపుచెట్లు, ఇక్కడి గంగానది యొక్క ఇసుకతిన్నెలూ, వెన్నెల తీగెల పొదరిళ్ళూ, మీ గుడిసెకొంపలకి సరిరాక పోతున్నాయా?

అంధునకు గొజయె వెన్నెల
గంధర్వాంగనల పొందు గాదని సంసా
రాంధువునఁ బడియె దకట, ది
వాంధము వెలుఁగు గని గొంది నడఁగిన భంగిన్.

అయ్యో (అకటా)! గ్రుడ్డివానికి వెన్నెల ఎలా పనికి వస్తుంది? గంధర్వాంగననైన నాతో సంభోగం కాదని సంసారమనే నూతిలో (సంసార+అంధువునన్) పడతానంటావేమిటి - పగటిపూట వెలుతురు చూడలేని గుడ్లగూబ (దివాంధము) కలుగులో (గొందిన్) దూరి దాక్కు న్నట్లు (అడగిన భంగిన్)?

ప్రాంచద్భూషణ బాహుమూలరుచితోఁబాలిండ్లు పొంగార బై
యంచుల్ మోవఁగఁ గౌగిలించి యధరం బాసింప "హా! శ్రీహరీ"
యంచున్ బ్రాహ్మణుఁ డోరమో మిడి తదీయాంసద్వయం బంటి పా
మ్మంచున్ ద్రోచెఁ, గలంచునే సతులమాయల్ ధీరచిత్తంబులన్

మోహం ఉప్పొంగగా, వరూధిని ప్రవరుని కౌగిలించి ముద్దుపెట్టుకోబోగా, అతడు "హా, శ్రీ హరీ!" అంటూ పెడమొహంతో (ఓరమోమిడి) "పో" అని తన మునివేళ్ళతో ఆమెభుజాల్ని - త్రోయడానికి ఎంత అవసరమో అంతమాత్రమే వ్రేళ్ళు ఆనించి అని - త్రోసేశాడు. స్త్రీల కపటకృత్యాలు ధీర చిత్తులయిన వారి మనస్సులని కలత పెట్టగలవా? లేవు అని అర్థం.

వెలిపెట్టిరే బాడబులు పరాశరుఁబట్టి
 దాశకన్యాకేళిఁ దప్పుసేసి
కులములో వన్నె తక్కువ యయ్యెనే గాధి
 పట్టికి మేనక చుట్టఱికము
ననుపుకాఁడై వేల్పు నాగవాసముఁగూడి
 మహిమ గోల్పడియెనే మాందకర్ణి
స్వారాజ్య మేలంగ నీరైరె సుర లహ
 ల్యా జారుఁడైన జంభాసురారి

వారికంటెను నీమహత్వంబు ఘనమె
పవన పర్ణాంబు భక్షు లై నవసి యినుప
కచ్చడాల్ గట్టుకొను ముని మ్రుచ్చులెల్ల
తామరస నేత్రలిండ్ల బందాలు గారె.

ఏమయ్యా, పరాశరుడు దాశరాజు కూతురు సత్యవతితో కూడినందుకు మీ బ్రాహ్మణులు ఏమైనా అతన్ని తప్పుబట్టి వెలివేశారా? మేనకరితో చుట్టరికం పెట్టుకున్నందుకు విశ్వామిత్రుడికి కులంలో వన్నెతగ్గిందా? అనేకమంది అప్సరసల మేళంతో సంభోగించినా మాందకర్ణి తన మహిమ ఏమాత్రమైనా కోల్పోయాడా? అహల్యకోసం విటుడుగా మారిన ఇంద్రుణ్ణి దేవతలు స్వర్గలోకం ఏలనీయం అన్నారా? లేదే?

వాళ్ళందరికన్నా నువ్వు గొప్పవాడివా? గాలి (పవన) ఆకులు (పర్ణ) నీరు (అంబు) మాత్రమే సేవించి కృశించిపోయి, ఇనుపగోచీలని (ఇనుప కచ్చడాల్) కట్టుకొనే దొంగమునులందరూ, మా అందగత్తెల ఇళ్ళలో బందీలుగా పడిఉండేవారే కదా !!

దానజపాగ్ని హోత్ర పరతంత్రుఁడనేని భవత్పదాంబుజ
ధ్యానరతుండనేనిఁ బరదార ధనాదులఁ గోరనేని స
న్మానముతోడ నన్ను సదనంబున నిల్పు మినుండు పశ్చిమాం
భోనిధి లోనఁ గ్రుంకకయ మున్న రయంబున హవ్యవాహనా.

యజ్ఞయాగాదులనుండి హవిస్సుల్ని తీసికువెళ్ళే ఓ అగ్నిహోత్రుడా (హవ్యవాహనా)! దాన జప అగ్నిహోత్రములకు నేను అధీనుడనైతే, సదా నీ పాద పద్మములయొక్క ధ్యానమందు ఆసక్తికలవాడనైతే, పరుల భార్య-దనాదులను నేను ఎన్నడూ కోరనివాడనైతే, సగౌరవంగా (కామ మోహిత అయిన ఈ వరూధినిచే అగౌరవం పాలవకుండా), సూర్యుడు (ఇనుడు) పడమటి సముద్రంలో (పశ్చిమాంభోనిధిలోనన్) క్రుంకకముందు నన్ను ఇలు చేర్చు తండ్రీ - అని ప్రార్ధించాడు.

**సూర్యాస్తమయ వర్ణన -**

శ్రేణుల్ గట్టి నభోంతరాళమునఁ బాఱెన్ బక్షులుష్ణాంశు పా
షాణ వ్రాతము కోష్ణమయ్యె, మృగతృష్ణా వార్థు లింకెన్ జపా
శోణం బయ్యెఁ బతంగ బింబము దిశాస్తోమంబు శోభాదరి
ద్రాణంబయ్యెఁ సరోజషండములు నిద్రాణంబులయ్యెన్ గడున్

పక్షులు బారులు తీరి ఆకాశ మధ్యభాగానికి (నబోంతరాళంబునన్) పరిగెట్టయి - ఎగిరాయి. సూర్యకాంత శిలాసముదాయం (ఉష్ణాంశు పాషాణవ్రాతము) నులివేడి (కోష్ణము) కలవిగా అయింది. మధ్యాహ్నానికి వేడెక్కిన సూర్యకాంతపురాళ్ళు చల్లబడ్డాయి అని. సముద్రంలాగా అంతులేనట్టు కనబడే ఎండమావులు (మృగతృష్ణావార్థులు) ఇంకిపోయాయి. సూర్యమండలం (పతంగ బింబం) జపాకుసుమం - దాసానిపువ్వు - లాగ ఎఱ్ఱగా అయింది. దిక్కుల సమూహం (దిశాస్తోమంబు) కాంతిచే పేదఱికం చెందింది (శొభాదరిద్రాణంబు అయ్యెన్). అంటే అన్ని దిక్కులా కాంతి తగ్గి చీకటి పడడం మొదలయింది. పద్మసమూహాలు (సరోజ సండములు) బాగా (కడున్) ముకుళించాయి (నిద్రాణంబు). అంటే ప్రొద్దుక్రుంకు సమయం అయింది.

**ఇరుట్లు (చీకటి) వర్ణన -**

మృగనాభి పంకంబు మెయినిండ నలదిన
మాయాకిరాతు మై చాయఁ దెగడి
నవపింఛ మయ భూషలవధరించి నటించు
పంకజాక్షుని చెల్వు సుంకమడిగి
కాదంబ నికురుంబ కలిత యై ప్రవహించు
కాళింది గర్వంబుఁగాకు సేసి
తాపింఛ విటపి కాంతార సంవృతమైన
యంజనాచల రేఖ నవఘళించి

కవిసె మఱియును గాకోల కాల కంఠ
కంఠ కలకంఠ కరి ఘటా ఖంజరీట
ఘన ఘనా ఘన సంకాశ గాఢకాంతిఁ
కటిక చీకటి రోదసీ గహ్వరమున

అర్జునుడికి పాశుపతాస్త్రం ప్రసాదించిన సమయంలో, మాయా కిరాతుడి రూపంలో వచ్చిన శివుడు ఒళ్ళంతా కస్తూరి (మృగనాభి) అలముకున్నప్పుడు కలిగిన నల్లటి ఒంటి రంగు, నెమలిపింఛమునలంకరించుకుని నాట్యం చేస్తున్న కృష్ణుని యొక్క అందాన్ని పన్నుగా అడిగి (తనని పోలి ఉండడం చేత సుంకం అడిగింది చీకటి), నల్లని హంసలను కలిగిన యమునా నది, చీకటి చెట్లతోపులు (తాపించ విటపి కాంతార) గల కాటుకకొండ (అంజనాచలం), మాలకాకులు (కాకోల), నెమిళ్ళమెడలతో (కాలకంఠ కంఠ),

ఏనుగుమంద (కరిఘటా), కాటుక పిట్టలతో (ఖంజరీట),గొప్ప కాఱుమబ్బులు (ఘన ఘనా ఘన)- వీటంతటి కాఱు నలుపుని మించిన నలుపుతో కటికచీకటి జగమంతా కమ్ముకుంది.

కలయ జగమునఁ గలయట్టి నలుపులెల్ల
దెలుపులుగఁజేసి నీడలు దెలుపు సేయఁ
గా వశము గామిఁ బొడము దుఃఖమునఁ బోలె
సాంద్ర చంద్రిక తుహిన బాష్పములు గురిసె

వెన్నెల తాను జగమునందలి నల్లని పదార్థాలన్నిటినీ తెల్లగాచేసికూడా, నీడలని మాత్రం తెలుపుచేయడానికి శక్యం కాకపోవడంతో (వశము గామిన్), జనించిన దుఃఖంతో కాబోలునన్నట్లు మంచు చినుకులు (తుహిన బాష్పములు) కురిసాయి.

**వరూధిని విరహ పరాకాష్ట -**

వరూధిని ప్రవరుడి కోసం బహువిధములైన విరహ బాధలననుభవించింది. ఆ విరహం పరాకాష్టకి చేరుకుంది.

చనుగవఁ గప్పు దొలగ వాసన గాలి కెదురేఁగుఁ
బరు వొప్పు నలుగుల బాఱు కరణి
నిడుద వేనలి నూనె ముడి వీడఁ జిగురాకు
బొదఁదూఱుఁ గార్చిచ్చుఁగదియు కరణిఁ
బసిడి గాజులు పైకి వెసఁద్రోచి నునుఁదీగఁ
దెమలించు నుఱ్ఱాడు నెమకు కరణి
మొలనూలు బిగియించి వెలది వెన్నెలఁ జొచ్చుఁ
బిఱుదీయ కేటిలో నుఱుకు కరణి

జడియ దళులకుఁగురియు పుప్పొడుల మునుఁగు
మావికడ నిల్చు విరుల నెత్తావిఁ గ్రోలు
విషమ సాయకునేఁపుల విసివి విసివి
తనువుఁ దొఱగంగ దలఁచి యవ్వనరుహాక్షి.

ఇది విరహావస్థలో "మృతి" అనే చివరి మన్మథావస్థ. ఈ స్థితికి చేరుకున్న వరూధిని విరహం తట్టుకోలేక చేసిన మరణ ప్రయత్నం అభివర్ణింపబడింది.

ఆమె మన్మథుడు వేసిన పుష్పబాణాలచే (విషమ సాయకు తూపులన్) విసిగి విసిగి, శరీరాన్ని విడిచిపెట్టెయ్యడానికి (తనువు తొఱగంగన్) నిశ్చయించుకుని, పైట తొలగిపోయినా, పరుగున పరుగున సువాసనలు వెదజల్లే గాలికి ఎదురేగుతోంది. అటునుండి వచ్చేవి మన్మథుడు వదులుతున్న పూల బాణాలు; ఆ పూలబాణాలు సువాసనలు వెదజల్లుతూ ఈమె కేసి వస్తున్నాయి - ఇటునుండి ఈమె ఆ బాణాలకేసి వేగంగా - శరీరత్యాగానికి కూడా వెనుకాడకుండా - ఆ బాణాలకేసి దూసుకు వెళ్తోంది.

దావాగ్ని (కార్చిచ్చు) చేరబోవు విధంగా (కదియు కరణిన్) పొడవైన (నిడుద) జడతో వేసిన సిగయొక్క (వేనలి) ముడివీడిపోగా, చిగురాకు పొదలలోకి దుముకుతుంది. (విరహిణి మతిచలించి చనిపోదామని చిగురుటాకుల రాశి అగ్నిగుండమని భ్రమించి దూకింది).

బంగారు గాజులు పైకి త్రోసుకొని, లతలని ఉరిత్రాడుగా పెనవేసుకుంటుంది. మొలత్రాటిని బిగించుకుని, సముద్రంలో దూకుతున్నట్టు వెన్నెలలో జొరబడుతుంది. తుమ్మెదలకి (ఆళులకి) భయపడదు.

రాలే పుప్పొడులలో మునుగుతుంది. మామిడిచెట్టు వద్ద నిలిచి పూవులనిండు పరిమళాన్ని గ్రోలుతుంది.

గంధర్వుడు మాయా ప్రవరుడిగా అవతరించాడు.

అర్ధచంద్రుని తేట నవఘళించు లలాట
పట్టి దీర్చిన గంగ మట్టి తోడఁ
జెక్కుటద్దములందు జిగివెల్లువలు చిందు
రమణీయ మణికుండలముల తోడఁ
బసిఁడి వ్రాఁత చెఱుగు మిసిమి దోఁపఁ జెలంగు
నరుణాంశుకోత్తరీయంబు తోడ
సరిలేని రాకట్టు జాళువా మొలకట్టు
బెడఁగారు నీర్కావి పింజె తోడ

ధవళ ధవళము లగు జన్నిదముల తోడఁ
గాశికాముద్ర యిడిన యుంగరము తోడ
శాంతరస మొల్కు బ్రహ్మతేజంబు తోడఁ
బ్రవరుఁడయ్యె వియచ్చర ప్రవరుఁడపుడు

అర్థచంద్రుణ్ణి తిరస్కరించే నుదిటిమీద గంగమట్టిని తిలకంగా దిద్దుకున్నాడు. అద్దాల్లాటి బుగ్గల మీదకి కాంతులుచిందే అందమయిన మణులతో చెక్కిన కుండలాల్ని ధరించాడు. బంగారుపనితనంతో అంచులు మిసమిసలాడుతున్న, ఎఱ్ఱని రంగుగల ఉత్తరీయం మీద వేసుకున్నాడు. వెలలేని రత్నాలతో పొదిగిన బంగారు మొలత్రాడు (జాళువా మొలకట్టు) కట్టుకున్నాడు. అందమైన కావిరంగు (నిత్యం ఉతికి ఆరవేసుకోడం వల్ల కావిరంగు తేలింది) పంచె కట్టుకున్నాడు. అతితెల్లటి యజ్ఞోపవీతం ధరించాడు. వేలికి కాశీముద్రవున్న ఉంగరం పెట్టుకున్నాడు. శాంతరసం ఒలికే బ్రహ్మతేజస్సుతో వెలిగిపోతూ - ప్రవరుడి రూపంతో నిలిచాడు ఆ గంధర్వశ్రేష్టుడు (వియచ్చరప్రవరుడు).

కాంచి కలక్వణత్కనక కాంచిక యై యెదురేఁగి యప్పు డ
క్కంచన కేతకీ కుసుమ గాత్రి వయస్యలడించి తన్నికుం
జాంచల వీథిఁ దాఱుచు ఘనాంత చలచ్చపలాకృతిన్, గలన్
గాంచిన వస్తువున్ దెలిసి గాంచినయట్లనురక్తిఁ గాంచుచున్

పసిమి మొగలిపువ్వులాంటి మేనుఛాయగల వరూధిని ఆ కపట బ్రాహ్మణుడైన మాయాప్రవరుణ్ణి చూచి (కాంచి) - అతడు అసలు ప్రవరుడనే ఆమె  అనుకుంది - మొలకు కట్టుకున్న మువ్వల వడ్డాణం అవ్యక్తమధురంగా ధ్వనులు (కనత్ కనక కాంచితయై) చేస్తుండగా,  చెలికత్తెలని విడిచి, తానే వంటరిగా (ఎదురేగి), అతడు ఉన్నచోటున వున్న పూపొదల సమీపంలో (తత్ నికుంజ + అంచల వీధిన్) తాపీగా నడుచుకుంటూ (తాఁజుచున్), కలలోచూసిన వస్తువుని మెలకువ వచ్చాకా చూసినట్టు (కలన్ కాంచిన వస్తువున్ తెలిసి కాంచినయట్లు), అతనినే ప్రేమపూర్వకంగా (అనురక్తిన్) చూసింది.

పలాశిడాసి రాజుఁజూచి పల్కె నోరి నోరికి
పొలానఁబెన్పొలాన లేకపోవ నీవు దోఁచితౌ
బలా, బలాలితోడఁ బాలఁబట్టి బిట్టుచుట్టి నిన్
హళాహళిన్ హలాహలాభయౌ బుభుక్షఁదీర్చెదన్

మాంసభక్షకుడైన (పలాసి) ఆ రాక్షసుడు సమీపించి (డాసి) రాజుని చూసి ఇలా అన్నాడు (పల్కెన్).  ఓరీ, ఈ వనంలో (పొలానన్) నా నోటికి (నోరికి), పెనుమాంసం (పెన్ పొల) తినడానికి (ఆనన్), లేకపోయిన ఈ సమయంలో (లేకపోవన్), నువ్వు కనపడ్డావు (తోచితి); ఇది నాకు తగును (ఔ);  భలే (బలా). నీ సైన్యంతో సహా (బల + ఆలితో), ఈ బాలికని (బాలన్) పట్టుకొని (పట్టి), ఇప్పుడే వడిగా (బిట్టు), నిన్నుకూడా చుట్టబెట్టి (నిన్ చుట్టి), ఆత్రంతో (హళా హళిన్) హాలాహలంలాంటి (హలా హలాభయౌ), ఆకల్ని (బుభుక్ష) తీర్చుకుంటాను (తీర్చెదన్).

ఇందీవరాక్షుడు చాటుగా అదృశ్యరూపంలో ఆయుర్వేదవిద్యని నేర్చుకొన్నాడు.  తరవాత గురువుగారి దగ్గరకి వెళ్ళి  అపహాస్యం చేసినప్పుడు.  నీచపు బిచ్చపు మునీ (కష్ట ముష్టింపచా) అని ధిక్కరించాడు.

అనినన్ గన్నులు జేవురింప నధరం బల్లాడ వేల్లత్పునః
పునరుద్యద్భ్రుకుటీ భుజంగ యుగళీ ఫూత్కార ఘోరానిలం
బన నూర్పుల్ నిగుడన్, లలాట ఫలకం బందంద ఘర్మాంబువుల్
చినుకన్, గంతు దిదృక్షు రూక్షనయన క్ష్వేళాకరాళ ధ్వనిన్

ఇందీవరాక్షుడు అలా ప్రేలగానే, బ్రహ్మమిత్రుడనే ఆ మునికి విపరీతమైన కోపం వచ్చింది. కన్నులు ఎఱ్ఱబడిపోయాయి ఎఱ్ఱబడిపోయాయి.  పెదవులు కోపంతో కంపించాయి (అల్లాడన్). వ్రేళ్ళాడుతున్న  (వేల్లత్), గుబురుగా ఉన్న,  కనుబొమలు (భ్రుకుటి) మాటిమాటికీ (పునః పునః), ఎగిరిపడ్డాయి (ఉద్యత్).  సర్పద్వయంలా (భుజంగ యుగళీ) బుసకొట్టినట్టు (ఫూత్కార) భయంకరమైన (ఘోర) గాలియా అన్నట్టు (అనిలంబు అనన్) శ్వాశ (ఊర్పులు) వదలుతూ, ఆ నిట్టూర్పులు అంతకంతకు ఆవేశం వల్ల ఎక్కువైపోయాయి (నిగుడన్).  నుదిటిమీద అక్కడక్కడ (అందంద) చెమటబిందువులు (ఘర్మాంబువుల్) చినుకగా - ఒక భయంకరమైన అరుపు అరిచాడు.  ఆ బొబ్బ ఎలాఉందంటే, మన్మధుణ్ణి (కంతు) తన కోపపుచూపుతో (దిదృక్షు) వేడికన్నుగల (రూక్షనయన) పరమశివుడు చేసిన సింహనాదంలాటి (క్ష్వేళా) భీతిని  కలుగచేసేటటువంటి (కరాళ), మహాశబ్దం (ధ్వనిన్) అలాటి ధ్వని ఈ ముని నోటివెంట వెలువడింది.

వెంటనే ఇందీవరాక్షుణ్ణి బ్రహ్మరాక్షసుడవైపొమ్మని శపించాడు.

మునిశాపప్రభావం వల్ల క్రమేపీ తనకి బ్రహ్మరాక్షస లక్షణాలు ఎలా వచ్చాయో ఇందీవరాక్షుడు స్వరోచికి ఇలా చెబుతున్నాడు.

అభ్రమండలి మ్రోచునందాక నూరక
పెరిగినట్లో మేను నరవరేణ్య
యవధి భూధర సానువందాక నూరక
పఱచినట్లో మేను పార్థివేంద్ర
యబ్జ భూ భవనంబునందాక నూరక
యెగసినట్లో మేను జగధదీశ
యహిలోక తల మంటునందాక నూరక
పడినయట్లో మేను ప్రభువతంస

యఖిల జగములు మ్రింగునంతాకలియును
నబ్ధులేడును జెడగ్రోలునంత తృషయు
నచల చాలన చణమైన యదటు గలిగె
నసురభావంబు నను జెందు నవసరమున

స్వరోచి వనదేవత ద్వారా ఒక కుమారుణ్ణి కన్నాడు.

కాంచెన్ బుత్రు విశాలనేత్రుఁ బృథువక్షః పీఠి విభ్రాజితున్
పంచాస్యోద్భట శౌర్యధుర్య ఘన శుంభద్బాహుఁదేజోనిధిం
బంచాస్త్ర ప్రతిమాను మాన ఘను సామ్రాజ్యై హేతు ప్రభూ
తాంచల్లక్షణ లక్షితున్ సుగుణ రత్నానీక రత్నాకరున్

విశాలమైన కళ్ళు, వెడదఱొమ్ము, సింహపరాక్రమమం, మన్మధుణ్ణిమించిన సౌందర్యం, సార్వభౌమలక్షణాలూ, సకల సద్గుణసంపన్నుడూ, అభిమానధనుడూ అయిన కుమారుడు జన్మించాడు.

అతడే స్వారోచిషుడు.

తెలుగు భాష లాలిత్యం, సౌకుమార్యం తెలియాలంటే "మనుచరిత్ర" చదవాలి అని పెద్దలంటారు. చతుర్దశ (పధ్నాలుగు) వర్ణనలు కలిగి, ఆఱు ఆశ్వాసాల ఈ ప్రబంధ రత్నం, 750 పైగా పద్య-గద్య-వచనాలతో ఒక కళాఖండంగా వెలిసింది. తెలుగు భాష ఉన్నంతకాలం అల్లసాని పెద్దనామాత్యుని పేరు ఈ భూమీద సుస్థిరంగా ఉంటుందనడానికి సందేహం లేదు.

*(శుభం)*

●●●




*శతకకారులు దోషైక దృష్టి*

*-కుంతి*

**శతకకవులలో అత్యున్నతమైన భావసారూప్యత ,**భావసమతుల్యత కలదు. దానితో పాటుగా ఆధ్యాత్మిక,భక్తి,నీతి,వైరాగ్యాది అంశాల పట్ల వీరు స్పందించిన తీరు అద్భుతము. తెలుగు శతక సాహిత్యము నిండైన సామాజిక స్పృహను చూపుతూ, సామాజిక చైతన్య బాధ్యతను నెత్తికెత్తుకుని, జాతికి నైతిక ,మానవతా విలువలను నేర్పి , మానవ మనుగడను ఉత్తమంగా తీర్చిదిద్దుతూ తన వంతు పాత్రను నిర్వహించింది. అయితే ఇది అంతా నాణెమునకు ఒక వైపు మాత్రమే. మరొక కోణములో శతక సాహిత్యాన్ని పరిశీలిస్తే కనిపించేది మైల. దీనినే మనము దోషైక దృష్టి అందాము.

శతకారులు చెప్పిన పద్యాలలో కొన్ని ఆ కాలానికి ఉపయోగపడినా ప్రస్తుతకాలానికి చెల్లనివి, అంతగా ఉపయోగములేనివి, తప్పుదోవ పట్టించునవి, కుల, వ్యక్తి దూషణలు మొదలగునవి కలవు. వానిని ఇక్కడ చర్చిద్దాము. శతకారులు చాలా మంచి విషయలుగా చెప్పినా అక్కడక్కడ అనవసరంగా కొన్ని కులాలను దూషించి, తమ కవిత్వాన్ని చిన్న చేసుకున్నారు. తమ కాలములో తమ కెదురుపడిన వ్యక్తులవల్ల కలిగిన చేదు అనుభవాలను వారు కులపరంగా చూసారు. ఇటువంటి పద్యాలు ప్రస్తుత కాలానికి అప్రస్తుతమే కాక అప్రయోజనమైనవి. ఇటువంటి పద్యాల ప్రచారము ఎందరి మనోభావాలనో గాయపరిచేవి..ఇలాంటి పద్యాలను వ్రాసినంత మాత్రాన మొత్తము శతక కారులను తప్పుపట్టరాదు.

ముందుగా తెలుగు రాష్ట్రములో ఆబాలగోపాలానికి పరిచయమైన సుమతి పద్యాలు చూద్దాము.

"మేలెంచని మాలిన్యుని ,మాలను,నగసాలెవాని ,మంగలిహితుగా
నేలిన నరపతి రాజ్యము నేలగలిసి పోవుటగాని నెగుడదు సుమతీ!"
"వెలియాలు సేయుబాసలు,వెలయగ నగసాలిపొందు వెలమలనుడువుల్
కలలోన గన్న కలిమియు విలసితముగనమ్మ రాదు వినరా సుమతీ"

"వెలమకు నిలువెల్ల విషము వినరాసుమతీ" -- దీనిని సంస్కరించి ఖలునకు నిలువెల్ల విషము కదరా సుమతీ అని చదువుచున్నాము. "గొల్ల సాహిత్య విద్య , కోమటి నిజము, తెల్లని కాకులు లేవు" అని మరొకచోట అంటాడు.

పండితయ్యగారి శివతత్వసారములోని ఈ పద్యమును చూడండి. శైవేతరులను పీడించడము, దండించడము పండితయ్య గొప్పగా కీర్తిస్తాడు. శివభక్తులు కాని ఆడవారిని హింసించడము కూడా ఆయన దృష్టిలో ఒప్పే. "స్వాహాపతిభామినియగు స్వాహాంగన ముక్కునెడమ చనుమొనయ దగున్ సాహసము తోడ జిదిమిన బాహుబలంబొప్ప వీరభద్రునకు శివా"

"భాస్కర శతకములోని పద్యాలు కొన్ని అంతగా ప్రగతికారక, క్రియాశీలక భావాలతో కూడుకున్నవి కావు. మనిషికి దేనికైనా అదృష్టము ముఖ్యమంటాడు. అది లేకుంటే ఏదీ లేదంటాడు.

"ఎప్పుడు దృష్టితామహిమ యించుక పాటలునప్పుడింపుసొం
పొప్పుచునుండు గాక యది యొప్పని పిమ్మటరూపుమాయుగా
నిప్పుననంటి యున్నయతి నిర్మలినాగ్ని గురుప్రకాశముల్
దప్పినట్టి బొగ్గునకు దానలుపెంతయుబుట్టుభాస్కరా".

అంతే కాక ఈ కవికి చదువు, విద్యంటే అంతగౌరవము లేదు. అదృష్టము ముందు విద్య వ్యర్థమంటాడు.

"ఏల సమస్తమునొకించుకు భాగ్యము కలిగియుండినన్
జాలుననేక మార్గముల సన్నుతికెక్కు నదెట్టకోయనన్
రాలకునేడవిద్యలు తిరంబుగ దేవర రూపుచేసినన్
వ్రాలినమస్కరించి ............భాస్కరా".

మనిషి పుట్టినందుకు యేదో రకంగా మేలు చేయాలి. తమకు తోచినంత పరోపకారము చేయాలి. గుళ్ళు,గోపురాలు కట్టించడము, తటాకాలు త్రవ్వించడము, మాటుపెట్టించడము, సత్కృతి చేయించడము, దానాలు చేయడము లాంటి మంచి పనులు చేయాలని, సమాజ సేవయొక్క ఆవశ్యకతను తెలియచేసారు మన పూర్వీకులు. సామాజికులు భయానికో, భక్తికో పుణ్యానికో, పేరు ప్రతిష్టలకో ఆ పనులు చేసే వారు. శతకారులు ఈ మానసేవ వద్దు-మాధవసేవ ముద్దు అని చెప్పేవారు. శ్రీకాళహస్తీశ్వర శతకములోని ఈ పద్యమును చూడండి.

"తనయుంగాంచి, ధనంబునించి, దివిజస్థానంబు గట్టించి విప్రునకు, ద్వాహంబుజేసి,
సత్కృతికి పాత్రుడై ,తటాకంబునేర్పున ద్రవ్వించి,
వనంబు పెట్టుమననీ, పోలేడు, నీ సేవజేసిన
పుణ్యాత్ముడు పావులోకమునకున్ శ్రీకాళహస్తీశ్వరా!".

మాధవసేవకు యేదీ సాటిరాదంటాడు ,ధర్మపురి నృకేసరి శతక శతకకర్త .

"గోవులుబంచిపెట్టినను గోటిధనంబునతాటబుచ్చినను బావులు చాలద్రవ్వించినను .......... దేవ నీ సేవకు సాటిరావు సుమీ ..

చేసే వారిని కూడా మంచి పనులను చేయనివ్వరు. పరమార్థము ఎదైనా ఒక్కొక్క సారి పైపైన అర్థమయ్యే భావాలు ప్రజలను ప్రక్కత్రోవకీడుస్తాయి. "నారసింహ చిద్విలాస"శతకమును చూడండి. చాలామంది చదువును నిరసించేవాళ్ళు, చదువును తప్పించుకుందామనుకున్న వాళ్ళు, ఇలాంటి వాక్యాలను వాడి పబ్బాలను గడుపుకుంటారు.

"చదివిచదివి చదివి చిత్కళ్ళ మరపౌను చదివినందున బుద్ధి చపలమౌను చదువువారల కంటె చాకలిమేలురా"

వేమన కూడా ఒకచోట "చదువుకన్న చాకలితామేలు" అంటాడు. వేమన పద్యాలలో కూడా అక్కడక్కడ కులదూషణ, అనర్థభావనలు పానకములో పుడకల్లా కనిపిస్తుంటాయి. చెడ్డవాళ్ళు బాగుపడాలంటే బాగా దండించాలని, భయము పాదుకొలిపితే ఫలితముంటుంది అన్న తిరోగమనాంశములు కూడా అక్కడక్కడా శతకాలలో కనబడతాయి.

"నయమునబాలుద్రావరు భయముననువిషమ్మునైన భక్షింతురుగా
నయమెంతొదొసకారియె భయమెచూపంగ వలయు బాగుగాసుమతీ!"

పిల్లల్లో భయాందోళనాభావమును నెలకొలపడము ఎంత ప్రమాదమో, ఆధునిక మానసిక శాస్త్రవేత్తలు ఏమి చెప్పారో మనమెరిగినదే. కోదండరామ శతకాన్ని మన పోలీసు శాఖ బాగా వంటబట్టిచ్చుకున్నది కాబోలు "తప్పుచేసిన వాడిని తంతేనేబాగు" అని ఈ పద్యాన్నుండి గ్రహించి ఉంటారు.

"కొతిమిరగింజలంకురముల బెట్టునా పాతచెప్పులకాళ్ళ బామకున్న
మడిలోపల మనుష్యమలము వేయకకాని బలుపుముల్లంగి దుంపలుమొలచునె
బరికచేతను బట్టి భయపెట్టి కొట్టక కంచరితట్టి శీఘ్రము నడచునె
తండముల్ కోలచే పుందుగా బొడవక తిన్నగానడచునే దున్నపోతు
మెట్టుకొకమారు దొబ్బులు బెట్టకున్నకరిగి మెత్తబడదు ముష్కరునిమనసు
దొంగవానికిజెవిగోయదోసమేమి భండనాతిభీమకోదండరామ"

తిట్టకపోతే ఖలుడే కాదు పరమాత్ముడైనా బాగుపడడని మన శతకాకారులు దేవుడిని కూడా తిట్టారు. దండించడమే కాదు చెడ్డవాడు బాగుపడాలంటే తిట్టాలి కూడా. కోడండరామ శతకములో చాత్రాతి లక్ష్మీనరసింహము ఇలా అంటాడు.

"ముక్కు నుల్పక దీపమెక్కువవెలుగిదు తరచకవెన్నీదు పెరుగుబొట్టు
వేడిబాపక నెయిగాదు వెన్నముద్ద ఖలుడుగుణవంతుడౌను చకారగుళ్ళ
కలికమునగాని తీరదు కంటితీట భండనాతిభీమకోదండరామ" .

ఇస్తే పొగడడము లేదా తిట్టడము వంటి అసభ్య దానగ్రాహ్య సంస్కృతి మన శతకకారులు అక్కడక్కడా చూపిన మరొక న్యూనతా లక్షణము. పైవన్నీ ఒకరకముదోషాలైతే, గురుగులాలు చెప్పిన నారసింహ శతకము క్రైస్తవ మనుజులను చెండాడమని, శతక సాహిత్యమునకు ఒక మచ్చను దిద్దాడు.

"కుమతజన శిక్ష!మాధవాక్రూరవరద! దానవాంతక పల్లవీ ధైర్యచోర!
క్రీస్తు మతజుల జెండుమా కినుక తోడ వైరిగజసింహ! ఓబులనారసింహా!.

అయితే ఇట్టి సాహిత్యాన్ని మనము ఆయా కాలాలలో ఉన్న రాజకీయ, సాంఘిక పరిస్థితులదృష్ట్యా చూడాలి.

ఇలాంటి దోషాలున్నప్పటికీ, శతక సాహిత్యము తెలుగు వాఙ్మయమునకు చేసిన సేవ ఎనలేనిది. బియ్యములో రాళ్ళు, మట్టి పెడ్డలు ఏరి వంటవండుకున్నట్లు మనము వీనిలో గల ఈ పనికి మాలిన భావాలను ఏరి వాడుకుంటే జాతి మానసిక ఆరోగ్యానికి భంగము వాటిల్లదు.




## శతక సాహిత్యములో స్త్రీ

**-కుంతి**

**"స్త్రీలెంతయు పూజ్యులే", స్త్రీలు** "హైందవభూజంగమ పుణ్యదేవతలు", స్త్రీలను గౌరవించవలెను, కలకంఠకంటి కన్నీరొలికిన సిరులుతొలగును." ఇవిమనకు పూర్వీకులు స్త్రీల గూర్చి చెప్పినవి. మన భారతదేశములో పుస్తకాలలో, పురాణాలలో, మాటలలో అత్యంత గౌరవము అందుకునేది, పూజలందుకునేది, చేతల్లో మగవారి చేతిలో ఘోరంగా బలి అయ్యేది స్త్రీయే . తల్లిగా, చెల్లిగా, ఆలిగా, చెలిగా స్త్రీ చేసే సేవలు సమాజములో చేయించుకొని, ఆమెకు మొండి చేయి చూపుతున్నది. అనాదిగా స్త్రీని ప్రగతిమార్గములో నడవనీయకుండా, వంటయింటి కుందేలును చేసి, పిల్లలను కనే యంత్రముగాచేసి నేటి యీ దుస్థితికి కారణమైనది. రకరకాల సాంఘిక దురాచారాల రథ చక్రపుటిరుసులలో పడి నలిగిన పడతి బాధలు ఇన్నీ అన్నీకావు. సతీసహగమనము, బాల్యవివాహము, విధవావివాహ నిషేదము, కన్యాశుల్కము,వరకట్నము, స్త్రీ, అవిద్య మొదలగు ఎన్నో సమస్యలతో ఉవిధకు ఉరివేసి, తరాలుమారినా, దురాచారాలు రూపాంతరము చెందాయి తప్ప స్త్రీ దుస్థితి మారలేదు. కాలచక్రములో ఒక సాంఘిక దురాచారమునుండి మరొక దురాచారము ప్రవేశించింది. వీనికితోడు అత్యాచారాలు, లైంగికదాడులు, బలహీనతలను సొమ్ము చేసుకోవడము, నిర్ణయాధికారరాహిత్యము, స్త్రీ శిశుహత్యలు వారిని ఈదేశములో ఎందుకుపుట్టామా? అన్న సందేహములో పడేట్లుచేశాయి. ఇది గతమునుండి వర్తమానము వరకు ఉన్న పరిస్థితి. అయితే అంతాచీకటేనా? అన్నీ ముళ్ళేనా?ఎందరో సంఘసంస్కర్తలు, మహనీయుల కృషి ఫలితంగా పరిస్థితి కొంత మారింది. చట్టాలవల్ల, స్త్రీవిద్యవల్ల, మనుషుల్లో వచ్చిన చైతన్యము వల్ల గతముకన్నా ప్రస్తుత పరిస్థితిమిన్న. ఈ నేపధ్యములో మన శతకకారులు స్త్రీ గూర్చి ఏమి చెప్పారో చూద్దాము. అంతకు ముందు భాగవతములో ఒక చోట స్త్రీలగూర్చి చెప్పినమాట చర్చించుకొని మళ్ళీ ఇటువద్దాం.

"స్త్రీ హృదయము కఠినమైనది. ఆమె జీవితాంతము ఒక్క పురుషుని పంచనే ఉండదు. ఉండకోరదు. స్త్రీలు పెళుసువారు. పిసరంతమాటకే విరిగిపోవుదురు. తమసౌఖ్యమునకు ఎంత సాహసమునకైనను వెనుకాడరు. స్వార్థమునకు తోబుట్టువులను, కట్టుకున్న భర్తను సహితము చంపుదురు. ఆడదాని స్నేహము,ఆకాశకుసుమం ఒకటే. కొమ్ములు తిరిగిన వానిని సహితము వలలో వేసుకొందురు"

ఇటువంటి భావాలు వంట బట్టించు కోవడమువలననో, తమకు ఎదురైన స్త్రీలు మంచి అనుభవాలను అందించకపోవడమువలననో, కాలప్రభావమో, ఒకరిని చూసి ఒకరు ప్రభావితము కావడము వలననో మొత్తానికి శతకసాహిత్యము స్త్రీని తలపైన పెట్టుకోకపోగా తలకంటకంగా భావించింది.

ముందుగా ముదితగూర్చి పలువురు చెప్పిన అంశాలను చూద్దాం

సుమతిశతకకారుడు యేమి ఉండవోచెబుతూ "కోమలి నిజమున్.....లేవు సుమతీ" అంటే స్త్రీలు నిజము చెప్పరట.

ఎఱ్ఱయ్య తన"సకల నీతి కథా విధానము" లో ఇలా అంటాడు.

ఒక్కని జూచువేరొకనినొల్లక మారుమొగంబుబెట్టునొం
డొక్కనికాసజూపు మరియొక్కనితో రమించువేడ్కతో
నొక్కనికౌగిలించు తలపొక్కనిపైనిడి తాల్మిదూలునే
దిక్కునబట్టిజూడసుదతీజనవర్గము నమ్మవచ్చునే"

మరొకపద్యములో మరింత కించపరిచే విధంగా చెప్పారు.అయితే ఇది వారకాంతలకు సంబంధించినది.

భాస్కర శతకకర్త "మారవి" ఇలా అంటాడు.దృష్టాంతంగా చిత్రాంగి సారంగధరలను స్వీకరించి చెప్పిన పద్యమిది.

"అంగదనమ్మరాదు తనయంకెకురాని మహాబలాఢ్యులవేభంగుల మాయలొడ్డి చెరుపందలపెట్టు" అంటాడు.

ఇక భర్తృహరి "మలభూయిష్టపు తోలుబొమ్మ"అంటాడు. మరొకచోట అందమైనవారు అన్నికష్టములకు కారణమైనవారు అంటాడు."తొయ్యలులకన్న రమ్యవస్తులులేవు, వారలే కష్టములకెల్ల కారణములు" అంటాడు ఎఱ్ఱయ్య.

ఇక భర్తృహరి శతకములో స్త్రీ దూషణ చేస్తూ, స్త్రీ యంత్రము అనే మాట వాడుతాడు.

"నరకద్వారము,పుణ్యస్వర్గవి ఘ్నంబు, దు
స్తర మాయాశతపేటి దంభనిధి, దోషస్థానమప్రత్యయో
త్కరసుక్షేత్రముకాలకూటమమృతాకారంబు స్త్రీ యంత్రమున్
ధరనెవ్వాడు సృజించెబురుషగళోద్బద్ధక్రియా పాశమున్"

శతానంద యోగి"రామశతకములో ఆడవాళ్ళను నమ్మవద్దంటాడు.

"పురుషుని సుషుప్తుని చేసియు బరపురుషుని సన్నజేసి పడకకురాదీ
నిరమించి సుఖముపొందెడి తరుణులనమ్మందగునే దశరథరామా"
మరొక పద్యములో " వనితలచే శృంగారము-వనితలచేగలుగుకీర్తివంశంబునకున్
వనితలచేనపవాదము- వనితలచేతెలివి వసుధనిరామా"

ఆడవారిపొందు ఆసనంబునకీడు నారసింహ చిద్విలాస" అంటాడు నారసింహ చిద్విలాస శతకకర్త.

ఇకపతిభక్తిని గూర్చి, స్త్రీని భార్యగా గూర్చి యేమిచెప్పారోచూద్దాం.

భారతం, అరణ్యపర్వములో పతిభక్తిని గూర్చి ఇలా చెప్పబడింది.

"అనవహార్యంబు తేజోమయంబు సర్వగుణములకునలంకారంబు గురుతరంబు
భామలకు పతిభక్తియు పరమైన భూషణంబట్టివే సైజభూషణములు"

"లేదు సుమీ సతుల వలపులేశము అన్న సుమతికారుడు మరొకచోట ఆడవాళ్ళుసంపాదించేమగవాడిని గౌరవిస్తారని లేకుంటే దూషిస్తారని అంటాడు.

"గడనగలమగని జూచిన నడుగడుగున మడుగులిడుదురతివలుతమలో
గడనుడుగ మగని జూచిన నడపీనుగువచ్చెననుచు నగుదురు సుమతీ!

"ఏవనిత మెలంగు భర్తవశవర్తినియై యది సత్కళత్ర" అంటాడు భర్తృహరి శతకకారుడు.

వేమనగారు భార్యచెడ్డదియైతే విడిచిపెట్టి అడవిలో ఉండమంటాడు.

"ఆలుమగనిమాటకడ్డంబువచ్చెనా యాలుగాదది మరగాలుగాని యట్టియాలువిడిచి యడవినుండుటమేలు" మరొకచోట

"కూలినాలిచేసి గుల్లాముచేసి తెచ్చిపెట్టనాలి మెచ్చనేర్చు లేమిచిక్కువిభినివేమారుదిట్టును" మరొకచోట "ఇంటిలోనపోరు ఇంతింతగాదయా" అంటాడు. ఉన్నవయోగానందకవి తన రాజగోపాలశతకములో "పతిభక్తివిడిచి సంపదనొందు జవరాలు ఆలుగాదది నీచురాలుగాని" అంటాడు.

"నాతికిమానంబు దొడవునయముగసుమతీ" అంటాడు స్త్రీకి పాతివ్రత్యమే అలంకారమనినమ్మే సుమతికారుడు.

భర్తలేని స్త్రీలు తోబుట్టువుల ఇంట ఉండకూడదు అంటుంది ముదిన సుభద్రాయమ్మ-- "వరవిశాఖపురాధీశహరిపరమేశ" అనుమకుటముతో చెప్పిన శతకములో.

"కాంతుడులేకున్న గడుపేదయై బుత్రులుతొలుతపొందియున్న
మిత్రులుశత్రులై మేలెరుంగకున్న తిరుపమేయూరనుదొరకకున్న
దీనపోషకుడైన దేవరక్షామణి కనికరంబెదపూనికావకున్న
తనసహోదరులకు ,ధనధాన్యసంపదల్ కరము ప్రెభుత్వము కలిగియున్న
భ్రాతృగృహవాససమితికి భారమగునె, వారికుటిల వచశ్మర వజ్రమునాటి బాధపడుట కంటె దేహంబుబాయు టొప్పు
హీనమైయున్న బ్రదుకదేలమానినులకు వరవిశాఖపురాధీశహరి రమేశ"

"జపములు గంగాయాత్రలు దపములునోములునదానధర్మంబులుపు
ణ్యపురాణములు పతిభక్తికినుపమింపను సాటిరాకనుండు కుమారీ"

అనితెలిపాడు కుమారీ శతకకర్త ఫక్కి అప్పలనరుసు.

ఇక వారకాంతల గూర్చి శతకాకారులు చెప్పింది ఇంతా అంతాకాదు. వీరిలో కొందరు వెలదులంటె గిట్టనివారుకాగా మరికొందరు

వేశ్యాలోలతలో మునిగి, తేరుకొని బుద్ధితెచ్చుకున్నవారు. శతకసాహిత్యములో ఒకానొక అంశముగ వేశ్య చర్చ యేదో ఒక సందర్భములో జరుగుతుంది. ఈచర్చ విరివిగా ఉన్నప్పటికీ ఒకటి రెండు పద్యాలు చూద్దాము. సుమతికారుడు

కొక్కోకమెల్లచదివిననూ జక్కనివాడైనరాజ చంద్రుండైనన్
మిక్కిలిరొక్కమునీయకచిక్కదురావారకాంత సిద్ధముసుమతీ"

వేమనగారి ఈ ఆటవెలదితీరుచూడండి

"గంపెడంతతవుడు గంపలోబెట్టక చన్నిబట్టనీదుకొన్నబర్రె
వారకాంతలేలవలతురునూరక" ఇక ఉన్నవయోగానందకవి "వారకాంతల మాటమాట గాదదినీళ్ళమూటగాని"అంటాడు.

గువ్వలచెన్న శతకములో పట్టాభిరామ కవి "వెలకాంతలెందరున్నను కులకాంతకు సాటిరారు గువ్వలచెన్న"అంటాడు.

శతకకారులు పండితులు,సంస్కరణాభిలాషులు అయినప్పటికీ, విధవరాళ్ళ విషయములో మాత్రము జాలిచూపలేదు. కాలప్రభావము కాబోలు. పైగా విశ్వస్తవడ్డింపగా భోజనముచేసిన శ్రీనాధుడి ఆలోచనా పరంపరలు, ఆయా సంప్రదాయాలను గౌరవించినవారయిరి. "విరజాజిపూదండ విధవకేల" అనిఒకరంటే మరొకరు" ముండమోపికేలముత్యాలపాపిట వన్నెలన్నిభాగ్యవతికిగాక" అనిమరొకరంటారు. ఏదియేమైనప్పటికి శతకారులు కొంత దోషైకదృష్టిని చూపినప్పటికీ, స్త్రీలలో తల్లి, కూతురు, కోడలు, అత్త ఇలా ప్రతి ఒకరు నిర్వహించాల్సిన బాధ్యతను గూర్చి వివరించారు. వారి బాధలు, గాధలు, పూజలు, పునస్కారాలు, నోములు, వ్రతాలగూర్చి చర్చించారు. అందచందాలు, అలంకారాలను గూర్చి తెలిపారు. వారి మనసును వడబోసారు.

మనమనోవికాసానికి, భాషాభ్యుదయానికి, మూర్తిమత్వాభివృద్ధికి తోడ్పడే శతక సాహిత్యము స్త్రీలను కాస్తా చిన్న చూపు చూసిందని చెప్పవచ్చు. పాయసములో పల్లేరుకాయల్లాంటి ఇలాంటి పద్యాలను, అవి విస్తరింపచేసే భావజాలాన్ని పరిహరించి, ఆ శతక సాహిత్యామృతాన్ని సేవించిన మానవాళికి శుభదాయకము.




## *శతకకవులు అనుకరణలు-అనుసరణలు*

**-కుంతి**

**శతకసాహిత్యమును పరిశీలిస్తే** శతక కవులపై ప్రముఖ కవుల ప్రభావము ఉన్నట్లుగా కనిపిస్తుంది. కొందరు కవులు తమ కన్నా ప్రాచీన కవుల భావాలను తమ శతకాలలో వాడుకున్నారు. శతక కవులలో భక్తి తత్వము వ్రాసినవారు తప్పక పోతనను అనుకరిస్తే ,నీతి శతకాలను వ్రాసినవారు రామాయణ, మహాభారతాలలో చెప్పబడిన ధర్మసూక్ష్మాలను, నీతులను అనుసరించినట్లు, అనుకరించినట్లు గోచరిస్తుంది. శతకకారులు వివిధ సందర్భాలలో ప్రముఖ కవుల మార్గమును ఎంచుకున్నట్లు తెలుస్తుంది. అయితే శతకారులు మిగితా ప్రాచీన కవులతో పోలిస్తే పోతనను బాగా అనుసరించారు. పోతనను శతకకారులు యేవిధంగా అనుసరించారో నేను ప్రత్యేకముగా మరొక వ్యాసములో వివరించాను. ఈ వ్యాసమునందు ముఖ్యంగా శతకకారులు ఇతరులను, ఇతరులు శతకకారులు ఎలా అనుసరించాలో తెలిపే ప్రయత్నము చేస్తున్నాను.

***శతకకారులు-ప్రముఖులు***

మహాభారతము నందు జనమేజయుడికి పరిక్షిత్ వృత్తాంతము నెరిగించు సందర్భమున శమీకుడు శృంగితో అన్నమాటలు,

క్రోధము తపముంజెరుచును __క్రోధమ యణిమాదులై గుణముల బాపుం
గ్రోధమధర్మక్రియలకు, బాధయగుం, గ్రోధిగాదపస్వికి జన్నే?

క్రోధము తపస్సును చెడగొట్టును. తపము నిలముగానొనరించును. క్రోధము అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశత్వము, వశత్వమనెడి గుణములను పారద్రోలును. కోధము ధర్మకార్యములకు బాధ కలిగించును కావున తపస్వియగు వాడు కోధమును కలిగి యుండరాదు.

ఈ భావము తప్పక సుమతికారుడికి ప్రేరణగా తోస్తుంది. అయితే పై పద్యము ఉన్నదున్నట్లుగా కాక, క్రోధ దుష్ఫలితాలు మాత్రమే కవికి ప్రేరణ ఐనట్లుగా తోస్తున్నయి,.

"తనకోపమె తన శత్రువు తనశాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ
తన సంతోషమె స్వర్గము తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ!"

కుమార సంభవములో నన్నె చోడుడు వెలయాలిని గూర్చి చెప్పిన ఒక పద్యము చూడండి.

"ఇలబుట్టదు, పుట్టియుదానిలువదు ,నిలిచియును నొక్కనిజమున దిరమై
కలదాక నెయిదనేరదు వెలయాండుర కలుపు మగల విడుపును సతులన్"

సుమతి శతకములో వెలయాలిని గూర్చిన చెప్పిన పద్యము చూడండి.

"వెలయాలి వలన కూరిమి గలుగదు మరికలిగెనేని కడతేరదయా

పలువురు నడిచేతెరువున పులుమొలవదు మొలిచెనేని పొందదు సుమతీ!"

బద్దెన రచించిన "నీతి శాస్త్రముక్తావళి" లో ఈ పద్యమును చూడండి.

"సుతుకడకు తనకూర్చిన సతికడకును వేల్పుకడకు సద్గురుకడకున్
బతి కడకు రిత్త చేతుల మతిమంతుల నగజనదు మహిబద్దెనృపా!"
"నయమన్న పాల్పుద్రావరు భయమన్ననమేధ్యమైన భక్షింతురు ,నా
భయము నయములోపల భయమే నయమండ్రు బుధులు బద్దె నరేంద్రా!"

బద్దెన రచించాడని చెప్పబడుచున్న సుమతి శతకములోని పద్యాలను చూడండి. అయితే సుమతి శతక కర్త, నీతి శాస్త్రముక్తావళి కర్త వేరువేరు అంటారు. ఒక్కరు కూడా కావచ్చు.

***<u>సుమతి పద్యాలు చూడండి.</u>***

"పతికడకు తన్ను గూర్చిన సతికడకున్ వేల్పుకడకున్ సద్గురు కడకున్
సుతుకడకు రిత్త చేతుల మతి మంతులు చనరు నీతిమార్గము సుమతీ!"
"నయమన్న పాల్పుద్రావరు భయమన్ననమేధ్యమైన భక్షింతురుగా
నయమెంతదోసకారియె భయమే చూపంగ వలయు ప్రజలకు సుమతీ!"

రెండవ పద్యమును గమనిస్తే, ఆధునిక మానసిక శాస్త్ర సిద్ధాంతాలకు వ్యతిరేకంగా తోస్తుంది.

నన్నెచోడుని కుమారసంభవములో ఒక పద్యమును చూడండి

"బలహీనులయ్యు నేమగు బలువురు దమలోన గూడి బలయుని నైనన్
గెలుతురు సూడగ నీహారలవంబులగూడి తీవ్ర రశ్మిని గుప్పున్!"

ఇల్లాంటి పద్యమే సుమతికర్త చెప్పినది ప్రసిద్ధమైనది.

"బలవంతుడనాకేమని పలువురితో నిగ్రహించి పలుకుటమేలా
బలవంతమైన సర్పము చలిచీమల చేత చిక్కి చావదె సుమతీ!"

శివదేవయ్య రచించిన శివదేవ ధీమణి మకుటము కలిగిన శతకములోని ఒక పద్యమును చూడండి.

"ప్రాణునపాను గూర్చియలపాము గదిల్చితదూర్ధకలితో
డ్యాణమునొత్తిమేన్నుధుడమై నిగుడంబిగియించి దృష్టులం
ఘోణము చేర్చి యా ప్రణవ ఘోషనమున్విని యందు మానస
క్షీణముసేసినం బసవ సిద్ధుడనా శివదేవ ధీమణి"

ఈ పద్యాన్ని తిక్కనగారు అనుసరించారని నిడదవోలు వెంకట్రావుగారి అభిప్రాయాన్ని ఆరుద్రగారు తన సమగ్రాంధ్ర సాహిత్యములో తెలిపారు.

"ప్రాణునపానునందును నపానుని బ్రాణునియందు నిల్పి ని
ర్వాణము గోరిచిత్తము తిరంబుగ బట్టగ బ్రాణ సమ్యమా
క్షీణత దేహ మధ్య శిఖి జిమ్మగ ద్రతయమొంది మూ ర్ధపా
రీణత గోర్కి సల్పున పరిచ్యుతి దగ్గతుడైన యోగికిన్!"

ఐతే ఈ రెండు పద్యాల కాలాలని బట్టి ఎవరు ఎవరిని అనుసరించారో తెలుసుకోవాలి.

మార్కండేయ పురాణము తొలితెలుగు పురాణము మారన రచించాడు.. (1295-1326) ఇందులో అనేకమైన నీతులున్నాయి. సుమతికారుడి పద్యాన్ని పోలిన ఈ పద్యమును చూడండి.

"ఎచ్చట శ్రోత్రియుడును ధనమిచ్చునతడు నీరుగలుగునేరు వె జ్జున్
మచ్చికయును లేకుండును నచ్చట వసియింపవలవదభినుతచరితా!"

సుమతి పద్యము చూడండి-"అప్పిచ్చువాడు వైద్యుడు నెప్పుడు ప్రవహించునట్టి యేరును ద్విజుడుం
జొప్పడిన యూరనుండుమచొప్పడకున్నట్టి యూరుజొరకుము సుమతీ!"

మార్కండేయ పురాణములోని మూలశ్లోకము చూడండి.

"ధనక్యశ్రోతియోరాజానదీ వైద్యా స్తు పంచమః పంచయత్రన విద్యంతేన తత్రదివసం వసేత్".

18 వశతాబ్దములో గంగమ్మగారి నరసింహము రచించిన కృష్ణ శతకము చాలా ప్రసిద్ధమైనది.

"హరియను రెండక్షరములు ,హరియించును పాతకములంభుజనాభా
హరి! నీ నామమహత్వము ,హరిహరి పొగడగ వశమె హరి శ్రీకృష్ణా"

ఎఱ్ఱనగారి నృసింహ పురాణములోని ఈ పద్యము,పై పద్యానికి ఆధారము.

"హరియను రెండక్కరములు,దొరకొనదీపొసగు జిహ్వాతుదినెవ్వనిక
న్నరుడొకడిభ్యుడు భవసాగర విస్తరణ ప్రకార కౌశలమునకున్!"

కూచిరాజు ఎర్రన తన సకలనీతికథానిధానము లో సుమతి కర్తను అనుకరించాడు.

"తేలునకు తోకవిషమగు .................. ఖలునకును విషము కాయంబెల్లన్"
సుమతి పద్యము..తలనుందు విషము ఫణికిని వెలయంగా తోకనుండు వృశ్చికమునకున్
తలతోకయనకనుండును ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ!'

ఎర్రన వ్రాసిన మరొక పద్యము

"తమవారి బాసిననునుత్తమ మిత్రుండైన మిగులదాపము సేయున్
గమలంబు నీటబాసిన కమల్దాాజిని వేడి చేత కమలినభంగిన్"

సుమతి పద్యము,

"కమలములు నీటబాసిన కమలాత్ముని రశ్మిసోకి కమలిన భంగిన్
దమతమ నెలవులు దప్పిన దమ మిత్రులె శత్రులౌట తథ్యము సుమతీ!"

హరిభట్టు రచించిన వరాహపురాణము రచించాడు. అతడి ఒక పద్యము సుమతి పద్యాన్ని పోలిఉంది. చూడండి.

"చీమలు పెట్టినపుట్టల బాములు సుఖియించినట్లు పరమజ్ఞానుల్
ప్రేమంబున బరగృహమున వేమరు సుఖియింతురధికవిభవముతోడన్"

గట్టుశేషయ్య తన కుచేలోపాఖ్యానములో, కార్యేషుదాసి సంస్కృత శ్లోకాన్ని అనువదించాడు.

"పనులు సేయునెడబానిసవలె,బుద్ధిగరుపునెడప్రధాన కరణి ,భోజనంబులిడెడి యెడలనంబకైవడి ..

సుమతి పద్యమును చూడండి..

"పనిచేయునెడల దాసియు ననుభవమున రంభ ,మంత్రియాలోచనలన్
దనభుకియెడల దల్లియు, యనదగుకులకాంతయుండనగురాసుమతీ!"

యధావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకములోని పద్యము.

ఏయేవేళలనే వయస్సున నరుండేభూమినేయూరిలో
నేయేకర్మమునాచరించునశుభంబేనిన్ శుభంబేనిదా
నాయావేళల నావయస్సున నతుండాభూమి నాయూరలో
నాయాకర్మంబులెల్లనగుదధ్యబింత సర్వేశ్వరా!

పారిజాతాపహరణములోని నందితిమ్మనగారి ఈ పద్యముచూడండి. పై పద్యానికి ఇది బింబ ప్రతిబింబముగా తోస్తుంది.

ఏయే వేళలనే సఓజముఖి యేయేలీలలంగోరుదా
నాయావేళల నాసరోజముఖి నాయాలీలలంతేల్చియే
చాయంజూచిన దానయ్యె మెలగుచున్ సౌఖ్యాబ్ధినోలలాడు భో
గాయత్తుండయి పెక్కు రూపములమాయాకల్పనాచాతురిన్"

పై పద్యాలు స్థూలంగా శతకకారులు ఇతరులనుండి అనుసరించినవియే ఐనప్పటికీ, అక్కడక్కడా శతకకారులను ఇతరులు అనుసరించినవి యున్నవి. యే పద్యాన్ని ఎవరు అనుసరించినా, ఆ పద్యాలన్నీ ఆణిముత్యాలే కావడము విశేషము.

●●●




# శతకకవుల ఒకరి నుండి ఒకరు

## -కుంతి

**శతకకవులపై పోతనాది భక్తకవుల,** కవిత్రయ కవుల ప్రభావము ఎంత ఉందో అలాగే ఒకరి పై ఒకరి ప్రభావమును మనము చూడవచ్చు. శతకకవులు పోతనను బాగా అనుకరించినారు,అనుసరించినారు. అదేవిధంగా ఒకరినొకరు అనుకరించారు అనుసరించారు. ఈ కవులు పూర్తిగా పద్యాన్ని లేదా భావాన్ని లేదా పద్యములో చూపబడిన దృష్టాంతాన్ని లేదా ఉపమానాలను ఒకరినొకరు అనుకరించారు, అనుసరించారు. ఈ అనుకరణలు,అనుసరణలు కేవలము భక్తి శతకారులు భక్తి శతకకారులను, నీతిశతకారులు నీతిశతకకారులను అని కాక పరస్పరము చేసుకున్నారు. వీరందరు భావములో ,విషయములో మరియు అభివ్యక్తిలో దగ్గరి తనాన్ని ప్రదర్శించారు.

అందరికీ జీవితము నీటిబుగ్గే. మూర్ఖుడిమనసు కుక్కతోకే. సంపద ఉంటే బంధువులు వస్తారు. చలిచీమలు బలమైన పామును చంపుతాయి.అన్యదైవాలు కొలవము....ఇలా. ముందుగా సుమతి శతకాన్ని తీసుకుందాము. సుమతి శతకములోని భావాలు ఇతర భక్తి,నీతి శతకాలలోకి వెళ్ళాయి. కొన్ని పరిశీలిద్దాము."తాగొంకకనిచ్చువాడు దాత" అని బద్దెన అంటే ,"చేచాచని వాడు చాచినలేదనకిచ్చువాడు మేటి" అని దాశరథి శతక కర్త గోపన్న అంటాడు. "రణమున జొచ్చునదె మగతనంబు" అని సుమతికారుడు అంటే ,"రణంబులోనమేన్ దాచనివాడు మేటి" అని అంటాడు దాశరథి శతక కర్త గోపన్న.

సుమతి శతక కర్త ఈ పద్యము ఆబాలగోపాలానికి పరిచయమైనది.

***"ఎప్పుడు సంపదగలిగిన నప్పుడుబంధువులు వత్తురది యెట్లన్నన్***
***దెప్పలుగ జెఱువునిండిన గప్పలు పదివేలు చేరు గదరాసుమతీ"***

ఉపమానము ,దృష్టాంతము వేరైనా భావానికి దగ్గరగానున్న భాస్కరశతక పద్యమును (మారవి) చూడండి.

***"శ్రీగలభాగ్యశాలిగడు జేరగ వత్తురు తారుదారె దూ - రాగమన ప్రయాసమున కాదటనోర్చియైన్,నిల్వను***
***ద్యోగముజేసి,రత్ననిలయుండుగాదె సమస్తవాహినుల్ -సాగరుజేరుటెల్ల మునిసన్నుతమద్గురుముక్తి,భాస్కరా!"***
***"సంపద గలవారిని మోదింపుచు జుట్టుకొనియుందురెల్లపుడు ద***
***త్సంపదదొలగిననుపేక్షింపుదురవివేక జనులు కుమారా!"***

క్షేత్రయ్య గారి సుప్రసిద్ధమైన చాటువును చూడండి

*"తముదామె వత్తురర్థులు క్రమమెరిగిన దాతకడకు రమ్మన్నారా*

*కమలంబులున్న కొలనికి భ్రమరంబులనచ్చుజుతేంద్ర రఘునాధనృపా!"*

ఎవరైనా తమ ఉనికిని విడిచినట్లయితే తమ మిత్రులు, శత్రువులౌతారని సుమతి చెప్పిన పద్యము చూడండి.

*"కమలములు నీటబాసిన గమలాప్తుని రశ్మి సోకి కమలిన భంగిన్*

*దమతమ నెలవులు దప్పిన మిత్రులు శత్రువులౌట తథ్యము సుమతీ!"*

స్థానబలిమి పోతే మిత్రులు శత్రువులౌతారని సుమతి చెబితే, బలముపోయిన వేళ మిత్రులు శత్రువులౌతారని మారవి(భాస్కరశతకర్త) అంటాడు." బలయుతుడైనవేళ నిజబంధుడు తోడ్పడుగాని యాతడె-బలముతొలంగెనేని, తనపాలిట శత్రువదెట్లు, పూర్ణుడై -జ్వలనుడు కానగాల్చుతరి వాయువు సఖ్యము జూపును గానినా-బలయుడు సూక్ష్మదీపముననున్న పుడార్చునుగాదెభాస్కరా!"

ఉత్తముడు నీచుడితో సాంగత్యమును చేస్తే కలిగే నష్టాన్ని గూర్చి సుమతి ఇలా అంటాడు.

*"కొంచెపునరు సంగతిచే సంచితముగ గీడువచ్చునది యెట్లన్నన్*

*గించిత్తునల్లి కరిచిన మంచమునకు బెట్లు వచ్చు మహిలో సుమతీ!"* .

అదే భావాన్ని మరొకదృష్టాంతముతో" ఇనుమును గూర్చి యగ్నియలయింపదె సమ్మెటపెట్టు భాస్కరా" అంటాడు మారవి.

వారకాంతల గూర్చి:

సుమతికారుడు: *"కొక్కోకమెల్లజదివిన జక్కని వాడైనరాజచంద్రుడైనన్*

*మిక్కిలి రొక్కము నీయక చిక్కదురా వారకాంత సిద్ధము సుమతీ!"*

వేమన: "గంపెడంత తవుడు గంపలోనబెట్టక చాన్నిబట్టనీదుకొన్నబ్రరె వారకాంతలేల వలతురు నూరక"

సుమతికారుడు చెప్పిన ఈ ప్రసిద్ధమైన పద్యము చాలా మందికి ప్రేరణ.

"చీమలు పెట్టిన పుట్టలు పాములకిరవైనయట్లు పామరుడు దగన్ హేమంబుకూడబెట్టిన భూమీశులపాలజేరు భువిలో సుమతీ!"

దేవకీ నందన శతకములో వెన్నెలకంటి జన్నయ్య పై పద్యాన్ని ఇలా అనుసరించాడు.

"చీమలు పుట్టలు పెట్టుచుండ నవి విస్తీర్ణంబుగావించినన్ పాములు జేరిన రీతి లోభిజన సంపన్నార్థరాసుల్ వృధా భూమిపాలుల పాలుగాక చనునాపుణ్యంబులేలొల్లరో సామాన్యంబు ధనాధినాధునకు..!"

"లావుగలవానికంటెను భావింపగ నీతిపరుడు బలవంతుండౌ గ్రావంబంత గజంబును మావటివాడెక్కినట్లుమహిలో సుమతీ!"

సుమతి పద్యములోని ప్రసిద్ధమైన ఈ దృష్టాంతము భాస్కర శతకకారుడు ఇలా ప్రయోగించాడు.

"చక్కదలంపగా విధి వశంబుననల్పుని చెతనైన దా జిక్కియవస్థలున్ బొరలు జెప్పగగ రాని మహాబలాఢ్యుడున్ మిక్కిలి సత్వసంపదలు మీరిన గంధగజంబు మావటీడెక్కి యదైల్చికొట్టు కుదియించిన నుండదెయోర్చి,భాస్కరా!"

పరులకు మర్మము చెప్పకు, మని సుమతికారుడు హితవు చెబితే "ఇంటగల గుట్టు నీ పొరుగింట రవ్వంతైన దెలుప నేగకు" అని కుమారి శతక కర్త ఫక్కి అప్పల నరసు అంటాడు.

శివతత్వసారము శతకము కాదు. అందులో ఒక పద్యమును చూడండి

*"ఏదేశంబుననేపురినేదెసవసియించియుండు నిలశివభక్తుం*

*దేదేశంబున నాపురినాదెస వసియించియుండు హరతీర్థముల్"*

యధావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకములో ఇదేభావాన్ని ఇలాచెబుతాడు.

*"ఏదేశంబుననేదిశాముఖమునందేయూరనే వాడమీ పాదాభ్యర్చన సేయు నిర్మలుడుసద్భకుడొకడుండె నా*

*యాదేశంబుసునాదిశముఖముసున్నాయూరు నావాడ గంగాదిస్నానదీ ప్రవాహాఫలదంబై యొప్పుసర్వేశ్వరా"*

దేవకీ నందన శతకములో వెన్నెలకంటి జన్నయ్య మంత్రి రచించిన ఈ పద్యమును చూడండి.

*"పుడమిన్ బెద్దలబోటివారినడుగంబోరాదె చోద్యంబు పాల్కడలిన్ గల్కి ముద్దరాలు గలుగంగా బూర్వకాలమునన్*

*పొడవెల్లన్ గడుతగ్గి దానవునితో బొంకైన మాటాడి మూడడుగుల్ నేలను వేడగా జనవు కృష్ణా!దేవకినందనా!"*

కృష్ణ శతకములో  నరసింహము గారి పద్యమును చూడండి.

*"పరులను నడిగిన జనులకు కురుచు సుమీ యిదియటంచు గురుతుగ నీవు*

*న్గురుచడవై వేడితి మునుధర పాద్మతయము బలిని తద్దయు కృష్ణా!"*

*"అదనంబొద్దుటినీడ చందమునవిచ్చుల్ స్రుక్కి దుష్టాత్ము సంపద పెంపై ధరనిలవదించుకయు సౌభాగ్యప్రభాభాసితంబై*

*పొదలున్ మాపటి నీడకై వడి భవత్పూజానిధేయజ్ఞుండై  సదయుండైనన్ లేమి జేకూరునె కృష్ణా!దేవకీ నందనా!"*

ఇందలి ఉపమానాలు భర్తృహరి శ్లోకమును గుర్తుకు తెస్తుంది.

*"ఆరంభగుర్వీక్షయిణీక్రమేణంఘ్వీరావృద్ధియుపైతిపశ్చాత్".*

*ప్రాప్తకాలజ్ఞత పై దాశరధీ శతకములో గోపన్నగారి పద్యమును చూడండి*

*"ముప్పునగాలకింకరులు ముంగిట వచ్చినవేళ,రోగముల్ గొప్పరమైనచో గఫము కుత్తుకనిండిన వేళ ,బాంధవుల్*

*గప్పినవేళ ,మీస్మరణగల్గునొగలదొ గల్గదొనాటి కిప్పుడే తప్పకచేతు మీభజన దాశరధీకరుణాపయోనిధీ!"*

ఈ పద్యానికి నరసింహాశతకములో, శేషప్ప అనుసరణ గావించాడు.

*"యమదూతల్గాగృహంబునవచ్చి ప్రాణముల్ పెకిలించి పట్టునప్పుడు*

*కఫవాతపైత్యముల్ గప్పగాభ్రమచేత గంపముద్భవమందికష్టపడుచు*

*నాజిహ్వతో నిన్ను నారాయణాయంచుబిలుతునో శ్రమచేత బిలువలేనో*

*నాటికిప్పుడెచేతునీ నామభజన తలచెదను".*

యధావాక్కుల అన్నమయ్య తన సర్వేశ్వర శతకములో ఈ పద్యము చూడండి.

*"పెంపందల్లియగున్ రుజాపటల దుష్పీడా విధిక్షోభ వా*

*రింపన్ వైద్యుడగున్ గుమార్గ విధులంగ్రీడింప బోకుండ శి*

*క్షింపన్ బల్లిదుడైన తండ్రి యగుచున్ "*

అను పద్యమును దాశరధీ శతకకారుడు ఇలా అనుసరించాడు.

*"పెంపునదల్లివై కలుషబృంద సమాగమమొందకుండ రక్షింపను దండ్రివై మెయివసించుదశేంద్రియరోగముల్ నివా*

*రింపన్ వెజ్జువై కృపగుటించి వరంబుగాగ సత్పంపదలీయ నీవెగతి దాశరధీ కరుణాపయోనిధీ!"*

అదేవిధంగా "కనకాద్రి సమాన ధనంబుగూర్చినంగాసు వెంటరాదు" అని గోపన్న చెబితే, "ఘనమైన్ సకల భాగ్యంబెంత గల్గిన గోచిమాత్రంబైగొనుచుబోడు" అని శేషప్ప అంటాడు.

శ్రీకాళహస్తీశ్వరశతకములో ధూర్జటి పద్యమును చూడండి

*"గ్రహదోషంబులు దుర్నిమిత్తములు నీకఖౌజుణ నామంబు ప్ర*

*త్యహమున్ బేర్కొనుసుత్తమోత్తముల బాధంబెట్టగానోపు నే*

*దహనం గపుగజాలునే శలభ సంతానంబు?నీ సేవచే*

*సి హతక్లేశులు గాక మనుజుల్ శ్రీ కాళహస్తీశ్వరా!"*

దాశరథీ శతకములో ఈ పద్యమును చూడండి

*"దురితలతాను సారభవ దుఃఖకదంబము రామనామభీ*

*కర తరహేతి చేదెగిన కావకలై చనుచుండ నేర్చునే*

*దరికొని మండుచుండు శిఖి దార్కొనిన్ శలభాది కీటకో*

*త్కరము విలీనమై చనదె దాశరథీ కరుణాపయోనిధీ!"*

ఒంటిమిట్ట రఘువీర శతకములో రామనామము జపిస్తే ఎంతటివాడైనా ముక్తికర్హుడు అంటాడు.

*"గోమాంసాశనిమద్యపానిసగరిన్ గొండీడు చండాలుడున్*

*హేమస్తేయుడు సోదరీరతుడు గీడే కాదశిన్భుక్తిగాం*

*చేమూఢాత్ముడులోనుగా గలుగు దుశ్శీలాత్ములైనన్ దుదిన్*

*రామాయన్నను ముక్తిగాంతు రఘువీరాజానకీనాయకా!"*

ఇదే భావాన్ని శేషప్ప,నరసింహ శతకమునందు ఇలా అంటాడు. అయితే అయ్యలరాజు జాబితాకి, శేషప్ప జాబితాకి కాస్తా తేడా ఉంది. "వేదముల్ చదివెడు-విప్రవర్యుండైనన రణము సాధించెడు రాజెయ్యైన- వర్తక కృషికుడౌ -వైశ్యముఖుండైన బరిచరించెడు శూద్రవరుండైన -మెచ్చు ఖడ్గము బట్టి మెఱయులేచ్చుండైన బ్రజలకకఱ పడు రజకుడైన-చర్మమమ్మెడి హీనచండాల నరుండైన నీమహీతలమందునెవ్వడైన -నిన్నుగొనియాడుచుండెనానిశ్చయముగ వాడుమోక్షాధికారి యా వసుధలోన"

భాగవతము ప్రభావముతో శతకకారులు చెప్పిన పద్యము.

రుక్మిణీపతి శతకములోని పద్యము,

*"ప్రాణభయంబుచేనయినబాపసమాగమచింతనైనని*

*స్త్రానముచేతనైన సుకృత పర్తిపత్తినైన సద్వెని ద్రాణ మనంబుచె మిము*

*నిరంతరమెవ్వడు సంస్మరించునా జాణ భృత్యదాబ్జముల చక్కి వసింపడె రుక్మిణీపతీ!"*

ఇదే భావముతో గల ఇతర శతక పద్యాలు.

దేవకీనందన శతకములో ని పద్యము,

*"వెఱ్ఱిచైననుమఱుచైన గార్యము తటిన్ వేసారుచున్నైన యా"*

*రామతారకశతకములోని పద్యము,"*

*ఓపియోపకనైన నొక్కసారైనను వెఱివెఱపులేకవేడ్కనైన"*

సీతాపతిశతకములోని పద్యము,

"లేముల్బొందినవేళరోగములు జాలింబెట్టుచో ఘోరసం"

కొన్ని శతకాలలో భగవన్నామ కీర్తిని ఘనంగా చాటుతాము అన్న భావముతో ఉన్న పద్యాలు ఉన్నాయి.అందులో మణిపూసవంటిది దాశరథీ శతకములోని పద్యము. ఈ పద్యమును చూడండి.

*"భండనభీముడార్తజనబాంధవుడుజ్వలకోదండబాణతూణకో*

*దండకళా ప్రచండభుజ!తాండవ్ కీర్తికి రామమూర్తికిన్*

*రెండవసాటిదెవమిక లేడనుచు గడగట్టి భేరికా*

*డాండడడాండ డాండనినదంబజాండమునిండ మత్తవే*

*దండమునెక్కి చాటెదను దాశరథీ కరుణాపయోనిధీ!"*

రామరాఘవశతకములో పల్లి పార్వతీశ్వరకవి రామనామఘనతని ఇలా చాటుతానంటాడు.

*"శ్రీ మహనీయమూర్తికి ,విశేషవచఃపరిపూర్తికి న్మహో ద్ధామదయానువర్తికి,నుదంచితకీర్తికి రామమూర్తికి*

*న్నేమరు సాటిలేదనుచు వేడుక ఘంటిక మ్రోతలొప్పునీ నామముదిక్కులన్నినన గనంగనొనర్చెద రామరాఘవా!"*

ధర్మపురి నృకేసరి శతకములో శేషప్ప ఇలా అంటాడు.

"సాటిరాదనుచు దండిగ బూబ్బలు పెట్టి చేతజే గంటనుగొట్టిసాచెదను గట్టిగ ధర్మపురి నృకేసరి "

ప్రయాగ రామేశ్వర కవి విరచితమైన శ్రీరామప్రభుశతకము ధూర్జటిగారి శ్రీకాళహస్తీశ్వరశతకాన్ని తిరగేసి తొడగేస్సినట్లుగా ఉంటుంది. భావమునేకాక అక్కడక్కడ పద్యాలకు పద్యాలే అనుకరించారు. శైవ, వైష్ణవభేదాలలో చెప్పబడినా ఒకే భావ సంపదతోనున్నవి.

- *"ఏ మంత్రంబు జపించేపక్షికవిరాజేతంత్రముంజూచితా" ---రా.ప్ర.శ.*

  *"ఏ వేదంబుపఠించెలూత ,భుజగంబేశాస్త్రముల్చూ చె తా"--శ్రీ కా.శ.*

- *"నిన్నుంగొల్చిన భాగ్యసంపదలు రానీలేమి రానీ సమ---రా.ప్ర.శ.*

  *"నినుసేవింపగ నాపదల్పొడమనీ ,నిత్యోత్సవంబబ్బనీ--శ్రీ కా.శ.*

- *"సరిదోఘంబులులేవె నీరములు"భిక్షాందేహి"యన్నభూ"------రా.ప్ర.శ*

  *"లేవోకానల కందమూలఫలముల్,లేవోగుహల్దోయముల్--శ్రీ కా.శ.*

*ఒంటిమిట్ట రఘువీర శతకములో ఈ పద్యాన్ని కృష్ణశతకకర్త తన కందములోకి అందంగా అనువదించాడు.*

*"రవిసూనున్ బరిమార్చి యింద్రసుతునిన్ రక్షించునాడందునో*

*రవిసూనుంగృపనేలి యింద్రసూతుబోరంద్రుంచినాడందునో"---ఒ.ర.వీ.శ*

*"దివిజేంద్ర సుతుని జంపియు రవిసుతు రక్షించినావు రఘురాముడవై*

*దివిజేంద్రసుతుని గాచియురవిసుతుబరిమార్చితౌరాకృష్ణా!"--కృ.శ.*

"నినుసేవింపగ నాపదల్పొడమనీ ,నిత్యోత్సవంబబ్బనీ--శ్రీ కా.శ. అనుపద్యమునుపోలిన సీతాపతిశతకములోని ఈ పద్యమును చూడండి. "నినుసేవింపుచునుండగా సిరులురానీలేములే వచ్చిపై---------------------సీతాపతీ!"

మహిజామనోహరశతకములోని, "ఎంతని వేడుకొందు నినుయేమని దూరుదుయేమిజేతురా" అనుపద్యమును పోలిన పద్యములు రామరామశతకములో, రామతారకశత్కములో నున్నవి.

శేషప్ప రచించిన నృకేసరి శతకములోని, "రవికుల రేగుకాయలకు రత్నము వీలబోసినట్లుదు" అను పద్యమునకు దాశరధీశతకములోని, "మసకొనిరేగు బండ్లకును మౌక్తికములు వెలబోసినట్లు" అను పద్యము స్ఫూర్తి. ఇలాచెప్పుకుంటూపోతే యెన్నైనాచెప్పవచ్చు.

ఈ విధంగా శతకకారులు ఒకరి నుండి ఒకరు భావాలను, ఉపమానాలను,దృష్టాంతాలను యధేచ్ఛగావాడుకున్నారు. వీరు ఒకరి నుండి ఒకరే కాక ,ఒకే కవి వేరు వేరు శతకాలు వ్రాస్తే, ఆ కవి తన శతకాలలోని భావాలను మరొక శతకములో వాడుకున్నాడు. శేషప్ప నరసింహ శతకము, ధర్మపురి నృకేసరి శతకములను పరిశీలిస్తే ఈ విషయము తెలుస్తుంది. ఏది యేమైనప్పటికీ వీరంతా శతక సాహిత్యాన్ని రసవంతము, పుష్టివంతముచేసి తెలుగుసాహితీ సరస్వతికి గొప్పసేవ చేసారనడములో సందేహము లేదు.




# బౌద్ధం దుష్ప్రభావాలు

## ఒక ఖండన

**ఇ.ఎన్.వి.రవి**

**కౌముది పత్రిక మార్చి, ఏప్రిల్ 2012** సంచికలలో శ్రీపాతూరి తేజేంద్ర గారి "బౌద్ధం - దుష్ప్రభావాలు" అన్న వ్యాసం వచ్చింది. వ్యాసం సరళంగా ఉన్నది. వ్యాసంలో ఉటంకించిన అభిప్రాయాలలో, చరిత్ర, మతాలకు సంబంధించిన విషయాలలోనూ, నిజాలున్నప్పటికీ అసమగ్రమైన చరిత్రచిత్రణా, సమన్వయ, తర్కలోపాలు, కొన్ని వాస్తవవిరుద్ధాలు కనిపిస్తున్నవి. వీటిని సమీక్షించడమే ఈ రచన ఉద్దేశ్యం. ఈ రచనకు కారణం నిజానిజాల పరిశీలనే తప్ప, ఆ వ్యాసరచయితను కించపర్చటం కాదు. ఎక్కడైనా ఆ విధంగా ధ్వనిస్తే అది వ్యాస రచనా సంవిధానంలో దొరలిన పొఱబాటుగా గ్రహించగలరని సవినయంగా మనవి చేస్తున్నాను.

ఈ దేశంలో బుద్ధబోధ ఒక ధ్యానపద్ధతిగా మొదలయినది. అటుపిమ్మట 'బౌద్ధం'గా మారి కొన్ని శుష్కాచారాలు చోటుచేసుకుని, మతవ్యవస్థగా రూపొంది, క్రమేణా పలుచబడిన మాట నిజమే. మూలకందమైన బోధ ప్రధానంగా ధ్యానప్రేరణకు సంబంధించినది, సూక్ష్మస్థాయిలో అర్థం చేసుకోవలసినదీనూ. సరైన అవగాహన లేకపోతే దురభిప్రాయాలు తలెత్తడం సహజం. ఆ కారణాల చేత తేజేంద్రగారు వ్రాసిన వ్యాసాన్ని అనేకకోణాలలో గమనించడం అవసరం.

ప్రపంచంలో విఫలం కాని మతమూ, మతవ్యవస్థా ఏదీ లేదు. ఎందుకంటే ఏ మతవ్యవస్థా భిన్న వ్యక్తులను ఒక్కటిగా చేయలేదు. భిన్నత్వం అనేది ప్రకృతి సహజం. అందువల్ల, చరిత్రలో జరిగే పొఱబాట్లు గుర్తించడం వరకూ తప్పులేదు కానీ అందుకు వ్యక్తులనో, మతాన్నో బాధ్యత వహించాలనడం ప్రమాదకరమైన పరిస్థితులకు దారి తీయవచ్చు. బౌద్ధం ఎంతవరకూ దేశాన్ని కాలరాచిందన్న విషయాన్ని నిష్పక్షపాతంగా పరిశీలించవలసి ఉంది. నిజానికి బౌద్ధం ఎంత దుష్ప్రభావాన్ని చూపిందో, అంతకన్నా ఎక్కువగా, రాజుల భోగలాలస, అన్యమతస్తులయిన పరాయి రాజులను గుడ్డిగా నమ్మడం, తమలో తాము కీచులాడడం, సైద్ధాంతికలోపాలు వంటివి మరింత దుష్ప్రభావాన్ని చూపించాయనటానికి ఆధారాలున్నవి. (రెండు చిన్న ఉదాహరణలు: పృథ్వీరాజ్ చౌహాన్ మామగారయిన జయచంద్రుడు, విజయనగర సామ్రాజ్య చక్రవర్తి ఆరవీటి రామరాయలు గారు చరిత్రలో కనిపిస్తున్నారు.) ఈ నేపథ్యంలో నిజానిజాలను పరిశీలించాలి.

***మార్చి మాసంలో మొదటిభాగంలో వ్యాసరచయిత చెబుతున్న విషయాలను చూద్దాం.***

బుద్ధుడి జీవితంతో పెనవేసుకున్న అమానుష, అతిమానుష శక్తులను తీసివేస్తే, ఆయన చారిత్రక పురుషుడని, ఆ తర్వాతి వారు కొన్ని కల్పనలను వ్యాపింపజేశారని, కాబట్టి చారిత్రక నేపథ్యంతో పరిశీలించి బౌద్ధమతానుయాయుల దేశద్రోహాలు, దుష్పరిమాణాలు అంచనా వేయాలని రచయిత అంటున్నారు.

ఒక మహానుభావుడు భూమిపై పుట్టి, ఎందరినో ప్రభావితం చేసి గతించిన తర్వాత ఆ వ్యక్తి చుట్టూ అతీంద్రియ శక్తులు, అతిమానుష కల్పనలు, దైవత్వారోపణలు కమ్ముకోవడం ప్రపంచవ్యాప్తంగా ఉన్నదే ఇందుకు ఈ రెండు శతాబ్దాలలోనే దృష్టాంతాలు కనిపిస్తున్నాయి. షిరిడీ సాయిబాబా, రామకృష్ణ పరమహంస, జిడ్డు కృష్ణమూర్తి తదితరులను దేవుడని, మహిమలు చూపించగలరని, భగవంతుని అవతారాలని భావిస్తున్నారు. ఆ వ్యక్తులు తాము బ్రతికి ఉన్నప్పుడు స్వయంగా తాము సామాన్య మానవులని చెప్పినది నిజం. బుద్ధుడి విషయంలోనూ అదే జరిగింది. ధమ్మపదంలోని కృశగౌతమి, సుజాత, అంగుళీమాలుడు ఇత్యాది కథల మూలంగా బుద్ధుడికి అతీతశక్తులు లేవని తెలుస్తూంది. నిజానికి బుద్ధుడిని దశావతారాలలో ఒకడుగా చేర్చినది హిందువులే. బుద్ధుడికి పూర్వమే వ్రాసిన మహాభారతం శాంతిపర్వంలో, దశావతారాలలో బుద్ధుడు లేడు. ఆ తరువాత వ్రాయబడిన మత్స్య పురాణం బుద్ధుడిని మానుషావతారాలలో ఒకరుగా పేర్కొన్నది. జయదేవుడు గౌతమబుద్ధుడిని విష్ణువు యొక్క తొమ్మిదవ అవతారంగా కీర్తించాడు. బౌద్ధులు అతిమానుషవ్యక్తిగా బుద్ధుడిని చేసినమాటలో కూడా నిజం లేకపోలేదు. దేవుడే లేడని బుద్ధుడు చెబితే, బౌద్ధులు ఆయనను దేవుణ్ణి చేశారు. అవలోకితేశ్వరుడన్నారు. తుషితస్వర్గమన్నారు, ఇంద్రుడన్నారు, అతిమానవశక్తులను ఆపాదించారు. చివరకు మైత్రేయ బోధిసత్త్వుడు అవతరిస్తాడని, అతడికి వాహికగా ఒక శరీరాన్ని తీర్చిదిద్దాలని బౌద్ధం, విదేశీమతాలు కలిసివండిన థియోసఫీ విశ్వాసబద్ధులు నమ్మారు. కాబట్టి అటు హిందువులు, ఇటు బౌద్ధులు ఆయనను దేవుడిని చేయడంలో పోటీపడ్డారనే చెప్పాలి. ఇద్దరిలోనూ స్వార్థం ఉంది. అయితే బుద్ధుడు దేవుడైనా, పురుషోత్తముడైన మానవుడైనా, ఆయన బోధనలలో మానవాళిని సముద్ధరింపగల ధ్యానప్రాధాన్యత ఉండనే ఉంటుంది.

సర్వార్థ సిద్ధుడు రైవతకుడు,రాజకుడు, ఆరూఢుడి వద్ద వేదవిద్యనభ్యసించినట్టు రచయిత పేర్కొన్నారు. వేదవిద్య నేర్చుకున్న బుద్ధుడు వేదప్రామాణ్యాన్ని, వేదాంతంలోని శాంతిబోధలను ఎలా ఖండిస్తాడని ప్రశ్నించారు.

ఆర్యగౌతముడు ఇల్లువీడిన తర్వాత శ్రమణకుడై సత్యాన్వేషణకు ఉపక్రమించాడు. మగధ రాజ్య ముఖ్యపట్టణం రాజగృహం చేరుకున్నాడు. అక్కడ బ్రాహ్మణులు రైవతకుడు, రాజకుడు అన్న వ్యక్తులు ఆయనకు ఆశ్రయమిచ్చారు. గౌతముడు వారి ఆశ్రయంలో ఉంటూ ఆలారకాలాముడనే గురువు వద్ద ణఆకించన్యాయతనంణ అన్న యోగవిద్యను అభ్యసించాడు. ఆరునెలలలో గౌతముడు ఆ విద్యను పూర్తిగా నేర్చి, అందులో అత్యున్నతమైన శూన్యతాస్థితిని సాధించాడు. అతనికి తృప్తి కలుగలేదు. మరొక గురువు ఉద్దకరామపుత్రుని ఆశ్రయించి, 'నైవ సంజ్ఞాయతనం' (న సంజ్ఞ న అసంజ్ఞ ఏవ) అనే మరొక విద్యను నేర్చి నిర్వికల్ప సమాధిస్థితిని చేరుకోగలిగినాడు. ఆ సమాధిస్థితీ గౌతమునికి తృప్తినివ్వలేదు. (మజ్జిమనికాయ 2-4-5)

పైన పేర్కొన్నట్లు గౌతముడు నేర్చినవి యోగవిద్యలే కానీ వేదవిద్యలు కావు. నిజానికి వేదవిద్యలు నేర్వడానికి బ్రాహ్మణులకు తప్ప అన్యులకు నాడు అధికారం లేదన్నది ఊహించడము పెద్ద కష్టం కాబోదు.

వేదప్రామాణ్యఖండన గురించి తెలియాలంటే బుద్ధబోధ కాస్త స్పష్టంగా తెలియాలి.

కనిపించే ఈ ప్రపంచమంతా వ్యక్తులసమాహారం కాక, 'ఘటనలప్రవాహం'గా బుద్ధుడు పేర్కొన్నాడు. మరి కంటికి కనిపిస్తున్న జాతి, గుణ, క్రియ, సంజ్ఞలనబడే ఉపాధులు నిజం కావా? అంటే, నిజం కాదంటాడాయన. ఎందుకంటే కనిపిస్తున్న ఎదుటి వ్యక్తి/జాతి/గుణాదులలో అంతకు ముందుక్షణానికి, ఈ క్షణానికి మార్పు కలిగింది, ఉత్తరక్షణంలో మార్పు కలుగబోతున్నది. చూస్తున్న వ్యక్తిలో మార్పు వచ్చింది. బయట ప్రపంచంలోనూ మార్పు వచ్చింది. కాబట్టి ఉపాధులు లేవు, "ఉపాధులలో మార్పు" మాత్రమే ఉన్నది. ఈ మార్పే ప్రపంచంలో నిత్యమూ, శాశ్వతమూనూ. మార్పు కానిది, నశించనిది ప్రపంచంలో లేనే లేదు. హైందవం ప్రబోధించే

ధ్రువాత్మవాదాన్ని (ఆత్మ నాశనము లేనిది) బుద్ధుడు ఒప్పుకోలేదు. దీనినే అనాత్మవాదమని అన్నారు. మార్పొక్కటే శాశ్వతం కాబట్టి మార్పు లేని భగవంతుడు కూడా బౌద్ధంలో లేడు.

ఆలోచించే బుద్ధి కూడా మారుతూ ఉంటుంది కాబట్టి, బుద్ధి ద్వారా 'మార్పు'ను తెలుసుకోవటానికి వీలులేదు. ఘటనలకు కేవలం సాక్షీభూతుడుగా ఉంటూ నిరంతరంగా ప్రపంచాన్ని చూస్తూ (ధ్యానం) చేస్తూ ఉండటం వలన ఒకనాటికి బుద్ధికి నిశ్చలత ఏర్పడి నిర్వాణం కలుగవచ్చు. ఈ నిర్వాణమార్గానికి శీలం ధ్యానం, ప్రజ్ఞ అని మూడు సోపానాలు. ఈ మూడు సోపానాలనే విశదీకరిస్తే ఆర్య అష్టాంగమార్గమవుతుంది.

(సత్యదర్శనాన్ని సూత్రబద్ధం చేయటానికి తథాగతుడు చతురార్యసత్యాలను గురించి సూచించాడు.) ఇలా కేవలం అనుభవప్రమాణం వల్ల తెలియదగినది సత్యం. అందువలన వేదం కానీ, జైనులబోధలు కానీ, అసలు అనుభవానికి అందని ఏదీ బుద్ధబోధలో ప్రమాణాలు కావు. ఆఖరుకు బుద్ధుడు తను చెప్పిన బోధను కూడా స్వయంగా నిగ్గుతేల్చుకొని అనుభవానికి తెచ్చుకోనిదే నమ్మవద్దన్నాడు. (దీఘనికాయ, కాలామసుత్తం) అయితే బుద్ధుడు బోధించిన సత్యాన్ని తమదైన మార్గంలో కనుక్కున్న ఉపనిషత్ ద్రష్టలు అదివరకే ఉన్నారు. అందుచేత బుద్ధబోధ, వారి బోధలతో అక్కడక్కడా ఏకీభవించి ఉండవచ్చు.

బుద్ధుడి బోధ అంతా శిష్యులను బట్టి సాగుతుంది. తనవద్దకు వచ్చిన జిజ్ఞాసువుల సామర్థ్యాన్ని, యోగ్యతను బట్టి అనుగుణమైన భాషణ చేయడం బుద్ధుని పద్ధతి. అందువలన ఒకరి వద్ద వేదప్రామాణ్యాన్ని నిరసించినట్లు, మరొకరి వద్ద వేదఋషుల బోధను సమర్థించినట్లు కానవస్తుంది. మజ్ఝిమనికాయం చంకిసుత్తం (95) పరిశీలిస్తే

- కొందరు బ్రాహ్మణులు కలిసి బుద్ధునివద్దకు వేదం గురించి చర్చించడానికి వెళ్ళారు. వారికి ప్రాతినిధ్యం కాపథికుడనే యువబ్రాహ్మణుడు. ఆతడన్నాడు. "భోగౌతమా! మాకు తరతరాల నుండి వేదవిద్య ప్రామాణంగా ఉంటున్నది. అది మాకు తరాల నుండి వస్తున్న వారసత్వం. వేదమే సత్యం, మిగిలినది అసత్యం అని మా పెద్దలంటున్నారు. నిజం కాదంటారా?"

తథాగతుడన్నాడు. బ్రాహ్మణుల్లో ఎవరైనా "నాకిది తెలుసు. నేను స్వయంగా తెలుసుకున్నాను. అనగలిగే వారున్నారా?"

యువకుడు సత్యవాది కాబట్టి "లేదు" అని జవాబు చెప్పాడు.

'వారి ఆచార్య,ప్రాచార్యుల్లో, పరమాచార్యులలోనూ, ఏడుతరాలవరకూ ఆఖరుకు అష్టక, వామదేవాది మంత్ర రచయితల్లోనైనా సరే ఎవరైనా, "నాకిది తెలుసు. నేనిది స్వయంగా దర్శించాను" అనే వారున్నారా?'

"లేదు"

'మొదటి వ్యక్తి, మధ్యవ్యక్తి, చివరి వ్యక్తీ ఎవరూ చూడలేదు. ఇదొక అంధుల వరుసలా ఉన్నది. సత్యానురక్షణ - శ్రద్ధపై ఉండడం సముచితం తప్ప నమ్మకం పైన ఉండడం తగద'ని సుగతుడు వారికి బోధించినాడు.

వేదప్రామాణ్యం గురించి పైన చెప్పిన విధంగా వ్యాఖ్యానించిన బుద్ధుడు, మరొక సందర్భంలో వాసిట్ట (వాశిష్ఠుడు) అనే బ్రాహ్మణునితో బ్రాహ్మణుల గురించి, బ్రాహ్మణసంప్రదాయం గురించి ఎంతో గౌరవంగా వ్యాఖ్యానిస్తాడు. (ధమ్మపదం - వాశిష్ఠుని ఉదంతం)

బుద్ధబోధలో వేదాలలోని విషయాలు కనిపిస్తాయని, "సర్వేజనాస్సుఖినోభవంతు", "ఓం శాంతి, శాంతి శాంతిః" అనే మంత్రాన్ని బుద్ధుడెలా ఖండిస్తాడని, బుద్ధుని అనుయాయులు అనంతరకాలంలో చేసిన దుష్ప్రచారం అని రచయిత అంటున్నారు.

"సర్వేజనాస్సుఖినోభవన్తు" అన్నది బుద్ధబోధ తాలూకు అంతిమస్ఫూర్తి, అంతే కానీ బోధ సారాంశం అది కాదు. "ఆత్మదీపో భవ" అన్నది బుద్ధబోధ సారాంశం. వ్యక్తి యే సంఘానికి మూలం. అతడు మారాలి. ఆ తర్వాత అందరూ. ఎలాగైతే హైందవంలో అద్వైత, విశిష్టాద్వైత, శుద్ధాద్వైత వాదాలున్నాయో అదే విధంగా బుధుని బోధను విశదీకరించడానికి క్షణిక, శూన్య, మాధ్యమిక ఇత్యాది

వాదాలు,ప్రమాణ గ్రంథాలు ఆయా కాలాలకు అనుగుణంగా వచ్చినాయి. వాటిలో హిందూ ధర్మాన్ని ప్రశ్నించడం ఉన్నది. వాటికి సమాధానంగా శ్రీహర్షాది కవులు బౌద్ధంపై తీవ్రంగా విరుచుకుపడడమూ చరిత్రలో కనిపించే నిజం.

ఉదాహరణకు ఏడవశతాబ్దం నాటి నలందా విశ్వవిద్యాలయపు గురువు ధర్మకీర్తి శ్లోకం (ప్రమాణవార్తిక) పరిశీలించవచ్చు.

***వేదప్రామాణ్యం కస్యచిత్ కర్తువాదః***

***స్నానే ధర్మేచ్ఛా, జాతివాదావలేపః।***

***సంతాపారంభః పాపహానాయచేతి***

***ధ్వస్తప్రజ్ఞానాం పంచలింగాని జాడ్యే॥***

(బుద్ధి, వివేకం కన్నా గ్రంథాలప్రామాణ్యాలను అంగీకరించుట, సృష్టికర్త కలడను వాదాన్ని నమ్ముట, స్నానాదులాచరించి ధర్మము ఆచరించినట్టు చెప్పుట, జాత్యహంకారసమర్థనమూ, పాపప్రక్షాళనార్థం శరీరమును కృశింపజేయుట - ఈ ఐదును అవివేకుల జడత్వములు)

ఈ కావ్యాన్ని, నాగార్జునుని మాధ్యమిక వాదాన్నీ శ్రీహర్షుడు తీవ్రంగా ఖండించాడు. ఆయన నిరసనలో ఒకచోట గౌతముని, "గోతముడు" అని కూడా పేర్కొని ఉన్నాడు. గోతముడు - అంటే ఎద్దు వలే మూర్ఖుడు.

వ్యాసరచయిత చేస్తున్న వాదనలో మరొక విషయం ఏమిటంటే - ఒకపక్క బౌద్ధం ఉపనిషత్తులతో ఏకీభవించినదంటున్నారు. బౌద్ధం నిరాశను, నిష్క్రియావాదాన్ని నూరిపోసిందనీ అంటున్నారు. అంటే బుద్ధబోధ తాలూకు నిష్క్రియాపరత్వం ఉపనిషత్తులలోనూ ఉండాలి. అప్పుడు బుద్ధునిది, ఆయన అనుయాయులదీ తప్పెలా అవుతుంది?

యజ్ఞయాగాది కర్మకాండను బుద్ధుడు నిరసించడం, సామాన్యులభాషలో ప్రవచనాలు చెప్పడమూ, అంతకు ముందే పుట్టిన జైనమతంకంటే బౌద్ధం ప్రజలకు దగ్గరవటమూ రచయిత సరిగ్గానే పేర్కొన్నారు. బుద్ధుని శిష్యులలో బ్రాహ్మణులే ఎక్కువమంది అని కూడా త్రిపిటకాలలో, అట్టకథలలో, పాళీసాహిత్యంలో ఋజువులు దొరుకుతున్నవి. అయితే యజ్ఞయాగాది కర్మకాండల మీద విముఖత ఒక్కటే బుద్ధుని మీద జనసామాన్యం అభిమానానికి కారణమనుకోరాదు. సామాన్యులకు అర్థమయే భాషలో వారి దైనందిన జీవితంలో ఎదురయ్యే తాత్విక సమస్యలకు బుద్ధబోధలో సాంత్వన, సమాధానం దొరికినమాట నిజం. అలాగే బుద్ధుని నిరాడంబరతా, సరళత్వమూ, ఋజుత్వమూ, సామ్రాజ్యాన్నే త్యజించిన ఆతని వ్యక్తిత్వంలోని ఔన్నత్యమూ సామాన్యుల మనసులకు తనను చేరువ చేసింది.

రచయిత బౌద్ధంలోని మాంసాహార నియంత్రణ, నియమాల గురించి, హర్షుని గురించి, సావర్కార్ మాటలలో చెప్పిన వాక్యాలు పూర్తిగా నిరాధారం. బౌద్ధ త్రిపిటకాలలో భిక్కునియమాల గురించి చెప్పే వినయపిటకం మాంసాహారం గురించి ఏమంటుందో చూద్దాం.

●●●

*(కొనసాగింపు వచ్చే సంచికలో)*

# వ్యాస కౌముది



## బౌద్ధం దుష్ప్రభావాలు

## ఒక ఖండన

**ఇ.ఎన్.వి.రవి**

### (గత సంచిక తరువాయి)

**కౌముది పత్రిక మార్చి, ఏప్రిల్ 2012** సంచికలలో శ్రీపాతూరి తేజేంద్ర గారి "బౌద్ధం - దుష్ప్రభావాలు" అన్న వ్యాసం వచ్చింది. వ్యాసం సరళంగా ఉన్నది. వ్యాసంలో ఉటంకించిన అభిప్రాయాలలో, చరిత్ర, మతాలకు సంబంధించిన విషయాలలోనూ, నిజాలున్నప్పటికీ అసమగ్రమైన చరిత్రచిత్రణా, సమన్వయ, తర్కలోపాలు, కొన్ని వాస్తవవిరుద్ధాలు కనిపిస్తున్నవి. వీటిని సమీక్షించడమే ఈ రచన ఉద్దేశ్యం. ఈ రచనకు కారణం నిజానిజాల పరిశీలనే తప్ప, ఆ వ్యాసరచయితను కించపర్చటం కాదు. ఎక్కడైనా ఆ విధంగా ధ్వనిస్తే అది వ్యాస రచనా సంవిధానంలో దొరలిన పొఱబాటుగా గ్రహించగలరని సవినయంగా మనవి చేస్తున్నాను.

***

**వినయపిటకము - భైషజ్యస్కంధము - సింహసేనాపతి కథ చివరి భాగము.**

"భిక్కువులారా, మీలో ఎవరునూ, తనకోసమై వండబడినదని తెలిసిన మాంసమును స్వీకరింపరాదు. అదృష్టమూ, అశ్రుతము, అపరిశంకితము కాని మాంసము తినుట దుక్కటదోసము. మీ కోసము కాక, గృహస్తులు తమకోసము వండుకుని, అందులో భాగముగా మీకు భిక్ష ఇచ్చిన మత్స్య, జంతుమాంసములను స్వీకరింపవచ్చును."

వినయపిటకం - చుల్లవగ్గలోని మరొక సూత్రం ద్వారా అప్పటి సమాజానికి తగినట్టు పులి, ఏనుగు, చిరుత, ఎలుగుబంటి, శుష్కించిన శునకము తదితర జంతువుల మాంసాలను బుద్ధుడు నిషేధించాడు. ఆ నిషేధాల వెనుక తర్కమూ, హేతువాదమూ, ఆరోగ్యచింత తప్ప మతం తాలూకు నమ్మకమనేది లేదు.

ఇదే కాక, బౌద్ధంలో వచ్చే అనేక కథల ద్వారా మాంసాహార నిషిద్ధం లేదని తెలుసుకోవచ్చును. నేటికీ టిబెట్‌లోనూ, సింహళదేశంలోనూ మాంసాహారం స్వీకరించడం ఉన్నది. అయితే ముందు చెప్పినట్టు వినయధర్మం ప్రకారం భిక్కువులు తమకై తాము

జంతువులను వధించుట దోషము. నిజానికి బుద్ధుడు పళ్ళు, కాయలు, ఆకులు కూడా చెట్లకు కాసే మాంసాలని అంటాడు. ఆత్మ ఔన్నత్యసంధాయకమూ, ధ్యాననిష్ఠమైన బుద్ధబోధలో ఆహారనియమాదులకు పట్టింపు లేదన్నది తెలియవచ్చు.

తన పూర్వార్థజీవితంలో శైవమూ, ఆపై బౌద్ధమూ స్వీకరించిన హర్షవర్ధనుడు శాకాహారనియమాన్ని విధించాడనడానికి బాణభట్టుని హర్షచరితం, కాదంబరి కావ్యాలలోనూ, హుయాన్ త్సాంగ్ వ్రాసిన ట్రావెల్స్‌లోనూ ఋజువులు లేవు. పైగా ఆ కావ్యాలలో కిరాతులు జంతువేట సాగించినట్లు వర్ణనలు ఉన్నవి. ఇంకా - ఆతని కాలంలో నలందా విశ్వవిద్యాలయం అత్యున్నత ప్రాభవంలో ఉన్నది. దేశవిదేశాల నుండి విద్యార్థులక్కడ చేరే వారు. అంతమందికి శాకాహారం నియమంగా పెట్టి కఠినంగా అమలు చేశాడనడం ఔచిత్యరహితం. దీనికి శాసనాల ద్వారా ఋజువులు తెలిస్తే తప్ప నమ్మడం సాధ్యం కాదు.

అహింసను బోధించిన బుద్ధుడు తన జీవితం చివరన, పందిమాంసం తిన్నాడన్న విమర్శను రచయిత ఉటంకించారు.

- బౌద్ధంలో అహింస ఒకభాగమే. అయితే మాంసాహారం ప్రజలందరూ మానేయాలని బుద్ధుడు సూచించలేదు. భిక్కుసంఘానికి మాత్రం వినయపిటకంలో నియమాన్ని విధించినట్టు తెలుసుకోవచ్చు.

తన జీవితపు చరమాంకంలో బుద్ధుడు పావా అనే మల్లరాజ్యంలో చుందుడు అనే లోహకారుడు ఇచ్చిన సూకరమద్దనం అనే భోజనాన్ని శిష్యులెవ్వరూ తినవద్దని, తను మాత్రమే భుజించాడు. అదివరకే బుద్ధుడికి ఉదరకోశవ్యాధి ఉన్నది. ఆ భోజనం ద్వారా బుద్ధుడి వ్యాధి తిరుగబెట్టి అమితంగా బాధపడ్డాడు. బుద్ధుని శిష్యులు చుందుని నిందిస్తే, వారిని ఆయన వారించాడు. ఈ చుందుడనే లోహకారుడు అతిసామాన్యుడు. ఆతనివద్ద తథాగతునికి పెట్టడానికి వేరే తిండి లేదు. అందుచేత అతనికి ఎటువంటి దోషమంటదన్నాడు. మాంసాహారం పట్ల చాపల్యంతో బుద్ధుడు పందిమాంసం తిన్నాడన్నమాట వట్టిది.

ఆంధ్ర రామాయణ, మహాభారత గ్రంథాల్లో నాయకులు శాకాహారులుగా మారారని, భారతీయ దేవుళ్ళు మాంసాహారులుగా మనం చూపితే ప్రజలు అంగీకరించరని, అది బౌద్ధమత ప్రభావమని రచయిత బౌద్ధం మీద నింద మోపారు.

ఇది పూర్తిగా నిరాధారం. నేటికీ బౌద్ధం పాటించే మాంసాహారులుండగా, బౌద్ధం హైందవం మీద కుట్రజరిపి శాకాహారం అమలు జరిపిందనేది అవాస్తవం. నిజానికి కలియుగంలో బ్రాహ్మణులకు మాంసభక్షణనిషేధం విధించినది అగస్త్యమహర్షి. దీనికి బుద్ధునికి ఎటువంటి సంబంధమూ లేదు. తెలుగు కావ్యాల పరంపర 11వ శతాబ్దానికి కానీ మొదలవలేదు. అప్పటికే దేశంలో బౌద్ధం క్షీణించి ఉన్నది. శైవం, విశిష్టాద్వైతం నిలద్రొక్కుకొంటున్నాయి. ఇక బౌద్ధప్రభావానికి లొంగి కావ్యాలలో నాయకులను శాకాహారులుగా తీర్చిదిద్దడంలో అర్థమే లేదు.

*ఏప్రిల్ సంచికలో రెండవభాగానికి వస్తే -*

విన్సెంట్ స్మిత్ వ్రాసిన రాతలను రచయిత ఉటంకిస్తూ, హర్షుడు "మాంసాహారం ఉపయోగించిన వారికి ఉరిశిక్ష విధించేవాడని" చెబుతున్నారు. స్థాణేశ్వరం రాజధానిగా ఏలిన హర్షవర్ధనుడు భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప చక్రవర్తి. అతను హిందువు, శైవమతావలంబి. ఆపై చాలా యేళ్ళ తర్వాత బౌద్ధంపట్ల ఆకర్షితుడైనట్లు హర్షచరితం చెబుతున్నది. తన అన్నయ్య రాజ్యవర్ధనుని హత్యకు ప్రతీకారంగా గౌడరాజును సంహరించి, హూణులను తరిమికొట్టి ఉత్తరాపథంలో విశాలరాజ్యం స్థాపించిన చక్రవర్తి. దక్షిణాపథంలో ఈయనను రెండవపులకేశి ఓడించాడు. హర్షుడు బాణభట్టాది కవులను పోషించి సాహిత్యసేవ చేసినాడు. ఈయన ప్రతి యేటా ప్రయాగ వద్ద, బ్రాహ్మణులకు భూరిదానాలు చేసేవాడని హర్షచరిత్ర, ట్రావెల్స్ చెబుతున్నాయి.

"నిపుణకవి" అని పేరు పొంది, రత్నావళి, ప్రియదర్శిక, నాగానందం అనే మూడు ఉత్కృష్టమైన నాటకాలను సంస్కృత సాహిత్యానికి అందించిన సాహితీవేత్త ఈయన. భారతదేశచక్రవర్తులను, వారి ఔన్నత్యాన్ని తెగడడంలో ఎక్కడలేని కుతూహలం చూపించి, వారిని తూలనాడడానికి ముందు నిలిచే తెల్లవారి రాతలలో చెడు కాక మంచివిషయాలెలా ఉంటాయి? విన్సెంట్ స్మిత్ గారు ఆయన

రచనలో ఔచిత్యాలేవీ పాటించక, అక్బర్‌తో కూడా హర్షుని పోల్చారు! అంతా చేసి ఆయనకు ఆధారం హువాన్ త్సాంగ్ వ్రాసిన ట్రావెల్స్ పుస్తకమే.

హర్షచరిత్రలో వింధ్యాటవి, అక్కడ కిరాతుల జీవనం గురించి సవివరంగా ఉన్నది. అదే విధమైన వర్ణన తిరిగి కాదంబరి కావ్యంలో వైశంపాయనుని వృత్తాంతములోనూ ఉన్నది. కిరాతుల ఆహారం మాంసము. జంతువేటయే కాక, జంతుమాంసాన్ని జనపదాలలో అమ్మడం వారి వృత్తి. అదే విధంగా మత్స్యకారులూ ఉన్నారు. ఎవరి మతం వారు పాటించమని, అనవసర రక్తపాతం కూడదని, అహింసను చేపట్టమని దేవానాంప్రియుడు అశోకుడు పాళీభాషలో శాసనాలు వేయించాడు. అయితే అన్య మతస్థుల వైయక్తిక జీవితంలో కల్పించుకుని వారిని అశోకుడు కానీ, హర్షవర్ధనుడు కానీ నిర్బంధించినట్లు ఎక్కడా లేదు.

విన్సెంట్ స్మిత్ రాసిన రాతలు ఈ క్రింది ఛాయాచిత్రంలో చదవండి.

రెండవ పేరాగ్రాఫులో - "He sought" – As we are told అంటున్నాడాయన.

విన్సెంట్ స్మిత్ గారికి ఎవరు చెప్పారు? స్వయానా ఆయనే హర్షవర్ధనుని కాలం నాటి శాసనాలు నశించిపోయాయని చెబుతున్నాడు. మరి పై వాక్యంలో"ఎవరో" ఈ మహానుభావుడికి చెప్పారట. ఎవరతను??



RELIGION UNDER HARSHA 305

campaign was fought against the people of Ganjam (Kongoda) in 643 A.D., and then at last this king of many wars doffed his armour and devoted himself to the arts of peace and the practice of piety, as understood by an Indian despot. He obviously set himself to imitate Asoka, and the narrative of the doings in the latter years of Harsha's reign reads like a copy of the history of the great Maurya.

At this period the king began to show marked favour to the quietist teachings of Buddhism, first in its Hinayana, and afterward in its Mahayana form. He led the life of a devotee, and enforced the Buddhist prohibitions against the destruction of animal life with the utmost strictness and scant regard for the sanctity of human life. "He sought," we are told, "to plant the tree of religious merit to such an extent that he forgot to sleep and eat," and forbade the slaughter of any living thing, or the use of flesh as food throughout the "Five Indies," under pain of death without hope of pardon.

Benevolent institutions on the Asokan model, for the benefit of travellers, the poor, and the sick, were established throughout the empire. Rest-houses (*dharmsala*) were built in both the towns and rural parts, and provided with food and drink. Physicians were stationed at them to supply medicines without stint to those who needed them. The king also imitated his prototype in the foundation of numerous religious establishments devoted to the service both of the Hindu gods and the Buddhist ritual.

విదేశీయుల రాతల ద్వారా భారతదేశరాజుల చరిత్రను పరిశీలించి ఆయారాజుల అర్హతలను నిర్ణయించబూనుకుంటే, వాళ్ళ రాతలప్రకారమే భారతదేశ ఔన్నత్యకారకులైన మౌర్యులు, గుప్తులు మొదలైన అన్యరాజులనూ విమర్శించవచ్చు. విదేశీయులు వ్రాసిన భారతదేశచరిత్రలో భారతదేశ ఆత్మ ఎలా కనిపిస్తుంది?

మాంసాహార నిషేధంతో ప్రజలలో కొన్ని వర్గాల జీవనోపాధి దెబ్బతిని, వారిని పోషించవలసిన బాధ్యత ప్రభుత్వంపై బడి ఖజానా ఖాళీ అయి ఉంటుందని రచయిత ఊహించారు.

హర్షుడు తన ఏలుబడిలో రాజ్యాన్ని చక్కగా పరిపాలించాడని, నామమాత్రంగా పన్నులు వేశాడని విన్సెంట్ స్మిత్‌గారే అంటున్నారు. పైగా ప్రతి యేడూ ఆయన దానధర్మాలు చేశారని ఉన్నది. నలందా విశ్వవిద్యాలయం మహాప్రాభవంతో వెలిగింది. మాంసాహార నిషేధానికి ఖచ్చితమైన ఋజువులూ లేవు. కాబట్టి రచయిత ఊహ తప్పు.

బౌద్ధం అస్పృశ్యతను పెంచినదని, సమానత్వం లేకపోవడం వల్ల ఈ దేశంలో బౌద్ధం అంతరించినదని రచయిత మరోసారి ఊహించారు.

హర్షుని కాలంలో అస్పృశ్యత ఉన్నమాట నిజమే. కాదంబరి కావ్యంలోని ఛాండాలకన్య ఉదంతం నిదర్శనంగా కనబడుతున్నది. అస్పృశ్యతను పెంచి పోషించినది బౌద్ధులనేది పూర్తిగా నిరాధారమైనది. బౌదసంఘాలకు అధ్యక్షుడైన భదంత ధర్మకీర్తి సమాజంలో

బడుగువర్గపువాడని రాహుల్ సాంకృత్యాయన్ గారంటున్నారు. అసలు బౌద్ధం మొదలయినదే సమానత్వం ఆధారంగా, వర్ణవ్యవస్థకు భంజకంగాను. (దీఘనికాయం సోణదండసుత్త, అంబట్టసుత్త)

బహుశా సావర్కర్ గారు చెప్పదలుచుకున్న విషయం బానిసత్వం గురించి అయి ఉంటుందని అనుకుంటున్నాను. బానిసత్వం వేఱు, అస్పృశ్యత వేఱు. బుద్ధుని కాలం మొదలుకుని క్రీ.శ. చాలాకాలం వరకూ వరకూ కూడా బానిసత్వం ఉండేది. (బానిసత్వానికి మృచ్ఛకటికం నాటకంలో దృష్టాంతం కనబడుతుంది). బుద్ధుడు బానిసత్వాన్ని నిర్మూలించడానికి ప్రయత్నించినాడు, కానీ ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. కారణం - ఆ కాలంలో వర్తకాలు చేసేవారి రక్షణా, రాజుసైన్యం, రాజ్యరక్షణ, శాంతిభద్రతలు, తదితర సామాజిక అంశాలకూ బానిసత్వానికి లంకె ఉంది. బానిసలపై కోట్లాది రూపాయల వ్యాపారం జరిగి ఆర్థికవ్యవస్థ వారిపై ఆధారపడి ఉండేది. మగధ ఇత్యాది రాజ్యాలలో ఐదవవంతు బానిసలే. ఇది బౌద్ధరాజ్యాలలో మాత్రమే కాక, అన్ని రాజ్యాలలో ఉండేది. బింబిసారుడు బుద్ధుడితో ఈ విషయాలన్నీ వివరించి బానిసత్వాన్ని నిర్మూలించే ప్రక్రియ నుండి విరమింపజేశాడు. అయితే థేరగాథల్లో బానిసలకు యజమానులకు సంబంధాలు ఎలా ఉండాలన్న విషయంపై బుద్ధుడు కొన్ని సూత్రాలు చెప్పి ఉన్నాడు.

బౌద్ధం కొన్ని వృత్తులకు మినహాయింపులివ్వలేదని రచయిత.

బౌద్ధమార్గమే మధ్యేమార్గం. వినయపిటక స్ఫూర్తియే అది.

సన్యాసాశ్రమం గురించి వ్యాసరచయిత వ్రాసినది rhetoric. ఒక వ్యక్తి తాలూకు గొప్పతనాన్ని అతడు సమాజాన్ని ఎంత ప్రభావితం చేశాడన్న విషయంతో పరిశీలించడం సమంజసమైన పని. భారతదేశంలో లిపి, శిల్పం, చిత్రలేఖనం, నాట్యం, ఇత్యాది లలితకళలలో బౌద్ధం ప్రభావం చాలా ఎక్కువగా ఉన్నది. నలందా, తక్షశిల విశ్వవిద్యాలయాలకు మూలం బౌద్ధమే. చాణక్యుడు తక్షశిలలో చదువుకున్నాడు. అతడి మేధకు పరోక్షంగా బౌద్ధం మూలం. అలంకారశాస్త్రానికి, దర్శనాలకు బౌద్ధం మూల్యాంకాలనిచ్చింది. గ్రీకులనుండి భారతదేశానికి జరిగిన ఆదానప్రదానాలకు బౌద్ధం పరోక్షకారణం. చైనా, కొరియా, జపాను ఇత్యాది దేశాలలో యుద్ధవిద్యలకు బౌద్ధమే మూలం. అశోకునికంటే ముందే ఆంధ్రదేశమంతా బుద్ధుడి అడుగుజాడలలో నడిచింది. అమరావతి, నాగార్జునకొండల శిల్పకళకు, అజంతాచిత్రకళకూ బౌద్ధం మూలం. వైద్యవిద్యకు బౌద్ధం ఎన్నో మూల్యాంకాలనిచ్చింది. బౌద్ధం భారతదేశానికి ఎంతచేసింది అన్న విషయం లెక్కకు అందనిది. బౌద్ధాన్ని విస్మరించడమే భారతదేశం పతనానికి కారణమని వివేకానందుని వంటి తాత్త్వికులతో మొదలుకుని, గురజాడ, ఠాగూర్ వంటి సాహిత్యకారులు స్పష్టంగా చెప్పారు.

బౌద్ధంలో సన్యాసుల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయిందని, వారిని పోషించడం భారమైనదని సావర్కర్ ....

బుద్ధబోధ సామాజికపరంగా చెప్పాలంటే కుప్తంగా ఇది.

సబ్బపాపస్స అకరణం కలస్సోపసంపదా ।
సచిత్త పరియోదపనం ఏతం బుద్ధానుసాసనం ॥

(ఏ పాపం చేయకుండుట, పుణ్యకార్యాలు చేయుట, మనస్సును అదుపులో ఉంచుకొనుట - ఇదే బుద్ధ బోధ.)

ఆ సూత్రం గృహస్తులకూ, సన్యాసులకూ కూడా వర్తించేది. ఊరికే సన్యాసులు కమ్మని, తిని కూర్చోమని బుద్ధుడు చెప్పినట్లు ఎక్కడా లేదు.

బుద్ధుని కాలంలో ఆయనకు గృహస్థులయిన శిష్యప్రశిష్యులు ఎందరు ఉండేవారో వారిలో నూరోవంతులో కూడా శ్రమణులు లేరనేది బౌద్ధ అట్టకథల్లోనూ, వినయపిటకంలో అక్కడక్కడా కనిపించే ప్రస్తావనల్లోనూ కనిపించే పచ్చినిజం. ఆ తర్వాత కూడా లేరు. మజ్జిమనికాయం ప్రకారం వత్సగోత్రుడనే వ్యక్తి బుద్ధుణ్ణి - తన ధర్మం కేవలం శ్రమణులకేనా అని కొన్ని ప్రశ్నలు వేస్తాడు. బుద్ధుడతనికి సమాధానం చెబుతూ, బౌద్ధులలో గృహసులు, ఉపాసికలు వందలసంఖ్యలో ఉన్నారంటాడు. శ్రమణుడు కావడానికి నియమాలు నిజానికి

కఠినమైనవి. 21 యేళ్ళకు ముందు, తల్లిదండ్రుల అనుమతి లేకుండా, భార్యకు తెలియకుండా, భుక్తికోసమో, స్వార్థంకోసమో సన్యాసి కావడం బౌద్ధంలో వినయధర్మాలు ఒప్పుకోవు. శ్రమణులైనా వారిపని చేయవలసినదే నిజానికి సంఘంలో గృహస్తులు కూడా ఉండేవారు. అయితే సంఘంలో వ్యక్తులకు వ్యక్తిగత ఆస్తిగా కేవలం ఏడు వస్తువులు (చీవరం, పాత్ర, చెప్పులు, కర్ర వగైరా) మాత్రమే అనుమతింపబడినవి. అందుచేత గృహస్తులు పొలం పెట్టుకుని వ్యవసాయం చేసినా, వాటిని సొంత ఆస్తులుగా స్వీకరించే సదుపాయం ఉండేది కాదు. బౌద్ధ శ్రమణకం పట్ల తప్పు అవగాహనకు కారణం - శ్రమణులకు వలె సుదీర్ఘమైన నియమావళి గృహస్తులకు ఉండేదో, లేదో, కాలక్రమంలో లుప్తమైందో తెలియదు. సిగాలోవాదసుత్త, థేరవాద కథల్లో కొన్ని నియమాలు కనిపిస్తున్నాయి. అలాగే పాళీగాథల్లో విశాఖ, ఉదయనుని కథా ఇత్యాది కథలలో గృహిణులకు చక్కని సూత్రాలున్నవి. ఇవే బౌద్ధానికి సంబంధించిన లౌకికజీవనంలో బోధలుగా కనిపిస్తున్నవి.

చారిత్రక విషయాలను వ్రాసేప్పుడు తగినన్ని ఆధారాలతో వ్రాయడం సమంజసమైన పని కానీ సమగ్ర చిత్రమూ,ఆధారాలు లేక , ఊహల ఆధారంగా చరిత్రను అల్లడం సమర్థులు చేయదగినది కాదు. అశోకుని కాలంలో వాణిజ్యం, ఆర్థికవ్యవస్థా, పన్నులు, జనాభా, వ్యవసాయం, గ్రామవ్యవస్థా, పాలనా వ్యవస్థా, రక్షణశాఖ తదితర అంశాలు తెలియనిదే ఆయన రాజ్యం దివాళా తీసే పరిస్థితులలో చేరుకుందని సావర్కర్ ఎలా ఊహించాడో తెలియకుండా ఉన్నది. బుద్ధుని కాలంలోనే సుదత్తుడు, మృగారుడు వంటి కోటీశ్వరులు ఉన్నారు. (సుదత్తుడు జేతవనాన్ని 18 కోట్లసువర్ణకార్షాపణాలతో ఆ ఉద్యానం నిండా ధనం పరిపించి కొన్నాడని బౌద్ధసాహిత్యంలో కథ ఉన్నది. భర్ హుత్ శాసనంలో చిత్రించిన శిల్పం కూడా నిదర్శనం. అతడి మరొకపేరు అనాథపిండకుడు.) వారి వద్ద ఒక్కొక్కరివద్దా ముగ్గురు రాజులకు సరిపోదగిన ధనసంపద ఉండేదని, వారి వ్యాపారాలు దేశ విదేశాలకు విస్తరించినదనీ వందల కొలది బండ్లు నడుపుతూ వాణిజ్యం చేయటం ప్రధానంగా జరిగిందని, వారిని సార్థవాహులనే వారని, దేశ విదేశాల నుండి విశ్వవిద్యాలయాలకు విద్యార్థులు చేరుకునే వారని, వారిలో అనేకులు భూరిదక్షిణలిచ్చేవారని, బానిసలసహాయంతో వ్యవసాయం, సార్థవాహం వగైరాలు నడిచేవనీ, ఇలా ఆర్థికవ్యవస్థ అనేక పార్శ్వాలలో ముడివడిందని, వాటి గురించి తెలుసుకోవటానికి చరిత్రను ఎంతో లోతుగా అధ్యయనం చేయవలసి ఉంటుందని సావర్కర్ గారికి తెలియకుండా పోయింది. ఆంగ్లేయుల రాకపూర్వం వరకు భారతదేశం ప్రపంచదేశాలలో అత్యంతధనికమైన దేశమని The case for India పుస్తకంలో రచయిత Will Durant సోదాహరణంగా వ్రాశారు. మరి ఎప్పుడో అశోకుని కాలంలోనే దేశం దివాళా తీసిందని సావర్కర్ ఎలా ఊహించాడు? సావర్కర్ ఒక ఆవేశపరుడు. ఆంగ్లేయులకు విరుద్ధంగా పోరాడినందుకు ఆయనను అభినందించవలసిందే, అయితే బౌద్ధం మీద ఈ విధమైన అవగాహనా రాహిత్యానికి ఆయనను ఒప్పుకోలేము.

●●●

*(కొనసాగింపు వచ్చే సంచికలో)*




# బౌద్ధం దుష్ప్రభావాలు

## ఒక ఖండన

**ఇ.ఎన్.వి.రవి**

(గత సంచిక తరువాయి)

**కౌముది పత్రిక మార్చి, ఏప్రిల్ 2012** సంచికలలో శ్రీపాతూరి తేజేంద్ర గారి "బౌద్ధం - దుష్ప్రభావాలు" అన్న వ్యాసం వచ్చింది. వ్యాసం సరళంగా ఉన్నది. వ్యాసంలో ఉటంకించిన అభిప్రాయాలలో, చరిత్ర, మతాలకు సంబంధించిన విషయాలలోనూ, నిజాలున్నప్పటికీ అసమగ్రమైన చరిత్రచిత్రణా, సమన్వయ, తర్కలోపాలు, కొన్ని వాస్తవవిరుద్ధాలు కనిపిస్తున్నవి. వీటిని సమీక్షించడమే ఈ రచన ఉద్దేశ్యం. ఈ రచనకు కారణం నిజానిజాల పరిశీలనే తప్ప, వ్యాసరచయితను కించపర్చటం కాదు. ఎక్కడైనా విధంగా ధ్వనిస్తే అది వ్యాస రచనా సంవిధానంలో దొరలిన పొఱబాటుగా గ్రహించగలరని సవినయంగా మనవి చేస్తున్నాను.

***

ఈ వ్యాసపరంపరలో ప్రధానమైన విమర్శ ఇది - ***బౌద్ధం నిష్క్రియావాదాన్ని ప్రేరేపించింది. అదేపనిగా శాంతిమంత్రాన్ని జపించింది. మోతాదుకు మించిన శాంతిజపం కారణంగా బౌద్ధరాజులు యుద్ధాలు చేయడం మానేశారు. అందుచేతనే తరువాతి కాలంలో విదేశీయులకు భారతజాతి దాసోహమైంది.***

చరిత్రలో జరిగిన ఘటనలను అవగాహనతో చూసినప్పుడే చరిత్ర అధ్యయనం సమగ్రమవుతుంది. అలా జరుగని పక్షంలో దురవగాహననూ, అనుమానాన్ని పెంచే ఆ అధ్యయనమే అనవసరం.

బుద్ధుడు శాంతిమంత్రం జపించటమూ, రక్తపాతాన్ని, హింసనూ వ్యతిరేకించటమూ నిజమే. అందువలన బుద్ధుని తదనంతరం వచ్చిన బౌద్ధరాజులు శాంతికి తప్ప యుద్ధాలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడమూ కొంతవరకూ నిజమే. అయితే సరైన అవగాహన ఏర్పడాలంటే ఆ కాలపు పాలనావ్యవస్థలు, బుద్ధుడు ఏ పరిస్థితులలో పాలనావ్యవహారాలకు సంబంధించి శాంతిమార్గాన్ని ప్రబోధించాడు అన్న విషయాలు తెలియాలి. బౌద్ధం ఆశావాదమూ, నిరాశావాదమూ కాదు. అది యథార్థవాదం. యథార్థవాది అయిన బుద్ధుడు ఏ

పరిస్థితులలో శాంతిమంత్రం జపించాడు అన్నది ఆలోచించాలి. అంతకు ముందుగా మరొక సంగతి - బుద్ధుడు యుద్ధం వలన వచ్చే రక్తపాతాన్ని, చంపడాన్ని తీవ్రంగా వ్యతిరేకించినమాట నిజమైనా, ఆత్మరక్షణ చేసుకోవద్దని చెప్పినది లేదు. (నిజానికి చైనా, జపాన్, కొరియాలలో నేడు యుద్ధవిద్యలుగా కొనసాగుతున్న కుంగ్‌ఫూ, తైక్వాండో తదితర విద్యలు - బౌద్ధంలో మహాకాశ్యపుడు సాంప్రదాయంగా ఏర్పరిచిన ధ్యానపద్ధతులు, ఆత్మరక్షణ మార్గాలే. వాటిని బౌద్ధుడయిన బోధిధర్ముడే బుద్ధుడు గతించిన చాలాకాలం తర్వాత చైనాలో వ్యాప్తి చేశాడు. దరుమా డాల్ పేరుతో జపాన్‌లో నేడు జపనీయులు ఉపయోగించే మాస్క్ బోధి ధర్ముడిదే)

భారతదేశంలో అప్పటి కాలంలో రెండురకాల పాలనా వ్యవస్థలుండేవి. మొదటిది - అనువంశికంగా వచ్చే రాచరికవ్యవస్థా, రెండవది గణతంత్ర రాచరిక వ్యవస్థ. మహాభారతకాలంలోనే భారతదేశంలో గణతంత్రరాజ్యాలుండేవని పుట్టపర్తి నారాయణాచార్యుల వారు వ్యాసమహాభారతంలో నిదర్శనాలు చూపిస్తూ మహాభారతవిమర్శనము అనే గ్రంథం వ్రాశారు. గణతంత్ర వ్యవస్థలో రాజు అంటే ప్రజలకు ప్రతినిధి మాత్రమే. ఆ వ్యవస్థలో ప్రతి ప్రధాన నిర్ణయమూ శలాక (voting) పద్ధతిలోనే జరిగేది. ఆ రాజ్యానికి యుద్ధం వస్తే స్త్రీలు, పురుషులు కలిసి యుద్ధంలో పాల్గొనేవారు. రాజ్యానికి కావలసిన ప్రతి విషయానికి ప్రజలందరూ సమన్వయపద్ధతిలో విచారించి తగువిధంగా పరిష్కారం కనుక్కునే వారు. బుద్ధుడు పుట్టినది అటువంటి గణతంత్ర రాజ్యంలోనే. అతని తండ్రి శుద్ధోధనుడు కపిలవస్తు గణతంత్రరాజ్యానికి రాజు (ప్రతినిధి). ఆ రాజ్యంలో శుద్ధోధనుడే కాక భద్దియుడు, దండపాణి అనే మరో ఇద్దరు కూడా ఉపరాజులుగా ( deputy kings) ఉండేవారు.

నిర్వాణం తర్వాత బుద్ధుడు 45 ఏళ్ళపాటు సంచారం చేసిన రాజ్యాలలో ప్రధానమైనవి లిచ్ఛవీ, మల్లరాజ్యమూ, కోలియ రాజ్యమూ. అవి మూడూ గణతంత్రరాజ్యాలే. వీటికి దిగువన ఉన్న మగధరాజ్యం బలమైనది, అనువంశిక రాజ్యపాలనలో ఉన్నది. మగధను మహాభారతకాలంలో జరాసంధుడు పరిపాలించాడు. ఆ కాలంలోనూ మగధ మహా బలోపేతమైనది. తదనంతరం బుద్ధుని కాలంలోనూ ఆ రాజ్యం అలాగే ఉండేది. మగధ రాజ్యాన్ని బింబిసారుడు పరిపాలించేవాడు అతని తదనంతరం అజాతశత్రువు పరిపాలనకు వచ్చాడు. అజాతశత్రువుకు రాజ్యకాంక్ష ఎక్కువ. రాజ్యసరిహద్దుల్లో ఉన్న గణతంత్ర రాజ్యాలను తన రాజ్యంలో కలుపుకోవాలని అతనికి ఆశగా ఉండేది. వైశాలి (లిచ్ఛవీ) గణతంత్రం మగధతో పోలిస్తే విస్తీర్ణంలో చిన్నదైనా, మహాబలమైన రాజ్యం. వైశాలీ రాజ్యానికి సింహుడు సేనాపతి. రాజ్యంలో స్త్రీపురుషులందరూ ప్రాణానికి తెగించి యుద్ధాలలో పాల్గొనేవారు. అందువల్ల ఆ రాజ్యం సుభిక్షంగా, దుర్భేద్యంగా ఉంటూ అజాతశత్రువుకు కంటగింపుగా ఉండేది. లిచ్ఛవులపై అజాతశత్రువు చాలాసార్లు దండెత్తినా అతని ఆటలు సాగలేదు.

బుద్ధుడికి ఈ రాచరికవ్యవస్థకన్నా, ప్రజాస్వామ్య పద్ధతిలో నడిచే గణతంత్రవ్యవస్థపై విశ్వాసం ఉండేది. దీనికి దృష్టాంతం దీఘనికాయం వజ్జిసుత్తంలో కనిపిస్తున్నది. అజాతశత్రువు వైశాలీలకు ఆపుడైన బుద్ధుని వద్దకు వర్షకారుడనే మంత్రిని పంపి వజ్జియుల (లిచ్ఛవులన్నా అన్నా వైశాలీలన్నా, వజ్జియులన్నా ఒక్కరే) గురించి తెలుసుకురమ్మని పంపుతాడు. అప్పుడు గౌతముడు అతని సమక్షంలో ఆనందునితో సంభాషణ జరుపుతూ వజ్జియుల గణతంత్రరాజ్యం గురించి చెబుతాడు.

1. వజ్జియులు పలుమార్లు ఒక్కచోట చేరుతారు. సభలు, సమావేశాలలో చర్చించి తమ సమస్యలు పరిష్కరించుకుంటారు.

2. వజ్జియులందరూ కలిసికట్టుగా పనిచేస్తారు.

3. రాచరిక వ్యవస్థలో రాచరికానికి వచ్చిన అహంకారులలాగా కులస్త్రీలను చెరబట్టరు.

4. వృద్ధులను చులకనగా చూడటం, వారి ధర్మోపదేశాలను తృణీకరించటం వంటి అధర్మాలకు పాల్పడరు.

5. వజ్జియులు దేవస్థానాలను గౌరవించి పూజిస్తారు, మతసహనం కలిగి ఉంటారు, దేవాలయాల భృతిని కష్టపడైనా కొనసాగిస్తారు తప్ప మానరు.

6. తమ రాజ్యంలో అర్హతుల సంరక్షణ బాధ్యత వహిస్తారు. ఆపన్నులను, శరణార్థులను ప్రాణం పోయినా కాపాడుతారు.

7. వజ్జియులు అవిహిత కర్మలను విహితంగా భావించరు. హేతువాదధార్మిక ప్రవృత్తితో జీవనం సుఖవంతం చేసుకుంటారు.

పై యేడు సూత్రాలను బుద్ధుడు అన్యాపదేశంగా వర్షకారుడికి చెప్పి హెచ్చరించాడు.

గణతంత్ర రాజ్యాలు విస్తీర్ణంలోనూ, ప్రజాబలంలోనూ చిన్నవి. వీటికి రాచరిక రాజ్యాలతో యుద్ధం వస్తే బాగా ప్రజాక్షయం జరుగుతుంది. నాడు జనాభా తక్కువ. అందువలన సాధ్యమైనంత వరకూ, తమకు తీవ్రనష్టం కలుగనంతవరకూ సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని బుద్ధుడు దశరాజధర్మాలను (పాళీ అర్థకథలు, జాతక కథలు) ఉపదేశించాడు. ఆ ధర్మాలలో చివరిధర్మం - అవిరోధం. అంటే రాజు ప్రజాభిప్రాయాన్నే పాటించాలి. గ్రామాధికారుల పరిషత్తు నిర్ణయాలమీదనే ప్రధానమైన సమస్యలను పరిష్కరించటం జరగాలి. గణతంత్రవ్యవస్థలో అలాగే జరిగేది కూడాను. ఒకవేళ రెండు గణతంత్ర రాజ్యాలకు మధ్య స్పర్థలు వచ్చినా వాటి మధ్య స్పర్థలను మగధ రాజ్యం ఉపయోగించుకుని, రెంటినీ కబళించే అవకాశం ఉన్నది. బుద్ధుడు జీవించి ఉన్నప్పుడు శాక్యులకు, కోలియులకు మధ్య రోహిణీ జలాల వాటాకు సంబంధించి అటువంటి సమస్య వచ్చింది. యుద్ధం అనివార్యమయింది. అప్పుడు బుద్ధుడు స్వయంగా ఆ రాజ్యాల మధ్య సయోధ్యను కుదిర్చి, కోలియుల శ్రమను, శాక్యుల బుద్ధిబలాన్ని సమన్వయపరిచి, పరిష్కారమార్గం సూచించినాడు. ఆ రకంగా బుద్ధుడు అనవసర రక్తపాతాన్ని, యుద్ధాన్ని నివారించినాడు.

బుద్ధుడు భారతదేశాన్ని అనేక గణతంత్రరాజ్యాల సమాహారంగా (Collection of Decentralized Republic unions) కూడా ఊహించాడని చెప్పవచ్చు. కారణం అప్పటి గణతంత్రరాజ్యాలకు ఒక్కొక్క దానికి ఒక్కొక్క ప్రత్యేకత ఉండేది. శాక్యులకు బుద్ధిబలం, కోలియులకు శ్రమబలం, లిచ్ఛవులకు ఐక్యతాబలం, మల్లులకు బాహుబలం, ఇటు గాంధారరాజ్య సరిహద్దులోని యౌధేయులకు యుద్ధవిద్యలో నైపుణ్యతాబలం, ఉత్కళులకు నిరంతరప్రయత్నం చేయగల యత్నతాబలం ప్రత్యేకతలు. గణరాజ్యాల స్వాతంత్ర్యాన్ని గౌరవిస్తూ, వాటి మధ్య సమన్వయం చేకూర్చితే జంబూద్వీపం శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లడానికి అవకాశం ఉందని ఆయన ఊహించాడు. అయితే ఆ ప్రయత్నం నెరవేరలేదు. బుద్ధుడు నిర్వాణం పొందిన మూడేళ్ళ తర్వాత అజాతశత్రువు వైశాలి రాజ్యంలో పౌరులకు తమమధ్య తమకే విభేదాలు సృష్టించి, బయటనుండీ కూడా నిర్వీర్యపరిచి, ఆ రాజ్యాన్ని నాశనం చేశాడు.

బుద్ధుడి తర్వాత కాలంలో మహామేధావి ఆర్యచాణక్యుడి ఆలోచన బుద్ధుడి ఆలోచనకు వ్యతిరేకంగా సాగింది. రాచరిక రాజ్యమైన మగధను బలోపేతం చేసి, అక్కడ మౌర్యులను ప్రతిష్టాపించాలని, దేశాన్నంతటినీ ఒక త్రాటి కిందకు తీసుకురావాలని ఆతని తలంపు. ఆ ప్రయత్నంలో విజయవంతమయ్యాడు.

ఆపై గుప్తులు మౌర్యుల మార్గాన్నే అనుసరించారు. ఆ పద్ధతి ద్వారా వారు యవనులను అరికట్టినప్పటినీ యౌధేయులను, వారి గణతంత్ర రాజ్యాన్ని రాక్షస ప్రయత్నంతో నాశనం చేశారు. ఆ యౌధేయులు గాంధారరాజ్యానికి సరిహద్దుల్లో జంబూద్వీపానికి గాంధారరాజ్యానికి మధ్య ఉన్న ఒకే ఒక్క మార్గంలో విదేశీయులను అడుగు పెట్టనివ్వకుండా చాలాకాలం స్వతంత్రప్రతిపత్తిని నిలుపుకున్నవారు.

గణతంత్ర రాజ్యాల గురించి, వారి రాచరికవ్యవస్థల గురించి ఆ తర్వాత కాలంలో పట్టించుకున్న వారు లేరు. ఆ రాజ్యాల నాశనంతో వారి సంస్కృతీ, సాంప్రదాయాలు నశించి ఎక్కడో కొన్ని ఆనవాళ్ళు మిగిలినయ్. వారికి సంబంధించిన సాహిత్యాలు నలందా, తక్షశిలా విశ్వవిద్యాలయ గ్రంథాలయాలనాశనంలో కొట్టుకుపోయాయి. బౌద్ధసాహిత్యాన్ని భిక్కువులు టిబెట్‌కు తీసుకు పోయారు. ప్రజావ్యవస్థలకు సంబంధించిన సాహిత్యం లుప్తమై, అక్కడక్కడా చిన్నచిన్న ఆధారాలు మాత్రం దొరుకుతున్నవి. వినయపిటకంలో పేర్కొనబడిన సింహసేనాపతి తనకథను ఇటుకలపై వ్రాయించి పాతిపెట్టించాడు. ఆ కావ్యాన్ని రాహుల్ సాంకృత్యాయన్ పరిష్కరించారు. ఆ ఇటుకలు నేటికీ పాట్నా మ్యూజియంలో ఉన్నాయి.

చాణక్యుడు, రాక్షసమంత్రి, బాదరాయణుడు, యౌగంధరాయణుడు, తిమ్మరుసు వంటి మంత్రులు, హర్షుడు, చంద్రగుప్తుడు, భోజుడు, విక్రమార్కుడు, కృష్ణరాయలు, ప్రతాపరుద్రులు, పృధ్వీరాజు, శివాజీ వంటి రాజులు ప్రతితరంలోనూ జన్మించే అవకాశం లేదు. వ్యక్తులపై ఆధారపడిన రాచరికవ్యవస్థ సంఘశక్తిపై ఆధారపడిన గణతంత్రరాజ్యాలకంటే సిద్ధాంతరీత్యా బలహీనమైనది. జాగ్రత్తగా పరిశీలిస్తే ఆంగ్లేయులు, అన్యదేశీయులైన రాజులు రాచరికవ్యవస్థలోని స్వార్థాన్ని ఉపయోగించుకుని, విభేదాలు సృష్టించి పబ్బం గడుపుకున్నారో తెలుస్తుంది.

బౌద్ధమతావలంబకులు దేశద్రోహులుగా మిగిలిపోయారు. వైదికధర్మద్వేషంతో ఒడలెరుగక విదేశీయులకు సహాయం చేశారు. మహ్మద్ బిన్ ఖాసింకు బౌద్ధులు సహాయం చేశారు. నలందా, తక్షశిల విశ్వవిద్యాలయాల రక్షణకు వారు పోరాడలేదు. కనిష్కుడు, మినాందర్‌లకు వారే సహాయం చేశారు.

బుద్ధుని జననకాలం క్రీ.పూ. ఐదవశతాబ్దం అని అనేకులు అంగీకరించిన మాట. కోటవెంకటాచలం గారు పద్మపురాణం, మహాభారతంలో జ్యోతిష్యశాస్త్రప్రమాణాలను బట్టి బుద్ధుని కాలం క్రీ.పూ.1800 అని అంటున్నారు. ఈ మధ్య ఆ కాలానికి చెందిన కొన్ని అనుమానాస్పద బౌద్ధ అవశేషాలు బయల్పడటము కూడా ఆ విషయంపై పునరాలోచించడానికి ప్రేరేపిస్తున్నవి. మహమ్మదీయమతం మొదలయిందే క్రీ.శ. 6 వ శతాబ్దానికి తర్వాత. వెయ్యి సంవత్సరాలలో ఒక మతంలో ఎన్ని మార్పులు రాకపోవు? వాటికి బుద్ధుడెలా కారణమవుతాడు? సరే బుద్ధుడు కాడు, అతని బోధప్రభావం వల్ల ఇలా జరిగిందనుకుంటే, దీనికి విదేశీచరిత్రకారులు సాక్షి అనడం అనుమానాస్పదం. విదేశీయులు ఇటీవలికాలటి విజయనగరాధిపతుల చరిత్రలనే తారుమారు చేసి ఆదిల్షాకు తొత్తులై, వారి రాజ్యంలో సుఖాలనుభవిస్తూ విజయనగరచరిత్రను భ్రష్టుపట్టించి, హరిహర బుక్కరాయాది మహావీరులను బలహీనులుగా చిత్రించినది నిజం. మహమ్మదీయమతం నాటికి బౌద్ధం దేశంలో చాలావరకూ క్షీణదశలో ఉంది. రాజుల్లో బౌద్ధం పాటించే రాజులు దాదాపుగా మృగ్యం. వారి చేతుల్లో అధికారమే లేదు. ఇక వారు రక్షణకు, భక్షణకూ బాధ్యులెలా అవగలరు? నలందా ధ్వంసమైనప్పుడు బౌద్ధులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని టిబెట్టుకు పారిపోయారన్నదే నిజం. అందుకనే నలందలోని అనేక బౌద్ధగ్రంథాలు టిబెట్ చేరుకున్నాయి. అనంతరకాలంలో రాహుల్ సాంకృత్యాయన్ వాటిని వెలికితీసి ఇరవై కంచరగాడిదల సహాయంతో భారతదేశానికి తీసుకువచ్చారు.

గ్రీకు రాజు మినాందర్ (మిళిందుడు)కు బౌద్ధులు సహాయం చేసినట్లు చరిత్ర చెప్పడం నిరాధారం. మిళిందుడు మొదట బౌద్ధమతానుయాయి కాడు. కరడుగట్టిన తార్కికుడతను. అతడు పుష్యమిత్రుడనే హిందూ రాజును జయించిన భారతదేశంలో స్థిరపడిన తర్వాత అతడికి నాగసేనుడికి వాగ్వాదం జరిగిన తర్వాత మిళిందుడు బౌద్ధమతాన్ని ఆదరించినట్లు స్పష్టంగా మిళిందపన్హో చెబుతున్నది.

అసలు బుద్ధుని మరువడమే భారతజాతికి ముప్పు తెచ్చిందని విశ్వకవితో మొదలుకుని అనేకులు చెబుతున్నారు. అదే మాట స్వామి వివేకానంద చెబుతాడు - "పరమాత్ముడు బుద్ధుడు మరోసారి మీ ముందుకు వచ్చి దరిద్రులు, దుఃఖితులూ, పాపులు అయినవారిపట్ల ఆవేదన చెందటం, సానుభూతి చూపడం ఎలానో నేర్పాడు. కొందరు పురోహితులు - ఆయన అసత్యబోధలతో దైత్యులుగా మాయపర్చటానికి జన్మించాడనే కుత్సితపు కట్టుకథను కల్పించారు. అందువల్లనే మిమ్మల్ని పాలించడం సబబనుకున్న ప్రతిజాతికి మీరు బానిసలయ్యారు."

ఈ దేశంలో బౌద్ధం దేశాన్ని వీడటానికి శంకరాచార్యుల వంటి మహనీయుడు కారణం కాదు. శంకరుల మాయావాదంలోనే బుద్ధుని క్షణికవాదం ఛాయలున్నవి. అందుకే శంకరుని ప్రచ్ఛన్నబుద్ధుడన్నారు. బౌద్ధం నశించడానికి కారణాలు వెతకటం "కర్ణుని చావుకు కారణాలు" ఎన్నడం వంటిదే. అది అనవసరం కూడానూ. లౌకికంగా బౌద్ధమతానుసరణ ఎలా ఉండేది, ఛాయలతో సహా నశించినా, జగదేకకరుణామూర్తి అయిన బుద్ధబోధ ఆత్మ ఉన్నత్యసంధాయకమై, కరుణాలవాలమై, మనుష్యజాతి ఉన్నంతకాలం నిలిచి ఉంటుంది.

హిందూత్వాన్ని ద్వేషించి, బౌద్ధానికి రంగులు పులిమి, నేను హిందువునెట్లవుతానని ఎవరన్నా, బౌద్ధాన్ని, బుద్ధుణ్ణి అహంకారంతో విమర్శించే కొందరు కవిపుంగవులు, పండితులున్నా బుద్ధుని ఔన్నత్యం, ఉపనిషత్తుల మహత్తుకూ లోటు రాదు.

**ఈశావాస్యమిదం సర్వం యత్కించ జగత్యాం జగత్ ।**
**తేన త్యక్తేన భుఙ్జీథాః మాగృధః కస్యచిద్ధనం ॥**

అని ఉపనిషత్తు చెప్పినా,

"చెట్టునుండి కాయలను చెట్టుకు తెలియకుండా తీసుకోవడం కూడా తప్పు.పరుల సొమ్ము తాకటం నేరం" అని బుద్ధుడు పంచశీలలో ఒకటైన అస్తేయాన్ని బోధించినా, ఆచరించవలసినది, అనుసరించవలసినది నీతిని, అర్థం చేసుకోవలసినది పరమార్థాన్ని మాత్రమే.

References:-

బౌద్ధదర్శనం - కప్పగంతుల లక్ష్మణశాస్త్రి (A translated work of Ramesan, PreEdited by Puttaparti Sreenivasacharyulu from English)

What Buddha has taught? – Warpol Rahula (Ph.D., Buddhist Studies from Tibet)

వినయపిటకము - మోక్షానందస్వామి (A complete translated text of Vinayapitaka from Pali to Telugu),

లోకక్షేమ గాథలు, ధమ్మపదం కథలు, జాతకకథలు - బోధచైతన్య (Translations from Pali)

మిళిందప్రశ్నలు - బోధచైతన్య **(**Translation of MilindaPanho from Pali**)**

శీలం, ధ్యానం - బోధచైతన్య (Translation of Bhadanta BuddhaghOsa's Visuddimagga from Pali)

సూత్రసముచ్చయం - అన్నపరెడ్డి వేంకటేశ్వరరెడ్డి

కాదంబరి కథాముఖం - చౌఖాంబా ప్రకాశన్

బాణవాణీరామణీయకం - పి. శశిరేఖ (సంస్కృతభాషాప్రచారసమితి)

Ancient history of India – Vincent Smith

మహామానవీయ బుద్ధ - రాహుల్ సాంకృత్యాయన్

సింహసేనాపతి, వోల్గా నుండీ గంగ వరకు - రాహుల్ సాంకృత్యాయన్

మహాభారత విమర్శనము ।, ॥ - పుట్టపర్తి నారాయణాచార్యులు

The case for India – Will Durant

(సమాప్తం)